1

అరుణతార

సాహిత్య, సాంస్కృతిక మాస పత్రిక

సంపుటి: 36 సంచిక: 4 మే 2013 298 పేజీలు: 84 వెల: 15/-

కథ

ప్రత్యేక సంచిక

కథ గురించి...

నువ్వు వెన్నెలనీ, వనాన్నీ వేర్వేరుగా వర్ణిస్తున్నావు. నువ్వు చెయ్యాలవలసింది వెన్నెలపడి వనం ఎక్కడెక్కడ వెలుగుతోందో ఆ భాగాలు వర్ణిస్తే చాలు. అప్పుడు వెన్నెలనీ, వనాన్నీ కాకుండా ఆ రెండిటికీ ఉన్న అనుబంధాన్ని కూడా చెపుతున్నావన్నమాట. అటువంటివి ఏరుకోవడం లోనే కథా శిల్పం ఉంది.

- గోర్కీ తో చెహోవ్

శిల్పమూ, భాషా రచనకు ముఖ్యం కాదని కాదు. అవి చాలా ముఖ్యం. అయితే అవి కథా రచనకు మూల పరికరాలు మాత్రమే, ముడిపదార్థం జీవితం. అభ్యుదయ రచనలనిపించుకునే రచనలన్నీ కరుణరసంతోనో, బీభత్స రసంతోనో పుట్టిపడాలనే భ్రమ యువ కథకులకు అవసరం లేదు. సంఘ విద్రోహులందరూ భీకర రాక్షసులు కారు. అందులో చాలా మంది బడుద్ధాయిలున్నారు. కథకులు వ్యంగ్య ధోరణి అవలంబించి హాస్య రచనలు కూడా చేయవచ్చు.

రాబోయే కథకులు ఒక బాధ్యతను గుర్తించాలి, తాము తమ వర్గాలకూ కులాలకూ, తమకు సన్నిహితంగా వచ్చే జీవితానికీ 'ఎన్నుకొని ప్రతినిధులు' అని గుర్తించాలి. 'ఈ విషయం నేను సాహిత్యంలోకి ఎక్కించకపోతే ఇటువంటివి జరుగుతున్నాయని ప్రజలకు తెలియదేమో,' అన్న వైఖరి ప్రశంసార్హమైంది.

కొద్దిమంది కథకులకు ముద్రవేసి వారు ఉత్తమ కథకులు అనుకుని వారి రచనల కోసమే పత్రికలు ఎగబడడం పెద్ద పొరపాటు. విస్తృతమైన జీవితానుభవంగల కథకుడు కూడా పరిమిత సంఖ్యలోనే పనికివచ్చే కథలు రాయగలుడు. అందరూ వాస్తవ జీవితాన్ని గురించే రాస్తున్నారనుకున్న పక్షంలో ఒకే కథకుడు రాసిన పది కథలకంటే పదిమంది రాసిన పది కథలు ఎక్కువ జీవితాన్ని ప్రతిబింబిస్తాయి. నేను కథల పత్రికకు సంపాదకత్వం వహించే పక్షాన పనికి వచ్చే కథల కోసం తప్పక కొత్తవారి రచనకే వెతుకుతాను. ఒక కథకుడికి రచనా సామర్థ్యం లేకపోయినా సరిచేయ్యవచ్చు గాని, జీవితం తెలియకపోతే సరిచేయడం ఎవరివల్లా కాదు.

రచన ఎప్పుడూ జీవితం నుంచి రావాల్సిందే గాని సిద్ధాంతాల నుంచి వచ్చే అవకాశం లేదు. కాకపోతే ఏమిటంటే జీవితంలో మనుషులు ఎదుర్కొనే నైతిక, అధ్యాత్మిక సమస్యలని తాను అర్థం చేసుకోడానికీ ఇతరులకి విస్పష్టంగా చెప్పటానికి ఈ రచయిత విశ్వసించే సాంఘిక సిద్ధాంతాలు తోడ్పడవచ్చు. ఒక రచయిత ధనికావడం సంఘానికి ఉపకరించేదని నమ్ముతాడనుకోండి, ఆ రచయిత దృష్టి నుంచి ఒక నిరుద్యోగి ఆర్థిక సమస్య ఒక విధంగా గోచరిస్తుంది. ఈ నిరుద్యోగి అతని దృష్టికి సోమరిపోతుగానో అసమర్థుడుగానో కనిపిస్తాడు. కానీ నిరుద్యోగానికి ప్రధాన కారణం పెట్టుబడిదారీ విధానం అని మరొక రచయిత నమ్ముతాడనుకోండి, అతని దృష్టికి సమస్య వేరే రకంగా అర్థమవుతుంది. ఈ సమస్యలు నిరంతరం పెరిగేవిగాను తోస్తాయి. ఈ నిరుద్యోగులందరూ సంఘటితపడి పెట్టుబడిదారీని ప్రతిఘటిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారమయ్యేది కాదన్నట్టు అతడికి అనిపిస్తుంది. అదే రాస్తాడు.

- కొకు

కథలు ఆకాశంలో జరగవు. భూమ్మీద ఏదో కాలంలో, ప్రదేశంలో జరుగుతాయి. రచయిత, విషయాన్ని కళ్ళకు కట్టినట్టు చెప్పాలి. కథ ఎక్కడ జరుగుతుందో 'జాగా' అదీ చెప్పాలి. తరవాత 'సమయం'. ఏ సమయంలో జరుగుతోంది? ఉదయమా, సాయంకాలమా, రాత్రా, పగలా, 'వాతావరణం'. అక్కడ ఏం వున్నాయి - బల్లా, కుర్చీయా, మనీషా? కొంతమంది 'నేను' అని రాస్తూవుంటారు. కథ సగం అయిపోయేదాక కూడా అది ఆడో, మగో, జంతువో మనకి తెలియకుండా చదువుతుంటాం. కాబట్టి, రచయిత ఇది స్పష్టం చెయ్యాలి. ఇవన్నీ గుర్తుంచుకోవాలి. పాత్ర గురించి చిత్రీకరణ ఉండాలి రచనలో. చిన్న కథలో ఎక్కువ పేర్లు ఉండకూడదు.

మనం జీవితాన్ని పంచేంద్రియాలతో స్పృశిస్తాం. అంచేత, రచయిత ఇంద్రియాల్లన్నింటినీ స్పృశించేలా రాస్తే బావుంటుంది.

రచయిత ప్రతివాడూ తాను రాస్తున్నది ఏ మంచికి హాని కలిగిస్తుందో ఏ చెడ్డకి ఉపకారం చేస్తుందో అని ఆలోచించవలసిన అవసరం ఉందని నేను తలుస్తాను. మంచికి హాని చెడ్డకి సహాయమూ చేయకూడదని నేను భావిస్తాను.

నిజాన్ని తెలుసుకోవడం, అందులో మంచి చెడ్డలేవో నిర్ణయించుకోవడం, మనుష్యుల్ని మంచికి మళ్ళించడానికి ప్రయత్నించడం రచయితల కర్తవ్యం అని నేను అనుకుంటున్నాను. ప్రతి రచయితా కూడా తను ఎవరి మంచికోసం రాయాలో ఎప్పుడో ఒకప్పుడు నిర్ణయించుకుంటారని నేను అనుకుంటాను.

- రావి శాస్త్రి

మంచి కథ - నాలుగు లక్షణాలు

i. క్లుప్తత

ఇది తనంత తానుగా రాదు. రచయిత దాన్ని కష్టపడి సాధించాల్సిందే. చెప్పవలసిందంతా చెప్పటం చేత నిస్సందేహంగా కథకు విలువ తగ్గుతుంది. చెప్పవలసిందాని కంటే ఎక్కువ చెప్పటం కథా ప్రక్రియకే విరుద్ధం. కథ పొడవు తక్కువగా ఉండటామూ, క్లుప్తతా ఒక్కటి కాదు. ఇతివృత్తాన్ని బట్టి కథ పొడవు ఉంటుంది. కాబట్టి ఇతివృత్తం అవసరాలకు మించి కథ పెరగటాన్ని క్లుప్తత లోపించటంగా మనం భావించవచ్చు. కథలో క్లుప్తత అనేక కారణాలవల్ల లోపించవచ్చు. వీటిలో ప్రధానమైంది సందర్భ శుద్ధి లేకుండా కథలో వర్ణనల్ని చొప్పించటం. వర్ణనలకూ కథాంశాలకూ ఎలాంటి సంబంధమూ ఉండదు. క్లుప్తత లోపించడానికి మరో కారణం - రచయితకు పాఠకుని సామర్థ్యం మీదా, ఆలోచనా శక్తి మీద గౌరవం లేకపోవడం. తాను అన్నీ విషయాలనూ గురించి వివరంగా చెబితే తప్ప పాఠకునికి ఏమీ అర్థం కాదన్న అభిప్రాయం కూడా ఒక కారణం.

ii. అనుభూతి ఐక్యత

దీన్ని ఇంగ్లిషులో Unity of impression అని అంటారు. మొదటి వాక్యం నుంచీ చివరి వాక్యం వరకూ కథ, కథాంశం అన్న తీగ మీదనే నడవాలి. కథనంలో ఏకాగ్రత తప్పినా, అలసత్వం చోటుచేసుకున్నా కథకు తీగమీద నడిచేవాడికి పట్టే గతే పడుతుంది. ఇది రచయిత కష్టపడి సాధించుకోవాలి. ఇందుకోసం కథాంశం ఒకే సంఘటనలో

(....మిగతా 4వ పేజీలో)

KLVA101M163

అరుణతార

సాహిత్య సాంస్కృతిక మాసపత్రిక

298

సంపుటి : 36 ◆ సంచిక : 4 ◆ మే 2013

విరసం

సంపాదకుడు

చలసాని ప్రసాద్

వర్కింగ్ ఎడిటర్

డి.వి. రామక్రిష్ణారావు

ఎం.ఐ.జి. - 14, ఎ.పి.ఐ.ఐ.సి. కాలనీ,

కార్బైడ్ కంపెనీ ఎదురుగా,

మౌలాలి, హైదరాబాద్ - 500040

* కేవలం పోస్ట్, బుక్‌పోస్ట్ ల ద్వారా

రచనలు పై చిరునామాకూ,

* ఇ-మెయిల్ ద్వారా

arunatara1977@gmail.com

కూ రచనలు పంపవచ్చు

http://www.facebook.com/

arunatara.virasam

సంపాదకవర్గం :

ఉజ్వల్, బాసిత్, కూర్మనాథ్

చందాలు పంపాల్సిన చిరునామా

మేనేజర్

ఎస్. రవికుమార్

5-1307, దొరసానిపల్లె రోడ్,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516 360

సెల్ : 9866021257

విరసం కార్యదర్శి చిరునామా

పి. వరలక్ష్మి

5-1820, గీతాశ్రమం వీధి,

ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360

డి.టి.పి. అండ్ లే అవుట్

ఎస్. రాజు

కవర్ డిజైన్

సృజన గ్రాఫిక్స్

శ్రీను, ప్రొద్దుటూరు, కడప జిల్లా.

ఫోటోలు

ఇంటర్నెట్ / గూగుల్

ఈ సంచిక వెల : రు. 15/-

సంపాదక రేఖ...

'కథలు చెప్పొద్దు' అని మనం నమ్మశక్యం కాని విషయాల గురించి విన్నప్పుడు అంటుంటాం. కథలు రెక్కల గుర్రాలెక్కిస్తాయి. మేఘాల్లో ఉయ్యాలలూపుతాయి. తెలిసిన ప్రపంచాన్ని కొత్తగా, తెలియని లోకాలను గమ్మత్తుగా పరిచయం చేస్తాయి. కథ కళ్ళ ముందు ఒక ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. అందులోకి వేలుపట్టుకుని మనల్ని తీసుకుపోతాయి. అది మాయాప్రపంచం అయితే చిన్న పిల్లలను చేసి అబ్బురపరుస్తాయి. వాస్తవ ప్రపంచం అయితే జ్ఞానాన్నిస్తాయి. ప్రాచీన కాలంలో కథలు చెప్పడమే ఉండేది. ఆ కథలు వీరుల చుట్టూ తిరిగేవి. జానపదుల కథలు జీవితం లోతుల్లోంచి వచ్చేవి. ఆధునిక కథ సామాన్య మానవుడిని, సామాజిక సంచలనాలను పట్టుకుంది. జీవన సారాన్ని పిండింది.

అంత మాత్రమే కాదు. సమాజంలో బోలెడంత సంఘర్షణ ఉంటుంది. వివిధ భౌతిక ఆవరణల్లో మనుషులు విభిన్న అనుభవాల జ్ఞానాన్ని పొందుతారు. అట్లా తాను పొందిన జ్ఞానాన్ని సమూహంలో ఆవిష్కరిస్తారు రచయితలు. అది కథ అవుతుంది. అది ఎన్నో అలజడులను, ఆకాంక్షలను దృశ్యీకరించి జీవన వాస్తవికతను ఎరుక పరుస్తుంది. మార్పు దిశగా ఆలోచనలను కదిలిస్తుంది. తెలుగు కథా సాహిత్యం ఎన్నో ప్రగతిశీల భావాలకు వేదికయింది. సంప్రదాయ కొలమానాలను బద్దలు కొట్టి భిన్న సమూహాల జీవన సౌందర్యాన్ని రూపుగట్టింది. పీడిత సమూహాల ఆర్తినీ, ఆవేశాన్నీ వ్యక్తీకరించింది.

విప్లవకథ అయితే సమాజవాస్తవికతనే కాదు సామాజిక చలనాన్ని అందుకుంది. సమాజం మార్పు చెందుతుందని, ఆ మార్పు చైతన్యయుతమైన మానిషి ఆచరణ ద్వారా జరుగుతుందనే సైద్ధాంతిక పునాది మీద విప్లవ కథా నిర్మాణం జరుగుతున్నది.

ఈ సైద్ధాంతిక అవగాహన నుండి సమాజాన్ని, వ్యవస్థను మూలాల నుండి అర్థం చేసుకోవడం జ్ఞానానికి సంబంధించినదైతే దాన్ని మానవ జీవితానికి అన్వయించడం సృజనకు సంబంధించినది. అట్లా విప్లవకథ పదే పదే వికాసం చెందుతున్నది.

సమాజ మార్పును సుసాధ్యం చేస్తూ ప్రత్యక్ష ఆచరణలో ఉన్న వాళ్ళు దీనిని మరింత ఎత్తుకు తీసుకుపోయారు. దండకారణ్య వర్గపోరాటం విప్లవ కథను ఇంకింత పదునెక్కిస్తున్నది. ఈ సందర్భంలోనిదే అరుణతార కథల ప్రత్యేక సంచిక. ☆

ఈ సంచికలో...

సంపాదకీయం (5 - 7)
విప్లవ కథా సాహిత్యం - సందర్భం
- పాణి

కథలు
అమూల్య - **కె. సుభాషిణి** (7 - 11)
మునెమ్మవ్వ - **స్వాతి** (12 - 16)
తోడు - **ఎం. శ్రీనివాసరావు** (16 - 19)
నర్సిం- **ఇక్బాల్** (20 - 23)
జాగ - **ఉదయమిత్ర** (23 - 27)
మెలకువతో... - **నల్లూరి రుక్మిణి** (28 - 33)
దరారే - **మహమూద్** (33 - 37)
ఫాస్బెండ్ స్టిచ్ - **గీతాంజలి** (37 - 39)
ఏం చేద్దాం? - **పలమనేరు బాలాజీ** (40 - 42)
రాజకుమారుడు... కార్వేటమ్మ- **పాణి** (42 - 48)
నీళ్లంత రుచి - **తాయమ్మ కరుణ** (49 - 53)
మిగిలేటోళ్లు - **ఎం.ఎ. బాసిత్** (54 - 58)
ప్రయాణం - **పద్మకుమారి** (60 - 61)
మొదలు - **ఎస్.డి.** (70 - 77)

సమీక్ష (59 - 60)
దండకారణ్య కథా సమయం - **జగతి**

రిపోర్టు (78 - 80)
ఇవాళ ఏమి రాయాలి, ఎలా రాయాలి?
వర్తమాన విప్లవ కథపై వర్క్‌షాపుల్లో సమాలోచన
- పి. వరలక్ష్మి

సీరియల్ (81 - 82)
గత సంచిక తరువాయి - తొమ్మిదవ భాగం
సూర్యుడు - **కె.వి. కూర్మనాథ్**

గమనిక : మార్చి - ఏప్రిల్ సంచికలో ప్రారంభమైన ఎం. రత్నమాలగారి వ్యాసం మిగతా భాగం వచ్చే సంచికలో ప్రచురిస్తాం... - సం.

(2వ కవర్ పేజీ తరువాయి...)

వెలిగేట్టు చూసుకోవాలి. రచయితే ఎన్నుకునే ప్రధాన సంఘటన, పాత్రలో గుణాత్మకమైన మార్పునకు కారాణభూతమయ్యేదిగా ఉండాలి.

iii. సంఘర్షణ:

సంఘర్షణ అనేక రకాలుగా ఉండవచ్చు. ఇద్దరు వ్యక్తుల మధ్యా, ఒకే వ్యక్తిలోని రెండు అంశాల మధ్యా, రెండు భావాల మధ్యా, రెండు వర్గాల మధ్యా, రెండు సిద్ధాంతాల మధ్యా, రెండు జీవిత దృక్పథాల మధ్యా - ఇలా ఎన్నిటి మధ్యనైనా ఉండవచ్చు. అంతే కాకుండా ఈ సంఘర్షణ భౌతికంగా కానీ, మానసికంగా గానీ ఉండవచ్చు. కథలోని సంఘర్షణ రచయిత దృక్పథానికి సంకేతం. మరొక రకంగా చెప్పాలంటే ఎలాంటి సంఘర్షణా లేని కథను రాసిన రచయితకు ఒక నిర్దిష్ట జీవిత దృక్పథం లేదని చెప్పవచ్చు. జీవితంలోని ముఖ్యమైన సంఘర్షణల జోలికి పోకుండా జీవితపు పైపై మెరుగుల్ని చిత్రిస్తూ కథలు రాసిన రచయితలు తెలుగులో చాలమందే ఉన్నారు. ఎలాంటి సంఘర్షణనూ చిత్రించని కథలు కాలక్షేపం కథలు లేదా వ్యాపార కథలు.

సంఘర్షణను గురించి ఆలోచించినపుడు దాని పరిష్కారాన్ని కూడా ఆలోచించాలి. పరిష్కారాన్ని కథలో చూపించాలా వద్దా అన్నది అనాది చర్చ. ఖచ్చితంగా పరిష్కారాన్ని చూపించనక్కర్లేదు. వాస్తవిక పునాదిగా నడిచిన కథ ప్రతీక సూచనతో (కాళీపట్నం రామారావు గారి యజ్ఞం కథలో లాగా) ముగింపు కాకూడదన్న సిద్ధాంతం ఎక్కడాలేదు.

iv. నిర్మాణ సౌష్టవం

కథకు చక్కటి నిర్మాణం తప్పనిసరి. అల్లిక పూర్తిగాలేని కథ నీరసంగానూ, అల్లిక ఎక్కువైన కథ కృత్రిమంగా తయారయ్యే ప్రమాదం ఉంది. నిర్మాణ సౌష్టవం పేరుతో అనవసరమైన మలుపులూ, అసహజమైన కొసమెరుపులూ కథనంలో ప్రవేశపెట్టడం చాలా చావకబారు శిల్పం. పాఠకుని దృష్టి కథనం మీదా, కథనంలోని వైచిత్రి మీద ఉంటుందే కానీ కథాంశం మీదికి పోదు. ముగింపు ఎలా ఉండాలనేదాని మీద ఏకాభిప్రాయం లేదు. అంతం ఉండకూడదనీ, ముగింపు స్పష్టంగా ఉండాలని, కొసమెరుపు ఉండాలనీ, షాక్‌కి గురిచేయాలనీ ఇలా రకరకాల అభిప్రాయాలు ఉన్నాయి.

- వల్లంపాటి వెంకట సుబ్బయ్య
(సేకరణ : కూర్మనాథ్)

అరుణతార చదవండి!
చదివించండి!
చందాదారులు కండి!

చందాలు, బకాయిలు మనియార్డర్, డి.డి.ల రూపంలో మేనేజర్‌కు పంపించండి.
డి.డి.లను ఎస్. రవికుమార్, ప్రొద్దుటూరు పేర తీయండి.
విడి సంచిక వెల : రు. 15/-; సంవత్సర చందా: రు. 160/-; జీవితచందా : రు. 1500/-
మేనేజర్ : ఎస్. రవికుమార్
5-1307, దొరసానిపల్లె రోడ్, ప్రొద్దుటూరు, కడప జిల్లా - 516360, సెల్ : 9866021257
email : arunatara1977@gmail.com
http://www.facebook.com/arunatara.virasam

సంపాదకీయం

విప్లవ కథా సాహిత్యం - సందర్భం

- పాణి

విప్లవ రచయితల సంఘం ఏర్పడ్డాక కొడవటిగంటి కుటుంబరావు సంపాదకత్వంలో ఇప్పుడు వీస్తున్న గాలి అనే కథా సంకలనంతో కథా ప్రక్రియలో విప్లవ రచయితల కృషి మొదలైంది. ఆయన అంతకముందు ఐదు దశాబ్దాల పాటు కథ, నవల రచనలో కాకలుతీరినా విప్లవోద్యమం మొదలయ్యాక కథలు రాయాలని అనుకోలేదు. విప్లవ సాహిత్యోద్యమంలో ఆయన విమర్శరంగాన్నే ఎంచుకొని, ఆ పనే చివరి దాకా కొనసాగించారు. విరసం ఆవిర్భావంలో కొకుతోపాటు, రావిశాస్త్రి కాళీపట్నం రామారావు వంటి సుప్రసిద్ధ కథకులు ఉన్నప్పటికీ కవులే ప్రధానం. కవిత్వంతోపాటు విప్లవ సందేశాన్ని ప్రజల్లోకి తీసికెళ్ళడానికి పాట తదితర ప్రజా కళారూపాలపై ఎక్కువ శ్రద్ధ పెట్టినప్పటికీ కథ అవసరాన్ని కూడా విప్లవ సాహిత్యోద్యమం గుర్తించింది. అందువల్లే తొలి మహా సభ నాటికే కొకు సంపాదకత్వంలో కథా సంకలనం వచ్చింది.

అప్పటికే విప్లవ సాహిత్యోద్యమానికి అనుబంధంగా కొనసాగుతున్న సాహితీమిత్రుల సృజన పత్రిక, 1977 నవంబర్‌లో విరసం అధికార పత్రికగా మొదలైన అరుణతార కథా ప్రక్రియకు వేదికగా నిలిచాయి. విప్లవ కథా వికాసమంతా ప్రధానంగా ఈ రెండు పత్రికల్లో కనిపిస్తుంది. ఇవేగాక నూతన, రాడికల్ మార్చ్ తదితర పత్రికలు ఆ రోజుల్లో విప్లవ కథను ప్రాచుర్యంలోకి తెచ్చాయి. అంత వరకు ఉన్న కథ స్వరూప స్వభావాలను, దృక్పథాలను, శిల్ప ప్రయోగాలను విప్లవ సాహిత్యోద్యమం గణనీయంగా మార్చివేసింది. అంతకముందు కూడా అట్టడుగు కులాల వర్గాల జీవితాన్ని చిత్రిస్తూ చాలా కథలు వచ్చినా, జాతీయోద్యమ కాలంలో, తెలంగాణ సాయుధ పోరాట కాలంలో ఉద్యమ చలనాలను చిత్రిస్తూ కథలు వచ్చినా వీటన్నిటికంటే నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాల ప్రేరణతో మొదలైన విప్లవ కథ గుణాత్మకంగా చాలా భిన్నమైనది. విప్లవ కథ ఈ సమాజంలోని అట్టడుగున ఉండే నిర్దిష్ట మానవుణ్ణి వెలికి తీసింది. విప్లవం అనేది.. నిర్దిష్ట స్థల కాలాల్లో సాగే పరివర్తనా క్రమం కాబట్టి ఈ లక్షణాన్ని విప్లవ కథ అక్షరాలా పుణికిపుచ్చుకున్నది.

సాహిత్యానికి నిర్దిష్ట జీవిత అనుభవం వనరు. అంతకముందు కథా సాహిత్యంలో అక్కడక్కడా నిర్దిష్ట మానవుడ్ని చిత్రించినా విప్లవోద్యమం దాన్ని ఒక అతి ముఖ్యమైన సాహిత్య లక్షణంగా ధృవపరిచింది. తొలిరోజుల్లో భూషణం రాసిన కథలే దీనికి సజీవ ఉదాహరణ. శ్రీశ్రీ ఒక పౌరాణిక ప్రతీకతో పోల్చుతూ విప్లవ కథకు భూషణంగారు వ్యాసుడులాంటి వాడన్నమాట నిజమే. ఆయన శ్రీకాకుళంలోని ఆదివాసీ పాత్రలను కథల్లోకి తీసుకొని వచ్చారు. ఆదివాసీ జీవితం, సంస్కృతి ఆయన కథల్లో చాలా గాఢంగా కనిపిస్తాయి. సమాజపు అట్టడుగు పొరల్లోని ఆదివాసులను సాహిత్య వస్తువుగా ఆయన ఎన్నుకున్నారు.

నిర్దిష్టతతోపాటు పరివర్తనాగుణం విప్లవ కథలోని మరో ముఖ్య లక్షణం. విప్లవోద్యమం మానవ ఆచరణ కేంద్రంగా సాగుతుంది. భౌతిక పరిస్థితుల స్వభావం తెలుసుకొని.. మనుషులు తాము మారుతూ పరిస్థితుల్లో మార్పు తేవడం అనే క్రియాశీల గుణం ప్రదర్శిస్తారు. ఇందులో చైతన్యీకరణ అనేది ఇరుసుగా పని చేస్తుంది. మానవ జీవితాన్ని చిత్రించే కథలోకి మార్పు, చైతన్యీకరణ అనే మరో రెండు ముఖ్యమైన అంశాలను విప్లవ కథకులు తీసుకొని వచ్చారు.

అమరుడు ఆర్ఎస్‌రావు ఓసారి మాట్లాడుతూ, తన సహజ పద్ధతిలో కథకు, విప్లవ కథకు తేడా ఏమిటి? అనే ప్రశ్న వేసి తానే ఒక ఆసక్తికరమైన సమాధానం చెప్పారు. ఇతర కథకులు కూడా జీవన వాస్తవికతను అద్భుతంగా చిత్రించవచ్చు, అయితే విప్లవ కథ మొదలై ముగిసేనాటికి తప్పనిసరిగా అందులో ఒక మార్పు క్రమం తప్పక ఉండి తీరాలి.. అన్నారు.

అంటే కథ ఎక్కడ మొదలైనా ముగిసేనాటికి పాత్రలు విప్లవంలోకి వెళ్ళాలన్నమాట.. అని ఎదురు ప్రశ్నవేస్తే ఆయన మరింత వివరంగా చెప్పారు.

'నేను పొరబాటున కూడా కథలు అలా ఉండాలనను. మార్పు క్రమాన్ని ఎలా చిత్రిస్తారనేది శిల్పానికి సంబంధించిన సమస్య. నాకు దాని గురించి తెలియదు. ఏ పద్ధతిలో చెప్తారనేది రచయిత కళా నైపుణ్యానికి సంబంధించింది. నేరుగా చెప్పినా, సూచన ప్రాయంగా చెప్పినా, మరెలాగా చెప్పినా.. మొత్తం మీద ఏదో ఒక మార్పు క్రమం గురించి పాఠకులకు తెలియాలి. జీవితం ఇలా ఉందని చిత్రించి వదిలేయడం వల్ల యథాతథవాదంలోకి జారిపోయే ప్రమాదం ఉంది. దానికి గురికాకూడదంటే విప్లవ రచయితలకు మార్పు క్రమం గురించి శ్రద్ధ ఉండాలి. ఆ మార్పు మానవ సంబంధాల్లో, భౌతిక పరిస్థితుల్లో ఉండొచ్చు. మనిషి ఆలోచనల్లో ఉండొచ్చు. కథ మొదలై ముగిసేనాటికి పాఠకులకు మార్పు గురించి ఏదో ఒకటి స్ఫురించాలి.. ఆ ఫీలింగ్ ఎలా కలిగించినా మంచిదే..' అన్నారు.

అంటే-జీవితంలో ఉండే వైచిత్రిని చాలా మంది కథకులు చిత్రించవచ్చు. కానీ వాస్తవికతను, చైతన్యయుతమైన మానవ కర్తృత్వం వల్ల అందులో వచ్చే మార్పు క్రమాలను విప్లవ కథ చిత్రించాల్సి ఉన్నది. తెలుగులో విప్లవ కథ ప్రారంభమైనప్పటి నుంచి ఈ ప్రమాణం గీటురాయిగాఉంటూ వచ్చింది. మొదట్లో వచ్చిన కొన్ని కథల్లో దీన్ని అంత కళాత్మకంగా పాటించి ఉండకపోవచ్చు, లేదా తక్షణ రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా సరళమైన, యాంత్రికమైన పద్ధతిలో చిత్రించి ఉండవచ్చు. దీని వల్ల.. కథా వస్తువు, దృక్పథం విలువైనవే అయినా శిల్పపరంగా మంచి కథలనే గుర్తింపుకు అవి నోచుకొని ఉండకపోవచ్చు. ఇలంటి కథలు తొలినాళ్ళలో కొన్ని ఉండవచ్చుగాని ఆ రోజుల్లోనే ఈ స్పష్టత ఎంత పరిపూర్ణంగా ఉండేదో పైన ప్రస్తావించిన భూషణంగారి కథల్లోనే చూడవచ్చు. చెరబండరాజు, ఎన్.ఎస్. ప్రకాశరావు కథలను కూడా ఉదహరించవచ్చు.

విప్లవోద్యమం 1970ల చివరికల్లా ఎలాంటి మార్పులకు

లోనైందో, విప్లవ కథ కూడా అలాంటి అద్భుతమైన మార్పులకు లోనైంది. నేల మీద నిలకడగా, ప్రవాహంలా, వెల్లువలా సాగుతున్న విప్లవోద్యమాన్ని కథకులు చిత్రించడం ప్రారంభించారు. ఈ కథల్లో పైన చెప్పిన నిర్దిష్ట మానవుడు.. లేదా నిర్దిష్ట సంబంధాలు, వాటిని మార్చడానికి ప్రజల చైతన్యయుతమైన ఆచరణ కనిపిస్తాయి. ఒక రకంగా చెప్పాలంటే మానవ ఆచరణ కేంద్రంగా సాగే విప్లవ కథ.. అంతకముందటి యావత్ కథా సాహిత్యానికంటే విభిన్నమైన మార్గాన్ని ఎంచుకున్నది. వస్తువు, దృక్పథం, భాష, శిల్పం మొదలైనవన్నీ పూర్తిగా మారిపోయాయి. కొత్త కథా ఆవరణం నిర్మాణమైంది. దీని వల్ల మొత్తంగా తెలుగు కథ స్వరూప స్వభావాలే మారిపోయాయి. కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాల్లోని ప్రజాపంథా వల్ల విప్లవ కథా రచనలోకి అనేక మంది కొత్త రచయితలు వచ్చారు. విప్లవ రచయితల సంఘం సభ్యులు, విప్లవోద్యమ రచయితలు, ఈ నిర్మాణాల్లో లేకపోయినా విప్లవ దృక్పథం స్వీకరించిన రచయితలు అనే మూడు మార్గాల్లో విప్లవ కథా రచన సాగింది.

ఈ కథలను సాహిత్యలోకం సహజంగానే అంగీకరించలేదు. కొందరు విమర్శకులు కొన్ని జడాత్మకమైన అభిప్రాయాలను తయారు చేసుకొని విప్లవ కథ గురించి మాట్లాడడం మొదలుపెట్టారు. నేటికీ వాటిని సాధన చేస్తూ పురావస్తుశాల యజమానులవంటి విమర్శకులు కొందరున్నారు. విప్లవ కథ అంటే ఫలానా అని.. తాము ఏర్పర్చుకున్న బండ ప్రమాణాల కింద పడి తమ విశ్లేషణా సామర్థ్యాన్ని మొద్దుబార్చుకోవడం ఇప్పటికీ గమనించవచ్చు. ఈ ధోరణి వల్ల సహజంగానే ఇలాంటి విశిష్ట లక్షణాలు ఉన్న చాలా కథలను పత్రికలు కూడా తిరస్కరించాయి. అలాంటి కథలన్నిటికీ సృజన, అరుణతార మాత్రమే వేదిక అయ్యాయి. ఇవాళ చాలా మంచి కథకులుగా గుర్తింపు పొందిన అనేక మంది తొలి రచనలు అరుణతారలో అచ్చాయి. పత్రికలు ఏర్పరుచుకున్న గీతల్లో ఇమడని కథలు రాయడమే విప్లవ కథకుల ప్రత్యేకత. ప్రత్యామ్నాయ ఇతివృత్తం, దృక్పథం, శిల్ప పద్ధతులు ఉన్న కథలకు అనివార్యంగా ప్రత్యామ్నాయ పత్రికలే వేదిక అవుతూ వచ్చాయి. ఈ విషయంలో ఇతర విప్లవ పత్రికల వలె అరుణతార చాలా గణనీయమైన, గౌరవనీయమైన పాత్ర పోషించింది. ఇప్పటికీ విప్లవ రచయితలు, విప్లవోద్యమ రచయితలు రాస్తున్న చాలా కథలను అరుణతార తప్ప మరే పత్రిక అచ్చేయడానికి సాహసించడం లేదు. దీనికి ఆ పత్రికలు ఒక సాకు చెప్తుంటాయి. శిల్పపరంగా విప్లవ కథలు బాగా లేవని. నిజానికి ఈ నలభై ఏళ్ళలో బయటి పత్రికలు తిరస్కరించి, అరుణతారలో అచ్చయిన కథల్లో ఎంత శిల్ప నైపుణ్యం ఉంటున్నదీ ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిందే.

1990ల నాటికల్లా విరసం కథను బైటి సాహిత్య ప్రపంచం అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది. చాలా సంక్లిష్టమైన జీవన ఇతివృత్తాలను ఎంచుకొని విప్లవోద్యమ నేపథ్యంలో సంఘర్షణ, పరివర్తన అనే ముఖ్య లక్షణాలతో విప్లవ కథ చాలా ముందుకు వెళ్ళింది. అస్తిత్వ దృక్పథాలకంటే చాలా భిన్నంగా మార్క్సిస్టు అవగాహనతో జీవితంలోని అనేక సాంఘిక సాంస్కృతిక వైవిధ్యాలను, అనుభవ ప్రత్యేకతలను కథలుగా రాస్తున్నారు. సమాజ విశ్లేషణలో మార్క్సిస్టు దృక్పథం ఎంత విశాలమైన కాంతిని వెదజల్లేదీ గత ముప్పై ఏళ్ళలో వచ్చిన కథల్లో ఏ అయిదేళ్ళ కథలనుఎంపిక చేసి పరీక్షించినా అర్థం అవుతుంది. చాలా వేగంగా మారుతున్న వర్తమాన జీవితంలోని మారుమూలల్లోంచి ఇతివృత్తాలతో మంచి శిల్ప పద్ధతులతో, ప్రగతిదాయకమైన వైఖరితో రాస్తున్న అనేక కథలు అరుణతారలో అచ్చవుతున్నాయి. ప్రపంచీకరణ విధ్వంసంపై తెలుగు కథకుల స్పందన బాగానే ఉన్నా ఇందులో పురాస్మృతి భారం ఎక్కువ. ప్రపంచీకరణకు వ్యతిరేకంగా చాలా మంది తెలుగు రచయితలకు నాస్టాల్జియా మాత్రమే ఏకైక సాధనంగా ఉంటోంది. ఇందులోని ఆర్తి గౌరవనీయమే అయినా ప్రపంచీకరణను అర్థం చేసుకొని, ఏ రాజకీయార్థిక కారణాల వల్ల ఈ విధ్వంసం జరుగుతోందో చాలా మంది తెలుసుకోలేకపోతున్నారు. కేవలం నాస్టాల్జియాను ఆసరా చేసుకొని, అనుభవ శకలాలను కథలుగా మలుచుతున్నారు. రచయితలకు సిద్ధాంత దృక్పథం లేకపోవడం, అస్తిత్వ శకలాల వైపు నుంచి వాస్తవికతను అర్థం చేసుకోవడం వల్ల ఈ పరిమితి తప్పడం లేదు.

కానీ విప్లవ కథకులను ఈ పరిమితి లేదని చెప్పడానికి అరుణతారలో అచ్చయిన కొన్ని కథలైనా దాఖలా. ప్రపంచీకరణ అనేది సామ్రాజ్యవాదంలో భాగం. సామ్రాజ్యవాద రాజకీయ ఆర్థిక లక్షణాలు తెలుసుకోకుండా ప్రపంచీకరణపై సాంస్కృతిక ప్రతిస్పందనలు చిత్రించడంలో చాలా ఇబ్బందులు ఉంటాయి. సామ్రాజ్యవాదాన్ని (ప్రపంచీకరణను) అస్తిత్వ చైతన్యంతో ఎదిరించాలని భావించేవాళ్ళు, స్థానికత వైపు నుంచి దాన్ని ఎదుర్కోవాలని నమ్మేవాళ్లు ఉన్నారు. అస్తిత్వ స్పృహ వల్ల జీవన వాస్తవికత మరింత గాఢంగా కథల్లో వ్యక్తమైనా.. చాలా వరకు యథవాదం అంచుల్లోకి చాలా కథలు చేరుకొనే ప్రమాదముంటుందనే ఎరుక అవసరం. సామ్రాజ్యవాద వ్యతిరేకతలో ఈ ధోరణులపట్ల విమర్శనాత్మకంగా ఉంటూ విప్లవ కథకులు చాలా చైతన్యయుతంగా, సిద్ధాంత అవగాహనతో అప్రమత్తంగా ఉంటున్నారని చెప్పడానికి కూడా అరుణతారలో అచ్చయిన కొన్ని కథలు భరోసా ఇస్తాయి.

వీటికితోడుగా దండకారణ్య కథలు విప్లవ కథా చరిత్రకు శిఖరాయమానంగా నిలుస్తాయి. వస్తువులో, శిల్పంలో, కొత్త జీవిత చిత్రణలో, ముఖ్యంగా పైన చెప్పినట్లు పరివర్తనా గుణాన్ని చిత్రించడంలో దండకారణ్య కథలు ఇవాళ తెలుగు కథా ప్రపంచంలోకే కొత్త వాతావరణాన్ని తీసుకొని వచ్చాయి. గత ముప్పై ఏళ్లలో అనేక సామాజిక అస్తిత్వాల చైతన్యంతో చాలా కొత్త కథలు వచ్చాయి. ఇవి విప్లవ కథకులను కూడా ప్రభావితం చేశాయి. ఇవన్నీ జీవితం ఎలా ఉన్నదో అంతక ముందు ఊహించని పొరల్లోకి వెళ్లి చిత్రించాయి. అంతేకాదు, జీవితం అట్లా ఉండటంపట్ల ఆగ్రహంతో, గాఢమైన విమర్శ పెట్టాయి. ఆ అర్థంలో అవి చాలా మంచి కథలే. కానీ విప్లవ కథ ఈ రెండు పనులతోపాటు జీవితంలోని మార్పు క్రమాలను చిత్రిస్తుంది. ఈ పని దండకారణ్య కథలు చాలా శక్తివంతంగా చేస్తున్నాయి. జీవితం ఎల్లప్పుడూ మార్పుకు గురవుతూనే ఉంటుంది. అయితే మనిషి చైతన్యయుతంగా, ఎంపిక చేసుకున్న ఆచరణ వల్ల జీవితం లోపలి కారణాలతో జరిగే మార్పుక్రమాలను చిత్రించడం విశిష్ట లక్షణం. అంటే మానవకర్తృత్వం వల్ల జీవితంలో, సమాజంలో జరిగే మార్పుల గురించన్నమాట. దండకారణ్య కథల్లో ఈ లక్షణం ఎంత పుష్కలంగా ఉన్నదో వాటిని పట్టించుకుంటే అర్థమవుతుంది.

విప్లవ కథా వికాసానికి, మొత్తంగా తెలుగు కథకు అరుణతార ఈ 298 సంచికలో గణనీయమైన కృషి చేసింది. అయితే ఇది చాలా కొంచెమే. సృజన ఆగిపోయాక, అరుణతార అనేక నిర్వహణా భారాలతో, అనేక సమస్యల మధ్యనే విప్లవ సాహిత్యోద్యమంలో కార్యకర్తగా పని

కథ

అమూల్య

- కె. సుభాషిణి

చేతిలో ఉన్న కాగితాన్ని మడతపెడుతూనే ఉన్నాడు ఆనంద్. ఇక మడవటానికి వీలు కానంత సైజులో కాగితాన్ని మడుస్తూ లెక్క పెడుతున్నాడు.

ఒకటి... రెండు... నాలుగు... ఎనిమిది... పదహారు... ముప్పైరెడు... అరవైనాలుగు... అరవైనాలుగు... అరవైనాలుగు... కాగితాన్ని అంతకు మించి మడవలేకపోయాడు.

అరవైనాలుగు... అవును సరిగ్గా అరవైనాలుగువేలు ఫీజు... సో... మ్యాగ్జిమమ్ లాక్కున్నట్టే అయితే... అయినా అప్పుడే ఎక్కడయి పోయింది...! యింకా యిదొకటి వుంది కదా...

కాగితాన్ని మడతలు విప్పాడు. కాగితంలోవున్న లిస్ట్ వెంట ఆనంద్ కళ్లు పరుగులు తీశాయి.

క్యాలిక్యులేటర్, డ్రాఫ్టర్, డ్రాయింగ్ కిట్, యాప్రాన్, షూస్...

'ఎంతవుతుందో యివన్నీ కొనేకి...' అరచేతుల్లోనూ, నుదుటి మీద చెమటలు పడుతున్నాయి.

జేబులో నుండి ఖర్చీఫ్ బయటకు తీశాడు. తుడుచుకుంటే పోయే చెమటలు కాదని ఆనందుకు తెలుసు. పర్సు తెరిచి చూసాడు. ఐదు వందల రూపాయల నోట్లు... పన్నెండు.... రెపరెపలాడుతున్నాయి. కాలేజి ఫీజు, బస్ పాస్ కింద పోనూ మిగిలినవి.

బైకు స్టార్ట్ చేశాడు. కూతురి ఆలోచనలే ఆనంద్ బండిని నడిపిస్తున్నాయి.

'నాలాగా నాకూతురు యిబ్బంది పడకూడదు. డబ్బులు కోసం చూసుకోకూడదు. ఎంత కష్టమైనా చదివించాల... ఏదీ తక్కువ చేయకూడదు... అమ్మ, నాన్న నాకోసం ఎంత కష్టపడుతున్నారు అని గ్రహించి, బాగా చదువుకుంటే చాలు. తన భవిష్యత్తే బాగుంటుంది. ఎట్లనో ఈ సంవత్సరం ఫీజుకు యిబ్బంది లేకుండా గడిచిపోయింది. వచ్చే సంవత్సరానికి ఆర్.డి అయిపోతుంది. తర్వాత పాలసి ఒకటి మెచ్యూర్ అయితాది. సేవింగ్స్ పెంచితే ఈ నాలుగేండ్లు యిబ్బంది లేకుండా అయిపోతాది... 'పది నిమిషాల కాలంలోనే నాలుగు సంవత్సరాల కూతురు భవిష్యత్తును దర్శించి వాటి ఫలితాలను కళ్ళల్లో నింపుకున్నాడు ఆనంద్.

బైక్ శబ్దం... గేట్ తెరిచిన చప్పుడు వింటూనే పరిగెత్తుకొచ్చింది అమూల్య.

'యింతసేపు అయ్యిందేం నాన్నా... ఫీజ్ కట్టేశావా....?'

'నేను వొక్కన్నే కాదు కదమ్మా!... స్టూడెంట్స్, వాళ్ల పేరెంట్సు చాలా మంది వచ్చారు...'

పర్సులో నుండి రశీదు తీసి కూతురి చేతిలో పెట్టాడు ఆనంద్.

'క్లాసెస్ ఎప్పటి నుండి మొదలు పెడ్తారంట నాన్నా....'

'పదహారు నుండట....'

'అవునా...! జస్ట్ టెన్ డేస్... అయ్యో ఎలా...?'

కూతురు దేనికోసం అంత కంగారు పడుతోందో ఆనందుకు అర్థం కాలేదు.

'యిన్ని రోజులు ఇంట్లో టీవి చూసుకుంటూ ఫ్రీగా గడిపేసిందేది చాల్లేదేమో...' విసుక్కున్నాడు ఆనంద్

'ఏమేమి కొనాలో కాలేజ్ వాళ్లు లిస్ట్ యిచ్చారులేమ్మా...రేపో, మర్నాడో పోయి తెచ్చుకుందాం...'

అమూల్యకు లిస్ట్ చూపించాడు. లిస్ట్ చూసి పెదవి విరిచింది.

'యిప్పుడు ఈ డ్రాఫ్టర్ దీండ్లకు ఏం తొందరొచ్చింది...? యివి ఎప్పుడయినా కొనచ్చు... పద్మశ్రీ బుక్ సెంటర్లో యివన్నీ దొరుకుతాయి. గంటలో అయిపోతుంది ఈ పని. విషయం యిది కాదు. డ్రస్సులు ఎప్పుడు తీసుకోవాలా...? ఎప్పుడు కుట్టించుకోవాలా... యింతకు అమ్మేది...? మా...! ఓమా!'

కూతురి పిలుపుకు సమాధానంగా 'వస్తున్నా... కొంచెం వుండు...' అమూల్యకు వినిపించేట్టుగా చెప్పింది సునీత.

చీరలను జాగ్రత్తగా మడత పెట్టి బ్యాగులో సర్దింది. మళ్లీ ఒకసారి చీరలన్నీ లెక్కపెట్టింది.

'చూసుకోండి... మీ చీరలో కాదో... అన్ని వున్నాయో లేదో సరిగ్గా లెక్క పెట్టుకోండి....' హెచ్చరించింది సునీత.

సర్దిన చీరలు అన్నీ బయటకు తీసింది ఆవిడ.

చేస్తున్నది. ప్రత్యామ్నాయ పత్రికలకు సహజంగానే ఉండే ఇబ్బందులన్నీ అరుణతారకు ఉన్నాయి. వీటిని అధిగమించేందుకు చేస్తున్న ప్రయత్నాలు కొంచెం ఫలితాలు ఇస్తున్నా మొత్తంగా సమస్యలు తీరడం లేదు. ఈ ఇబ్బందుల మధ్యనే 300 సంచిక మైలురాయిని విరసం చేరుకుంది. ఆ క్రమంలో ఇది 298వ సంచిక. కథలతో ప్రత్యేకంగా తెస్తున్నాం. ఆ తర్వాత వరుసగా కవిత్వం, సాహిత్య విమర్శ కూడా వస్తాయి. 300 సంఖ్యకు ఏ ప్రత్యేకతా లేకపోయినా, అసలు ఫలానా సంఖ్యకంటూ దేనికీ ప్రత్యేకత లేకపోయినా, ఈ సందర్భంలో కొన్ని ప్రత్యేక సంచికలను పాఠకులకు అందివ్వాలనుకుంటున్నాం. ఈ సంచికలు మరింత విస్తృతంగానే తేవచ్చు. అయితే ఆర్థిక సమస్యల దృష్ట్యా ఇంత వరకే పరిమితం కాకతప్పడం లేదు. అయితే వర్తమాన విప్లవ కథకు ప్రతి సంచికలో వస్తున్న కథలు, ఇటీవల విడుదలైన కథల పంట 1, కథల పంట 2, విడివిడిగా విరసం సభ్యుల సంపుటాల వలె ఈ ప్రత్యేక సంచిక కూడా సాక్ష్యంగా నిలబడుతుందనే నమ్మకం ఉంది. ఈ తరం విప్లవ కథను విరసం సభ్యులు, విప్లవోద్యమ కథకులు, సోదర విప్లవ కథకులు ఎంత శక్తివంతంగా తీర్చిదిద్దుతున్నదీ ఈ సంచిక తాజా ఉదాహరణ. విప్లవ కథ మీద నిర్మాణాత్మక విమర్శను ఎప్పటిలా కోరుకుంటూ..

ఒక చీర మడత విప్పి చూస్తూ, 'ఈ చీరకొకదానికి పాలిషింగ్ బాగా చేసినట్టు లేదు...'

ఆవిడ చేతిలో నుండి చీరను తీసుకుంది సునీత.

'ఇది జరీ వర్క్ వున్న చీరండి... వీటికి రోలింగ్ చేయడం చాలా కష్టం... యిలాంటి వాటిని తిప్పి పాలిషింగ్ చేస్తాం... యిప్పుడు అలానే కనిపిస్తుంది... కాని కట్టుకుంటే మాత్రం కొత్త చీరలాగా మెరుస్తుంది...' విప్పిన చీరను తిరిగి మడతలు పెట్టి బ్యాగులో సర్ది ఆవిడ చేతికిచ్చింది సునీత.

ఆమె యింకేమీ మాట్లాడలేదు. పర్సులో నుండి రెండు వందల రుపాయల నోట్లు తీసి సునీత చేతిలో పెట్టింది.

'గిట్టదండి... రోలింగ్ పౌడర్ రేట్ చాలా పెరిగి పోయింది... కరెంట్ చార్జెస్ కూడావిపరీతంగా పెంచేశారు. పాలిషింగ్ కు చాలా అవుతోంది. చీరకు ముప్పై రుపాయలండి... పోయిన నెల నుండి యిదే రేట్ తీసుకుంటున్నాను...'

ఏమనుకుందో ఏమో యివ్వాల్సిన పైసల్ని సునీత చేతిలో పెట్టింది. ఆవిడ గేట్ మూసి వెళ్లిపోవడం చూసి అమూల్య

'ఏందమ్మా..! గిట్టదు... రేట్లు పెరిగాయి... అంటూ అట్ల మాట్లాడితే ఆ ఆంటి ఏమనుకుంటుంది...? మన గురించి చీప్ గా అనుకోదూ...? డబ్బుల కోసం వీళ్లు ఏం పీడిస్త్రారా బాబు అని గ్యారంటిగా అనుకొనింటాది...'

దెబ్బ తిన్నట్లు అమూల్య వైపు చూసింది.

'అనుకుంటే అనుకోండ్లే... నా కష్టం గురించి చెప్పితే చీప్‌గా అనుకుంటారా? వాళ్ల సంగతేమో కాని నువ్వే అనుకుంటున్నట్టుంది. నువ్వయితే ఫ్రీగా చేయించి యిస్తావేమో...!'

తను తప్పుగా మాట్లాడినానేమో అన్నట్టు నాలుక కరుచుకుంది. వెంటనే తన పని గుర్తుకు వచ్చింది.

'మా! నాన్న ఫీజ్ కట్టేశాడంట... పదహారు నుండి పోవాలంట...'

'ఎట్టకేలకు కాలేజీలు మొదలౌతున్నాయన్న మాట...! ఈ సంవత్సరం చాలా లేట్ చేశారు ఫస్టియర్ వాళ్లకు. దాదాపు ఐదు నెలలు అయ్యింటుందేమో మీరు ఖాళీగా వుండబట్టి... అన్నీరకాలుగా నష్టమే... ఫీజులు విపరీతంగా పెంచేసిరి... టైమ్ కు కాలేజి తెరవకపోయిరి.'

'అదే కదా... బాగా బోర్ కొట్టేసింది. యింక పదిరోజులు టైమ్ వుంది. అమ్మా! సాయంకాలం బయటకు పోదామా...'

'ఏం కొనాలి...?'

'డ్రస్సులు యింకా...' అమూల్యను పూర్తిగా మాట్లాడనివ్వలేదు సునీత.

'ఇంకేం డ్రస్సులు అమూల్యా...! వున్నాయి కదా! పుట్టినరోజుకి, ఉగాదికి తీసుకున్నవి అట్టనే వుండాయి. అవి కాక కొత్తవి మూడు జతలు వున్నాయి. అవి యింత వరకు వాడనే లేదు... ఇంటర్ లోటివి, అంతకు ముందువి వున్నాయి కదా...! మళ్లీ డ్రస్సులు అంటున్నావు? ఏం చేసుకుంటావు...'

'అంటే ఆ పాత డ్రస్సులే యిప్పుడు కూడా వేసుకొని పొమ్మంటావా...?' పళ్ళు, మూతి బిగపెట్టి అడిగింది అమూల్య.

'కొత్తవి, పాతవి రెండూ వాడుతాండు... ఎప్పుడూ కొత్తవే అంటే ఎక్కడ నుండి వస్తాయి...?'

'రోజుకో డ్రస్సు వుండాలా అని నేనేం అడగటం లేదు. అట్ల పాతవి తిక్కతిక్కవి ఎట్ల వేసుకుంటారమ్మా? వాటిలో సగం అవుటాఫ్ ఫ్యాషన్. దాండ్లను వేసుకొని కాలేజికి పోతే మ్యూజియంలో వస్తువును చూసినట్టు చూస్తారు...'

'మరి వాటిని ఏం చేయమంటావ్...'కొంచెం మెత్త బడింది సునీత.

'ఏమో...! 'భుజాలు, కళ్లు రెండు ఎగరేసింది అమూల్య.

అమూల్య వైపు చురుగ్గా చూసింది సునీత.

'రోజుకు ఒక కొత్త ఫ్యాషన్ వస్తాంటాది. కొత్తది కనిపిస్తే చాలు కొనాలంటావు... అవన్నీ కొనివ్వాలంటె ఎక్కడ అవుతుంది...? అడగటానికి కూడా ఒక హద్దు పద్దు వుండాలి...'

ఆమూల్యకు సర్రున కోపం వచ్చింది.

'అవునులే పాపం... నాకోరికలకు హద్దు వుందా ఏమైనా? నేను ఏమీ అడిగితే అది నాకు నిమిషాల్లో కొనిస్తున్నారు కదా... ఏదన్నా అడిగితే చాలు క్లాసు పీకకుండా మాత్రం వుండరు..?'

అమూల్య గొంతులోని వెటకారానికి సునీత నొచ్చుకుంది.

'ఏం మనిషి...! ఎన్ని కొనిచ్చినా ఈ పిల్లకు తృప్తి లేదు. తను అడిగేటివి అన్ని కొనియ్యకపోవచ్చు... ఒక్కొక్కసారి తను అడగకపోయినా కొనిస్తాను కదా...! ఎప్పుడు చూడూ యింకా అది కావాల యిది కావాల ...ఒకదాని తర్వాత వొకటి రడీగా పెట్టుకోంటుంది.... డబ్బులు ఎక్కడ నుండి వస్తాయనుకుంటుందో...? కొంచెమన్నా అర్థం చేసుకోవద్దా...? 'సునీత ఉదాసీనంగా వుండి పోయింది.

కాసేపటికి బీరువా తెరిచి చీరల కింద పెట్టిన నోట్లను లెక్క పెట్టింది.

ముఖమంతా సీరియస్ గా పెట్టుకొని టీవి చూస్తోంది అమూల్య.

'లే...అన్నం తిందాం... సాయంకాలం పోదాంలే...'

'ఏమక్కర్లేదులే... తిట్టేది... కొనిచ్చేది... మళ్లీ అరిచేది...'

'ఈ అలగడమే వద్దనేది... నిన్ను తిట్టేంత సీనా...! అర్థం చేసుకొని చూసుకొని పొమ్మని చెబుతున్నా అంతే... యింతకు ఎక్కడెక్కడికి పోవాల మనం...'

అమూల్య కు వుత్సాహం వచ్చింది.

'అట్లడుగు బాగుంది..! ముందు కల్పనాకు పోదాం... చాలా బాగున్నాయంట... వెరైటీస్ కూడా చాలా వచ్చాయంట... లేటెస్టు మాడల్స్ అంట...! మాఫ్రెండ్స్ చాలమంది అక్కడే తీసుకున్నారు. మనం కూడా అక్కడికే పోదామమ్మా... అక్కడికి పోయినాక... యింత రేటా? వద్దు...కొంచెం తక్కువలో చూపెట్టండి అని షాపు వాళ్ల దగ్గర మాత్రం దయచేసి అనొద్దు... ప్లీజ్... ఘోరంగా వుంటుంది...'

కల్పనా షోరూమ్ కు పోతే తన దగ్గర వున్న డబ్బు ఏ మూలకు చాలదని అర్థమయ్యి సునీత గుండె దడదడలాడింది.

ఇలాంటి సందర్భాలు ఎన్నో...! ఎప్పుడు వుండేదే...! కొత్తదేం కాదు..కాకపోతే ఎప్పటికప్పుడు కొత్త డిమాండ్స్.

తాము ఇద్దరు చేతులెత్తయ్యటం.... ఈ పిల్ల రెండు చేవులు మూసేసుకోవటం...

యిటు అరవడం... అటు అలగటం...

తాము బ్రతిమలాడటం... ఆమె బిగుసుకు పోవటం...

ఆమె ఏడ్చటం... తాము కరిగిపోవటం...

ఆమె అన్నం తినకపోతే, తమకు అన్నం సహించకపోవటం

చివరకు అడిగినదాని కంటే రెండు ఎక్కువ కొనిచ్చి పిల్లను ప్రసన్నం చేసుకోవటం...

'అమూల్యా...! ప్రస్తుతం నా దగ్గర వుండేది రెండు వేలు. ఏమన్నా చేసుకో...! కల్పనాలో కొంటావో... కవితాలో కొంటావో నీ యిష్టం...

సరిపోయినా సరిపోకపోయినా వీటితో సరిపుచ్చుకో....'

తల్లి వైపు అదోలా చూసింది అముల్య.

'నువ్వు ఎప్పుడూ యింతే... రెండువేలిచ్చి సర్దుకో అంటే ఎట్ల సర్దుకోమ్మంటావుమా..? ఏం వస్తాయి ? మౌని వాళ్ల అమ్మ అయితే హైదారాబాద్ నుండి తన కోసం ఎన్ని కొనుక్కొచ్చిందో తెలుసా...! అన్ని వద్దులే నాకు...నాలుగు క్యాజువల్స్ అన్నా కావాల్నా వద్దా? ఫ్రెషర్స్ పార్టీ, ఎత్నిక్ పార్టీ కాలేజ్ డే ఏవో ఒకటి ఫంక్షన్స్ వుంటాయి. వాటికి అందరు డిజైనర్ డ్రస్సులే వేస్తారు. నాకు వాళ్ల మాదిరిగా వేసుకోవాలని వుండదా? అప్పుడు కూడా రోజూ వేసుకొని పోయే డ్రస్సు వేసుకొని పొమ్మంటావా? నువ్వే చెప్పు... అందరూ స్టైలుగా బ్రాండెడ్ జీన్స్ వేసుకుంటే...నేను తిక్కదానిలాగా ఏది బడితే అది వేసుకొని పోవాలా?నేను చస్తే కూడా అట్ల వుండను నాకు కూడా బ్రాండెడ్ జీన్స్ కావాల్సిందే...వాటి పైకి జూలియట్ కంపెనీ టాప్స్ బాగుంటాయని మా ఫ్రెండ్స్ చెప్పారు. ఎక్కువేమీ వద్దు...నాలుగు కొనివ్వు చాలు...ముందువి కాటన్ వి కొన్ని వున్నాయి కదా...'వాకిలి దగ్గర ఎవరిదో నీడ పడినట్టుగా అనిపిస్తే చెప్పేది ఆపేసింది అమూల్య..

చీరలు రోలింగుకు యివ్వడానికి వచ్చింది ఒకావిడ.

'ఏం అమూల్య ! మంచి ర్యాంక్ తెచ్చుకుంటివి...మంచికాలేజిలో సీటూ తెచ్చుకుంటివి యింకేం...పార్టీ ఏంలేదా? యింతకు ఎప్పటి నుండి కాలేజి...?'వచ్చినావిడ అమూల్యను పలకరించింది.

'పదహారు నుండి ఆంటీ...!'

యింట్లో వాళ్లతో ఎంత గట్టిగా దబాయించి మాట్లాడుతుందో బయటవాళ్ల దగ్గర చాలా వినయంగా నోట్లో నుండి మాట రానంత మెత్తగా మాట్లాడుతుంది అమూల్య.

కళ్ళు తిప్పి అమూల్య వైపు చూసింది సునీత. ఎందుకో నవ్వు వచ్చింది సునీతకు.

'అమూల్య పాలు తోడు వేయాలి. కొంచెం పాలు అట్ల స్టౌ మీద పెట్టుపో...'

బ్రతికించావు అన్నట్టు సునీత వైపు చూసి అక్కడ నుండి పక్కకు పోయింది.

'కాలేజిలో చేరే ముందు ఖర్చులు విపరీతంగా వుంటాయి. ఏంటివేంటివో అడుగుతాంటారు కొనివ్వమని... మీ అమూల్య ఏం అడగలేదా?'

'ఎందుకు అడగలేదు... ఆ విషయమే మాట్లాడుకుంటున్నాం... ఏవో కొనాలంట... సాయంకాలం బజారుకు పోదామంటోంది...'

'వాళ్లు అడుగుతాంటారు... మనం కొనియ్యాల్సిందే. ఈ కాలం పిల్లలే అంత... మనలాగా కాదు... వెరైటీస్ కావాలి... అవి కూడాఎంత ఖరీదయినవయితే అంత గొప్ప... కొనిచ్చేవరకు ప్రాణాలు తీస్తారు....'

'అబ్బాయిలు కొంచెం మేలేమోలే...'

'ఎవరు నీకు చెప్పిందేది... నీకు కూతురు కాబట్టి మగపిల్లల సంగతి తెలియటం లేదు... ఆడపిల్లల కంటే మగపిల్లలు యింకా రెండాకులు ఎక్కువేగాని తక్కువయితే లేరు..నాకయితే మావానితో సాలయిపోతాంది. నాలుగు వేలకు తక్కువ డ్రస్ వేయనంటాడే.... బ్రాండెడ్ వే కావాలంటాడు. అవయితే పాతగయ్యి చినిగిపోయినా గుండీలు వూడిపోవంటా, కుట్లు పోవంటా, కలర్ కూడా పోవంటా... కొనిచ్చుకోడానికి ఏందేదో చెప్తాంటాడు. ఇంట్లో వేసుకునే టీ షర్ట్స్ కూడా ఎడెనిమిది వందలు పెట్టి కొంటెనే తొడిగేది...'

ఆవిడ గొప్పలు చెప్పుకుంటోందో లేక బాధను వెళ్ళబోసుకుంటోందో సునీతకు అర్థం కాలేదు.

'అయితే అబ్బాయిల కంటే అమ్మాయిలే మేలంటావు...'

'ఆ...! మరి అట్ల అనుకోవద్దు...అందరందరే...! ఒకర్ని తియ్యవట్టదు...ఒకర్ని పెట్టవట్టదు...మీ అమూల్యను చూస్తే నాకు చాలా మేలనిపిస్తోంది. మాచెల్లెలి కూతుర్ను చూస్తే ఏమంటావో... ఒక ఫంక్షన్ కు వేసుకుపోయిన డ్రస్సును యింకొక ఫంక్షన్ కు చస్తే కూడా వేసుకుపోనంటుంది. ఏమంటే...అందరూ చూసింటారు...మళ్లీ అదే డ్రస్సు వేసుకుంటే ఈ పిల్లకు ఈ డ్రస్సు తప్ప వేరే డ్రస్సు లేదు అనుకుంటారంట...పిల్లలకు మంచి డ్రస్సులు కొనియ్యడంలేదని తల్లిదండ్రుల్నే తక్కువగా అనుకుంటారంట...మా చెల్లెలుకు తల వాచి పోతోంది అనుకో. యింకా కొంతమంది పిల్లలయితే నగలు కూడా మ్యాచింగ్ వుండాలంటున్నారు...అట్ల తయారయిపోతున్నారు ఈ కాలం పిల్లలు...మనం ఏమన్నా చెప్పినా వినేట్టుగా లేరు...'

* * *

'ఎందుకు ప్రతి దానికి వీళ్లు యిట్ల అడ్డం పడ్తారు...? ఈమె అయితే మరీ...! ఒక్క దానికి కూడా వెంటనే వొప్పుకోదు...ఏది అడిగినా ఏం అవసరం అంటుంది...అవసరం అయితేనే కొనాలా? అవసరం అంటే ఎక్కడికి...? అలా అయితే రెండు డ్రస్సులు వుంటే చాలు...మరి దానికి కూడా వొప్పుకోరు కదా... అందరి అమ్మా నాన్న వాళ్లు ఎట్లున్నారు...? వీళ్లెట్లున్నారు...?.వున్నవాటితో పని జరుపుకో అంటారు....పని జరుపుకోవడం అంటే ఏంటో వీళ్ల భాషలో... ఏడ్చి అలిగేవరకు ఎందుకుండాలా...? నాన్న కూడా ఈసారి అమ్మ వైపే మట్లాడినాడు...నాదే తప్పా..! అయినా ఎమంత కానివి అడిగినా..? ఒక్క కూతుర్ని ఎంత బాగా చూసుకోవాల...? అందరేమో నీకేమమ్మా ఒక్క కూతురివి...ఏవి కావాలంటే అవి తీసిస్తారు మీ అమ్మా వాళ్లు అంటారు...ఈడ చూస్తేనేమో యిట్ల...ఎంజాయ్ చేయడమే తెలియదు ఇద్దరికి...యిప్పుడు కాకపోతే యింకెప్పుడు ఎంజాయ్ చేస్తారు...ఎప్పుడూ చిట్టి, ఆర్.డి అని జపం చేస్తుంటారు...ఎందుకు ఈ తిప్పలు అంటే, రేపు ఏదన్నా అవసరం వస్తే ఎలా మరి అంటారు. పొదుపు చేయడానికే పుట్టినట్లు మాట్లాడాతారు. పొదుపు లక్ష్మి, పొదుపు లక్ష్మయ్య అని టైటిల్ పెట్టి సినిమా తియ్యాలి...టేస్టే లేదు. బాగా ఖరీదైన బట్టలు వేసుకొని నలుగురిలో ఫ్యాషన్ గా కనపడచ్చు కదా. ఊహు...ఆ కథే లేదు...అందరూ ఏడెనిమిది వేలు పెట్టి పట్టు చీరలు కొని, కట్టుకొని ఝూమ్మని పెండ్లిల్లల్లో తిరుగుతుంటుంటారు. ఈమేమో కనీసం రెండు వేలు పెట్టి ఇంతవరకు ఒక్క చీర కొన్న పాపాన పోలేదు...ఈమె అంతే...ఆయన అంతే.. ఇద్దరిద్దరే...ఒకరికొకరు ఏం తీసిపోరూ...ఏం చేసుకుంటారు సంపాదించి...మళ్లీ నాకే కదా యిచ్చేది...యిప్పుడు యివ్వకుండా తర్వాత ఎప్పుడో యిస్తే ఏం లాభం...అప్పటికి నాకు కూడా ఏదో ఒక జాబ్ వచ్చేసింటుంది. అప్పుడు వీళ్లను ఒక్క పైసా కూడా అడగకూడదు...వీళ్లకే ఖర్చు పెట్టాల...అమ్మకు బాగా కాస్ట్లీ శారీస్ నెలనెల రెండు తీసివ్వాలి. నాకు చీరలు వద్దు బాబోయ్ అన్నంతగా కొనివ్వాల... నాన్న కూడా ఎన్ని రోజులు ఈ డొక్కు బైక్ లో తిరుగుతాడు. సర్ ప్రయిజ్ గిఫ్ట్ కింద నాన్నకు ఐ ట్వంటి కార్ తీసివ్వాలి... అరే...ఈ పిల్లను అనవసరంగా తిడ్తాంటిమే అని బాధ పడ్తారు...యిప్పుడు మాత్రం ప్రతిదానికి క్లాస్ అయినా పీకుతారు యింక లేదంటే దండకం మొదలు ఎత్తుకుంటారు...'

* * *

మంచానికి వీపు ఆనించి బయటకు చూస్తోంది సునీత. కొబ్బరి

చెట్టు ఆకులు కదిలినప్పుడంతా వెన్నెల పొరలు పొరలుగా సునీత ముఖం మీద పడుతోంది. కాసేపు చీకటి, కాసేపు వెన్నెల సునీతను పరామర్శిస్తున్నాయి. వెన్నెల మీద పడినప్పుడంతా కళ్లు సగం మూస్తూ సగం తెరుస్తోంది సునీత. ఇదంతా గమ్మత్తుగా వుంది ఆనందుకు. సునీతకు దగ్గరగా జరిగాడు.

'ఏం ఆలోచిస్తున్నావు అంత దీర్ఘంగా... 'చెవిలో గుసగుసగా అడుగుతూనే సునీత చెవి మీద ముద్దు పెట్టాడు. పెదవుల కుడి చివర మెరిసిన నవ్వు మెల్లిగా సునీత ముఖమంతా అల్లుకుపోయింది.

'ఎన్ని దినాలయ్యిందో సునీత ముఖం మీద యిలాంటి నవ్వు చూసి...రానూరానూ జీవితంలో చిన్న చిన్న సరదాలకు కూడా మొకం వాచినట్టయిపోతోంది...ఏం జీవితమో ఏమో... ఎవరి బిజి వాళ్లది...ఎవరి లోకం వాళ్లది... మాటలు కూడా కరువే...మాట్లాడుకున్నా ఎంత సేపు యిల్లు, డబ్బులు, సేవింగ్స్, అమూల్య చదువులు, ఫీజులు...యివి తప్ప వేరే మాటలే వుండడంలేదు...ఎప్పటినుండో యిట్ల? ఎందుకయ్యింటుంది...?'

సునీత ముఖాన్ని కాసేపు అలానే చూడాలనిపించింది ఆనందుకు.

పలుచటి చెంపలు... కళ్ల కింద నలుపు... చెంపల దగ్గర, పాపిట్లోనూ తొంగి చూస్తున్న తెల్ల వెంట్రుకలు... యింటి పని, చీరల రోలింగ్, జిగ్ జాగ్, ఫాల్స్ కుట్టడాలతో తీరిక లేక నలిగిపోతున్న సునీత...దిగులుగా అనిపించింది ఆనందుకు. అనుకోకుండానే నిట్టూర్చాడు.

'పనివత్తిడి... దానికి తోడు వయసు వచ్చేస్తోంది... ఎందుకు రాదు... కూతురికే పజ్జెనిమిది వస్తాంటే, కన్నోళ్లకు వయసు రాకుండా ఎట్ల వుంటుంది...?'

పక్క రూం వాకిలి దబ్బుమని వేసినట్టు శబ్దం వచ్చింది. ఆనందు కోపంతో లేవబోతుంటే చెయ్యి పట్టి లాగింది సునీత. విడిపించుకో బోయాడు. రెండు చేతులతో గట్టిగా పట్టుకుంది.

'యిప్పుడు ఏం అనొద్దు... నిద్రపోనీ... తను అడిగినేటివి కొనివ్వం అని ఇద్దరం ఒకేసారి చెప్పేసరికి భరించలేపోతోంది...'

'కొనివ్వం అని ఎక్కడన్నాం... అన్నీ కొనివ్వం, అవసరమైనవి మాత్రమే కొనిస్తాం అని కదా మనం చెప్పిండేది... ఆమెకేమో అన్నీ అవసరంలాగానే కనిపిస్తాయి...! ఒకటా రెండా అడుగుతాండేది... రోజుకొకటి యాడ్ చేస్తా పోతోంది. ఈ కాలం పిల్లల కోర్కెలు తీర్చడానికి నెలకు యాభై అరవై వేలు జీతం వచ్చినా సరిపోదేమో అనిపిస్తుంది...'

మంచం మీద నుండి లేచి గదిలోనే అటూ యిటూ పచార్లు చేస్తూ ఏదో గుర్తు చేసుకున్నాడు.

'నీతో అన్నట్టు లేను... ఫాస్ట్ ట్రాక్ వాచ్ కావాలని అమూల్య మొన్న అడిగింది. నీకు వాచ్ వుంది కదమ్మా అంటే... ఆ... వుంది... అందరికయితే మూడు నాలుగు వాచులుంటాయి... నాదగ్గరుండేది పాత డొక్కు మాడల్లి అని ఫీలయితే, సరేలేమ్మా కొనిస్తాను అని చెప్తి.... నిన్న అవేవో చెప్పులు కావాలంది... ఏంటవి... ఆ... క్యాట్ వాక్ చెప్పులంట... నీకు తెలుసా ఆ చెప్పులు ఎట్లుంటాయో...'

'ఆ... సర్లే... చెప్పులు తెగితే కుట్టించుకొని వేసుకునే నాకు ఎట్ల తెలుస్తాయ్ స్వామీ అట్లాంటివన్నీ... బయట తిరిగేటోళ్లు మీరు... ఏమన్నా తెలిస్తే నీకు, నీకూతురికే తెలియలా...!'

'నన్నే దెబ్బ కొడుతాండావా...? సర్లేకాని... చెప్పులని అడిగిందా? మళ్లీ బ్యాగులు అనింది. ఏది ఒకటి అడగదు.! రెండు మూడు కావాలంటుంది. అవి అయిపోయినాయా ఈ రోజు ఏకంగా సెల్లుకు టెండర్ పెట్టింది. మామూలు సెల్లు కూడా కాదు... టచ్ స్క్రీన్, కెమెర ఎఫెక్ట్స్ వుండేటివి కావాలంట...వాడు ప్రభాకర్ చెప్తాంటాడు స్టూడెంట్స్ దగ్గర వున్నంత కాస్ట్లీ సెల్స్ లెక్చరర్స్ దగ్గర కూడా వుండవంట. కొంతమందయితే రెండు మూడు సిమ్ములు మెయింటైన్ చేస్తా్న్నారంట... ఒకర్ని చూసుకొని ఒకరు.! మనట్లాటోళ్లం నెత్తి నోరు కొట్టుకుంటే సెల్లులు అమ్మేటోనికి పండగ. దిక్కులేనంత బిజినెస్....'

'అసలు వీళ్లు కాలేజీలకు పోయేది చదువుకోడానికా లేక ఎవరి దగ్గర ఏం వున్నాయి? ఎట్లాంటివి వుండాయ్... ఏ కంపెనీవి బాగుంటాయ్... ఎంత రేట్... యిట్లాంటివి మాట్లాడుకోడానికా...'

'సరిగ్గా నేను కూడా అదే అనుకుంటున్నాను సునీతా..! ఎంత సేపు అది కొనివ్వు... ఇది కొనివ్వు అంటూ వాటి మీద మోజు తప్ప, అవి ఎంత మటుకు అవసరం అనేది ఏమాత్రం ఆలోచించదే. కాలేజికి సెల్లు ఎందుకమ్మా అంటే సెల్లు లేకపోతే ఎట్ల నాన్నా, ఏదన్నా అవసరం పడ్తే ఎట్లా అంటుంది... రోజూ అవసరం వుండదు అని తనకు కూడా తెలుసు... తెలియక ఏం కాదు... కాని వుండాలా అంతే... అందరి దగ్గర వుంది నా దగ్గర వుండాలా... యింక వేరే లాజిక్కే లేదు...'

ఆవులింతను బలవంతంగా ఆపుకుంది సునీత. ఎర్రబడిన సునీత కళ్లను చూసి,

'ఎంతసేపు మాట్లాడుకున్నా యిది తేగేది కాదుగాని పొద్దున్నే ఆ పాపతోనే డైరెక్టుగా మాట్లాడుదాం... యింక లైట్ ఆఫ్ చేసేయ్. పడుకుందాం...'

చంద్రుడు మరింత ఉత్సాహంగా కొబ్బరిచెట్టుమీదుగా దాగుడు మూతలు ఆడుతున్నాడు. కొబ్బరి ఆకులు గాలికి వూగుతుంటే ఎవరో పొదుగాటి విసన కర్రలు తీసుకొని విసురుతున్నట్టుగా వుంది సునీతకు. పక్క రూమ్ లో లైట్ ఆర్పేసినట్టుంది.

* * *

గంజిలో ముంచిన చీరలను రోలింగ్ కర్రలకు చుడుతోంది సునీత. మడతలు పడకుండా చీరలను వెడల్పుగా సర్దుతోంది అమూల్య.

'నిన్నటి కోపం యింకా తగ్గినట్టులేదు... పోంద్లే... పిలవకున్నా వచ్చి చేస్తోంది కదా!... నిదానంగా, కోపం తెచ్చుకోకుండా చెప్పాల...'

'కాలేజీలో చేరుతుంటే యింత హంగామా అవసరమా అమూల్యా? ప్రతిదానికి మీలాగే నేను కూడా అట్లే వుండాలా అంటావు...! మీకాలం కాదు అంటావు... నిజమే యిది మా కాలం కాదు... మీకాలమే... మిమ్మల్ని కూడా మాలాగే వుండమని చెప్పడం లేదు... కాని నేను కూడా డిగ్రి చదివినా.. మీనాన్న ఎమ్.ఎ చదివినాడు. గాని యిట్ల అయితే మాత్రం మేము చదవలేదు. కాలేజికి పోవాలంటె యిన్ని అవసరాలు వుంటాయని అప్పట్లో మాకు తెలియదు...'

తన కాలేజి చదువును కూతురి కాలేజి చదువుతో పోల్చుకుంటోంది సునీత. వర్తమానంతో గతాన్ని మాట్లాడించే ప్రయత్నం మొదలు పెట్టింది.

'పుస్తకాలు, పెన్నులల్లోకి ఇంకు కొనుక్కోడానికి డబ్బులు యిస్తే చాలు అనుకుంటాంటీని... సమయానికి పరీక్ష ఫీజ్ కడితే అదే పదివేలు... సంవత్సరానికి రెండు జతల బట్టలు... దశరాకి, ఉగాదికి అంతే ... పుట్టినరోజు అనేదే ఎరగం... ఎప్పుడయినా యింట్లో అడిగి అదీ వాళ్లు డబ్బులిస్తే ఫ్రెండ్స్ తో కలిసి సినిమాకు పోయేవాళ్లం... ఇప్పుడు??? సినిమాలేమీ? ఫాస్ట్ ఫుడ్ సెంటర్లేమీ, చాట్ బండార్లు, ఐస్ క్రీమ్ పార్లర్లు... బిర్యాని పాయింట్స్... ఓయబ్బా... యాదో ఒకటి చెప్పేది రెండు వందలు లాక్కొని పోయేది... మేము చదువుకునేటప్పుడు యివన్నీ ఎక్కడవి? మా నాన్న ఒక్కడు సంపాదించాల... ఐదుమందిమి

తినాల.. ఒక్కని జీతంతో ముగ్గురి చదువులు... పెండ్లిల్లు... ఇప్పుడో...! మీనాన్న వుద్యోగస్తుడు... నాకూ అంతో యింతో ఆదాయం వుంది...వుండేది ఒక్కదానివే... అయినా సరిపోవడం లేదు... ఎందుకంటావు..? చుట్టు పక్కల వాళ్లను, ఫ్రెండ్స్ ను, బంధువులను చూసి వాళ్లందరి మాదిరిగా కనబపడడానికి బలవంతంగా మనమే మన రేంజ్, లెవల్, స్టేటస్ పెంచుకోడానికి ఎన్ని తిప్పలు పడాలో అన్ని తిప్పలు పడుతున్నామనిపిస్తోంది...'

చీరలు గట్టిగా లాగి చుడుతుండటంతో చేతులు నొప్పి పెట్టాయి సునీతకు. చేతులు బలంగా విదిలించుకుంది. బలంగా వూపిరి పీల్చుకోసాగింది.

అమూల్య ముఖంలో రంగులు మారుతున్నాయి. కళ్లల్లో నీళ్లు దూకడానికి సిద్ధంగా వున్నాయి.

ఏదో ట్రాన్స్ లో వున్నట్టు మాట్లాడుతోంది సునీత.

'నువ్వు చెప్తే నమ్ముతావో లేదో కాని కట్ పీసుల చీరలు అంటె రెండు ముక్కల చీరలు డెబ్బై రుపాయలే. వాటిని తెచ్చేది మా అమ్మ...జాయింట్ చేసుకొని కట్టుకునే దాన్ని...ఆ రోజుల్లో నేను కట్ పీస్ చీరలు కట్టుకుంటే, ఈ రోజు నాకూతురు డిజైనర్ డ్రస్ లు కావాలంటోంది...'

భుజాలు నొప్పిగా అనిపిస్తుంటే రోలింగ్ పని ఆపేసి మెట్ల మీద కూచుంది సునీత. ఎప్పుడొచ్చాడో ఆనందు, చేతులు కట్టుకొని, వాకిలికి ఆనుకోని సునీతను తదేకంగా చూస్తున్నాడు.

భుజం రెక్కలు నొక్కుకుంటూనే మాట్లాడుతోంది సునీత.

'నేను పదోతరగతిలో వున్నప్పుడు బెంగుళూరు నుండి హెచ్.ఎమ్.టి వాచీ తెప్పించాడు మానాన్న. దాన్నేనిన్ను స్కూల్లో జాయిన్ చేసేవరకు పెట్టుకుంటాంటిని... యిప్పుడు నా కూతురికేమో ఒక వాచీ చాలడంలేదు...'

ఆనందుకు తన జ్ఞాపకాలను ఎవరో పిలిచినట్టయ్యింది. మెట్లమీద సునీత పక్కనే కూచుంటూ

'మీ అమ్మకు నయం... పదో తరగతిలో వాచీ కొనిచ్చారు... నాకెప్పుడు కొనిచ్చారో తెలుసామ్మా...? ఎమ్.ఏలో జాయిన్ అయ్యాక కొనిచ్చినాడు మానాయన, అదీ కందులు అమ్మి కొనిచ్చినాడు. ఒకపక్కేమో వాచీ పెట్టుకున్న సంబరం... యింకొకపక్కేమో మా అమ్మానాయన కష్టం... ఆరు నెల్లు కష్టపడితేగాని పంట చేతికి రాదు. ఎప్పుడోగాని చేతులల్లో డబ్బులు వుండేటివి కావు... ఏదన్న ఒకటి కొత్త వస్తువు కొంటే అది ఎంత చిన్నదైనా సరే వూర్లో అందరు వచ్చి చూసేటోళ్లు... నేను చిన్నప్పుడు మా యింట్లో రేడియో వుండే.... అది కొనుక్కోని వచ్చిన రోజు మా జేజి నాయన, ఎందుకీ పనికిమాలిన వస్తువులు... డబ్బులు దండగ అని మానాయనను అరిచినాడంట... యిప్పుడు వస్తువులు లేకపోతే జీవితమే దండగ అనుకుంటున్నారు...'

'యిప్పుడు నాకు యివన్నీ ఎందుకు చెబుతున్నారు నానా...'

'నీతో చెప్పడం కాదమ్మ యిది. మమ్మల్ని మేము గుర్తు చేసుకుంటున్నాం అంతే...'

'ఈ కాలం పిల్లలకి సామాన్లు, వస్తువుల మీద వున్న ప్రేమ మనుషుల మీద లేదేమో అనిపిస్తుంది.. తాము ఏది అడిగితే అవి కొనిస్తే అప్పుడు తల్లితండ్రులకు తమ మీద ప్రేమ వున్నట్టు అని అనుకుంటున్నారు ఈ జనరేషన్ పిల్లలు... ఇప్పుడు తల్లితండ్రులు అట్లనే వున్నారు. పిల్లల కోసమే వీళ్లంతా బ్రతుకుతున్నారా అని అనిపిస్తుంది... నాకు ఏమనిపిస్తుందో తెలుసా సునీతా....! పిల్లల మీద తల్లితండ్రులకు వుండేది ప్రేమ కాదు... వ్యామోహం... తల్లితండ్రుల ప్రేమను ఎన్ క్యాష్ చేసుకుంటున్నారు ఈ కాలం పిల్లలు...'

అమూల్య ముఖం చిన్నబోయింది. తలవంచుకొని నేల చూపులు చూస్తోంది.

గడ్డం పైకెత్తి అమూల్య కళ్లల్లోకి చూసింది సునీత.

'నా కూతుర్ని ఎప్పుడూ బాధ పెట్టకూడదనుకుంటాను.... ఒక్కొక్కసారి కంట్రోల్ వుండదు. కాని ఏం చెస్తాను చెప్పు... నువ్వు కోరే కోరికలు వింటుంటే ఒక్కొక్కసారి పిచ్చి కోపం వస్తుంది. అంత మాత్రనా ప్రేమ లేదని ఎట్ల అనుకుంటావు... అసలు అంత పిచ్చేందుకు నీకు డ్రస్సులు, వస్తువులు అంటే...'

'అమ్మా... నాకేం పిచ్చి లేదు... వాటి కోసం నేనేం ఏడ్వడం లేదు... అందరి దగ్గర వుంటే నా దగ్గర ఎందుకు వుండకూడదు అనిపిస్తుంది...? 'అమూల్య గొంతులో ఏడుపు జీర.

ఏడుపును బలవంతంగా ఆపుకుంటోంది.

'అదే ఎందుకు అట్ల అనుకోవాలా? అట్ల అనుకోవటంవల్ల నీ యిగో ఏమైనా శాటిస్ ఫై అవుతుందేమోగాని లాభపడేవాళ్లు మాత్రం వ్యాపారస్తులే. మమందరం చాలా కష్టపడి వాళ్ల లాభాలను పెంచుతున్నాం. వస్తువుల మీద క్రేజో, మోజో, ఫోజో ఎదైనా సరే వుంది అంటే మాత్రం మార్కెట్ తయారు చేసే రకరకాల వస్తువులను కొనడంతోనే జీవితమంతా గడిచిపోతుంది... ఇప్పుడు నీకు అర్థం కాకపోవచ్చు... నిదానంగా ఆలోచించి చూస్తే నీకే తెలుస్తుంది... దీన్ని తిట్టడమో, క్లాస్ పీకడమో అని మాత్రం దయచేసి అనుకోవద్దు...'

అమూల్య చెంపలను నిమిరింది. నుదుటి మీద వాలిన వెంట్రుకలను సరిజేసింది. ఆనందు కూడా దగ్గరగా వచ్చాడు.

'అమ్మ రోలింగ్ చేసేటప్పుడు నువ్వు కూడా అప్పుడప్పుడు సహాయం చేస్తుంటావు...! అవునా? యిందులో ఎంత కష్టం వుందో నీకు కూడా తెలుస్తోంది... యింత కష్టం ఐదారు రోజులు పడ్తే కాని వెయ్యి రూపాయలు మిగలవు... ఆ డబ్బులన్నీ దేనికి ఖర్చు పెడుతున్నామో నీకు తెలుసు. అంటే మనమంతా బానిసల మాదిరిగా కష్టపడి వాళ్లకు లాభాలను అందిస్తున్నాం...'

కళ్లు వెడల్పు చేసి ఇద్దరి వైపు మార్చి మార్చి చూస్తోంది. అర్థమయినది కొంచెం అర్థం కానిది అనంతంలా వుంది అమూల్యకు.

'నాకేమో యిన్ని మాటలు చెప్తాన్నారే...! నేనొక్కదాన్ని మానేస్తానే ప్రపంచమంతా మారిపోతుందా ఏమన్నా...? అందరూ వింటారా చెప్తే...?చూసీనాంపో అంటారు...!'

'అందరూ ఎప్పుడూ వినరు...! వాళ్లల్లోనే కొంతమంది వస్తువులను తయారు చేసేవాళ్లు వుంటారు... యింకొంతమంది ఆ వస్తువులను మార్కెట్ చేసే వాళ్లుంటారు. వాళ్ల సంగతి వదిలేయ్... మనట్లాంటి ఇళ్లల్లో యిది అందరికి వుండే సమస్యే... ఓపిక వున్నవాళ్ల నచ్చచెప్తారు. లేనోళ్లు అరిచి నోళ్లు మూపిస్తారు...'

సునీత అమూల్యనే గమనిస్తోంది. మెల్లిగా పెదవులు విచ్చుకున్నాయి

'మీ నాన్న చెప్పిందేది కరెక్టేనమ్మా...! మొన్న ఆంటీ కూడా వాళ్ల అబ్బాయి, చెల్లెలు కూతురు గురించి యిదే చెప్పింది. ప్రతి యింట్లోనూ వుండేదే... చాలామంది తల్లిదండ్రులు ఫేస్ చేస్తున్నారే... నలుగురిలో, నేను యిది కొన్నాను అని మీరు చూపిస్తారే కాని తల్లిదండ్రులు ఎట్ల కొనిచ్చారో మాత్రం చెప్పరు... ఆ ఆలోచన లేకపోవడమే పెద్ద విషాదం...

కథ

మునెమ్మవ్వ

- స్వాతి

డిసెంబర్ నెలలో ఓరోజు

ఉదయం 8గంటలు...

దుప్పట్లో ముడుక్కుని హాయిగా నిద్రపోయే వేళ...

ఫోన్ ఊరికే రింగ్ అవుతోంది...

ఇంత పొద్దున్నే ఎవరికి గుర్తొచ్చానో.. విసుక్కుంటూనే దుప్పట్లోంచే.. 'హలో..' ఫోన్ ఎత్తింది తేజ

'ఏమే ఇంకా లేవలే..' అరుపులా అడిగింది శాండి..

(నిజానికి శాండి పేరు సంధ్య.. అందరూ ముద్దుగా శాండి అంటారు)

'నువ్వా.. ఇంత పొద్దున్నే ఏమొచ్చిందే..'

(జో అంటే జోత్స్న... షార్ట్‌కట్‌లో జో అయ్యింది..)

'హో.. కదా.. అయినా లంచ్ కదా ప్లాన్ చేసుకున్నాం..'

'అవును.. నన్నెవరు పికప్ చేసుకుంటారే..'

'అదొకటి ఏడిసింది కదూ.. సరేలే.. ఓ అరగంటలో వస్తా'

'సో స్వీటాఫ్‌యూ.. బై..'

'దీనికేమీ తక్కువ లేదు'.. విసుక్కుంటూ మంచం మీదనుంచి లేచింది తేజ.

* * *

మధ్యాహ్నం 1.30 బంజారాహిల్స్.. బార్బిక్యూ..

కార్నర్ టేబుల్ దగ్గర నలుగురు అమ్మాయిలు కూర్చుని మాట్లాడుకుంటున్నారు. తెలుగు.. ఇంగ్లిష్ కలగలిపిన టింగ్లిష్.

రావాల్సిన దోస్తులు ఇంకా ఉన్నట్లు ఉంది. మాటి మాటికి డోర్‌వైపు చూపులు వెళుతున్నాయి.

ఏమే.. వస్తుందంటావా? ఓ స్నేహితురాలి సందేహం..

'వస్తా అనే చెప్పిందే.. వస్తుంది..' అభయం ఇస్తున్నట్లు చెప్పింది శాండి..

'రెండేళ్ల తర్వాత ఇండియాకి వస్తే.. కనీసం టైంకి భోజనానికి కూడా రారానే..' నిష్టూరంగా అంది జో

అబ్బ పొద్దున్నే నిద్రకూడా లేపానే బాబు.. పికప్ చేసుకుంటా అంది. మళ్లీ పోన్ చేసి ఆఫీసులో టేకప్ చేస్తున్న కొత్త ప్రాజెక్ట్‌లో ఏదో ప్రాబ్లమని వెళ్లింది. లంచ్ టైంకి అంతా వచ్చేస్తా అంది. వివరణ ఇస్తోంది శాండి..

దీనికి ఈ మధ్య బాగా ఎక్కువైంది.. సెప్టెంబర్ నుంచి ఇది నాల్గోసారి ప్రోగ్రాం ఫిక్స్ చేయటం.. ఇది మానేయటం.. వస్తే చావగొట్టాలి..

ఏమైనా అంటే.. వర్క్ అంటుంది. ఇదొక్కటే ఉద్యోగం చేస్తున్నట్లు.. చెప్పుకు పోతోంది శాండి..

ఏమే నేను యూకే వెళ్లాక మీరు మళ్లీ కలవనే లేదా.. ఆశ్చర్యపోయింది జో..

లేదే నువ్ వెళ్లాక వన్ మంత్‌కే తేజకి వేరే ఆఫీస్‌లో ప్రాజెక్ట్ లీడర్‌గా ఆఫర్ వచ్చింది. పూనేలో అయినా సరే వెళ్లిపోవడానికే డిసైడ్ అయ్యింది. సెప్టెంబర్‌లో మళ్లీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా హైదరాబాద్ వచ్చేసింది..

శాండి మాటలు ఆశ్చర్యంగా వింటోంది జో.. అంతకంటే ఆశ్చర్యం రాధి ఫేస్‌లో కనిపిస్తోంది..

'రెండేళ్లలో రెండు ప్రమోషన్స్..' జో, రాధి ఇద్దరు ఒకేసారి అన్నారు..

'అంత డౌట్ ఎందుకే.. దాని టాలెంట్ నీకు తెలీదా..'ఆశ్చర్యం ఎందుకన్నట్లు అడిగింది స్వాతి.

అది సరే.. వచ్చిన అరగంటలో కనీసం 20 టైమ్స్ తేజ తేజ అని కలవరించారే.. ఇంతకీ తేజ ఏమన్నా వివిపీనా.. లేదంటే ఈరోజు లంచ్ బిల్ తనే పేచేస్తోందా.. జోక్ చేసింది రాధి.

నీకు తెలీదు కదూ.. నువ్ మా బ్యాచ్‌లో కొత్త నేను, తేజ, జో క్లాస్‌మేట్స్.. హైదరాబాద్ వచ్చాక స్వాతి పరిచయం అయ్యింది. మేం ముగ్గురం ఒకే హాస్టల్‌లో ఉండి జాబ్ సర్చ్ చేసే వాళ్లం. జో వాళ్ల పేరెంట్స్ హైదరాబాద్ షిఫ్ట్ అయ్యారు.

అందరికీ మాదాపూర్‌లోనే ఉద్యోగాలు.. టూ ఇయర్స్ బ్యాక్ వరకూ అందరం కలిసి తిరిగే వాళ్లం.

జో కి పెళ్లి అయ్యి యూకే వెళ్లిపోయింది. తేజ్ జాబ్‌కోసం పూనే వెళ్లింది... మేమిద్దరం మిగిలాం.. అప్పట్లో నువ్ పరిచయం అయ్యావ్.. అందు వల్ల మా వీఐపీ నీకు పెద్దగా పరిచయం లేదు. స్నేహాల గురించిన వివరాలు పూర్తైయ్యాయి అన్నట్లు ఆపేసింది శాండి..

* * *

అందేంటే.. తేజ టాలెంట్ నీకు తెలీదా.. దానికుండే కమ్యూనికేషన్ స్కిల్స్ నాకుంటేనా.. ఈపాటికి ఐబీఎంలో ఒక వెలుగు వెలిగేదాన్ని..

అప్పట్లోనే క్లైంట్‌కాల్స్ .. మీటింగ్స్ అన్నీ మాగ్జిమం దాన్నే అటెండ్ చేయమనే వాళ్ళు కదా.. టీఎల్ అంతా..

ప్రాజెక్ట్ ప్రజంటేషన్ అన్నా అదే ఉండాలి.. కాలేజీలో కూడా అంతే కదే.. క్లాస్‌లో తక్కువ స్టేజిమీద ఎక్కువ ఉంటుంది.. అని పేరు. తమ ఫ్రెండ్ గురించి స్వీట్ మెమొరీస్ గుర్తు చేసుకున్నారు. అంత మల్టీటాలెంటెడ్ చాలా తక్కువ మంది ఉంటారే బాబు... రాధికి చెపుతున్నారు..

'ఏంటి అంత టాలెంటెడా..' ఫ్రెండ్స్ స్వీట్ మెమొరీ సీక్వెన్స్‌లో సందేహంగా అడ్డొచ్చింది రాధి..

అవును అది మాట్లాడటం మొదలు పెట్టిందంటే టైం మర్చిపోతాం. పొగడ్తలు కొనసాగించారు ఫ్రెండ్స్..

నేనైతే ఈ రెండేళ్ల విశేషాలు దాని నోటి నుంచి వినాలని చాలా ఆశపడ్డా.. ఇదేమో.. ఇంకా వచ్చిచావలేదు.. శాండి.. ఓసారి ఫోన్ చెయ్యవే.. ఎక్కడుందో.. జో కాస్త నిరాశగా చెప్పింది..

'మనం ఏదైనా చెప్పాలంటే.. మామూలుగా ఇలా జరిగింది..

అలా అయ్యింది అని చెప్పేస్తాం.. అది అయితే.. స్టోరీలాగా చెపుతుంది..' స్వాతి రాధికి చెపుతోంది.

అసలు దాని టాలెంట్‌కి అది సినిమా ఫీల్డ్‌కి సరిపోతుందే.. డైరెక్టర్ అయితే అద్భుతమైన సినిమా తీయగలుగుతుంది. కనీసం స్క్రిప్ట్ రాసినా సినిమా హిట్టే.. కొనసాగించారు ఫ్రెండ్స్..

వీళ్ళ మాటలు విన్నాక.. ఆ వచ్చే మనిషిమీద మరీ ఇంట్రెస్ట్ ఎక్కువైంది రాధికి..

ఫోన్ బిజీ వస్తోందే.. ఇన్స్పిరేషన్ ఇచ్చింది శాండి...

అసలు వస్తుందా.. రాదా.. అసహనంగా అడిగింది స్వాతి..

ఏమైనా అంటే ఆఫీసు.. వర్క్.. అంటుంది.. ఇదొక్కటే ఉద్యోగం చేస్తున్నట్లు... కంప్లైంట్ చేస్తోంది శాండి..

అబ్బ ఎట్టకేలకు వచ్చిందమ్మా.. స్వాతి డైలాగ్‌తో గుమ్మం వైపు చూశారు అందరూ..

పొట్టిగా.. బొద్దుగా.. ఓ నల్లపిల్ల వీళ్లవైపే నడుచుకుంటూ.. వస్తోంది.. అప్పటి దాకా ప్రశంశల వర్షం కురిసింది ఈ అమ్మాయి మీద అంటే నమ్మలేనట్లుంది రాధికి.. ఈ అమ్మాయికి రెండేళ్లలో రెండు ప్రమోషన్స్... అదీ సాఫ్ట్ వేర్ ఫీల్డ్‌లో.. ఎంత టాలెంట్ ఉన్నా.. కాస్త అందం కూడా చూస్తారు ఈఫీల్డ్‌లో.. ఎన్ని సార్లు అనుకుందో.. కొలీగ్స్‌తో... తేజాని చూస్తే నమ్మబుద్ధి అవ్వటంలేదు.. మనసులో అనుకున్నట్లే బయటికే అనేసింది..

ఫ్రెండ్స్ అంతా ఆశ్చర్యంగా రాధీవైపు చూశారు..

చేసిన తప్పు అర్థమై.. నాలిక కరచుకుంది. రాధి..

అది కాదు.. ఇప్పటిదాకా మీ గురించి మీఫ్రెండ్స్ అంతా ఓ.. అని మోసేశారు.. అని సంజాయిషీ ఇచ్చుకున్నట్లు చెప్పింది..

ఏం చెప్పారే బాబు.. ఎవరెస్టు గట్రా ఎక్కేశానని చెప్పారా ఏమిటి..? సరదాగా అంది తేజ..

లేదే.. నీ కమ్యూనికేషన్ స్కిల్స్ గురించి మాట్లాడుకున్నాం. నువ్ చెప్పే సొల్లు కబుర్లు ఎంత టేస్టీగా ఉంటాయని చెప్పాం అంతే..

ఓ అదా.. కతలు చెప్పటంలో బ్యాచ్‌లో నేనే టాప్ అనుకో.. ఈ విషయంలో నన్ను ఎవరూ బీట్ చేయలేరు.. కానీ ప్రపంచంలో ఇలాంటి టాలెంట్ ఉన్న వాళ్లు చాలా మంది ఉంటారు. నేనేదో ఆముదపు చెట్టుని.. అదేనే.. చెట్టులేని చోట ఆముదపు చెట్టు అంటారు కదా.. అలా అన్నమాట..

అసలు కథ చెప్పటం అంటే.. మనం మిస్ అయిన సీన్స్ అన్నీ కళ్లముందు సినిమాలా కట్టడం.. నాకు తెలిసి ఇప్పటి వరకూ నేను చూసిన వాళ్లలో మా మునెమ్మవ్వ బెస్ట్ స్టోరీ టెల్లర్.. కథ చెప్పటం అంటే అమె చెప్పినట్టు చెప్పాలి.. ఓసారి మా మునెమ్మవ్వ ఏదో సినిమా స్టోరీ చెప్పింది.. అది విని జనాలు ఆ సినిమా చూసేందుకు టౌనుకు బండ్లు కట్టుకుని వెళ్లారు.

అసలు అదంతా ఎందుకు కానీ.. మా మునెమ్మవ్వ గురించి చెపుతా వినండి..

మా మునెమ్మవ్వ అంటే చుట్టుపక్కల నాలుగూర్లల్లో తెలీనోళ్లు లేరు.. ఊర్లో అందరికీ తల్లో నాలికంటి మనిషి.. అయితే అమెకు పేరు తెచ్చింది మాత్రం ఆమె కతలే.. ముఖ్యంగా సినిమా కథలు చెప్పటంలో అమెకు ఎవరూ సాటిరారు.. ప్రతి వారం టౌను సంతకు పోవాల.. రిలీజ్ అయిన ప్రతి సినిమా చూడాల.. ఇంటికి వచ్చినాంక వైన వైనాలుగా కథలు చెప్పాల.. కథ ఎలా చెప్పేదంటే.. మనమే టౌనుకుపోయి.. సినిమాచూసి వచ్చినట్లు చెప్పేది..

అమెతో కథ చెప్పించుకోడానికి ఊర్లో ఆడోల్లంతా అవ్వ కొట్టంకాడికి చేరే వాళ్ళు..

అవ్వ సినిమా కథ ఎప్పుడూ.. ఊరి కాడి నుంచే స్టార్ట్ అవుతుంది...

* * *

ఈ వారం సంతకు బో జనాలు వచ్చినారు మ్యా.. రోడ్డు కాడ నందాల పల్లె అయిమ్మి కనపడింది.. అదే మ్యా మన వీరశంకర వాళ్ల రెండో పిల్లను ఇచ్చిరి చూడు.. అయిమ్మి.. సన్న పిల్లకు పానం బాలేదంట.. గంగిరెడ్డికి చూపించుకోను వచ్చింది. మొన్న పదిరోజులాపొద్దు వాళ్ల పెద్దతోటికోదలు.. ఇంటికాడ కొట్టాడి.. పుట్టింటికి పోయనంట..

పన్ల కాలం పిల్లోల్లకు పానం మీందికి వచ్చినా సూపిచ్చుకోను లేకపాయ అని కండ్లనీల్లుపెట్టుకునె..

'ఆ యమ్మిని మానుకిందోల్లకు ఇచ్చినాపొద్దునుంచే కష్టాలు..' గుంపులోంచి ఆడంగులెవరో.. గుర్తుచేసుకుంటున్నారు.. ఒకటి రెండు నిట్టూర్పులు.. వినిపించాయి..

పొద్దుగాల 9గంటల బస్సు.. లేటుగా వచ్చెనా... సంత జనాలు బస్సునిండుగా ఉండిరి.. బస్సంతా తోపులాటలు..దొబ్బులాటలు..

రాలు కొల్లకాడికి పోయాలకు పానం పోయ.. వానకు రాలుకొల్లు ఏటికాడ రోడ్డుకొట్టకపోయ నంట.. మోకాల్లలోతు గుంతలు.. బస్సు కిటకిట్టలాడె.. టౌనుకు పోయాలకల్ల ఒల్లు హూనం ఆయ..

సంతకు పోయ్యి.. సరుకులందూ.. కొనుక్కున్యా.. వాడు.. తెలికి బాబుగాడు ఉండ్లే.. వాడు పూలంగల్లకాడ నూనెంగడిపెట్టినాడు..

ఎవరూ.. మన తెలికి బాబుగాడా.. ఎవరో గుంపులోంచి సందేహం..

అవును మ్యా.. వాడే..

వాడు పార్టీలంబడి తిరుగుతుండె గదూ..

హో.. వాడే.. వాడే.. పెద్దసారు తోటకాడ కాయిలికి ఉండమన్యాడంట... వీడు.. రెండు మూడు కూనీల్లో ఉండెనా.. బయమొచ్చింది సార్ అనెనంట.. అయితే పార్టీల్లో తిరగాకు మనెనంట....

పార్టీలో లేకుంటే.. ఊర్ల తిరగనీకి య్యాడైతాది... టౌనులోనే ఉంటా ననెంట.. వాల్ల మామ మంగపట్నం చేను అమ్మి అంగడిపెంట్టించె నంట..

ఏమోలే.. ఇన్నేండ్లకు ఆదు బాగుపన్యాడు.. అంగడికాడ నుంచి పోతాంటే.. వాడే పలకరించే.. బాగుండారా వ్వా.. అనె..

సినిమా చూసినావా.. లేదా.. చెప్పవ్వా.. ఓ పిల్ల ఆత్రంగా అడుగుతోంది...

ఓ యమ్మా... నీకు ఎర్ర రిబ్బన్లు తెచ్చినా.. మల్లా పోయేప్పుడు కొనబో.. ఆయమ్మి రాలా.. ఈరబద్రమ్మ.. వాపిటి బిల్లల.. జడకుచ్చులు అడిన్యాది..

ఆయమ్మి రాలేవా.. ఈపొద్దు కొండకింది చేనికి పోయినారు.. ఇంగా రాలే...

పోయ్యేతప్పుడు కొనబోండిమ్యా...

సర్లేవా.. ముందు సినిమా చూసినావా.. లేదా.. చెప్పు....

ఓ యమ్మనే... ఏమే.. తొక్కులాడతున్నావు.. చెపుతాండా.. చెపుతాండ..

సరుకులు కొనాలకల్లా మ్యాట్నీ టైం అయ్యినా... సినిమాకు పోదామని విచారం చేస్తి... పూలంగల్ల కాడ అడిగినా.. ఏమైనా కొత్త సినిమా వచ్చినాదా.. అని..

పత్తికట్టె వచ్చినాదత్తా అనిరి.. (ప్రతిఘటన సినిమాని ఆరోజుల్లో పల్లెల్లో పత్తికట్టె అనిఅనే వాళ్లు)

జనాలు బో సూచ్చనారత్తా టికెట్లు దొరుకుతాయో లేదో అనిరి.. ఎట్లైతే అట్లైతాదిలే.. అని హాలు కాడికి పోయినా..

ఏమి జనాలమ్మే.. సినిమా కాడ.. ఈడ నుండి.. మన బుర్జు ఉండ్లే .. అడ దాంక.. నిలవన్యారు.. టికెట్లకాడ... ఇంగ సినిమా చూసిట్లే అని... బొమ్మలన్నా చూచ్చాం.. అని గేటుకాడికి పొయ్యినా.... టికెట్ల కాడ దావతాపురం ఆదిలచ్చిమి.. వాళ్ల పెద్దతోటి కోడలు ఉండిరి.. ఆయమ్మే.. బాగుండావా.. అవ్వా.. అని పలకరించే.. నేను అంచుకు పోయ్యి విచారం జేసి.. సైగ్గాకుండా రెండు రూపాయలు చేతిలోపెట్టినా.. నాకుగ్గూడా టికెట్ కొనకరమ్మని చెప్పినా... అయమ్మి ఏమనుకునెనో ఏమో.. మల్ల తెచ్చాలేవ్వా.. అని టికెట్లు కొనకొచ్చింది... హాలులోపలికి పొయ్యి కూర్చున్యాం... ముందుగాల కూకోవాల.. లేకుంటే బొమ్మలు సరింగా కనపరావు.. ఆడ కూకున్నోల్లు బో కొట్లాడిరబ్బా... ఏమి వాళ్లు టికెట్ కొనింటే.. నేను కొనిండ్లా.. హాలేమన్నా వాళ్ల అబ్బ కట్టించినాడా... మొకం ఇంత జేసుకుని పోయిరి.. మల్లా హాలంతా కరెంటు ఆరిపిరి.. బొమ్మలు సరితా కనపడాలని కరెంటు అరుపుతారు..

* * *

సినిమాలో ఇజయ్‌శాంతి ఈరోయిన్.. చంద్రమోహన్ గాడు ఈరో.. వాడు వకీలు పనిచేచ్చాంటాడు.. ఆడతా పాడతా.. సంసారం చేసుకుంటుంటారు....

పాటలు ఉండాయావ్వా...

ఏంటికి లేవు... జానకి అంటారు జూడు.. ఆయమ్మ పాటలు పాడింది... బాగుండెబ్బా... ఎంత బాగుండెనో.. బయట పాటల బుక్కులు అమ్ముతాండారేమో.. నీకు కొనకొచ్చాం అని చూసింటిమ్మీ... దొరకల్యా...

కథచెప్పవ్వా.. పాటలు మల్లా..

మల్లా ఇలన్‌గాడు.. ఎవడోబ్బా.. గుండు చేసుకోని ఉండాడు..

అమరేషు అంటారు అత్తా.. వాడేనా.. ఎవరో పక్కనించి అందించారు..

కాదు మ్యా.. ఎవడో కొత్తోడంట.. ఆలుకాడ అనుకుంటాంటిరి.. బో దుర్మార్గుడమ్మా.. ఆపిల్లను ఎంత గోడాడిచ్చాడు.. నానాక మాటలు అంటాడు.. నలుగుర్లోకి ఈడిసి.. అగుమానం జేచ్చాడు..

విలన్ విజయ శాంతిని ఎన్ని తిప్పలు పెట్టాడో.. వైన వైనాలుగా చెప్పుకు పోతోంది.. అవ్వ..

జనాలకు విలన్ మీద కోపమొస్తోంది...

ఇలన్‌మీద పోలీసుటేషన్‌లో చెప్పొచ్చాది.. కోర్టుకు పోతాది...

ఎవరూ ఏమీ అనల్యా వ్వా.. ఆయిమ్మిని.. ఎవరికో సందేహం వచ్చింది. మామూలు ఇల్లాలు ఏందీ.. టేషన్‌కు పోయ్యి కంప్లెయింటు చెయ్యడం ఏంది..

ఎందుకు ల్యా మ్యా.. చంద్రమోహన్‌గాడు ఏలుకోను పొమ్మంటాడు..

చేతగాని నాకొడుకు.. మల్లా పౌరుషం ఒకటి.. గుంపులోంచి చంద్రమోహన్‌మీద కోపంతో నాలుగైదు బూతులు..

కోరుటుకు పోతే.. ఆల్లు నానాక మాటలు అంటారు... అడ్డమైనేటి ప్రశ్నలు అడుగుతారు...

అడంగులు నోటికి కొంగులు అడ్డంపెట్టుకుని నిశ్శబ్దంగా నిట్టూర్పులు వదుల్తున్నారు..

ఈకాడికి.. ఇలన్‌గాడు.. ఎమ్మెల్యే అయితాడు.. ఊరంతా ఊరేగింపులు జేచ్యాంటారు.... మీటింగు కాడికి ఇజయ్‌శాంతి పోతాది.. నేను మాట్లాడతా.... అంటాది.. అందరూ.. చూచ్చాంటారు..

చేతిలోకి గొడ్డేలి దీసుకోని.. ఇలన్‌గాడిని ఆడికాడికే ఒక్కపేటుకు నరుకుతాది..

చావనీ నాకొడుకు.. జనాలకు త్రుప్తి కలిగినట్లుంది...

ఇజయ్ శాంతిని జైలుకు కొనబోతారు.. ఆడికి శుబం కార్డు పడతాది...

* * *

సినిమా అయిపాయ.. నేను పూలంగల్లకాడికి పోయ్యి సరుకులు ఎత్తుకోని.. ఏడుగంట్ల బస్సుకు పయనమైతి..

* * *

అవ్వ కథ చెపుతుంటే.. జనాలు ఏడుస్తారు.. నవ్వుతారు.. కోప్పడతారు.. అచ్చం మునెమ్మవ్వ మొకంలోనే సినిమా కనపడతాది.. ఈ సినిమా రిలీజ్ అయ్యే నాటికి నాకు మూడు నాలుగేళ్లనుకుంటా.. అప్పట్లో అవ్వ ఈసినిమా చూసి వచ్చి కథ చెప్పింది..

పనుల కాలం.. అంతా పనులు చేసుకుని.. సాయంత్రానికి అవ్వ కొట్టంకాడికి వచ్చినారు.. సినిమా కథ చెపుతుందేమో అని.. అవ్వ కథ చెప్పింది. అందరికీ సినిమా ఎట్టైనా సరే చూడాలనిపించింది. ఇజయ్‌శాంతి కష్టాలు స్వయంగా తెలుసుకోవాలనిపించింది. అంత ఎఫెక్ట్ ఇచ్చింది.. ఊర్లో జనాలంతా.. పనులు మనేసి సినిమా చూడాలని బండ్లు కట్టుకుని బయలుదేరారు..

అవ్వ కథ అంత ఎఫెక్ట్ ఇస్తుంది... మామూలుగా సినిమా హిట్టో ఫట్టో మాకుతెలీదు.. మా అవ్వ కొట్టం అరుగు మీద సినిమా మాత్రం ఎప్పుడూ హౌస్‌ఫుల్లే...

* * *

ఇప్పుడు కూడా ఉందా.. మీ మునెమ్మవ్వ.. సందేహంగా అడిగింది రాధీ...

నేను ఈలోకంలోకి వచ్చి.. హా ఉంది..? ఏమీ.? అన్నా...

ఏమీ లేదు.. ఇప్పుడు కూడా మీ మునెమ్మవ్వ సినిమా కథలు చెపుతోందా.. అని డౌట్.. అని ఆగింది..

అవ్వ చెప్పినా కానీ.. వినే వాళ్లు ఎవరు ఉంటారు..? మొన్న వూరికి పోయినా.. సాయంత్రం అవ్వ కొట్టంకాడికిపోయినా.. జనాలంతా వచ్చి ఉంటారు కదా.. ఒకసారి అందరినీ పలకరించినట్లు ఉంటాదని... ఊర్లో కబుర్లన్నీ వినచ్చుకదా అని.. ఎవరూ లేరు..

అవునే.. ఊర్లు మనం చిన్నప్పుడు ఉన్నట్లు లేవు.. మొన్న నేను దీపూ వాళ్ల ఊరికి పోయినా.. అంతా టీవీలు.. సీరియళ్లు.. అని పడినారు.. రచ్చబండకాడగానీ.. ఇడ్లకాడ అరుగుల మీద కానీ.. జనాలే లేరు.. జో చెపుతోంది..

అప్పట్లో ప్రతి ఊర్లో ఇట్లాంటోల్లు ఉండేటోల్లు.. మా అవ్వ ఉండె.. పిల్లలకు కథలు ఎంత బాగా చెప్పేదో.. ఎండాకాలం వస్తే.. ఊరికి పరిగెత్తే వాల్లం.. మా అవ్వ కథలు వినేందుకని... స్వాతి వాళ్ల అవ్వను గుర్తుచేసుకుంది..

మా వీధిలో వెంకటలక్ష్మి ఆంటీ ఉండేది.. ఆమె సినిమా చూసి వచ్చిందంటే.. వీధిలో అంతా పండగే.. పాటలన్నీ పాడి వినిపించేది.. ఎంత బాగా పాడేదో.. శాండీ వాళ్ల ఆంటీ గురించి చెప్పింది.

అప్పట్లో టీవీలు అంతగా లేవు కదా.. డీడీలో ఒకటి రెండు గంటలు వచ్చేతెలుగు ప్రోగ్రాములే గతి.. అందుకనీ.. ఆడోల్లంతా పనులు ఐపోయాక అరుగుల మీద చేరి ముచ్చట్లు పెట్టేవాళ్లు.. వాల్లల్లో బాగా స్టోరీ చెప్పేవాల్లే హీరోయిన్.. ఎక్కడ లేని గ్లామర్ ఉండేది. ఇప్పుడు ఇంటికి రెండు టీవీలు.. 100 ఛానల్లు.. బోలెడు సీరియళ్లు.. గరం గరం మసాలా బ్రేకింగ్‌లు.. ఫుల్ టైంపాస్.. ఇక పక్కింటోల్లలో మాట్లాడేందుకు టైం ఎక్కడుంటుందే.. స్వాతి ఏదో అనుభవంలోంచి చెపుతోంది.

అయితే.. ఇప్పుడు మునెమ్మవ్వ కథ చెప్పించుకోడానికి ఎవరూ రారా? ఎందుకో.. రాధీకి ఈ విషయం మింగుడు పడటంలేదు..

లేదే.. బాబు.. ఎవరూ రారు.. మొన్న నేను ఊరికి పోయినప్పుడు అవ్వ ఒక్కతే.. కొట్టం ముందు మంచం ఏసుకుని పడుకుంది.. ఆకాశంలో చుక్కలు లెక్కెట్టుకుంటోంది.. ఎవరూ రావటంలేదా అని అడిగితే.. ప్రియాంక వచ్చేసింది కదా.. అంది..

ప్రియాంక ఎవరబ్బా అని అడిగా.. అదేదో టీవీ సీరియల్ అంట.. నాలుగేళ్లయిందట.. మొదలై.. వెటకారంగా అన్నా..

అందరూ నవ్వారు...

ఈ మాటలు రాధీని మరింత బాధించినట్లున్నాయి... తను నవ్వలేదు.. అవునా... అని మాత్రమే అంది..

పాత మిత్రులం మేం మా ముచ్చట్లలో పడ్డాం..

జో యూకే వెల్లాక.. నేను పూనే వెళ్లి పోయాక.. బోలెడు సంగతులు జరిగిపోయాయి.. స్వాతి వాళ్ల బాబు చేసే అల్లరి.. శాండి స్టైయిలింగ్ స్టేట్‌మెంట్ అంటూ.. మామీద ప్రయోగించే ఫ్యాషన్ డిజాస్టర్స్.. నేను తిరిగొచ్చిన అడవులు.. కొండలు.. జో.. యూకే ముచ్చట్లు.. మాలోకంలో ఉండిపోయాం...

రాధీ.. మధ్యలోకి రాలేదు.. పూరికే వింటూ కూర్చుంది...

రెస్టారెంట్ మేనేజర్ వచ్చి రెస్టారెంట్ మూసే టైం అయ్యిందని గుర్తుచేసేంత వరకూ ముచ్చట్లలోనే గడిచి పోయింది. లేచి ఎవరిదారిన వాళ్లం వెళ్లిపోయాం..

వెల్లే ముందు రాధి.. నాతో ఏదో అడగాలనుకుని ఆగిపోయింది...

జో ఇండియాలో మరో నాలుగు వారాలు ఉంది.. నెలలో రెండు మూడు సార్లు బయట భోజనాలకు కలిశాం.. నేను మళ్లీ రాధీని చూడలేదు.. శాండీని అడిగా..

అది కాస్త డిఫరెంటే బాబు.. టీసీఎస్‌లో మంచి ఉద్యోగం.. అది వదిలేసి.. కిడ్స్ కోసం ఏదో స్కూల్ పెడుతోంది.. ఆపనుల్లోనే ఉంది.. అంది

మంచిదే కదే.. ఇప్పుడు స్కూల్ అన్నిటి కంటే.. బెస్ట్ బిజినెస్.. అన్నా నేను..

అవును కానీ.. అది బిజినెస్ చేసే స్కూల్ పెట్టటంలేదు.. పిల్లలకు సహజంగా నేర్పాలట.. వాళ్లకు ఇమాజినేషన్ పెరిగేలా చదువు చెప్పాలట.. ఏదో ఏదో చెపుతుంది.. నాకు పెద్దగా అర్థంకాదు.. అంది శాండి..

ఇప్పుడు ఇది ఫ్యాషన్ అయ్యిందే.. బాబు.. కొత్తరకం బిజినెస్.... జనాల వీక్నెస్‌ని క్యాష్ చేసుకునే బిజినెస్.. ఆర్గానిక్ ఫుడ్ స్టోర్స్ లేవు... అలా అన్నమాట... నేను తేలిక భావంతో అనేశా..

రాధి అలా కాదే.. చాలా డిఫరెంట్... చిన్నారులను కాంపిటీషన్‌లో వేసి రేసుగుర్రాల్లా చేస్తున్నాం.. వాళ్లకు చదువుకునేందుకు సహజమైన పద్ధతులు ఉండాలంటుంది... సరేలే.. నీకు అర్థం అయ్యేలా నేను చెప్పలేను.. కానీ మంచిపనే చేస్తోందని నాకు అనిపిస్తుంది...

సరేలే.. ఆమె చేసే పనిగురించి మనం వాదించుకోవటం ఎందుకు అని అప్పట్లో ఆ టాపిక్ ఆపేశాం...

* * *

ఏడాది గడిచింది... టేకప్ చేసిన ప్రాజెక్ట్ దాదాపు పూర్తి కావస్తోంది.. మరో వారంలో ఇది కంప్లీట్ చేస్తే.. లాంగ్ వెకేషన్ ప్లాన్ చేసుకోవచ్చు అనే తొందరలో ఉన్నఆ.. సరిగ్గా అలాంటి రోజుల్లో సాయంత్రం కొలీగ్స్‌తో క్యాటీన్‌లో కూర్చుని మాట్లాడుతుంటే.. ఓ అన్నోన్ నంబర్ నుంచి కాల్..

ఎవరై ఉంటారా.. అని ఆలోచిస్తూనే లిఫ్ట్ చేశా.. అవతల నుంచి రాధీ.. 'నీకు వేరే ప్లాన్స్ ఏమీ లేకపోతే.. సాయంత్రం మా ప్లే స్కూల్‌కి వస్తావా..' అని రిక్వెస్ట్

పెద్ద పనేంలేదు.. సరే వస్తానని అడ్రస్ తీసుకున్నా..

బీహెచ్ఈఎల్ ప్రాంతంలో ఉంది ప్లేస్కూల్... పెద్ద కష్ట పడకుండానే దొరికింది.. అడ్రస్.. వెళ్లే సరికి స్కూల్ ప్రాంగణంలో ఓ పెద్ద చెట్టుకింద ఏర్పాటు చేసి అరుగు మీద ఓ పెద్దావిడ.. చుట్టూ.. 5 నుంచి 10 ఏళ్ల లోపు పిల్లలు గుంపుగా కూర్చుని ఆమె చెప్పే మాటలు వింటున్నారు. నేను వాళ్ల వైపు చూసుకుంటూనే.. ఆఫీసువైపు అడుగులేశా..

నేను కనపడగానే రాధీ చాలా సంతోషించినట్లు అనిపించింది. స్కూల్ వివరాలు.. తన ఆలోచనలు.. పిల్లల కోసం ఇంకా ఏమిచేయాలో.. పేరెంట్స్‌ని ఎలా కన్విన్స్ చేయాలో.. పేరెంట్స్ నుంచి వచ్చే కామెడీ కోరికలు ఉత్సాహంగా చెపుతోంది...

చెట్టుకిందకు దగ్గరగా వెళ్లి చూద్దును కదా.... పిల్లల దగ్గర మా మునెమ్మవ్వ..

'మొదట్లో అస్సలు ఒప్పుకోలేదు.. చాలా బ్రతిమాలి తీసుకొచ్చా.. పిల్లలకు బోలెడు కథలు చెపుతోంది.. పిల్లలకు కూడా చాలా నచ్చింది. ముఖ్యంగా పేరెంట్స్‌కి..

వాళ్లు చిన్నప్పుడు విన్న కథలు.. మళ్లీ వాల్లపిల్లలకు చెప్పే మనిషి దొరికి నందుకు చాలా చాలా సంతోషించారు.. అవ్వకూడా మొదట రెండు మూడు రోజులు ముభావంగా ఉండేది.. పదిరోజులయ్యే సరికి పిల్లలతో బాగా కలిసిపోయింది. వాల్లకు కథలు చెపుతుంది.. వాల్లదగ్గర ఇంగ్లీషు.. నేర్చుకుంటుంది.. ' చెప్పుకుపోతోంది శాండి...

నా బుర్రల్లో బోలెడు సందేహాలు.. నాకే అర్థం కాని విషయాలేవో నడుస్తున్నాయి..

అవ్వ నావైపు చూసింది.. తేజమ్మా.. వచ్చినావామ్మా... ఈడకు వచ్చినాలునుంచి రాధికమ్మ చెపుతానే ఉండాది.. నిన్ను తీసకవస్తా అని..

బాగుండారామ్మా.. అమ్మా.. నాయనా.. అంతా బాగుండారా.. అప్యాయంగా పలకరించింది..

బాగుండాం అవ్వా.. నువ్ అన్నీ ఇడిసిపెట్టి టవునుకు వచ్చినావా అన్నా.. ఆగలేక...

పల్లెలో ఎవరు ఉండారమ్మానాకు.. అప్పట్లో మీ పెద్దనాయన పిల్చక వచ్చినాడు మీ వూరికి.. ఇప్పుడు ఆయప్పా లేకపాయ.. మంచి చెడ్డా చూసే టోల్లు లేకపాయ.. యాడైతే ఏమమ్మా.. ఇచారించేందుకు

కథ

తోడు

- ఎం. శ్రీనివాసరావు

పెళ్లనేదే ఓ దురదృష్టం. లేకపోతే ఏంటి? ఈ ఒంటరి బతుకేదో అప్పటినుండే బతికేదాన్ని. అలవాటు పడుండేదాన్ని. కాకపోతే ఈ ఉద్యోగం ఉండేది కాదేమో. కష్టపడేదాన్ని. ఊళ్లోనే పనిచేసుకుంటూ ఉండేదాన్ని. ఊళ్లో ఒంటరిగా బతుకుతున్న ఆడవాళ్లు ఎంతమంది లేరు. చిన్నమ్మాయిని నా చిన్నప్పటినుండి చూస్తున్నాను. పేరుకు చిన్నమ్మాయేగాని మనిషి చాలా పెద్దదే. దీటైన శరీరం. వాళ్ల తోబుట్టువులందరిలో చిన్నదిగాబట్టి చిన్నమ్మాయనే వాళ్లు. చిన్నమ్మాయి అసలు పెళ్లే చేసుకోలేదు. ఎన్ని సంబంధాలు తెచ్చినా ఏదో ఒక వంక చెప్పేది. కాదనేది బలవంతం చేస్తే బాయిలో దూకేది. అట్లా రెండుసార్లు జరగడంతో వదిలేశారు. అలా చిన్నమ్మాయి ఒంటరిగానే బతుకుతుంది. ఇప్పుడామెకు ఏభై ఉండొచ్చేమో, కష్టపడి పని చేసుకుంటుంది. సంపాదించుకుటుంది. ఇంట్లో పడుంటుంది. ఆదివారమైతే నూకాలమ్మగుడికెళ్తుంది. అంతకన్నా మునిగిపోయేదేముంది.తను కూడా అలాగే ఉండేది. అలా ఒక్క చిన్నమ్మాయే కాదు. మేడకాడ రమణమ్మ, గవరపాలెం అంజమ్మ, చిన్న సుబ్బులు, ఒడ్డిరేణుక, మాల బిచ్చావతి. ఇలా లెక్కబెడితే చాలా మందే ఉన్నారు. అన్ని కులాల్లో ఉన్నారు. మొగుడు వదిలేసినోళ్లొకళ్లయితే, మొగుడు సచ్చినోళ్లు ఒకరు. అసలు పెళ్లే చేసుకోనోళ్ళు కొందరు. ఎవరి కారణాలు వాళ్లకున్నాయి. అందరూ ఒంటరిగా బతుకుతున్నవాళ్లే. పిల్లలున్నవాళ్లు ఆ పిల్లల్ని చూసుకుంటే లేనివాళ్లు ఏదో కాలక్షేపం చేస్తూ అలాగే బతుకుతున్నారు. ఇప్పుడెలాగూ తను కూడా ఆ గూటిలోకే చేరేటట్టుందిలే అనుకుంటుంది సుగుణ.

బస్సులో నుండి బిలబిల మంటూ అందరూ దిగుతున్నారు. చుట్టూ చూసింది. తనుదిగే బస్టాపిదే. తను కూడా గబగబా దిగిపోయింది. ఐదునిమిషాల్లో ఇంటికొచ్చింది. మంచమ్మీద పడిపోయింది. కళ్లు మూసుకుంది. ఫేను చిన్నగా, మెత్తగా తిరుగుతుంది. మగతగా ఉన్నట్టనిపించింది. కొంచెం సేపటికి పైకి లేచింది. బైటికి వచ్చింది. సూర్యుడు పడమటి దిక్కు కొండల్లోకి వెళ్లిపోయాడు. చల్లగా ఉంది. బాత్‌రూమ్‌లోకెళ్లి ముఖం కడుక్కుంది. బట్టలు మార్చుకుంది. వంటగదిలో కొచ్చి స్టౌ వెలిగించింది. పాలు వేడి చేసుకుంది. గ్లాసులో పోసుకుని బైటికి వచ్చింది. వాతావరణం ప్రశాంతంగా ఉంది. సిటీలో ఉన్న రణగొణ ధ్వనులు ఇక్కడ ఉండవు. ఇక్కడ కొంత గ్రామీణ వాతావరణం ఉంటుంది. చుట్టూ కొండలు. కొండల మీద దట్టంగా,పచ్చగా పెరిగిన చెట్లు, పచ్చని తివాచీ పరచినట్లుగా అందంగా ఉంది. సిటీలో ఉన్న కాలుష్యం కూడా ఇక్కడ ఉండదు. చుట్టూ ఉన్న బిల్డింగుల మీదకు ఒక్కొక్కరే వస్తున్నారు. ఈ బిల్డింగ్ మీద ఒక పక్క రెండుగదుల ఇల్లు. అందులో తనుంటుంది. మరో పక్క కొంచెం విశాలంగా ఖాళీ. సాయంకాలాలు బయట కూర్చుంటే హాయిగా ఉంటుంది. అక్కడనుండి దూరంగా ఉన్న కొండలపైకి చూస్తూ ఉంది. పాలు తాగి గ్లాసు పక్కనబెట్టింది. కుర్చీలో తలవాల్చి కళ్లు మూసుకుంది. మనసంతా ఆలోచనలతో నిండిపోయింది.

సుగుణకు ఏ బాదరబందీలేదు. ఉద్యోగం ఉంది. బతకడానికి సరిపోగా బాగానే మిగులుతుంది. అంతస్వార్థపరురాలేమీ కాదు. చిన్నమ్మ,పెద్దమ్మ పిల్లలకు చుట్టుపక్కల వాళ్లకు సహాయం చేస్తుంది. ఇరుగు పొరుగుతో కలివిడిగా ఉంటుంది. అలాంటి సుగుణ అలా కళ్లు మూసుకుని ఆలోచిస్తూనే ఉంది. కృష్ణ తన దగ్గరకు ఎందుకు రావడంలేదో అర్థం కావడంలేదు. ఫోన్ చేస్తే తీయడంలేదు. వేరే నంబరు నుండి చేస్తే తీస్తాడుగాని ముక్తసరిగా మాటాడుతాడు. ఇంటికి రమ్మంటే వస్తానంటాడుగాని రాడు. ఏమీ అర్థం కావడంలేదు. ఇంతకాలం తను ఒంటరిగా లేననుకుంది. తనకూ ఓ తోడుందనుకుంది. ఇప్పుడు సందేహంగా ఉంది. బాధగా ఉంది. ఏడుపొస్తుంది. ఒంటరిగా ఉండగలననుకుందిగాని తనకెవరూలేరనుకుంటే దు:ఖంగా ఉంది. కృష్ణ కూడా అలా దూరంగా ఉంటే భరించలేకుండా ఉంది. అలా ఆలోచిస్తుంటే, జ్ఞాపకాలన్నీ తరుముకొస్తుంటే విపరీతమైన కోపమొస్తుంది.

నిజానికి తనెప్పుడో ఒక నిశ్చితాభిప్రాయానికొచ్చింది. తన వంట్లో హెచ్.ఐ.వి వైరస్ ప్రవేశించిందని తెలియగానే తను జీవితం మీద ఆశ వదులుకుంది. జీవితంలో కష్టసుఖాలు సహజమే గాని సుఖసంతోషాలకు తను నోచుకోలేదనుకుంది. నిజానికి హెచ్.ఐ.వి

నలుగురు మనుషులు కావాల అంతే..

పొద్దంతా ఎవరో ఒకరు వచ్చారు.. పొద్దుగూకాలకు.. పిల్లోల్లు వచ్చారు.. అవ్వా కతలు జెప్పు అవ్వా అంటా.. వీల్లు నాకు అన్నం పెడతారు.. ఉండనీకి రూం ఇచ్చినారు.. ఇంక ఏం కావాల..?

మామూలుగానే చెప్పుకుంటూ.. పోతోంది..

నాకు పొట్టలో ఏదో చెప్పలేని బాధ కలుగుతోంది.. కష్టం సుఖం కలబోసుకుని.. ఓదార్పుకోసమో.. ఆక్రోశమో వెల్లగక్కేందుకు అవ్వదగ్గరకు వచ్చేజనాలు నాకు తెలుసు.. అట్లాంటి చోట నాలుగు మాటలు మాట్లాడేందుకు ఎవరూ లేని స్థితి ఎలా ఉంటుందో.. నేను ఊహించుకోలేకపోయాను...

అవ్వా రేపు అమ్మా నాయన వాల్లను పిల్చుకోని వస్తాలే.. అని చెప్పా..

వెనక నుంచి పిల్లలు అవ్వా అవ్వా అనిపిలుస్తున్నారు.. వస్తాన్నా సాలుకోద్దర్రా.. అనుకుంటూ.. వాల్ల వైపు నడుచుకుంటూ వెల్లింది అవ్వ..

నా బుర్రనిండా బోలెడు ఆలోచనలు.... సందేహాలు.. ముసురుకున్నాయి..

గేటుదాకా.... రాధీ కూడా నడిచి వచ్చింది.... వచ్చినంత సేపు... స్కూలు కోసం... పిల్లల కోసం ఏదో చెపుతూనే ఉంది....

నేను మల్లీ వస్తా అనిచెప్పి సెలవు తీసుకున్నా..

తనకు సోకడంలో తన తప్పేమీలేదు. తను ఒక భూస్వామి కుటుంబంలో పుట్టింది. కాని ఐదేళ్లకే అమ్మ చనిపోవడంతో పెద్దమ్మ దగ్గరే పెరిగింది. ఆలనా పాలనా అంతా వాళ్లే చూశారు. తండ్రి తాగుబోతు. ఆస్తినంతా దానికే తగలబెట్టాడు. ఐనా తనను బాగానే చూసుకొనేవాడు. తను పదోతరగతి వరకు చదువుకుంది. పెళ్లి ఈడు రాగానే చాలా సంబంధాలే చూశారు. చివరకు ప్రభుత్వోద్యోగమని ఒకడిని ఖాయం చేశారు. తను కూడా సరేనంది. కాని వాడు జీవితం ముగిసిపోయిన దశలో ఉన్నాడని ఎవరూ చెప్పలేదు. వాడికి హెచ్.ఐ.వి ఉంది. అది ఎయిడ్స్‌గా మారిపోయింది. ఎయిడ్స్‌దశ వచ్చాక చావు తప్పదు. కాకపోతే కాస్త ముందూ వెనుక. కాపురానికెళ్లిన నెలరోజులకే మంచానపడ్డాడు. ఇంకో నాలుగు నెల్లకు చనిపోయాడు. చనిపోయిన తర్వాత చాలామంది చెప్పారు వాడికి ఎయిడ్స్ ఉందని తెలుసని. మరెందుకు చెప్పలేదంటే ఈర్ష్యతో చెప్తున్నారనుకుంటారని అన్నారు. అట్లా తను బలైపోయింది. గుడ్డిలో మెల్లగా బతకడానికి ఈ ఉద్యోగమొచ్చింది. అందువల్లనే ఆర్థికంగా ఇబ్బందిలేకుండా జీవితం గడుస్తోంది.

కళ్లు తెరిచింది. పైకి లేచి నాలుగడుగులు ముందుకు నడిచింది. పిట్టగోడ పట్టుకు నిలబడిరది. ఎదురుగా వీధిలో ఒకరు ఇద్దరు ఉద్యోగాలనుండి వస్తున్నారు. కూలిపనులకెళ్లిన ఆడోళ్లు, మగోళ్లు నలుగురైదుగురు ఖాళీ కేరియర్లతో నీరసంగా నడుచుకుంటూ వస్తున్నారు. బాగా చీకటిపడిరది. వీధిలో లైట్లు వేశారు. చుట్టూ నగరమంతా వీధిలైట్ల కాంతిలో వెలిగిపోతూ ఉంది. దాని వెలుగు పెద్ద కాంతిపుంజం పైకి చిమ్ముతున్నట్టుంది. వెనక్కి వచ్చింది. కుర్చీలో కూర్చుండిపోయింది. కళ్లు మూసుకుంది. ఇప్పుడు కొంత ఫర్వాలేదు. పదేళ్ల క్రితం ఈ వైరస్ సోకిన కొత్తలో తనను అందరూ అంటరానిదానిగా చూశారు. తన మన ఏంలేదు. అందరూ అలాగే చూశారు. ఇప్పుడందరూ మాలమాదిగలతో కలిసి మెలిసి తిరుగుతున్నారు. ఒకప్పుడుండేదా? ఉండేదికాదు. ఇప్పుడు? ఏ ఇబ్బందిలేదు. మొదట్లో తనను కూడా అంతే. ముట్టుకోడానికి కూడా సిద్ధపడేవారుకాదు. మాలమాదిగ కులాల్లో అట్టడుగుకులం కన్నా హీనం. ఆడదాన్ని కాబట్టి ఇంకా దారుణం. తన ఇంట్లో తను పెరిగిన పరిసరాల్లో, తనతో పెరిగినవాళ్లలో తను ఒక అంటరానిది. తన కంచం వేరు,తన మంచం వేరు. తన తిండి వేరు. కాని ఇప్పుడు తను సంపాదిస్తున్న డబ్బు మాత్రం అందరికీ ప్రియమే.

ఏడెందేళ్ల క్రితం కావచ్చు, డ్యూటి నుండి వస్తూ దారిలోనే కాబట్టి పిల్లల్ని చూద్దామని అక్క దగ్గరకు వెళ్లింది. వెళ్లినపుడల్లా చిన్నమ్మా చిన్నమ్మా అంటూ కాళ్లకు చుట్టుకుపోతారు. వాళ్ళతో కాసేపు గడిపితే హాయిగా ఉంటుంది. అందుకే అప్పుడపుడు అక్కడకు వెళ్తుంది. వెళ్లేటప్పటికి పెద్దమ్మ కూడా వచ్చింది. చిన్నమ్మ అంటూ ఇద్దరు పిల్లలూ చెరో పక్క కరుచుకుపోయారు. ఇద్దరికి ముద్దులు పెట్టింది. బ్యాగ్‌లో నుండి స్వీట్ ప్యాకెట్ తీసి వాళ్లకిచ్చింది. అక్కనీ పెద్దమ్మనీ పలకరించింది. ఊళ్లో ఆ కబుర్లూ ఈ కబుర్లూ అన్నీ చెప్పింది పెద్దమ్మ. అక్క తన టైలరింగ్ షాపుగురించి, అక్కడికొచ్చె తన కస్టమర్ల గురించీ చెప్పింది. గంటపైగా మాటాడుకున్నారు. అలసటగా అనిపించి బాత్‌రూంలో కెళ్లింది. కాళ్లు ముఖం శుభ్రంగా కడుక్కుంది. టవల్‌తో ముఖం తుడుచుకుని నిలువెత్తు అద్దం ముందుకొచ్చింది. ముఖం మీద బొట్టు బిళ్ల పెట్టుకుంది. చీర సరిచేసుకుంది. కొత్తగా కొనుక్కున్న తెల్ల చీరలో తను చాలా అందంగా ఉంది. ముందు వెనుక చూసుకుంటూ ఉంది.

అంతలో రేపో మాపో పొయ్యేదానివి నీకంత అవసరమా అంది అక్క: అలాగే నిలబడిపోయింది తను. అక్కవైపు చూసింది. వంటగదిలోకి వెళ్లిపోతూ ఉంది. అమ్మ వైపు చూసింది. అంతగాకేముంది అన్నట్టుగా ఉంది అమె చూపు. ఏం నేను శుభ్రంగా ఉండకూడదా? అంటుండగానే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఒకవైపు కోపం, మరోవైపు దు:ఖం, కొంచెం వెనకా ముందుగా అందరూ పోయేవాళ్లే అని బేగ్ తీసుకుని వచ్చేసింది. అంతవయసొచ్చింది. ఎంతో జీవితానుభవం ఉంది. అమ్మ కూడా ఏమీ మాటాడలేదు. అంటే తనకూ అదే ఉద్దేశం ఉంది అనుకుంది.

ఆరోగ్యం గురించి కావచ్చు, ఇతర అవసరాల గురించి కావచ్చు, ఏదైనా సహాయం చేస్తే బయటి వాళ్లు చేశారుగాని నా అనుకున్నవాళ్ళెవరూ చేయలేదు. మొదట్లో ఉద్యోగం కోసం తిరగాలన్నా, ఆరోగ్యంకోసం హాస్పటల్‌కెళ్లాలన్నా స్నేహితులే. ఇప్పటికీ తనకు చాలామంది తన ఆరోగ్యం గురించి సూచనలు సలహాలు ఇస్తుంటారు. మరోరకం మనుషులు కూడా ఉన్నారులే. ఒకప్పుడు ఆఫీసులో తను ఇచ్చిన మంచి నీళ్ళు కూడా కొంతమంది తాగేవారు కాదు. కొంతమందైతే ఒంటరిదాన్ని, ఎంతైనా ఆడదాన్ని, చూపుల్తోనే తినేస్తుంటారు. ఈ ఎయిడ్స్ అనేదుందిగాబట్టి బతికిపోయాను గాని లేకపోతే ఎంతనరకం అనుభవించాల్సి వచ్చేదో.

ఇంటా బయటా మాటల్తో, చూపుల్తో, చేష్టల్తో ఇంత నరకం అనుభవిస్తున్నా ఏదైతే అదవుతుంది, బతికినంతకాలం బతుకుతాను అనే మొండి ధైర్యంతో తను ఇంతకాలం బతికింది. ఆ ధైర్యమే తనను ముందుకు తీసుకెళ్తుంది,తనను నడిపిస్తుంది. అట్లా గడుస్తున్నపుడు ఐదారేళ్ళ క్రితం పరిచయమయ్యాడు కృష్ణ. కొత్తగా ఉద్యోగంలో చేరాడు. తనకన్నా పై స్థాయి ఉద్యోగమే. తనొక డిపార్టమెంటు అతనొక డిపార్టమెంటు. ఎప్పుడన్నా తన డిపార్టమెంటుకొచ్చేవాడు. వచ్చినపుడు మామూలుగా పలకరించుకొనేవాళ్ళు గాని పెద్దగా పరిచయం పెరగలేదు. ఒకరోజు సడన్‌గా ఫోన్ చేశాడు. ఫోన్ రింగవుతుంటే ఎవరో కొత్తనంబర్ అనుకుంది. తీసింది. నేనండీ కృష్ణనీ అన్నాడు. ఏ కృష్ణ అంది. ఎ.ఇ కృష్ణని అన్నాడు. మీరా? ఏమిటండీ అంది, నాకు ప్రమోషన్ వచ్చిందండి అన్నాడు. అవునా కంగ్రాట్సండి అంది. సాయంత్రం డ్యూటీ అయ్యాక చిన్న పార్టీ ఉందండి. మా ఆఫీసు దగ్గర, అందరికి చెప్తున్నాను. మీరు కూడా తప్పకుండా రావాలి అన్నాడు. సరేనండి అంది. అప్పటినుండి తరచుగా ఫోన్ చేస్తుండేవాడు. కలిసినపుడు ఎక్కువగానే మాట్లాడుతుండేవాడు. పరిచయం పెరిగి కొంచెం చనువు ఏర్పడిరది.

తన ఆరోగ్యం గురించి ఆఫీసులో అందరికీ తెలుసు. కృష్ణకు కూడా తెలిసిందని తనకు తెలుసు. ఒకరోజు సాయంకాలం ఆఫీసు టైం అయిపోతుండగా ఫోన్ చేశాడు. మీరెప్పుడైనా ఎవరితోనైనా కలిసి సినిమాకెళ్లారా? అన్నాడు. ఎందుకెళ్లలేదు. మా అక్కతో ఎప్పుడన్నా వెళ్తుంటాను అంది. వేరే ఎవరైనా ఫ్రెండ్స్ రమ్మంటే వెళ్తారా? అన్నాడు. వెళ్తాను అంది మామూలుగా. మరిప్పుడు నాతో సినిమాకొస్తారా? అన్నాడు. ఏం చెప్పాలో అర్థం కాలేదు. అట్లా అడుగుతాడనుకోలేదు. ఒక్క నిమిషమాగి అయిపోయేటప్పటికి బాగా చీకటి పడుతుంది, నేను రానంది. బండి మీద దిగబెడతానన్నాడు. అలాగే అంది. ఆఫీసుటైం అయిపోయింది. బయలుదేరింది. పరిచయం పెరిగిందిగాని సినిమాకు రమ్మనేంత చనువులేదు. ఎప్పుడూ అంత చొరవ తీసుకోలేదు. సడన్‌గా అడిగేటప్పటికి కాదని గట్టిగా చెప్పలేకపోయింది. ఆలోచిస్తోంది. ఆలోచనలతోనే బస్సెక్కింది. ఇష్టపడుతున్నాడా? ప్రేమిస్తున్నాడా?

అయినా తననెవరు ప్రేమిస్తారు? ప్రేమించినా పెళ్లి చేసుకుంటారా? తనకా రాత లేదని అప్పుడే నిర్ణయించుకొంది. అందుకనే ఎవరితోను ఎక్కువ చనువుగా ఉండేదికాదు. చనువెక్కువైతే చొరవ పెరుగుతుంది. అది ఎటువెళ్ళినా కష్టమే. అందుకే తన పరిధిలో తానుండేది. ఆ పరిధిలోకి ఎవరినీ రానిచ్చేదికాదు. అయినా కృష్ణకు పెళ్ళయింది. ఒక పిల్ల కూడా ఉంది. అంత ధైర్యం చేస్తాడా? ఆఫీసులో ఆయనకొక గౌరవం,ప్రతిష్ఠ ఉంది. అది వదులుకుంటాడా? అంతకన్నా మించి చావు కొని తెచ్చుకుంటాడా? అనుకుంది.

ఐనాక్స్ వచ్చింది. బయటా లోపలా అంతా చూసింది. ఎక్కడా కనపడలేదు. అంతలో ఫోన్, ఎక్కడ? అని. సియంఆర్ అంది. కాదు బీచ్ ఐనాక్స్ అన్నాడు. అక్కడికి రమ్మన్నాడు. వెళ్ళింది. అక్కడ బయటే ఎదురు చూస్తున్నాడు. టైం ఆరున్నర కావస్తుంది. సినిమా ఏడున్నరకి, అలా బీచ్ దగ్గరకు వెళ్దామా అన్నాడు. సరేనంది. బీచ్ రోడ్డు వాహనాల రద్దీతో నిండుగా ఉంది. రోడ్డుకు ఇరువైపులా జనం తిరణాలను మించిపోయారు. సిటీలో జనానికి బీచ్ ఒక పెద్ద ఎంటర్‌టైన్‌మెంట్. రోడ్డు దాటి దగ్గరకు వచ్చారు. సముద్రపు ఒడ్డున ఇసుకలో కొంతమంది పిల్లలు ఆటలాడుకుంటున్నారు. కొంతమంది పెద్దలూ, నడివయసు దంపతులు మెట్లమీద, గోడమీద కూర్చున్నారు. కొంతమంది జంటలు ఐస్‌క్రీములు తింటూ కబుర్లాడుకుంటున్నారు. ఇద్దరూ వచ్చి చిన్నగోడ మీద ఖాళీ చూసుకుని కూర్చున్నారు. సముద్రంలో దూరంగా పెద్దపెద్ద షిప్పులు నిలబడి ఉన్నాయి. అందులో నుండి లైట్ల కాంతి బయటకు వస్తుంది. పైన కొన్ని లైట్లు బంగారు రంగులో మెరుస్తున్నాయి. రెండు మూడు రంగుల కాంతితో షిప్పులు అందంగా కనబడుతున్నాయి. పక్కనే ఉన్న బండి దగ్గర కృష్ణ రెండు ఐస్ క్రీములు తీసుకున్నాడు. ఒకటి తనకిచ్చాడు. ఇద్దరూ తింటూ కూర్చున్నారు. కృష్ణ కొంచెం దగ్గరకు జరిగాడు. ఇటువైపు చూసింది. రెండు శరీరాలు తగిలీ తగలనట్లుగా ఉన్నాయి. ఏమాలోచిస్తున్నావు అన్నాడు. ఏమీ మాటాడలేదు. చాలా విషయాలు నీగురించి తెలుసుగాని ఒంటరిగానే ఉంటున్నావనే విషయం తెలియదు. అటెండరు అప్పన్న చెప్పాడు ఏదో మాటల సందర్భంలో అన్నాడు. మీకో విషయం చెప్పనా అన్నాడు మరలా. చెప్పండి అంది. నేను వచ్చినప్పుడే మీ గురించి తెలిసి ఉంటే మిమ్మల్నే చేసుకునేవాణ్ణి అన్నాడు. కృష్ణవైపు ఆశ్చర్యంగా చూసింది. నమ్మలేకపోతున్నారా, నిజమే చెప్తున్నాను అన్నాడు. నేను ఇక్కడకు వచ్చాకే పెళ్లి చేసుకున్నాను. తను ఒట్టి అనుమానం మనిషి. నిత్యం తన అనుమానంతో హింసిస్తుంది. ఎవరైనా ఆడవాళ్ళతో మాటాడితే అనుమానంగా చూస్తుంది. ఆఫీసు నుండి ఆలస్యంగా వస్తే సహించలేదు. అనుమానం అన్నాడు. జీవితానికి ప్రశాంతతలేదు. సరైన తోడు దొరకడమే జీవితానికి ప్రశాంతత. అదే నిజమైన అదృష్టం. నాకా అదృష్టం లేదు అన్నాడు. అలా తన గురించి చెప్పుకుంటూపోయాడు.

తను ఆ ఆశని ఎప్పుడో వదిలేసింది. తను మాటాడినపుడల్లా గౌరవంగానే మాటాడేవాడు. అందుకే రాగలిగింది. ఇంకొకరైతే వేరుగా ఉండేదేమో అనుకుంటూ ఉంది. ఏమాలోచిస్తున్నావు అన్నాడు. ఏమీలేదు అంది నా గురించి మీకంతా తెలుసు, నాకు జీవితం మీద పెద్దగా ఆశలేం లేవు. బతికినన్నాళ్ళు బతుకుతాను అనుకుంటూ బతుకుతున్నాను అంది. అలా మాటాడుకుంటుండగానే టైమైంది సినిమాకెళ్ళారు. అయిపోయేటప్పటికి పదైంది. బండి మీద ఇంటి దగ్గర వదలి వెళ్ళాడు.

అలా అప్పుడపుడు సినిమాకు తీసుకెళ్తుండేవాడు. బీచ్ దగ్గర, ఉడాపార్కు దగ్గర కలుస్తుండేవారు. సాయంత్రం ఆరుగంటలు కావస్తుంది. అందరూ డ్యూటీల నుండి వెళ్ళడానికి సిద్ధమవుతున్నారు. కృష్ణ ఫోన్ చేశాడు. రోడ్డు మీదకు వచ్చి నిలబడు, వస్తున్నా అన్నాడు. సరేనంది. వచ్చాడు. ఇద్దరూ బయలుదేరారు. నీకే కలరంటే ఇష్టం అన్నాడు. వైట్ అంది. కళామందిర్‌కి తీసుకెళ్ళాడు. తెల్లరంగులో చీరలు తీయించాడు. నీకు నచ్చింది తీసుకోమన్నాడు. ఒకటి తీసుకుంది. బిల్లిచ్చేశాడు. బయటికొస్తుండగా ఎందుకిపుడు అంది. ఏంలేదు. నీకు చీర తీసుకోవాలనిపించింది అంతే అన్నాడు. బండి మీద ఇంటిదగ్గర దిగబెట్టాడు. రేపు ఆదివారం కదా రాకూడదా అంది. ఇంటిదగ్గర తనూరుకోదు అన్నాడు. మళ్లీ కొంచెం ఆలోచించి ఏదో ఒకటి చెప్పి వస్తాలే అన్నాడు. సరేనంది.

సరిగ్గా పదకొండు గంటలకు వచ్చాడు. అప్పుడే స్నానం చేసి వచ్చి టి.వి ముందు కూర్చుంది సుగుణ. తను చైర్‌లో కూర్చున్నాడు. టి.విలో ఏదో సీరియల్ వస్తూ ఉంది. ఫేన్ మెత్తగా తిరుగుతుంది. చీరేది కట్టుకుని చూశావా? అన్నాడు. లేదు అంది. బీరువాలోనుండి తీసిచ్చింది. కవర్‌లో నుండి బయటకు తీశాడు. గమ్మత్తైన వాసన ముక్కుపుటాలను తాకింది. కట్టుకోమని ఇచ్చాడు. ఇప్పుడేనా అంది. ఇప్పుడే అన్నాడు. పక్క గదిలో కెళ్లి కట్టుకుని వచ్చింది. దేవతలా ఉన్నావన్నాడు. అవునా? థాంక్యూ అంటూ వచ్చి కుర్చీలో కూర్చుంది. పక్కనే మంచం మీద కూర్చున్నాడు కృష్ణ. అలా చాలాసేపు మాట్లాడుకున్నారు. అది స్నేహమో, ప్రేమో తెలియదు. కష్టసుఖాలు ఒకరికొకరు పంచుకున్నారు. సంతోషం వేస్తే ఇద్దరూ హాయిగా నవ్వుకున్నారు. దు:ఖం వేస్తే ఇద్దరూ బాధపడ్డారు. కాలం అలా తనకు తెలియకుండానే హాయిగా గడిచిపోతూ ఉంది.

అలాంటి ఒకరోజు. అది ఆదివారం. ఉడాపార్కు దగ్గరకు రమ్మన్నాడు. వెళ్ళింది. పార్కులో జంటలే ఎక్కువగా ఉన్నాయి. గన్నేరు చెట్టు నిండా పూలతో పరిమళిస్తూ ఉంది. పక్కనే ఉన్న బల్ల మీద కూర్చున్నారు. నీ బర్త్‌డే ఎప్పుడు అన్నాడు. ఏమో అంది. అదేంటి అన్నాడు. మా పల్లెటూళ్లలో వీటి గురించెవరు పట్టించుకుంటారు అంది. ఈరోజు నా బర్త్‌డే అన్నాడు. అవునా చెప్పలేదేం అంది. నాకూ బర్త్‌డేలు చేసుకోవడం అలవాటులేదు. అందుకే ఎవరికీ చెప్పలేదు అన్నాడు. హేపీ బర్త్‌డే అంది. ఐస్‌క్రీం పార్లర్ దగ్గరకెళ్ళింది. రెండు ఐస్‌క్రీంలు తెచ్చింది. ఒకటి కృష్ణకిచ్చి నీ బర్త్‌డే సందర్భంగా అంది. థాంక్యూ అన్నాడు.

ఇద్దరూ ఐస్‌క్రీం తింటూ ఉన్నారు. సాయంత్రం ఐదు కావస్తుంది. సముద్రం మీద పైరగాలి హాయిగా తాకుతూ ఉంది. నీకేమైన పెద్దకోరికలున్నాయా అన్నాడు. ఉంటే చెప్పు అన్నాడు. ఎందుకు తీరుస్తావా అంది నవ్వుతూ. తీరుస్తానన్నాడు. నిజంగానా అంది. నిజంగానే తీరుస్తానన్నాడు. ఐస్‌క్రీం తింటూ కొంచెం సేపాలోచించింది. నాకు జీవితం మీద ఇంతకన్నా ఆశలేం లేవు. అంటే సెక్స్ పట్ల కూడా అంత ఆసక్తి లేదు. భర్త పిల్లలు వీటన్నింటినీ నేనాశించడంలేదు. ఈ జీవితం ఇలా గడిచిపోతే చాలు అనుకుంటున్నాను. కాని ఒక్కోసారి జీవితం వెలితిగా ఉందేమో అనిపిస్తుంది. నాకంటూ ఒకతోడు కావాలేమో అనిపిస్తుంది అంది. కృష్ణ మౌనంగా వింటున్నాడు. తనవైపే చూస్తున్నాడు. ఆలోచిస్తున్నాడు కూడా. నాకు తాళి కట్టించుకోవాలనుంది అంది. అంటే నాతోనే ఉండాలనేంలేదు. నాకు తాళికడితే చాలు. అపుడపుడు నా మంచి చెడ్డలు తెలుసుకుంటే చాలు. ఎలాగున్నావ్

అనడిగితే చాలు అంది. బలవంతం ఏమీ లేదు. బాగా ఆలోచించి చెప్పు అంది. కొంచెంసేపు మౌనంగా ఉండిపోయాడు. తర్వాత అలాగే అన్నాడు. నీ కోరిక తీరుస్తానన్నాడు. ఐతే ఒక కండీషన్ అన్నాడు. ఏమిటది అంది. ఎవరికి చెప్పకూడదన్నాడు. చెబితే ఇద్దరికీ ఇబ్బందే అన్నాడు. మా వాళ్ళకి ఒకరిద్దరికి చెబుతానంది సరేనన్నాడు.

అలా ఇద్దరు ముగ్గురు తన తరపు పెద్దల సమక్షంలో ఒకరోజు గుళ్లో తాళి కట్టించుకుంది. అప్పుడప్పుడు ఇంటికి వచ్చేవాడు. ఇంటి పక్కవాళ్లకు పరిచయం చేసింది. కాలం ప్రవాహంలాగ అలా గడిచిపోతూ ఉంది. ఆనందంగా హాయిగా ఉంది. ఉత్సాహంగా ఉంది. ఆరు నెలలు కావస్తుంది. అలాంటపుడు ఒకసారి తనకు ఏభైవేలు డబ్బులు కావాలని అడిగాడు. అంత డబ్బు లేదంది. ఎందుకు అంది. చాలా ఇబ్బందిలో ఉన్నానన్నాడు. అదే ఏమిటా ఇబ్బంది అంది, నాతో చెప్పకూడదా అంది. ఎందుకు చెప్పకూడదు, నీతోకాక ఇంకెవరికి చెప్తాను అన్నాడు. అప్పులున్నాయన్నాడు. వాళ్లిపుడు అడుగుతున్నారన్నాడు. నా దగ్గర కొంత ఉంది గాని ఏభైవేలు కొరవైందన్నాడు. నాకు నెల నెలా ఆరోగ్యానికి కొంత ఖర్చవుతుంది. నా దగ్గర ఉంచుకున్నది కొంత అక్క, తమ్ముడు అవసరాలకు తీసుకున్నారు. ఇప్పటికిప్పుడంటే ఏమీలేవు అంది. నా చైను ఉంది, ఎక్కడైనా తాకట్టు పెట్టి అప్పుతీర్చు, తర్వాత నిదానంగా చైను విడిపించి ఇవ్వు అంది. సరేనన్నాడు. ఏంటాంటి ఇందాకటినుండి అలాగే కూర్చున్నారు అన్నాడు శేఖర్. కళ్ళు తెరిచి చూసింది ఎదురుగా అలాగే నిలబడి చూస్తున్నాడు. ఏం లేదు అంది. భోజనం చేశారా? అన్నాడు. లేదు చేయాలి అంటూ లేచింది. సరేనంటూ వెళ్లిపోయాడు.

కుర్చీ తీసుకుని లోపలకు వచ్చింది. టి.వి ఆన్ చేసింది. వంటగదిలోకెళ్ళి రెండు చపాతీలు చేసుకుంది. ప్లేటులో వేసుకుని కూరగిన్నె తీసుకుని వచ్చి టి.వి ముందు కూర్చుంది. ఇంతవరకు ఆకలి తెలియకుండా అలా కూర్చుండిపోయింది. తిన్నది అలా కడుపులోకి వెళ్తుంటే హాయిగా ఉంది. సహజంగా తనెపుడు తినకుండా ఉండదు. ప్రతిశనివారం ఒక్క పొద్దుంటుంది. రోజూ పాలు,గుడ్డు తీసుకుంటుంది. ఏదైనా బాగాలేకపోతే వెంటనే డాక్టర్ దగ్గరకెళ్తుంది. అలా ఇప్పటివరకు ఆరోగ్యం బాగానే ఉంది. ఇప్పుడు ఎక్కువగా ఆలోచిస్తే ఏమవుతుందో? డాక్టర్ కౌన్సిలింగ్ చేసినపుడు ఎక్కువగా ఆలోచించవద్దన్నాడు. తనేమో ఆలోచించకుండా ఉండలేకపోతుంది.

టి.వి అలా మోగుతూనే ఉంది. తన మనసు టి.వి వైపు వెళ్ళడం లేదు. కొంతసేపు మౌనంగా ఉండి పోయింది. లేచి టి.వి ఆఫ్ చేసి ప్లేటును సింకులో పెట్టి సింకంతా శుభ్రం చేసింది. బైటికి వచ్చింది. చుట్టూ ప్రశాంతంగా ఉంది. లోపలికి వెళ్ళి టైం చూసింది. పదికావస్తుంది. తలుపుగడియపెట్టి వచ్చి పడుకుంది. నిద్ర పట్టడంలేదు. ఆలోచనలు ఆగడంలేదు. ఎలా జరిగిందో తెలియదు. ఏమి జరిగిందో తెలియదు. సడన్‌గా ఫోన్ చేశాడు. మా ఇంట్లో తెలిసిపోయిందన్నాడు. పెద్దగొడవైందన్నాడు. ఇక రాలేనన్నాడు. ఎలా తెలిసింది అంటుండగానే పెట్టేశాడు. ఫోన్ చేస్తే తియ్యడు. వేరే నంబరు నుంచి చేస్తే ఒకటి,రెండుసార్లు తీశాడు. పొడిపొడిగా మాట్లాడతాడు. ఏమైందో విషయం వివరంగా చెప్పడు. ఆలోచనల్తో బుర్ర వేడెక్కింది. అలా ఎప్పటికో నిద్రపట్టింది.

తెల్లవారి ఆదివారం పొద్దు బాగా పైకొచ్చింది. ఎండ తీవ్రంగా ఉంది. ఫోను మోగుతుంది. మత్తుగా ఉంది లేవబుద్ధికాలేదు. రెండోసారి మోగింది. బద్ధకంగా ఉంది. అట్లానే ఉండిపోయింది. మూడోసారి మోగింది. ఎవరా అనుకుంది. లేచి చూసింది. కృష్ణ. ఎంతో సంతోషం. ఒకింత ఆశ్చర్యం. తీసి హలో అంది. ఆ.....నేనే ..అన్నాడు. బాగున్నారా అంది. ఆ అన్నాడు. రేపు సాయంత్రం డ్యూటీ అయిపోయాక సింహాచలంలో కలుద్దామన్నాడు. సరేనంది. ఫోను పెట్టేశాడు. కొంచెంసేపు మాటాడచ్చుకదా అనుకుంది.

సాయంకాలం ఆరుకావస్తుండగా ఆఫీసునుండి బైటపడిరది. నిన్నంతా ఎప్పుడు తెల్లవారుతుందా అని ఎదురు చూసింది. ఈ రోజంతా ఎప్పుడు సాయంకాలమవుతుందా అని ఎదురుచూసింది. ఎదురుచూసిన సాయంకాలం రానే వచ్చింది. ఆఫీసునుండి నడుచుకుంటూ వస్తుంది. ఆఫీసుల నుండి ఇళ్లకెళ్ళేవాళ్ళు ఇళ్లనుండి గుడికెళ్లేవాళ్ళు గుడినుండి వచ్చేవాళ్ళు ఆ ప్రాంతమంతా రద్దీగా ఉంది. ఎప్పుడూ కలిసే దగ్గర కాకుండా ఇక్కడకు రమ్మన్నాడంటే శుభమే జరుగుతుందేమో, జరగాలని మనసులోనే దేవుణ్ణి కోరుకుంది. తను ప్రతీరోజు ఉదయం పూజచేస్తుంది. తన పూజ వృథా కాలేదేమో అనుకుంటూ నడుస్తూ ఉంది. బస్టాండు దగ్గరకొచ్చింది. బాగా రద్దీగా ఉంది. ఎక్కడి కొస్తాడో, ఎక్కడుండాలో అర్థం కాలేదు. ఫోన్ చేద్దామా అనుకుంటూ ఉంది. సత్రాలన్నీ భక్తులతో నిండుగా, రద్దీగా ఉన్నాయి. మొక్కులు తీర్చుకునేవాళ్లు దైవదర్శనానికొచ్చినవాళ్ళతో ఆ ప్రాంతమంతా కోలాహలంగా ఉంది. తిరిగి వెళ్ళేవాళ్ళు హడావిడిగా బస్టాండుకొస్తున్నారు. గుడికి వెళ్దామా అనుకుంది. నాలుగడుగులు వేసింది. ఫోను మోగింది. ఎక్కడున్నావ్ అన్నాడు. బస్టాండు దగ్గరలో అంది. అక్కడే ఉండు వస్తున్నా అన్నాడు. బస్టాండులో కొచ్చి పదినిమిషాలు అలాగే నిలబడిరది. వచ్చాడు. నవ్వుతూ పలకరించింది. కొంచెం పక్కకు తీసుకెళ్లాడు. తను తీసుకున్న చైను తీసి చేతిలో పెట్టాడు. తను అలాగే చూస్తుంది. ఎప్పుడు తెచ్చారు అంది. ఈ రోజే తెచ్చాను అన్నాడు. మరి డబ్బులు అందాయా అనబోతోంది. ఇప్పుడు టైం లేదు, తర్వాత మట్లాడతాను అని గబగబా వెళ్ళిపోయాడు. వెళ్తున్నవైపే అలా చూస్తూ ఉండిపోయింది.

సింహాచలం కొండమీద అర్ధమానవుడు వికృతంగా నవ్వుతున్నట్టున్నాడు.

మీ రచనలను అరుణతారకు ఈ-మెయిల్ కూడా చేయవచ్చు!

పేజ్‌మేకర్ ఓపెన్ ఫైల్, పి.డి.ఎఫ్. పద్ధతులలో (అను 6.0లో అయితే మేలు),

మైక్రోసాఫ్ట్ వర్డ్, ఎం.ఎస్. భాషలో కూడా అరుణతారకు మెయిల్ చేయగలరు

ఈ-మెయిల్ **: arunatara1977@gmail.com**

http://www.facebook.com/arunatara.virasam

కథ

నర్సిం

- ఇక్బాల్

వాడు రాడేమో.. వాడింకెప్పుడూ రాడేమో..

అవునా... వాడు ఎప్పటికీ కానరాడా...

వాడికోసం లోలోపలే మదనపడుతున్నా బయటికే ఎన్నిసార్లు అన్నానో!

నేను రోజూ గద్వాల్ నుండి ఈ ఊరి బడికొస్తాను. ఈ బడికి హెడ్మాష్టర్నూ.. టీచర్నూ.. స్వీపర్నూ.. అన్నీ నేనే. ఊరంటే ఇదో పెద్ద ఊరూ కాదు, చిన్న పల్లెకాదు. అలాగని గిరిజన చెంచు పెంటనో... లంబాడీ తాండనో కూడా కాదిది.

ఓ ముప్పై నల్భై సంవత్సరాల కింద ఒక ఆరు రెడ్లవీ, మూడు మున్నూరు కాపువీ, ఓ రెండు బోయలవీ ఇట్లా మూడంటే మూడు కులాల పదకొండు కుటుంబాలు పొలాల దగ్గర స్థిరపడగా ఏర్పడిన అతిచిన్న సమాజమిది.

ఇప్పుడు ఓ నల్భై కుటుంబాలతో సేద్యంలో అత్యాధునిక పద్ధతులతో వ్యాపార వాణిజ్య పంటలూ, పండ్లతోటలూ సాగు చేయడంలోనే కాకుండా శాస్త్రీయ వ్యవసాయంతో అత్యధిక దిగుబడులు పొందడంలో కూడా రాష్ట్ర వ్యాపిత గుర్తింపు పొందినదీ ఊరు.

అక్షరాస్యత, జనాభా నియంత్రణతో పాటు ఊరి తగాదా ఏదైనా కచేరీలు, కోర్టుల వరకు వెళ్ళకుండా ఊర్లోనే పరిష్కరించుకొనే కట్టడి... సొంత ఆధిపత్యమూ కలదిగా కూడా చెప్పుకొంటారు దీన్ని

ఇలా అనేకానేక విశేషాలతో విలసిల్లుతున్న ఈ ఊరిలో చూద్దామన్నా ఒక్క పూరిగుడిసె కనపడదు. అన్నీ మిద్దెలే... బంగళాలే..

ఇప్పటికీ ఈ ఊర్లో మిగతా ఊర్లోలాగా చాకలి, మంగలి, కోమటి, తురక, బాపని, వడ్ల, కమ్మరి, కుమ్మరి తదితర కులాలేవీ లేవు. నల్భై ఏండ్లకిందటి లాగే ఇప్పుడూ అవే మూడు కులాలు.

రెడ్లవి అప్పటి ఆరు కుటుంబాలు ఇంటికో నాలుగు కొత్త కుటుంబాలుగా పెరిగి ఇరవై అయిదులోపలే. మూడున్న మూన్నూరుకాపు కుటుంబాలు ఇంటికో నాలుగు లెక్కన అందాజగ పన్నెండు. ఇక బోయలవైతే పదికుటుంబాలు. అన్నీ కలిసి నల్భై.

ఈ నల్భై కుటుంబాలతో రెండువేల ఎకరాలదాక పొలవిస్తీర్ణంతో, అయిదారు కోల్లలోతు నీళ్ళులేని పాడుబడ్డ బావులతో మూడు నాలుగు వందల ఫీట్లలోతు భూమిలోపలికి జొరబడి నీళ్ళులేక ఫైలయిన ఆరు వందల మీదున్న బోరు గుంతలతో.. ఉన్న ఊర్ల బతుకులేక పొట్టసేత పట్టుకొని బొంబాయి... పూనా... బెంగుళూరు.. ఇట్లా ఎక్కడెక్కడ్నో కానని దేశాలు దిర్గి బతుకేమోగాని మందులకు లొంగని మాయదారి రోగాలపాలై గుడ్లల్లో పానంతో ఊరుజేరి ఊపిరిడిసే దీన జనులతో భాసిల్లే ఊరిది.

ఊరిలో ఉత్తరం దిక్కు ఒక మూలకు బడికోసం ఎనభైలలో కట్టిన పాత భవనం కూలడానికి సిద్ధంగా ఉంది. తొంభైలలోది మరొకటి ఒకే గదితో. ఇదే మా ప్రాథమిక పాఠశాల భవనం.

వీటి చుట్టూ సాలీసాలని బట్టతో కుట్టిచ్చుకున్న బిరుసైన అంగిలాగ ఇరుకిరుకు కాంపౌండ్ ఉంది. లోపల బడితోపోటీ పడి రెండింతలు పైకి ధీటుగా పెరిగిన, నీలగిరి చెట్లున్నవి. దిమ్మెకూలిన బోసినోటితో గేటులేని కాంపౌండ్ ద్వారమూ దానికి చెరోపక్క ఊరిజనంలాగా వినయంగా ఒక పక్కకు తలవాల్చిన కానుగచెట్టు నీడవుంది. మరొపక్క ఊరి రెడ్ల పౌరుషానికి గుర్తుగా ఎదలు తీసినిల్చిన కరెంటు స్తంభం ఉంది.

ఈ రెండింటి మధ్యలోనుండి నన్నూ, నా ముప్పై మంది పిల్లల్ని బడిలోనికి సాదరంగా స్వాగతంపలికే దారివుంది. ఇదీ మా బడి.

ఒకటే దగ్గర ఎనిమిదేండ్లు దాటినాయని గట్టు బడి నుండి ట్రాన్స్‌ఫర్ చేస్తే నెలరోజుల కొరకనుకొని నేను ఈ బడి కొచ్చిన. రావాల్సిన ప్రమోషన్‌రాలే. పచ్చనోట్లూ పైరవీల్ల మునిగితేలే సంఘాల పెత్తనాల వీకులాటల మూలంగా నాలుగేండ్లు దాటి అయిదేండ్లకావొస్తున్నా ఈ ఊరు వొదిలే అవకాశం నాకు రాలే.

గద్వాల నుండి అయిజ రూట్‌లో మల్దకల్ దాటినంక మూడు కిలోమీటర్లకు మా వూరి స్టాపొస్తది. అక్కడ దిగి లోపలికి అరకిలోమీటరు నడిసివస్తే మా ఊరే! ఆ ఎదురుగా కనిపించేది మా బడే.

ఇది వరకు లేవుగాని ఈ మధ్యనే బస్టాపుదగ్గర మూడు నాలుగు ఇండ్లైనయ్. ఆ మూడిండ్ల నడుమ ఉండేదే వాడిఇల్లు. రోజూ ఈ స్టాప్‌లో బస్సుదిగి ఆ ఇంటిముందు నుంచి బడికి వెళుతుంటే నా కొరకే ఎదురుచూసుకుంటూ ఉండేది వాడు.

తను ఏం దిన్నదీ... లేచినప్పటి నుండి ఏమేమి చేసిందీ... అమ్మ ఏమేమి ఇచ్చిందీ.... అడగకుండానే చెబుతూ... ఏదో ఒకటి నాతో మాటలు కలుపుతూ ప్రతిరోజూ నాతోపాటు అడుగులు వేస్తూ వొచ్చేది వాడు.

ప్రశాంతమైన కళ్ళూ, గుండ్రటి ముఖమూ, ప్రకాశవంతమైన చామనఛాయ, పెదాలపై చిర్నవ్వు.. నాకు నడుమెత్తు ఎత్తుతో, నాతో పరుగులాంటి నడకతో.... సంకలో పలకా పుస్తకాలు పొదిగిన చేయిసంచితో వాడు. ఇదీ నా మనసులోని వాడి రూపం. రోజూ తలకు చిక్కగా నూనెరాసి నున్నగా దువ్విన నెత్తీ, తీర్చిదిద్దినట్టున్న ముఖమూ, తెల్లని పనువరుస... ఎంతని చెప్పేది ఏమని చెప్పేది. వాడితో మాట్లాడాలంటే చాలా సరదాగా ఉంటుంది. ఏం జవాబు చెప్పాలన్నా ముందు 'ఊం' అంటాడు.

స్నానం చేసినవా అంటే 'ఊం-అవును' అంటాడు. ఎవరు చేపిచ్చింద్రు అంటే 'ఊం-అమ్మ' అంటాడు. తల ఎవరు దువ్వింద్రు అంటే 'ఊం – అమ్మ' అంటాడు. ఇట్లా వాడి జవాబులో 'ఊం' అనే ఊత పదంతోపాటు 'అమ్మ' అని ఎన్నిసార్లు పలవరిస్తాడో! అమ్మ అంటే నీకు ఇష్టమా అంటే 'ఊం' అవు.. శాన అంటడు. ఈ మాటలన్నీ వాడి సుకుమారమైన నోటితో అంటుంటే మనం తనివితీరా వినితీరవలసిందే!

ఇంతకీ వాడంటే ఎవరనుకున్నారు?! వాడంటే... మంచు తునక, వాడంటే.. తేనే పలుకు, వాడంటే.. నిప్పుకణిక.. వాడే... వాడే...

వాడే... 'నర్సిం'.

వెంకట్రాములు, పుష్ప, రామకృష్ణ, విశ్వనాథ్ రేణుక, బశ... వీళ్ళంతా వాడి దోస్తులు. వాడికన్నా తరగతిలోనూ వయస్సులోనూ వీళ్ళంతా పెద్దోళ్ళే. అయినా వాడిస్నేహం వీళ్ళతోనే.

మధ్యాహ్న భోజనంగా బడిలో రాములమ్మ వండి వడ్డించిన అన్నం సరిపోయేది కాదోమో ఆ చిన్నారులకు. ప్రభుత్వ లెక్కప్రకారం ఒక్కో విద్యార్థికి నూరు గ్రాముల బియ్యం రోజుకు వాడాలి. దీని ప్రకారం వండితే పిల్లలకు ఆకలి తీరేదేకాదు. ఈ లెక్క కాదని పిల్లలల పరిస్థితి చూసి కాస్త బియ్యం ఎక్కువ వేసి వండితే నెలలో పదిరోజుల బియ్యం తక్కువ పడేవి.

ఒక రోజు మా యం.ఇ.వో నర్సన్న సారు బడికొచ్చి తన సహజ ధోరణిలో అన్నం బాగుంటుందా? కడ్పునిండ తింటున్నారా? రుచిగా వండుతున్నారా? పిల్లల్ని అడిగారు.

బియ్యం ఎక్కువేపియండిసార్ అన్నారు పిల్లలందరూ ఏకకంఠంతో. 'అట్లకుదరదు' ఒక్కొక్కరికి రోజుకు నూరు గ్రాములే ఇస్తది గవర్నమెంటు. పై లెవెల్ల పిల్లలు ఎంత తినగలరు అనేది శాస్త్రీయంగా నిపుణులు నిర్ధారించిండ్రు... ఆయనమాటలు పూర్తికాక ముందే బశ బుస్సున లేసిండు.

'వానవ్వ ఎవ్వడు ఆ నిపుణుడు సార్. ఈడ్కి పిల్వండివాన్ని ఎట్లసాల్తదో అద్భుతాం. పావు కడుపుక్కూడ సరిపోదు'....నేను వొద్దని వారిస్తున్నా వినకుండా... 'నీవ్వూకొసార్ అక్కడ' అన్కుంట కూసున్నడు బశ.

పిల్లవాడే కాని సాలని అన్నం విషయంలో ఆగ్రహాన్ని ఆపుకోలేక పోయిండు. నిజమే అవిధేయత అనవచ్చేమోకాని ఆ ఆగ్రహం సమంజమైనదే. పిల్లలు చాలామంది ఉదయం ఇంట్లో ఏమీ తినకుండానే బడికొస్తారు. అందులో అందరూ కాయకష్టం జేసేటోల్ల పిల్లలు టైం పన్నెండు గంటలయితే నేను చేప్పే పాఠంపై వాళ్ళ ఏకాగ్రత నిల్చేదేకాదు. వాళ్ళ కడుపుల్లో ఆకలి చేసే అలజడి అట్లావుండేది.

'ఇక ఆపుసారు నీసోది' అనేట్లుండేవి వాళ్ల చూపులు. కాదు. ధనవంతుల పిల్లలేమో దూరదూర పట్టణాల్లో హాస్టల్లలో చదువుతున్నారు. బడికి వస్తున్న వాళ్ళంతా ఈ ముప్పై మంది పేదలే. ఒకరిద్దరు రాకున్నా అందరికీ ప్రజెంటువేసి వండిరచినా ఏ మూలకు సరిపోయేదికాదు. ఆ చిన్నారి ఆకలికడుపులకు. లిమిటెడ్ స్ట్రెంత్ ఉండడంవల్ల మరోవిధంగా సర్దుబాటయేదే కాదు.

ఇలా బడిలో భోజనాలయ్యాక ప్రతిరోజూ ఈ ఏడుగురూ కల్సి బడిచుట్టూ ఉండే పరిసరాల్లో, పశువుల కొట్టాలో దాక్కున్న ఉడతల్ని వేటాడి కాల్చుకు తినేవాళ్ళు.

'ఒరే పాములుంటాయ్' ఏమైనా ప్రమాదాలు జరగొచ్చు. అట్లా తిరగరాదురా అని నేనుచేసే అభ్యంతరాల్ని ఏమాత్రంవినకుండా ఏంగాదులేసార్ .... ఎందుకట్ల బెదవద్దవ్... మా దగ్గరికొచ్చే దమ్ములాపాములకు అనుకుంటూ పరుగుతీసేది. ఉడతల శికారీలో పెద్ద బశ దిట్ట. ఉడతలు ఎక్కడ తిరిగేదీ, ఎక్కడ దాక్కునేదీ వాడికి బాగా తెలుసు.

ఉడతల్ని ఎట్లాపట్టాలో ఎట్లా కొట్లాలో ఎట్లా కాల్చుకుని తినాలో పిల్లలందరితో కలిసి వాడు ఉషారుగా చెబుతుంటే ఆశ్చర్యంగావినే వాణ్ణి.

ఒకరోజు అరగంటలోనే వీళ్ళంతా కల్సి పది ఉడతపోతుల్ని శికారిచేసి కమ్మగా కాల్చుకుతిన్నారట.

వీడు ఈ బుల్లి నర్సిం. నన్ను నీడలా వెంటాడే దూత. నిక్కర్‌జేబులో చేతులు పెట్టుకొని ఎగసోపుకుంటూ నాదగ్గరికి పరుగెత్తుకొచ్చి నిల్చున్నాడు. ఏమీ మాట్లాడకుండా జేబులోంచి చెయ్యితీసి నాకోసం దాచుకొచ్చిన కాల్చిన ఉడత నాటేబుల్ మీదపెట్టి 'తినుసారు కమ్మగుంటది..' అన్నాడు.

కడుపు నిండినంత పనైంది. భుజం మీద చెయ్యేసి వాణ్ని దగ్గరకు తీసుకొని ఎదకుహత్తుకున్నా! 'నాన్నా నర్సిం నువ్వేతినరా' అంటూ వాణ్ణే తినమని వత్తిడిచేశా. నా కళ్ళల్లోకే చూస్తూ కొంచం కొంచం ఇరుసుకొని తింటున్న వాణ్ణి చూస్తే ఎంత జాలి అనిపించిందో.

నేను బడికి క్యారియర్ తీసుకుపోవడం చాలా అరుదు. తెచ్చిన రోజు మాత్రం ముందు వాడికింత పెడితే చప్పరించుకుంటూ విశ్వనాథ్‌తో కలిసి అపురూపంగా తినేవాడు. పిల్లలందరితో అదో ఘనకార్యంలా చెప్పుకునేవాడు. వాడు తిన్నది పిడికెడే అయినా ఊరించి ఊరించి చెప్పుకుతిరిగేవాడు. ఊరంతా రెక్కలొచ్చిన పక్షిలాగా, పలక మీద కొత్త దిద్దపెట్టినా... పాఠం చెప్పినా... పాటనేర్పినా ఉత్సాహంతో ఊరకలు వేస్తూ పొంగిపోయేవాడు. మరిప్పుడు వాడేడీ! ఆ ఉరకలూ ఆ ఉత్సాహం ఏవీ?! ఇంతకీ వాడు ఎక్కడికెళ్ళాడు? ఏమైపోయాడు!!

ఆ రోజు నాకు బాగా గుర్తు. అవును బాగా గుర్తు.... ఏదో పనిబడి బళ్ళోంచి ఓ అయిదు నిమిషాలు అలా బయటికి నేను వెళ్ళి వచ్చేసరికి పిల్లలంతా కాంపౌండ్‌లో ఒకపక్క దూరంగా చూస్తూ నిలబడ్డారు కోపంగా, భయం భయంగా. నర్సిం మాత్రం నా టేబుల్‌ను నీళ్ళతో కడిగీ తుడిచీ బట్టలన్నీ నాన్చుకుని అలసినట్లున్నాడు. కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుని ఒక మూలకు తలవాల్చి నిలుచున్నాడు. వాడ్నెప్పుడూ నేనలా చూళ్ళేదు. కండ్లు ఎర్రబారివున్నాయ్ ముక్కులోంచి చీమిడికూడా ఏకధాటిగా కారుతూవుంది.

ఏడుపూ దగ్గూ రెండూ కలగలసి ఉబికి వస్తున్నాయి వాడికి. నిప్పుల కొలిమిలా వున్నాడు వాడు. దగ్ధమౌతున్న అడవిలా వున్నాడు వాడు. పేలడానికి సిద్ధంగా ఉన్న అగ్నిపర్వతంలా వున్నాడువాడు.

భయం భయంగా దగ్గరకెళ్ళి 'ఏమైంది రా నర్సిం' అన్న. గొంతు పెగలదు. ఒక్కమాటా బదులు పలుకదు. వాడికళ్ళు మాట్లాడుతున్నాయి. వాడి కన్నీళ్ళూ మాట్లాడుతున్నాయి. జలజలా కన్నీరు ఆలేత బుగ్గలమీంచి ధారకట్టింది. నాకు వాటి భాష అర్థం కావడంలేదు. ఆ ఘోషా అర్థంకావడం లేదు.

వాడి మిత్రుడు విశ్వనాథ్ ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. వెంకట్రాములు వారిస్తున్నాడు. పుష్ప కనుసైగలతో చెప్పొద్దని ఆజ్ఞాపిస్తున్నది. చెప్పలేక, చెప్పకుండా ఉండలేక విశ్వనాథ్ యాతనపడుతున్నాడు.

అందర్లోకి పెద్దోడు బశ. వాడ్ని ఒంటరిగా పిలిచి అడిగిన. విశ్వనాథ్ ఉరికొచ్చి గొంతుకలిపాడు.

'... సారు ఏంలేదుసారు. నిన్న నీవు ఒక్కొక్కర్ని ఒక్కోరకం ఇత్తనాలు తెమ్మంటివిగద. అందరం గవితెచ్చి నీకు సూపినంగద పొద్దున. అవి ప్లాస్టిక్ కవర్లల్ల ద్యానికవి వేరేవేరే ప్యాక్‌జేస్తివిగద నీవు. అవిట్ని మల్ల డ్రాయింగ్ షీటుకు అతికిచ్చి దేనికింద ఆ గింజల పేర్లు ఒక్కొక్కరు ఒక్కొక్కటి రాయమంటివిగద. నీవు పాస్‌కు పోయినంక మేమందరం డ్రాయింగ్ షీట్‌ను నీ టేబుల్ మీద పర్చి ప్యాకెట్‌కింద గింజల పేర్లు రాస్తుంటిమి. గట్ల పుష్ప 'కందులు' రాసింది. నేను 'జొన్నలు' రాసిన,

రామకృష్ణగాడు 'వడ్లు' రాసిండు, విశ్వనాథ్‌గాడు 'శనగలు' రాసిండు, వెంకట్రాములు గాడేమో 'ఉలువలు' రాసిండు, ఇంగ పెసల్లు, సజ్జలు, బుడ్డలు రాయాల్సిఉండె.

అంతట్లకు ఈ నర్సింగాడుండడుగద సేతులకెల్లి జారిపడిన అనుములు ఏరుకుంట ఏరుకుంట వాని కాలికి దెబ్బ వుండైంది గద అండ్లకెల్లి సీముగార్తుండె. ఈగలు జోపుకుంట ఆడు సీము ఏలుతోని దీసి.... అని ఆయాసపడుతూ చెప్పుకుపోతున్న బిశను విశ్వనాథ్ అడ్డుకొని 'కావాలని కాదులే' అని సవరణ ఇచ్చిండు. మళ్లీ బిశనే అవులే యాదోద్యాసల ఆసీముని నీటెబుల్‌కు తుడ్సిండు. అంతేజూడు సారు ఇంగ పిల్లలు అరె ఆని సీము దాకిన టేబుల్ ముట్టుకోరాదని అన్ని తిట్టింద్రు అన్నాడు బిశ.

'అయినంక ఇంగా ఆనితోనే బోరింగ్ నీల్లు మోపిచ్చి ఆనితోని రుద్ది రుద్ది కడిగిస్తుండిరి. ఇంగ నీవొచ్చినవ్ సారు విశ్వనాథ్ పూర్తి చేసిండు. 'సీము దాకితే ఏమైతదిరా అన్ని ఎందుకు బాధ పెట్టింద్రు అనవసరంగా అన్నానేను. వెంటనే బిశ అందుకొని అట్లంటవ్‌సార్ ఆ పుష్పనడుగు ఊర్ల అందరూ ఏమంటరో.. నర్సింగానోల్లమ్మకు, ఏడ్సుండట. అల్ల నాయన దాంతోనే సచ్చిండంట. అది శానా డేంజరంట గద. ఆ సీము దాకితే మనందరికి రాదాసార్ గందుకని... ఇంకా ఏమో అంటుంటే వాన్ని ఆపి ఇంగసాల్రా బుద్ధిలేనిపని జేసి అన్ని గాయపర్సింద్రు. 'పాండి అందరం వానికి సారీజెబుదం' అంటూ బయటికివొచ్చిన.

ఇందాకా నాటేబుల్‌ను కడుగుతున్నది బోరింగ్ నీళ్ళతో అనుకున్నా, నర్సింగ్ కన్నీళ్ళతో అనితెల్సి నిస్త్రాణమైపోయాను.

బయట అంత బరువున్న టేబుల్‌ను నర్సిం ఒక్కడే ఆయాసపడుతూ ఆమూల ఈ మూల లేపి కొంచంకొంచం జరుపుకొస్తున్న దృశ్యం కన్పించింది. గబగబ వెళ్ళి వాన్ని జరిపి నేనే టేబుల్‌ను లోపలికి తెచ్చుకొన్న. పిల్లలందర్ని దగ్గరికి పిలుచుకొని చాలా తప్పుచేశారు. జబ్బులు అట్లా అంటుకోవు. ముందు వాడికి సారీచెప్పండి అని ఒప్పించాను. వెంటనే కాకుండా ముందుగా నేను నర్సింతో చేయికలిపాక ఒక్కోక్కరు వచ్చి అందరూ చేయి కలిపారు.

అనవసరంగా మీరు భయపడి వాడ్ని బాధపెట్టారు. స్నేహం అన్నింటికన్నా గొప్పది. దయ, ప్రేమ ఉన్నచోట ఏ బాధలూ భయాలు దరిచేరవు. ఏదీ నర్సిం ఇటురా అనిపిల్చి స్కూల్ కిట్‌లోంచి ఆయింట్‌మెంట్ తీసివాడి గాయానికి పూశా ఈగలు వాలకుండా. ఇన్ని రోజులూ ఒకే కుటుంబంలా మెలిగిన మా బడిపిల్లల వదనాలన్నీ ఒక్క పులువుచుక్క పడి పాలన్నీ విరిగినట్లు పగుళ్ళు తెలిన ఆ దృశ్యం చూసి మనసంతా వికలమైంది. నర్సిం హృదయం పగిలిన అద్దమై ఎంత విలపించిందో...

మర్రోజు వాళ్ళమ్మే వచ్చింది బడికి. వాడురాలే!

..'సారు... తప్పైంది వాన్నేమనకండి... పోటురాయి దాకి కిందపడిరటే దెబ్బతాకి సీం బట్టిండె... అంతే వానికేం గాలే... నీఎంట ఇంత గున్నప్పట్నుంచి వొస్తుండే పోతుండే ఏలువట్కోని. నీ మీద శానపానం సారు...' అవమానభారంతో కుంగిపోతూ ఆమె ఒక్కొక్క మాట అతిభారంగా గొంతుపెగిల్చి ఉచ్చరిస్తుంది.

'బడిలేనినాడు వాడు నరకమే జూస్తడు పిల్లల్తోని గూడ కల్సి ఆడుకోడు ఊర్ల. నీ వొచ్చె దినం ఆగిన బస్సులెల్ల మా సారొచ్చె అని ఎదురు జూస్తడు. బస్సు దిగిన మందిల ఓరకంట జూసుకుంట నిన్ను ఎతుక్కుంటడు. యమ్మా సారు దిగపాయె ఇయ్యాల రాడా ఏంది అని కండ్లల్ల నీల్లు వెట్టడు.

సిన్నప్పుడు ఆనికి నోరుతిర్గకుంటే నీవే ఎంటవడి ఎట్ల పల్కాల్నో కూడ పల్కిచ్చి మాటనేర్పితివి. నీవు గా పొద్దు నా ఎంట దోల్కపోత మా ఇంటికి రా రా అన్నవంట. ఎప్పటికి ఇంట్లనే ఉందువు అన్నవంట. గాపొద్దు వాని సంతోషం సెప్పరాదు.

'యమ్మా సారు రమ్మన్నడే .. మాసాల్రమ్మన్నడే అని ఎగిరి గంతేసిండు. ' రా అనింటే మల్లపోరా నీ యిష్టం' అనింటే మల్ల నీవు గూడ నాగ్గావలె గదా... నీవులేంది నేనెట్ల బోత ...ఆగు సార్నే మల్లోసారి ఎప్పుడైన నేనే అడ్గుత 'సారు.... సారు.. మాయమ్మా నేనూ ఇద్దరం వొత్తుమా మీ ఇంటికి... ఎప్పడికి ఆడ్నే ఉండనీకె... అనంటడుగుత అంటుండె ఉత్త అమ్యాత్కుడాడు.

యమ్మా మా బడి ఎంత మంచిదనుకున్నవే ఎప్పుడు ఆడుకుంట పాడుకుంటగమ్మతుగుంటం. మా సారు బాగాసదివిస్తడే. సెయిపట్టి దిద్దిస్తడె. వొద్దగూసపెట్టుకోని సిన్నసిన్న మాటలు కథలు జెప్తడే. అలాయి దొక్కిస్తడు.. బొడ్డెమ్మలు గొట్టిస్తడు. నాతోని రాజు ఏశం గట్టిచ్చిండె. ఒక్క తీరుగ పిచ్చోనిలాగా ఇదే వొదురుతుండె. పెద్ద సద్వు సదువుకోని సారులెక్కసార్నైత అని ఏమేమో కలగంటుండె.

బడితోని వాని జ్ఞాపకాలు చెప్పుకుంటూ ఏడ్చి కన్నీటి పర్యంతమైందా తల్లి. పిల్లందరూ కండ్ల నీల్లు నింపుకొని పశ్చాత్తాపంప్రకటిస్తున్నట్టుగా విషాద వదనాలతో నిశ్చల శిలలై నిల్చుండిపోయారు ఆమెచుట్టూ. పిల్లలందరి దిక్కూతలఎత్తి చూసి మళ్ళీ ఆమెనే అన్నది. 'ఈ పిల్లలంతా ఏమేమో అంటరంట. నాకూ వానికీ ఏదో పెద్దరోగం ఉందని, వాల్లనాయ్న వుండిరటే వానిగ్గూడ ఒక ఆదెరువుంటుండె. దిక్కులేనోలం గదా అందరూ అదో తీర్గ జూస్తరు...'

ఈల్లు గూడ పిల్లలు వీల్లదేం తప్పులేదు. ఈల్లకేందెల్సు పాపం. ఇండ్లల్ల పెద్దలు అనుకున్నది ఇనింటరు అదే యదాస్టం అంటుంటరు.

ఇమానంగ జెప్తున్న సారు పెద్దరెడ్డి పంపింటే కర్నూల్‌కు గూడ పొయి పరీక్ష జేపిచ్చు కొచ్చిన. నీగ్గావాలంటే రేపు దెస్త బడికి సూడు . గీల్లదరికీ జెప్పు ఆన్నేమనాకండని. 'పిల్లలు ఏమేమో అంటరు. నేను బోనుబడికి అని వాడు ఒకటే ఏడుస్తున్నడు. రాతిరంత సలిజరం వొచ్చింది ఆనికి ఏడ్చేడ్చి.

నిద్రలగూడ పల్వరిస్తుండడు.. ' సారు నన్ను దగ్గెరికి రానియ్యాడా... సారు నన్ను పిల్చుకోడా ... అని. నడిరాతిరి నన్నులేపి యమ్మా ఏమో రక్త పరీక్ష కాయితం ఉందంటివి గదా గది సూపిచ్చి రాపో సారుకు' అని వొకటే వొలపోస్తున్నడు.

రేపుతెచ్చి సూపుత ఆగు ఆకాయితం అనుకుంటూ కానుగచెట్టు కింది నుంచి లేచి బడి పిల్లల్లో తన బిడ్డడు లేని లోటును సూసి తల్చుకొని తల్చుకొని రోదిస్తున్నదా తల్లి.

'అమ్మా ఇక్కడ బడిల ఎవరం ఏమీ అనమమ్మా పిల్లల మాటల కేంలే నేనుండగద.. జరిగిందానికి విచారంతో నేనిస్తున్న భరోసాను పూర్తిగా వినకుండానే మౌనంగా వెళ్ళిపోయింది. ఆమె వెళ్ళిపోయాక మా బడిలో అంతా మౌనమే! ...భయంకరమైన మౌనం... పిల్లల్లో... నాలో... అందరిలో...

ఎక్కడో వర్షించడానికి భారంగా వెళుతున్న మేఘాల్లాగా అందరమూ ఇండ్లకైతే వెళ్ళాంగాని... మనసంతా ఒకటే దిగులు.. ఆ రాతిరెలా గడిచిందో!

కథ

జాగ

- ఉదయమిత్ర

ఈ రోజు ఏదన్న కథ రాయాల్సిందే.. చాలా రోజులుగా లోపల్లోపల ఏదో సలుపుతోంది.. 'కూకుండనీదురా కూసింతసేపు'- అని నండూరి సుబ్బారావన్నట్టు, ఏదన్న రాయాలనిపిస్తే, లోపలంత అలజడి అవుతుంది..

ఇంతకీ ఏం రాయాల్నో, దేన్ని గురించి రాయాల్నో సమఝయితలేదు.. రాయకపోతేనేమో కుదిరేటట్టు లేదు..

చాలాసార్లు నడుస్తుంటేనో, బస్సులో ప్రయాణం చేస్తుంటేనో అద్భుతమైన ఆలోచనలొస్తుంటాయ్.. చలనానికీ, సృజనాత్మకతకీ ఏదైనా సంబంధం ఉందా.. ఏమో..

* * *

అట్లా బజారు మీద పడితే, ఏదో ఒక టాపిక్ దొరక్కపోదు. చలో.. అట్లా నడుద్దాం..

ఆ... ఆడబోతున్నాడే.. మర్లుబుచ్చయ్య.. అతని తల్లిమీద రాస్తేనో.. పాపం ముసల్ది.. బతికినంతకాలం తన బొక్కలరగదీసి, వాళ్ళను సాకింది.. ఉన్నంతల సదువులు జెప్పించింది. మొగడు మధ్యంతరంగా తాగుడుతో చనిపోతే, తండ్రి లేని పిల్లల్ని తనే తల్లీ తండ్రీ అయి పెద్ద జేసింది.. ఇప్పుడు రెక్కలుడిగినాంక.. పనికి మాలిందయ్యింది. ఓ రూములో ఉంటది.. చీమలు, దోమలు.. ఎవరూ పట్టించుకోరు.. అన్నింటికన్నా అయినవారి మాటలు.. ఎత్తిపొడుపులు.. 'ఎప్పుడు చస్తావే ముసల్దానా.. నీ రూం మేం తీసుకుంటాం' అనడాలు.. కొడుకులు కొరివి దయ్యాలు. ఆమెను ముట్టనుగాక ముట్టరు.. నిజానికి ఆమె ఎప్పుడో చచ్చిపోయింది. ఛస్తున్న లోకానికేసి గాజు కళ్ళు తిప్పుతూ నిర్వేదంగా చూస్తూ ఉంటది.. ఇంక చాలు నేనీ విషాదాన్ని మోయలేను.

పోనీ.. గా డాక్టర్ సాబ్ మీద రాద్దునా.. డాక్టర్ నరేందర్‌రెడ్డి ఎంబిబిఎస్ .. ఎంత పెద్దబోర్డు.. బొద్దుగా, నల్లగా, ముద్దుగా ఎంత బాగా నవ్వుతాడో.. పేషెంట్ల రక్తాల్ని కూడా అంతే మోతాదులో పిండుతుంటాడు. ఊరికి రాచపుండులాంటి నర్సింగ్ హోం.. వైద్యమూ, రాజకీయమూ వెలగబెట్టే డాక్టరు.. పేరుకేమో గవర్నమెంట్ డాక్టరు.. ప్రాక్టీసంతా తన ప్రైవేటు క్లినిక్‌లోనే.. గవర్నమెంట్ దవాఖానలకు మందులొస్తే చాలు.. అవి గునగున నడుచుకుంటూ ఆయనగారి ప్రైవేటు ఆసుపత్రికి చేరుకుంటాయి. పట్నంలో పందిరిగుంజలా పాతుకుపోయి రాజకీయాలు వెలగ బెడ్తుంటాడు.. వాడిని గురించి రాయడం శుద్ధవేస్టు.

ఎప్పుడో తెల్లారేముందు నిద్రపట్టినట్లుంది. కళ్ళు తెరిచి చూసేసరికి పొద్దు బారెడెక్కింది.

రోటీన్‌గా చేయాల్సిన ఇంటి పనులన్నీ లయతప్పుతున్నాయి. ధ్యాసంతా వాడిమీదనే... రోజు కన్న గంటముందుగా ఆవూరి స్టేజి దగ్గర బస్సుదిగాను. నాకోసం ఎదురు చూస్తున్న ఆ కళ్ళు... వాడి చూపులూ అక్కడలేవు. అడ్డొస్తున్న జనాల్ని తప్పించుకొని బాటపొడవునా వెతుకుతున్నాను. ముని వేళ్ళపై నిలబడి నా కోసమే చూస్తూ ఆహ్వానం పలికే వాడిలేత చేతులు కనిపించలేదు. గబగబా కదులుతూ వచ్చి దారిలోనేవున్న వాళ్ళింటి ముందొచ్చి నిలిచాయి నా అడుగులు.

వాడులేదు వాడిపలుకూలేదు. వాడిచిర్నవ్వూ వాడి ముద్దు ముద్దు మాటలూ.... మాట మాటకూ 'ఊం అమ్మ' అని బదులిచ్చే వాడి స్వరమూ ఏవీలేవు. ఎప్పుడూ సున్నగా నూనెరాసి దువ్వినట్లుండే వాడితలలాగే నునువుగా ఊడ్చి సాంపిజల్లుకొని ముచ్చటగొలిపే ఆ వాకిలి ఊడ్చేదిక్కులేక చెత్తాచెదారంతో పర్చుకున్నది. ముగ్గుల మురిపాల శోభను కోల్పోయిన ఆ వాకిలి పొక్కిలి వారింది.

బెదురు బెదురుగా ఆ పక్కనున్న ఓ ఇంటావిడ్ని అడిగాను ' అమ్మా మా నర్సింలు లేడామ్మా..'

ఇంగ్యాడి నర్సిములు నాయనా నిన్న మొబ్బుల ఎవరికీ సెప్పకుండా తల్లీ కొడుకు ఎల్లిపోయిండ్రు. ఊరిడిసి పోయిండ్రు... ఏడికోయిండ్రో సారూ..' ఆ కుటుంబంపై ఉన్న తన మమకారాన్నంతా గుర్తుచేసుకొని కళ్ళు తుడ్చుకున్నదామె.

ఆ తల్లీ కొడుకులు ఎక్కడికెళ్ళారో ..ఎలా ఉన్నారో.. నాజ్ఞాపకాలు వాడి అనుభూతుల్ని నెమరేసుకుంటుంటే నా అడుగులు బడిదిక్కు లాక్కుపోతున్నాయి నన్ను.

దారి పొడవునా అన్నీ సహజంగానే ఉన్నాయి. సందడిగానే ఉన్నాయి. అంగడి దగ్గర, హోటల్ దగ్గర, బోరింగు దగ్గర జనాలు ఎవరి పనుల్లో వాళ్ళు తలమునకలై ఉన్నారు.

అంగళ్ళకు సరుకులేసేటోళ్ళు, కూరగాయలమ్మేటోళ్ళు ఊర్లకు వెళ్ళేటోల్లు.. ఎవరి తొందరలు వాళ్ళవి. ఎవరి అవసరాలు వాళ్ళవి. ఊరి పెద్దరెడ్డి రోజులాగే తలస్నానం చేసి మడిగట్టుకొని సీతారాముల గుడికెళ్ళి ఇంటికి తిరిగొస్తున్నాడు చేతిలో ప్రసాదంతో..

నేనూ నా పిల్లలూ మా బడి మాత్రం దిక్కులేనివై మిగిలాం.

పిల్లలేమేమో చెప్పాలన్నా విషాదాన్ని కళ్లల్లో దాచుకొని నా కోసమే ఎదురు చూస్తున్నారు.

గేటు పక్కనున్న కానుగ చెట్టు నిన్న తడిసిన ఆ తల్లి దు:ఖం లోంచి ఇంకా తేరుకోనట్లు ఎవరికో సంతాపం ప్రకటిస్తున్నట్లు ఆకుల్ని అవనతం చేసుకొని తలవాల్చుకొని ఉన్నది. ఆ ఊర్లో అన్నీ సహజంగానే ఉన్నాయి. ఆ కుటుంబానికి ఆ దౌర్భాగ్యాన్ని అంటగట్టిన వాళ్ళు ఏమీ ఎరగనట్లు ఏమీ జరగనట్లు పూజా పునస్కారాలతో తరించిపోతుంటే ఆ తల్లీ కొడుకులు మాత్రం ఇల్లూ వాకిలీ వదిలీ ఊరూ వాడనిడ్సి ఎక్కడెక్కడ తిరుగుతున్నారో..

ఇంతకీ వాడు రాడా..? వాడెప్పటికీ రాడా..? వాడు మళ్ళీ రానే రాడా..!

అవును వాడు రాడా..? వాడు మళ్ళీ రానే రాడా..!?

మనసు మూగగా రోధిస్తున్నది.

పోనీ.. గా షావుకారు బాలస్వామి గురించా? వాడ్ని గురించి రాసేదేముంటది... ఎంతమంది కొంపలు గూల్చిండో.. అంత మంచి బిల్డింగ్ గట్టిండు.. హైదరాబాద్‌ల ప్లాట్లు, ఇండ్లు, పిల్లికి బిచ్చమెయ్యడుగాని పొద్దున్నే ఓ శాలువ గప్పుకొని (దానిమీద రామ, రామ అని రాసి ఉంటది) గుడికి పోయి వొస్తుంటాడు. అనేక బినామీ పేర్ల మీద ఓ పదిహేను దాంకా రేషన్ షాపులుంటాయి. ఎంఎల్ఎ అండ ఉండనే ఉంది.. నెలనెలా స్వచ్ఛమైన నేతి డబ్బా, కిలోల కొద్దీ కాజు పలుకులు వంటివి ఆయనకు నజరానగ ఇచ్చివస్తుంటాడు.. ఈ బురద గుంటను తవ్వడం నావల్ల గాదు..

పోనీ.. గక్కడ కూరగాయలు పెట్టుకొని చెమటలు దీస్తున్న అమ్మాయి రజిత గురించి రాయనా.. పాపం.. దురదృష్టవంతురాలు.. బాకీ తీర్చమని అడుగబోతే భర్త రెడ్డీల చేతిలో హతమయ్యాడు. అక్కడ్నుంచి రెడ్డీలు బెదిరిస్తే కొంపాగూడు వొదిలి, ఇక్కడికొచ్చి కూరగాయల దుకాణం పెట్టుకొని బతుకును ఈడ్చుకొస్తోంది. ఇంటర్ చదువుతున్నపుడే పెళ్ళి చేశారు. అటు చదువూ సాగలేదు. ఇటు కాపురమూ నడువలేదు. ఇద్దరు చిన్న పిల్లలు.. నిలకడలేని వ్యాపారం.. అంతులేని దుఃఖం.. ఆమె గురించి గంతే దెల్సు.. కథ ముందుకు సాగదు.

అది సరే.. గా హోర్డింగ్‌లో నిలబడి అందరికీ నమస్కారం చెబుతున్న ఎంఎల్ఎ గురించి రాద్దునా.. ఆయనా.. ఆయన ఎన్నికయినప్పట్నుంచి, ఇప్పటిదాంక, ఆయనెట్లా ఉంటాడో మేం చూడలేదు.. అసలు మాకో ఎంఎల్ఎ ఉన్నాడన్న సంగతి మేమే మర్చిపోయాం.. ఎప్పుడూ మందీమార్బలాన్ని వెంటేసుకొని దావతులకూ, ప్రారంభోత్సవాలకూ తిరుగుతుంటాడు.. తనకు ప్రజలే దేవుళ్ళంటాడుగాని, 'సెజ్'ల విషయంలో చాలామట్టుకు విందులు ఆయనింట్లోనే జరుగుతుండేవి అంటుంటారు.. తోడినకొద్దీ మురికి బైటపడ్తుంది. నా వల్లగాదు.

పోనీ.. నన్ను నిరంతరం వెంటాడే ఓ కల గురించి కథ అల్లితే.. నాకది జ్ఞాపకమొస్తేనే ఒళ్లు జలదరిస్తుంది.. ఓ రాత్రి.. చర్చిలో.. మసక వెల్తుర్లో.. ఓ మనిషీ, నేనూ.. పక్కపక్కన ఉన్నాము. ఆ మనిషి తల మూడొంతులు తెగి మెడకు వేలాడుతోంది (పురుషోత్తంలాగే) ఆ పక్కన నిలబడి నేను నిశ్శబ్దంగా ఏడుస్తున్నాను. గుండెలు కోసే నిశ్శబ్దం. గ్రీకు విగ్రహంలా అట్లా నిల్చున్నాడంతే. ఈ కల నన్ను జీవితాంతం వెంటాడుతోంది. ఇది ఏ దుఃఖానికి ప్రతీకనో? చిన్నప్పుడే ఈ కల నాకెందుకొచ్చిందో? ఇది రాబోయే కాలాలకు ఏదయిన సంకేతం వంటిదా? అసలు మనిషికి ఇట్లాంటి కలలెందుకు వొస్తాయి? మనిషి బయటి జీవితమే.. ఛిద్రమైన ఆశలే, లోపలికి కలగా విస్తృతమయి మనిషిని కకావికలం చేస్తుందా? ఏమో నాకీకలల గురించి వివరించడం రాదు. అయినా కలల్ని.. కథల్లోకి తేవడం మాటలా..

ఊహూ.. కుదరడం లేదు..

ఊహల దారప్పోగులు తెగిపోతున్నాయి.. అయోమయంగా ఉంది. బయటికీ, లోపలికీ తేరిపారజూస్తే.. పుండును గెలికినట్టుగా ఉంది.. మరేం చేయాలి? ఇంటికిపోతే...

ఆ అక్కడేదో ఆటో ఆగింది. అందులోంచి ఓ పల్లెటూరి మనిషెవరో బెరుకు బెరుగ్గా దిగాడు.. ఆ ఆటోలో రెండు తట్టు సంచీలలో ఏవో బొప్పడి కాయలున్నట్టున్నాయి. చూస్తే వాటిని అమ్ముకోవడాన్కి వొచ్చినట్టున్నాడు-పల్లెటూరి అమాయకత్వం కొట్టొచ్చినట్టుగా కనబడ్తోంది.-పట్నానికి కొత్తలాగున్నాడు. దిగింతర్వాత అతనికండ్లు చాలా జాగ్రత్తగా దేనికోసమో వెతుకుతున్నట్లున్నాయి. బహుశా తన పండ్లు అమ్ముకోవడాన్కి 'జాగ' కోసమేమో. చూద్దాం.. ఏం జేస్తాడో.. బహుశా ఇక్కడేదో మనకు కథా వొస్తువు దొరికేటట్టుంది.

* * *

నేతాజీ రోడ్డంగా గజిబిజిగా ఉంది.

చూసేందుకు అదొక మయసభలా ఉంది.

రోడ్డుకు ఇరువైపులా కూరగాయలమ్మేవాళ్ళు, పూలు, పండ్లు ఇతర దినులమ్మేవాళ్ళు, ఆ పక్కన నిర్లక్ష్యంగా ఆపిన లారీలు, కార్లు, వ్యాన్లు, ఆటోలు, స్కూటర్లు.. అంతా గందరగోళంగా ఉంది.. ఆ పక్కన మున్సిపాలిటీవాళ్ళు కాలువలోంచి తీసేసిన చెత్త నాల్గురోజులుగా అక్కడే పడి ఉంది.. దాని మీద ఈగలు ముసుర్తున్నాయి. అదీ గాక అక్కడ డాక్టర్లు, ఇంటర్నెట్‌లు ఉండడంతో వొచ్చేపొయ్యే వాళ్ళ హడావిడి ఇంతా అంతా గాదు.

రోడ్డంతా పగిలిన చీమల పుట్టలా ఉంది.

దాపులేని గాయంలా ఉంది.

ఆ మనిషి తన మొత్తం శక్తిని కళ్ళలోకి తెచ్చుకుని ఇంత 'జాగ' కోసం వెతుకుతన్నాడు.. అనుకుంటాంగాని పట్నంలో జాగ దొర్కడమంటే మాటలా? మజాకా? గింత జాగకోసం ఎన్నెన్ని కొట్లాటలో? ఎనెన్ని అవమానాలో? ఎన్నెన్ని కుట్రలో? ఎన్నెన్ని యుద్ధాలో? అతను బెరుగ్గా సూపర్ మార్కెట్ ముందున్న చెట్టునీడన ఆగాడు.. అప్రయత్నంగా అతని దృష్టి అక్కడున్న ఇద్దరు స్త్రీల మీద పడింది. వాళ్ళిద్దరూ ఘోరంగా తిట్టుకుంటున్నారు.

'బద్మాష్‌దానా.. ఇంతింత రమ్మంటే ఇల్లంతా నాదేనన్నట్టు రోజురోజుకు నా జాగలకు జరిగొస్తున్నవేందే?' అంది పెద్దామె..

అవతల పడుచు పిల్ల తక్కువేం తినలేదు..

'ఏయ్.. మాటలు సక్కగరాని.. నా జాగ నా జాగ అంటున్నవు ఇది నీయయ్య గొన్నదా? నీ మొగడు గొన్నదా? లేక నీ ఉంచుకున్నోడు గొన్నదా? పెద్ద చెప్పొచ్చినవు–' అంతే స్వరంతో జవాబిచ్చింది పడుచుపిల్ల.

'నీకేం తెలుసే బజారు దానా.. నిన్న మొన్నొచ్చి టిక్కు టక్కుమంటున్నవుగాని, గీ జాగ నిలవెట్టుకోనీకె నేనెన్నేండ్లు తిప్పలు వడ్డ.. కన్నోనికాల్లువట్టుకున్న.. గీషావుకారుకి, గామున్సిపాల్టీవొల్లకు ఎన్నిసార్లు కూరగాయలిచ్చిన్నో, పైకమిచ్చిన్నో నీకేమెరుకనే..'

'ఓ.. ఇచ్చినవు పటు... నీవు గాంగ ఇచ్చినవు.. నీ అవుసరముండి నువ్విచ్చిన్నవు.. ఎవరినన్న ఉద్ధరించనీకె ఇచ్చినవా..'

'అసలు జర్గుతవా లేదా?'

'జర్గను.. ఏం జేస్తవేంది'

ఇద్దరూ కొట్లాటకు సిద్ధమయ్యారు. చోద్యం చూస్తున్న షావుకారు వొచ్చి 'ఇద్దర్నీ అక్కడ్నుంచి వెళ్ళగొడతాననడం'తో ఊరకుండి పోయేరు. వీళ్ళిట్లా తిట్టుకుంటూ ఉండగానే, ఆ పక్కనే ఉన్న మరో కూరగాయలమ్మేముసలమ్మ రెండు మూడు నదురైన ఆ నగపు కాయలు దీసి ఎదురుగ్గా పాలషాపు లోడికిచ్చేసింది..

ఇక్కడ ప్రతి షావుకారూ.. తన ఎదురుగ్గా ఉన్న రోడ్డు జాగ అంతా తన అబ్బసొత్తు అన్నట్టే ఫీలవుతుంటాడు.

మొత్తం మీద ఆ కొట్లాటలో 'జాగ' అంటే ఏమిటో ఆ ఇద్దరు స్త్రీలు తత్వ బోధ జేసినట్టయ్యింది.

* * *

ఆ మనిషికి లోపల్లోపలేదో కెలుక్కుమంది. అక్కడుండడాన్కి మనసొప్పలేదు. ముందుకు నడిచాడు.. కొంతదూరం పొయ్యాక అయ్యప్ప క్లాత్ స్టోర్ ముందు ఆగాడు. అక్కడి వేపచెట్టు కింద ఇంత జాగ కన్పించింది.

అతను అటూ ఇటూ జూసి మెల్లిగా ఒక వర్కు సంచి దీసి రోడ్డు వారగా పర్చాడు.. మెల్లగా బొప్పడిపండ్లు దీసి వర్క్ సంచి మీద పెట్టడం మొదలెట్టాడు.. అవి పసుపు, ఎరుపు, ఆకు పచ్చ కలగల్సి నిగనిగలాడుతున్నాయి. రంగుల బట్టలు తొడుక్కొని రంగుల రాట్నం గాడ గుమిగూడిన పిల్లల్లా ఉన్నాయవి-సంచీలల్ల తీసుకురావడం వల్లనేమో కొంతనలిగి ఉన్నాయి.

పాపం.. అతనట్లా పేర్చాడో లేదో రానే వొచ్చాడు సుడిగాలిలాగ షావుకారు.. సన్నటి బనీనులోంచి బొజ్జ ఊగుతోంది..

'ఏయ్.. ఎవడ్రా నువ్వు.. బేవఖూఫ్. నా షాపుముందర వెడ్తవా తీయ్ ఇక్కడ్నుంచి'.. షావుకారు హుకుంజారీ చేశాడు.

'సార్.. సార్ నీకు పున్యముంటది. గీ ఇన్ని పండ్లు జర్రసేపట్ల అమ్ముకపోత. నీకాల్మొక్త. కావలిస్తే ఇన్ని పండ్లు దీస్కోసారు' అన్నాడు బతిమిలాడుతూనే

షావుకారు ఆగేటట్టు లేడు... బూతులు లంకించుకున్నాడు. మధ్యలో బిపి, ఆయాసం పెరిగిపోయింది.. అతని కూతురు టాబ్లెటు తెచ్చి ఇవ్వడంతో.. అది వేసుకొని మళ్ళీ బూతులు మొదలెట్టాడు.

ఆ తిట్లకు ఆ మనిషికి రోషమొచ్చినట్టుంది.

'ఏందయ్యా.. గిది రోడ్డు.. అందరిది.. నీ జాగగాదు.. పైగా ఈడ కాలువ ఉంది.. కాలువ అవతల నీషాపుంది. ఇవతల నా షాపు ఉంది.. నేను నీకెట్ల అడ్డమొస్త.. లెక్క మీద మాట్లాడాలె' విసురుగా అన్నాడామనిషి...

'ఏంది బే బద్మాష్ మాటలు జాస్తి గొస్తున్నయ్.. ' అంటూ షావుకారు పిచ్చికోపంతో ఊగిపొయ్యాడు- ఆ మనిషి ఏదో అనేలోపు షావుకారు బొప్పడి పండ్లను కాలితో చిందరవందర చేయడం మొదలెట్టాడు. ఆ విషయంలో పిల్లలు కూడా తండ్రికి తగు విధంగా సాయం చేశారు.. కొన్ని పండ్లు పగిలిపొయ్యాయి. కొన్ని రోడ్డు మీదకి దొర్లుకుంటూ పోయాయి. అడ్డుకోబోయిన ఆ మనిషిని తోసేయడంతో, అతను విసురుకోలిగ పక్కనున్న ఆటో మీద పడిపోయాడు. మోచేతికి రక్తం వొచ్చింది. ఈ లోపున షావుకారుకు సపోర్టుగా పనిమనుషులొచ్చారు. రచ్చయ్యేటట్టుంది. రోడ్డుమీద పొయ్యే వాళ్ళు వింతగ జూస్తున్నారు.

ఆ మనిషికి తన పరిస్థితి అర్థమయినట్టుంది. మనిషి పోతోన్న పడవల్లో నిస్సహాయంగా రోదిస్తున్న మనిషిలా ఉన్నాడతను- మెల్లగా పండ్లను సంచీలో పెట్టుకొని, పుట్టెడు అవమానాన్ని మోసుకొని ఆటో ఎక్కాడు.. చుట్టుపక్కల వాళ్ళు సానుభూతితో చూడగలిగారేగాని, ఏమీ చేయలేని స్థితి. ఎవరి తిప్పలు వాళ్ళవి.. అతనికి సపోర్టుగ వొస్తే, రేపు తనను కూరగాయలు అమ్మనిస్తాడో, లేదో- ప్రపంచం పెద్దదే అనుకుంటాంగానీ, మనుషులు ఇంతింత చిన్న జాగల కోసం జీవన్మరణ యుద్ధాలు చేయడం విషాదమే..

తిరిగి 'జాగ' కోసం అన్వేషణ మొదలయ్యింది.

* * *

రోడ్డు అంతా జాతర్లాగుంది.. ఆ రోజు లీడరెవరో వొస్తున్నాడు.. ఈల్లకు పని తక్కువ.. ప్రచారం ఎక్కువ.. రోడ్డుపక్కన అనేకకటౌట్లు.. చౌరస్తాలో భారీ వేదిక. లౌడ్ స్పీకర్లో పాటలు.. హడావిడి

ఇవేమీ పట్టని ఆ మనిషి మెల్లిగా కాల్లీడ్చుకుంటూ 'జాగ' కోసం తిర్గుతున్నాడు.. తిరగంగా తిరగంగా ఒక చోట లడ్డూలాంటి జాగ కనబడింది.. చాలా నీట్‌గా, చదరంగా ఉందది. ఆ మనిషికి ఆ జాగను చూస్తే భలే ముచ్చటేసింది.. లేకలేక పుట్టిన ఆడ పిల్లను జూసి సంతోషపడ్డట్లు ఫీలయ్యేడతను-ఎదురుగ్గా దవాఖాన, పక్కన లైబ్రరీ, స్కూలు, పోస్టాఫీసు, మున్సిపల్ ఆఫీసు.. ఓహ్.. ఇంకేం. ఇక్కడ పండ్లు బోసుకుంటే వేడివేడి పకోడీల్లా అమ్ముడు బోతాయనుకున్నాడేమో.

అనుకోవడమే తడవుగా వర్కు సంచీ పర్చి పండ్లను పేర్చడం మొదలెట్టాడు.. ఎండకు పట్టిన చెమటను తుడ్చుకుంటూ చుట్టూ తేరిపారజూశాడు.

రానే వొచ్చింది తుఫాన్‌లా.. ఓ ఆడ మనిషి

'ఏందన్నా.. యా ఊరు మనది.. గీడేం జేస్తున్నవు-' నడుం మీద చెయ్యేసి అడిగింది.

ఆ పక్కన-కూరగాయలమ్ముకుంటుందామె.. పొట్టిగా, నల్లగా, పెద్దబొట్టుతో గడుసుదానిలాగ ఉందామె.

'ఏంలేదమ్మా.. గీడగిన్ని బొప్పడిపండ్లు వోసుకుంట. వొక్క గంట సేపట్ల వోత'-బతిమిలాడుతున్నట్టే అడిగాడు.

'ఆ.. బాగుంది వరుస.. నీవు పండ్లమ్ముకుంటే మేం గాడ్డి పండ్లలో మాలెనా.. మా గిరాకేం కావాలె.. తియ్‌తియ్.'

తను పండ్లమ్ముకోవడానికీ, ఆమె కూరగాయలకీ ఉన్న 'లింక్' ఏమిటో అర్థం గాలేదు. పట్నంలో ఇట్లా అర్థంగాని లింకులు సవాలక్ష ఉంటాయని అతనికి తెలియదు పాపం..

'అమ్మా.. మీకు పున్యముంటది.. పిల్లలుగల్లోన్ని.. జర్ర సేపట్లవోత' ఈసారి అతని ముఖం మరింత చిన్నబోయింది... ఏడుపొచ్చేస్తున్నట్టుంది.. కొండ మీద నుంచి జారి పడిపోతున్నాడు.

'వొద్దన్నా. గీడొద్దు.. మర్యాదగ జెప్తే ఇనాలె.. ఇక్కడ వేరేటోల్లొస్తరు.. అయినా మేం.. ఈ జాగను వేలకు వేలుపోసి కొన్నం.. అడ్డమైనోల్లు వొచ్చి అడ్డాలేస్తే, మా నోట్ల ఇంతమన్నే..

'జర్ర సేపట్ల వోత'

'కుదరదు'

'పండ్లు దీస్కోమ్మ'

'వొద్దొద్దు.. మా ఇంట్ల కడుపు తోటి ఉన్న పిల్ల ఉంది' మా మనిషికి ఆమె మీద విపరీతమైన కోపమొచ్చింది.. అనుకుంటాం ఆ మనిషి కూడా అక్కడ 'అడ్డా' వేయడాన్కి ఇట్లాంటి అవమానాలే ఎదుర్కొన్నదని అతనికి తెలీదు.

మళ్ళీ దేవులాట-ఎడారిలో నీళ్ళ కోసం వెతికినట్లు..

* * *

పట్నం ఈ తంతు మామూలే.

ఒకప్పుడిది చిన్న ఊరే... రోడ్ల వెంబడి చెప్పుకోదగ్గ 'రష్' ఉండేదిగాదు.. క్రమంగా పట్టణీకరణ చెంది, ఉబ్బిపోయిన శరీరంలా తయారయ్యింది.

దీనికి తోడు స్థానికేతరుల తాకిడి పెరిగిపోయింది. గుజరాత్ నుండి గుజరాతీలు, మైమన్‌లు, మహారాష్ట్ర నుండి మర్వాడీలు, కర్నాటక నుండి కర్నంపటేల్లు, ఇంకా ఇతర ప్రాంతాల నుండి వైశ్యులు వొచ్చి జేరారు. క్రమంగా తమణ్య పారకోరల్ని విస్తరించి... కోట్లు గడించారు.. అందుకే ఈ ఊరిని 'దొంగల రాజ్యం' అంటుంటాడు మా మిత్రుడు షరీఫ్ ఖాన్.. క్రమంగా ప్రాంతేతరులు యజమానులయి, ప్రాంతం

వాళ్ళు హమాలీలుగా, గుమాస్తాలుగ, పనివాళ్ళుగా మిగిలిపోయారు.

ఈ షావుకార్లు ఇక్కడ చేసే దుర్మార్గానికి ఒక అంతంటూ ఉండదు.. రూల్స్‌ని గంగల దొక్కని పెద్దపెద్ద బిల్డింగ్‌లు గడతారు.. రోడ్డునాక్రమించుకొని పెద్దపెద్ద మెట్లు వేసుకుంటారు.. రోడ్డు ముందుకు పది, పదిహేను అడుగులు జరిగి పెద్దపెద్ద షెడ్లు వేసుకుంటారు.. ఇంటిముందు కారో, వ్యానో, స్కూటరో పార్కు చేసి పెట్టుకుంటారు.. అయితే ఎవరయినా తమ షాపు ముందు ఇన్ని కూరగాయలో, పండ్లో అమ్ముకుందమంటే రోడ్డు వాళ్ళ అబ్బసొత్తని ఎగిరిపడతారు. వాళ్ళకు తగినఫలం ముట్టజెప్పాలె.. ఒక్కోసారి అదీ ఒప్పుకోరు. ఒకవేళ ఏవో తంటాలు బడి అడ్డా సంపాయిస్తే వాళ్ళతో వడ్డీల బిజినెస్ చేస్తారు.. 'ఇది నా జాగ.. ఇక్కడ్నుంచి ఇప్పుడిప్పుడే పోను.. ఎందుకంటేనేనే షావుకారు దగ్గర యాభై వేలు అప్పు దీసుకున్న'-అంటూ అమాయకంగా చెబుతాడో రైతు.. మొత్తం మీద షావుకార్లు పెట్టే తిప్పల్లో చిన్న బేరగాల్లు చీమల్లా నలిగిపోతుంటారు.

దీనితోబాటు ఇటీవల పోలెపల్లిలో 'సెజ్'లు ఏర్పాటు కావడంతో రద్దీ విపరీతమైంది.. మూల్గుతున్న నక్క మీద తాటికాయ పడ్డట్టయ్యింది.

మొత్తం రోడ్డు ఒక అనాథ.. పగలు చూస్తే పచ్చిపుండులా ఉంటది. రాత్రి ఉంటే రాక్షస రతికి గురై అలిసిపడుకున్న వేశ్యలా ఉంటది.

ఎండాకాలమొస్తే నీడలేక జనం చీమల్లా మాడిపోతుంటారు. టాయ్‌లెట్లుండవు.. ఆడోళ్ల పరిస్థితి ఘోరం.. టాయ్‌లెట్‌కి పోవాల్సి వొస్తే, కడుపుబ్బిపోవాల్సిందే..

* * *

'జాగ' కోసం అతను చేసిన అన్వేషణలో అతను కోర్టులో ఫుట్ బాల్‌గా మారిపోయాడు. 'బర్మాబజార్' కాడికిపోతే వాడు హిందీలో తిట్టి పంపించాడు.. ఓ క్లినిక్ ముందు పెట్టుకుందమంటే, డాక్టరు తిట్టిపంపించాడు. లేడీస్ కార్నర్ 'కాడ జూస్తే, వాడూ గొడవ పెట్టుకున్నాడు. జాగన్వేషణలో ఆంధ్రా బ్యాంక్, హెటెరో మందుల షాపు, అప్పారావు జ్యువెల్లరీ, ఇట్లా ఒక్కొక్కటీ దాటుకుంటూ పోయాడు. ఎక్కడా జానెడు జాగా దొర్కితే ఒట్టు..

ఆ పండ్లను ఎంత కష్టపడి కొన్నాడో.. ఎట్లా తీసుకొచ్చాడో.. ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో.. అతని ఆశలన్నీ బొప్పడిపండులాగ నిట్టనిలువుగ పగిలినట్టయినాయ్. ఎరక్కపోయి వొచ్చి పట్నంలో 'జాగ' కోసం ఇరుక్కుపోయాడతను.. ఆటోవాడు మరోవైపు విసుక్కుంటున్నాడు. పండ్లను దించేసి పోతానంటున్నాడు.

* * *

'ఆ... దొర్కింది... దొర్కింది మనసులోనే అనుకున్నాడతను. అనుకోవడమేమిటి? ఎగిరి గంతేయాలన్పించినట్టుంది. ఇంతకూ ఎక్కడా అని ఆశ్చర్యపోవొద్దు.. 'గతిలేనోనికి మతిలేనిది దొర్కినట్లు', రైల్వే గేటు పక్కన ఓ పెద్ద మురికి కాలువ పక్కన దొర్కిందా జాగ.. అదొక చిన్న పెంట దిబ్బ గూడా.. ఏలాగోలాగున శుభ్రం చేసి, ఆడ సెటిలవుదామనుకున్నాడు.

చుట్టూ పరికించి చూశాడు.. ఈ చివరి ఆశ కూడా నెరవేరుతుందోలేదోనని అతని అనుమానం. అవతలి పక్కన చిన్న చిన్న బేరగాళ్ళున్నారుగానీ, ఎందుకో ఈ వైపురాలేదెవ్వరూ.. బహుశా అది పెద్ద కాలువ దగ్గరం ఉండడం వల్లనేమో లేక అక్కడ దందా జేసే మనిషి ఆ రోజు రాలేదో.. మొత్తం మీద, ఏదయితేనేం? ఏదో ఒక జాగ దొర్కింది. హమ్మయ్య.. ఆకలితో ఉన్నమనిషికి చెత్తకుండేల పూరీలు దొర్కినట్టయ్యింది. ఆ పక్కనే ఉన్న చక్రాల బండి సాయెబుతో ఏదో 'ఒప్పందం' కుదుర్చుకొని లైన్ క్లియర్ జేసుకున్నాడు..

* * *

చెత్తనంతా ఊడ్చేసి ఓ 'జాగ' లాంటిది ఏర్పాటు జేసుకున్నాడతను.. పక్కన మురికికాలువ గబ్బు వాసన కొడుతోంది. బొక్కలోంచి ఎలుకపిల్ల ఒకటి బైటికొచ్చి 'ఎవరీ కొత్త మనిషి?' అన్నట్టుగా చూసి బొక్కలోకి దూరింది.. రావిచెట్టు మీద కుంటికాకి 'కావు, కావు' మని అతనికి స్వాగతం పల్కింది.

జాగ కోసం తిరిగి తిరిగి అతని కాళ్ళు రాళ్ళయ్యాయి..బట్టలు చెమటతో తడిసి ఆరిపోయాయి. ఇంతదాకా అతను జాగ కోసం వెతకడంలో ఆకలి సంగతి తెలియలేదు.. అదిప్పుడు అడవిమంటలాగ అంటుకుంది.

ఆకలి వెంట కోపం ఉంటుందేమో..

అతనిప్పుడు విపరీతమైన కోపంతో ఉన్నాడు.. ఎవడినయినా పట్టుకొని తందామన్నట్టున్నాడు.. ఈనా కొడుకులు పెద్ద పెద్ద జాగాలు జూసుకొని.. పెద్దపెద్ద బిల్డింగ్‌లు గట్టుకొని.. రోడ్డు మీదకు ఇష్టమొచ్చినట్టి జరిగి, మనిషికింత జాగ లేకుండా జేస్తున్నారు.. ఒక్కొక్క దుకాణ దారుని కత్తి దీస్కొని కసకసా పొడవాలన్పించింది.. నెత్తిమీద ఎండలాగే.. లోకంలో దుర్మార్గం కూడా అతని గుండెను మండిస్తోంది.

మరోవైపు 'అమ్మకాల' కన్నాముందే 'పంపకాలు' మొదలయ్యాయి. మెత్తగున్నోన్ని జూస్తే మొత్త బుద్ధేస్తుందంటారు గదా.. అతని అమాయకత్వం వల్లనో.. ఏమో అందరూ తలో విధంగా అతనికి టోపీ పెడ్తున్నారు.

అప్పటికే ఆటోవాడు ఊళ్ళో ఎక్స్‌ట్రా తిరిగినందుకు డబ్బుతోబాటు ఇన్ని పండ్లు తీసుకుపోయాడు.. తోపుడు బండు సాయెబు 'దయ'తో పర్మిషన్ ఇచ్చినందుకు అతనూనదురైనపండ్లు నాలుగైదు తీసేసుకొని దర్జాగ బండిమీద పెట్టేసుకున్నాడు.. ఆ పండ్లను చూసినప్పుడల్లా ఆ పల్లెటూరి మనిషి ఎక్కడో కెలుక్కుమన్నట్టనిపిస్తోంది. మరో పక్క ఓ పోలీసాయన థాట్ థూట్ అనుకుంటూ వొచ్చి 'పర్మిషన్.. అదీ ఇదీ..' అని చెప్పి ఇన్ని పండ్లు కొట్టేసుకుపోయాడు. కొంతసేపయినాంక, రైల్వే గేటు కీపరు దర్జాగ వొచ్చేసి 'అది రైల్వే జాగ అనీ, స్టేషన్ మాష్టరు చూస్తే కేసు పెడతాడని' బెదిరించి ఓ నాల్గు పండ్లు తీసుకుపోయాడు.. అప్పటికే షావుకారు దాడికి కొన్ని పండ్లు పగిలిపోతే, అవి మందికి పంచిపెట్టాడు..

పోయినవీ, కొట్టేసినవీపోగా 'దంచినమ్మకు బుక్కిందే మిగిలింది' అన్నట్లుగా అతనికి మిగిలినవి సగం పండ్లు మాత్రమే..

* * *

చుట్టూ పరికించి చూశాడు..

తానయితే జాగ కోసం నానా అవస్థలు పడ్డాడుగాని, అవతల పండ్ల బళ్ళవాళ్ళూ, మిర్చీ బజ్జీలవాళ్ళు నింపాదిగ బేరంగానిచ్చేస్తున్నారు. ఆ కింది భాగాన పాములనాడించేవాడు-పామును ఆడిస్తూ అందరితో డబ్బులడుక్కుంటున్నాడు. 'చీమల మందు, దోమలమందు, ఎలుకలమందు మా దగ్గరకొనండి.. మాది బస్వరాజ్ కంపెనీయండి.. మరెక్కడా కొనవద్దండీ' అంటూ ఓ మందుల బండిలాడు అరుస్తున్నాడు.

వాళ్ళు అక్కడ 'అడ్డా' వేయడాన్కి ఎన్ని తంటాలు పడ్డారో అతనికి

తెలీదు. ప్రేమ ముదిరి పెళ్ళి దాకా వొచ్చినట్టు, కన్నోడి కాళ్ళువట్టుకొని వాళ్ళు ఆయా జాగాల్లో కూచొని కూచొని దాన్ని తమ 'అడ్డా'లుగ మార్చేసుకున్నారు.

లోకంలో నెగ్గుకురావాలంటే మాటకారి తనం చాలా ఉండాలి మరి.. నోట్లో నాలుకలేనివాళ్ళేం నెగ్గుకురాగలరు.. పల్లెటూరిలో పుట్టి పెరిగిన మనిషికి వాళ్ళమ్మా నాయినా కావాల్సినంత మంచితనం, నిజాయితీ ఇచ్చారుగానీ 'మాటకారితనం' నేర్పలేదు.. ఇదేదో నేర్పడాన్కి ఏదన్నా బడి ఉంటే బావుండు...

* * *

'ఇకారం దప్పినోడు దుకానం బెడితే వొచ్చిన గిరాకీ మల్లమల్లిపోయింది' అన్నట్టుగా ఉంది ఆ మనిషి స్థితి. అదేమి విశేషమో. బేరం కూడా అంతంత మాత్రంగానే ఉంది. అసలే పట్నం.. పది రూపాయలు చెబితే రెండు రూపాయల కడుగుతున్నారు.. కొందరయితే వేడి చేస్తుందని, గర్భిణీ స్త్రీలకు మంచిది గాదని పడుచు ఆడ పిల్లల్ని అటువైపు వెళ్ళనీయడం లేదు.. అరకొర బేరం.. ఆకలీ.. అవమానం.. ఎండ పేదవాని కోపంలా దంచి కొడుతుంటే, పూర్తిగా అలసిపోయి ఉన్నాడతను సరిగ్గా చెప్పాలంటే, అతనో అగ్ని పర్వతం మీద ఉన్నట్టున్నాడు..

* * *

సరిగ్గా అప్పుడొచ్చాడో మనిషి.. అతడు మున్సిపల్ ఉద్యోగి.. పేరు రాంచెందర్.. ఆఖరి సీన్లో ముసుగు తీసేసిన విలన్‌లా ఉన్నాడతను.. రెండు సార్లు లంచం కేసులో సస్పెండ్ జేస్తే లంచం పోసి ఉద్యోగంలోకి వొచ్చి, అదే పాతవాసనతో బతికేస్తున్నాడు. ఎప్పుడు గారపండ్లికిలించుకుంటూ, వసూళ్ళ కోసం అలుపెరుగక తిరుగుతుంటాడు.. మాంసం దుకాణం కాడి నుంచి, సినిమా టిక్కెట్ల వరకు అన్నీ ఫ్రీ.. వెనుక ఎవరుతిట్టినా పట్టించుకోడు..

'ఏయ్.. ఎవ్డ్రా నువ్వు?' గద్దింపుగా అన్నాడు రాంచెందర్..

'సలామయ్య.. మాది ఆకు తోటపల్లి' కాస్త గరుగ్గానే జవాబు వొచ్చింది.

'అది సరే.. ఈడ ఈ పండ్లు ఎవరినడ్గి పెట్టినవ్..' ఇంకా గద్దింపుతో అడిగాడతను.

ఆ పల్లెటూరి మనిషికి పిచ్చి కోపం వచ్చినట్టుంది.

'గీ చెత్తకుప్పకాడ, గీముక్కి కాల్వపక్కన గిన్నివండ్లు అమ్ముకోవాలంటే ఎవరినడుగాలయ్యా.. కలెక్టరునడుగాల్నా..'

ఈసారి జవాబు పెడసరంగా వొచ్చింది జవాబు.

'ఏందిరో.. మాటలు జాస్తిగొస్తున్నయి.. ఇది మున్సిపల్ జాగ. నీకు పిర్మషన్ ఉందా?' లాపాయింటు తీసేడతను.

'ఎంతమంది నడుగాలయ్యా.. ఎవడు జూసినా నా జాగ, నా జాగ అంటడు..'

'అబే.. సువ్వర్.. ఇది ఎవని జాగ కాదు, మున్సిపాల్టీజాగ.. మా కమిషనర్ కోపం జేస్తది.. తియ్‌తియ్'

అప్పటికే ఆ మనిషికి ఓపిక నశించింది..

'అయితే యాడికి బోవాల్నయ్యా.. ఏట్లకువోవాల్నా? వాగుల వడిసావాల్నా..'

'ఏందిబే.. నఖ్‌రాల్ జేస్తున్నవా.. నరాల్ దీసేస్త.. పర్మిషన్ లేకుండ పండ్లమ్ముతవ్.. మీదికెల్లి ఉల్టమాట్లాడుతున్నావ్..'

'గిప్పుడేం జేయమంటవో చెప్పరాదూ?'

పక్కనున్న సాయెబువొచ్చి ఆ పల్లెటూరి మనిషి చెవిలో 'దేవ రహస్యం' చెప్పివెళ్ళాడు. ఏం లేదు అతనికీ ఇంత ఇచ్చేస్తే వెళ్ళిపోతాడు.. తన దగ్గరింకేం మిగిలింది.. మాంసం పోగా అస్థిపంజరం మిగిలింది. ఆ మనిషికి కోపం నశాళానికంటుకొంది.. మాటా మాటా పెరిగింది. అంతెత్తున అరుస్తున్నాడా మనిషి.

'ఏందయ్యా.. ఇక్కడెవ్వడూ బత్కగూడదా.. మీరే బతుకాల్నా' ఎంతమందికియ్యాల్నయ్యా లంచం.. ఎంతమందినడుగాలె.. గింత జానెడు జాగ కోసం గిన్ని అవస్థలు పడాల్నా.. పోలీసోన్ని.. రైల్వేవోన్ని, వక్కోన్ని, నాయబ్బకు పుట్టినోన్ని, ఆన్నీ ఈన్నీ.. అడ్డమైన భాడుకావుల్ని-అందర్నీ తడుపాల్నా.. ఏం.. మేం మనుషులం గామా.. మేం బతుకొద్దా.. తీస్కోండి.. గీ మిగిలిన పండ్లన్నీ మీరే దీస్కోండి.. బత్కుని.. మీరే బత్కుని.. చేస్కోండి.. పండుగ జేస్కోని.. థూ 'అంటూ కోపంగా బొప్పడి పండ్లను రోడ్డుమీద గుమ్మరించి.. కాకరించి ఉమ్మేసి.. చౌరస్తావైపు వెళ్ళిపోయేడతను.

ఒక్కక్షణం గాలి స్తంభించిపోయినట్టయ్యింది. బొక్కలోంచి ఎలుక మళ్ళీ ఏం జరిగిందోనని చూసి మళ్ళీ వెళ్ళిపోయింది. చెట్టు మీద కుంటికాకి ఒక్కటే ఇదిగా అరుస్తూ వెళ్ళిపోయింది.. అక్కడున్న మనుషులు రకరకాలుగా వ్యాఖ్యానించారు.

నాకు కథ దొర్కుతుందనుకుంటే, వ్యథను మూటగట్టుకున్నట్టయ్యింది. గుండె గాలానికి చిక్కిన చేపలా గిలగిలా కొట్టుకుంది.



విజయపథంలో పురోగమిస్తున్న

ఫిలిపినో విప్లవోద్యమానికి జేజేలు

విరసం ప్రచురణ:

వెల-రు. 15/-

ప్రతులకు :

దిశ పుస్తక కేంద్రం, చిక్కడపల్లి, హైదరాబాద్.

సహచర బుక్‌మార్క్స్, బాగ్‌లింగంపల్లి.

నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్.

కథ

మెలకువతో...

- నల్లూరి రుక్మిణి

'భూమి గుండ్రంగానేవుంది' ... మరోసారి అనుకుని పైకే అనేసింది.

'అదేం! కొత్తగా తెలిసినట్టు అన్నావ్!'... అంది ఉమ.

వేసవి సెలవలు! పిల్లలిద్దరూ కిందికి దిగారు, ఆటల కోసం. నిశాంత్ ఇంకా ఆఫీసు నుండి రాలేదు.

ఉమకు ఊపిరితిత్తులు దెబ్బతిని ఆరోగ్యం బాగా పాడైంది. ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. బెజవాడ ఎండలకు మరీ శక్తి లేనట్టుగా అనిపిస్తుంటే, శశికళ దగ్గర పది రోజులు వుందామని వచ్చింది.

'హాయిగా, చల్లగా ప్రాణానికి సుఖంగావుందే!.. ఈ బెంగుళూరు వాళ్ళు నిజంగా ఎంత అదృష్టవంతులో'... రోజుకు పదిసార్లైనా అనుకుంటోంది ఉమ అక్కడ వాతావరణంచూసి.

'సరే! ఇక్కడి వాళ్ళను కదిలించి చూడు... ఇప్పుడు ఎండలు ఎక్కువయి తట్టుకోలేక పోతున్నామని వలపోస్తుంటారు'... 'మంచి రోహిణికార్తెలో బెజవాడ తీసుకురావాలి వీళ్ళను'...

ఉమకు నవ్వు వచ్చింది. 'పాపం వాళ్ళమీద అంత కోపమెందుకే.

శశి కూడా నవ్వుతూనే.. పిల్లలు ఎక్కడ వున్నారోనని ఓ కంట ఆ విల్లా గార్డెన్స్ వైపు చూస్తోంది.

ఈ పది రోజులుగా శశి పిల్లల మీద చూపిస్తున్న శ్రద్ధ చూస్తుంటే ఆశ్చర్యంగా వుంటోంది. ఆంటీ కూడా ఇంత శ్రద్ధగానే పెంచి వుంటుంది గదా! మరి శశికి ఎందుకు తల్లితో అంత గ్యాప్ వచ్చింది? ఉమకు చాలా రోజులుగా ఆ ప్రశ్న ప్రశ్నగానే వుండి పోయింది.

శశికళ, ఉమాబాల ఇంటర్ చదివేటప్పటినుండే మంచి స్నేహితులు. ఉమ డిగ్రీతో ఆపేసింది. తండ్రి ఆర్.టి.సి.లో చిన్న ఉద్యోగి కావడంతో... 'ఇంకా చదివితే, నీకంటే పెద్ద చదువులున్న వాడిని తేవడం కష్టం తల్లీ! మనకింత వరకు చాల్లే!' అని, తన నిస్సహాయతను వ్యక్తం చేశాడు. తమ్ముడి చదువు, తన పెళ్ళీ గురించి నాయనమ్మ దిగులు పడుతూ, కొడుకు కష్టం గురించిన తలపోతలు వింటూ 'పోనీలే'అని... ఉమకూడా సరిపెట్టేసుకుంది.

వాళ్ళిద్దరిదీ మొదట ఆటల దగ్గర స్నేహమే.

గుంటూరు ఉమెన్స్ కాలేజీలో టెన్నిస్ టీమ్‌లో వుండేవాళ్ళు. టెన్నిస్ ప్రాక్టీసు కోసం కాలేజి వదిలాక కూడా వుండాల్సి రావడం... సెలవు రోజుల్లోనూ తరచుగా కలవడంతోనూ వేరు వేరు గ్రూపులయినా ఇద్దరి మధ్యా మంచి స్నేహం ఏర్పడింది.

శశి చొరవగా, చలాకీగా వుండేది. ఆటల్లోనేగాక డిబేటింగ్ కాంపిటీషన్స్‌లోనూ ఫంక్షన్స్‌లోనూ ముందుండేది. ప్రపంచమంటే లెక్కేంటన్నట్టుగా సూటిగా మాట్లాడేది. యాక్టివ్‌గా వుండే శశి అంటే స్టూడెంట్స్‌లో చిన్నపాటి గ్లామరు వుండేది. ఉమ బాగా ఆడేదే గానీ.. మిగిలిన విషయాల్లో ఎప్పుడూ శశి ననుసరించేది.

శశికళ తల్లిదండ్రులిద్దరూ డిగ్రీ కాలేజీలో లెక్చరర్స్ కావడంతో - వాళ్ళ ఇంటి వాతావరణం చాలా స్వేచ్ఛగా వుండి దేనికీ ఎవరూ ఇబ్బంది పడుతున్నట్లుండేది కాదు. పరీక్షలప్పుడు కలిసి చదువుకుందామని... వాళ్ళింటికి వెళ్ళినప్పుడు ఉమకు ఎంతో ఆనందంగా అనిపించింది. ఆ ఇంటికి 'హ్యాపీహోమ్' అని పెట్టుకోవచ్చుననుకునేది. తననీ ఎంతో ప్రేమగా చూడడం, శశి వాళ్ల నాన్న 'ఆట' గురించిన వివరాలు అడిగి ప్రోత్సహించడం! - శశి ఎంత అదృష్టవంతురాలో' ననిపించేది.

'ఆడపిల్లలకు ఆటలేమిటే ఈ వయస్సులో! రేపు పెళ్ళయితే మొగుడికి వండి పెట్టడమెట్లా, ఇల్లు చక్కదిద్దుకోవడమెట్లా! అన్నది నేర్చుకోవాలి గానీ'... అనే నాయనమ్మ సణుగుడు విన్నప్పుడల్లా, 'ఏ పూర్వ జన్మ పుణ్యమో'నని నిట్టూర్చేది.

ఉమ ఆలోచనలకు బ్రేక్‌వేస్తూ పిల్లలు అల్లరి చేసుకుంటా పరుగెత్తుకొచ్చారు. శశి హాలు తలుపు తీయగానే! 'మమ్మీ! చూడు' అంటూ ఒకరి మీద ఒకరు కంప్లైంట్స్ చెప్పడంలో పడ్డారు.

అదంతా అయి ప్రశాంతపడ్డాక... కొడుకు తిరిగి దేనికో పేచీ మొదలు పెట్టాడు. 'ఆ బొమ్మ ఇప్పుడెందుకురా! విరగ్గొట్ట డానికి తప్ప'. వద్దని యివ్వక పోయింది శశికళ.

తల్లి ఇవ్వననే సరికి, వాడింక దాని కోసమే గొంతు పెంచాడు.

'మొన్న సింగపూర్ వెళ్ళినపుడు తెచ్చాం ఉమా! నాలుగు రోజులన్నా వుంచరు. అందుకే దాన్ని అందకుండా పైన పెట్టాను. అయినా ఏం లాభం?.

పిల్లలు మనం వద్దన్నదే, కావాలంటారు మరి! మనమేమో మనం ఏది కావాలను కుంటామో, అదే పిల్లలు చెయ్యాలని చూస్తాం!.

పిల్లలని ఏముందిలే ఉమా! పెద్దలమయినా అంతే! ఎవరన్నా మననుండి దాస్తున్నారనుకుంటే, అదేదో తెలుసుకునేదాకా ఆరాట పడతాం!. అంతేమరి!, పిల్లల్ని పెంచడం ఓ కళ... ఎలాగోలా పెంచితే సరిపోతుందా?.

శశి వైపు చూస్తూ అలా వుండి పోయింది.

ఇంతలో అక్కా తమ్ముళ్ళిద్దరూ ఆ బొమ్మ కోసం పేచీలు పడి రెండు గుద్దులు గుద్దుకుని... ఏడుస్తూ తల్లి దగ్గరకు వచ్చారు.

శశికళ ఇద్దర్నీ కోప్పడి... 'ఎవరు ముందు అడిగినా ఇద్దరూ కలిసి ఆడుకోవలసిందే! అక్కా తమ్ముళ్ళిద్దరూ అన్నీ పంచుకోవాలి!' అని కొడుక్కి పాఠం చెప్పింది.

'అన్నీ ఎప్పుడూ! ఇంతే'... కొడుకు మూతి ముడుచుకున్నాడు. అలిగిన వాడిని అట్లా, ఇట్లా చక్కిలిగింతలు పెట్టి నవ్వించే పనిలో పడింది శశికళ.

అదంతా చూస్తూ హాయిగా నవ్వుతూ!, 'చేస్తూ, చేస్తూ వున్న ఉద్యోగం ఎందుకు మానేసిందీ? ఈ పిల్లకేం తిక్కా అనిపించింది'... గానీ 'ఉద్యోగం మాని మంచి పని చేశావ్!' అంది.

పిల్లల్ని వదిలి ఉమకు ఎదురుగా కూర్చుంటూ!. 'నిజమే అదో తీర్చలేని వైరుధ్యం! ఆడవాళ్ళకు స్వేచ్ఛ కావాలంటే జ్ఞానం కావాలి...

దానితోపాటు పైసలూ కావాల్సిందే. అవి కావాలంటే, చదవాలి... ప్రపంచాన్ని తెలుసుకోవాలి. ఉద్యోగమో, సజ్జోగమో చెయ్యాలి. ఇదంతా ఎంత నిజమో!, 'ఆడది తిరిగి చెడిపోద్దని' అణచి వుంచడమూ అంతే కఠోరమైన వాస్తవం. తిరిగితే 'శీలం' చెడటం మాట కాదు... మగవాడికి ధీటుగా నిలబడగలదు, వ్యక్తిత్వాన్ని ప్రదర్శించ గలదు... అదంతా ఈ సమాజం భరించవద్దా!... 'ఎంత మిధ్యా?'

'పెళ్ళిళ్ళూ, దాంపత్యాలూ, పిల్లలూ, ఏమవుతాయో? కనక అడవాళ్ళు పిల్లల్ని కనాలి, పెంచాలి, సమాజం వృద్ధి కావాలి!. ఇదంతా ప్రకృతి ధర్మం.. దాన్నెవరు తప్పిస్తారూ? ... లేదంటే సమాజంలో విలువలు నశించి పోతున్నాయని ఎంత గగ్గోలో – చూస్తుంటే రాబోయే రోజుల్లో, ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళకు పెళ్ళిళ్ళు కావేమో?..

శశి మాటలకు నవ్వి... 'అంతా నీ భ్రమే! ఇప్పుడు ప్రతివాడికీ డబ్బుమీద యావ పెరిగింది... ఏం చేసైనా సంపాదించాలి, అనుభవించాలి... ఇది బాగా పెరిగిపోలేదూ! ఉద్యోగం చేసే ఆడవాళ్ళకు డిమాండ్ ఎక్కువేలే'! అంది ఉమ.

'అందుకే ఆడవాళ్లకు వత్తిడి మరింత ఎక్కువైంది. కుటుంబానికి బాధ్యత పడకా తప్పడం లేదు... బయట పని చెయ్యకుండానూ వుండలేక పోతున్నారు. ఇదో తీర్చలేని వైరుధ్యం'...

'మనం ఇది కోరి తెచ్చుకున్నదేమోననిపిస్తుంది నాకైతే! పిల్లలకూ, వంటిళ్ళకూ సమాజం బాధ్యత పడితే మంచిదని చెప్పిన మాటలు మనకు చేదుగా అనిపిస్తాయిగానీ... కుటుంబాలు వ్యక్తుల బాధ్యత మీద వుండటం వల్ల... స్త్రీల కెంత కష్టంగా వుంటోందీ?

'నువ్వనేది నిజమేగానీ శశీ, ఇప్పటికే ఆడవాళ్ళను పట్టలేక పోతున్నామని... కుటుంబాల సంస్కృతే నాశనమయి పోతోందని గదా, గొడవంతా'!.

శశికళ నవ్వుతూ! 'ఇదో గొప్ప నాటకమే తల్లీ! సంస్కృతి నాశనమై పోతుందని గోలచేసే వాళ్లను... వారి పిల్లల్ని అమెరికాకు పంపకుండా వుండమనూ!... అంతదాకా ఎందుకుగానీ తెలుగు సంస్కృతో అని గోల చేసే ఈ వెధవల్ని ముక్కిపోయి ప్రేమ వాసనగొట్టే తెలుగు సినిమాను ఒక్కటి బ్యాన్ చెయ్యమని అడగమనవే, దమ్ముంటే'!.

'బ్లూ ఫిల్ములు, ఇంటర్‌నెట్ కేఫ్‌లు తీసెయ్యమని డిమాండ్ చేయగలరేమో చూడు?' అసలు తెలుగు సినిమా నిర్మాతలల్లో ఒక్కడినైనా 'ఉరి' తియ్యాలని నాకెంత ఆశో?'

'నీ దుంపతెగా! వాళ్ళేం చేశారే!'.. ఉమ నవ్వుతూ.

'వాళ్ళా! అసలు ముందు మోతీరావుని, ప్రథమ ముద్దాయిగాచూపి, యావజ్జీవ శిక్ష విధించి... జైల్లో మూడు పూటలా... తెలుగు సినిమాలు చూపిందే చూపించాలని నా కోరిక'.

'విచిత్రం' సినిమా సృష్టించిన ట్రెండ్ ఎంత సిగ్గుచేటూ? తెలుగు సినిమా రంగం ఎంత చెడిపోయిందే! మురికి వరదగా పారినట్టు... టీనేజీ ప్రేమ సినిమాల ప్రవాహం... టీజింగ్ హీరోయిజం.. అవి చూసి ఈ బదుద్దాయిలు ఆడపిల్లల వెనక చేరడం... ప్రేమించాననడం!, లేదంటే యాసిడ్ పొయ్యడం, వీలయితే రేప్‌లు చెయ్యడం!.. ఏమిటిదంతా?.

శశికళ చెప్తూ చెప్తూ కోపంతో ఆగిపోయింది.

'ఫ్రెండ్సిద్దరూ ఎవరికో శిక్షలు వేస్తున్నారే!... ఇక వాళ్ళ పని అయిపోయినట్టే'... అప్పుడే వచ్చిన నిశాంత్ అందుకున్నాడు.

నిశాంత్ రాకతో అతని చేతిలో బ్రీఫ్ అందుకుని మంచి నీళ్ళు తెచ్చి ఇచ్చింది శశికళ.

బూట్లు విప్పి... టై వదులు చేసుకుని శశికళ ఖాళీ చేసిన కుర్చీలో కూర్చున్నాడు, అలసట తీర్చుకుంటూ!.

రెండు 'బౌల్స్'లో ఫ్రూట్ ముక్కలు సర్ది తెచ్చి చెరొకటి ఇచ్చి తనూ మరో కుర్చీ లాక్కుని కూర్చుంది.

'మామూలే! సమాజం మీద నుండి సినిమాల మీదకు పోయింది'.

'మోతీరావుకి యావజ్జీవ కారాగార శిక్ష వెయ్యాలనీ... అథవా ఒక్క తెలుగు నిర్మాతకన్నా ఉరిశిక్ష వెయ్యాలనీ'

నవ్వి.! 'మీ తీర్మానానికే నా ఓటు కూడా!' అని, చేతిలో బౌల్ టేబుల్ మీద పెట్టి గదిలోకి పోయాడు. అతని ననుసరించింది శశికళ.

ఉమ కూడా లేచి మొహం కడుక్కుని, జడ వేసుకుని, పుస్తకం తీసుకుని మంచం మీద వాలింది.

* * *

ఉమ పేజీలు తిరగేస్తుందే గానీ... మనస్సు మాత్రం ఎక్కడో వుంది. పెళ్ళికి ముందు కొన్నాళ్ళుగా శశి ఎందుకో డల్‌గా వుంటూ వచ్చింది. ఉమకు అర్థం కాలేదు. ఇప్పుడు వీళ్ళను చూస్తుంటే ఎంతో అన్యోన్యంగానే వున్నారు. అప్పుడెందుకలా వుందీ?

అవి కార్తీక మాసపు రోజులు. పరిగెత్తే చీకటి తెరలు. చలికి తలుపులు దగ్గరగావేసి అంతా లోపల చేరారు. అలాంటి టైంలో అనుకోకుండా ఓ రోజు శశి, ఉమ వాళ్ళింటికి వచ్చింది. శశి రాక ఆశ్చర్యం కలిగించిందామెకు. ఏవేవో మాట్లాడుకుంటున్నారు గానీ శశి హుషారుగా లేనట్టు గమనించిన ఉమ –

'ఏమిటే అలా వున్నావ్! మొన్న సెలక్షన్స్‌లో పోయిందనా? ఏమిటి? అయినా ప్రాక్టీసు కూడా తగ్గించావేం?'... అంది. శశి అలా వుండటం మొదటిసారిగా చూస్తోంది.

'ఎనీ ప్రాబ్లమ్'! ... ఆందోళనగా అడిగింది.

'లేదు! లేదు!' ఏం లేదు! అని మౌనంగా వుండి పోయింది.

కొద్దిసేపు ఆగి! ఓ నిట్టూర్పు వదలి ... 'డబ్బు, కులమూ, పరపతి అన్ని రంగాలనూ ఎట్లా పాలిస్తోందో! గదా' అంది! అప్పుడే కళ్ళు తెరచి లోకాన్ని మొదటిసారిగా చూస్తున్నట్టు.

శశి మాటలకు ఆశ్చర్యంగా! 'అవేవీ లేని లోకమే లేదు శశీ.. మన వాళ్ళు అనే వాళ్ళు వుండటం ఎంతో అవసరం. కానీ నీకేమిటే?'...

'పరపతి గలిగిన తల్లిదండ్రులూ! సంఘంలో పలుకుబడీ'... అట్లా సంభాషణ ప్రారంభమయి ఉమ కూతురు రావడంతో ఆగిపోయింది. ఆ పిల్లను ఎత్తుకుని ముద్దు చెయ్యడంలో పడిపోయింది శశి. అటు తరువాత ఆ ప్రస్తావన రాలేదు.

శశికళ పీజీ పూర్తి కావస్తుండగా పెళ్ళి చెయ్యాలన్న సందర్భం వచ్చింది. శశి పెళ్ళి ఆ ఇంటిని చిన్నపాటి కుదుపుకు గురి చేసింది. బయట వాళ్ళకు అర్థం కాలేదు గానీ... దాని తాకిడికి వాళ్ళు చిగురుటాకుల్లా కదిలారు.

శశి కోసం వెళ్ళిన తనకు కమలమ్మ మాటలు ఆశ్చర్యం కలిగించింది. 'మేం చేసింది మంచో చెడో తెలియడం లేదు ఉమా!, పొరపాటు చేశాం! పిల్లలు ఎదిగాక ప్రశ్నలు వేస్తారనీ, బాధ్యత పడాల్సి వుంటుందనీ అనుకోలేక పోయాం!' ఆమె మాటల్లో ఏదో నిర్వేదం ధ్వనించింది.

కమలమ్మ కొత్తగా అనిపించింది మొదటి సారిగా... ఎన్నడూ దిగులనేది ఆమెలో కనిపించేది కాదు. జ్ఞానంతో కూడిన ఆమె చిరునవ్వు

ఎం ే అందంగా వుండేది.

అప్పటికి శశి రావడంతో ఇద్దరూ బయటకు వెళ్ళిపోయారుగానీ ఆమె మొహం ఉమను వెంటాడుతూనే వుంది.

'ఎందుకే! ఆంటీ అట్లా ఉన్నారూ!' అంది.

శశి 'ఊ' అని, ఊరుకుంది.

శశి కూడా తల్లితో ముభావంగా ఉందనిపించింది. ఏమైవుంటుంది?

'నువ్వుగానీ సమస్య ఏదన్నా సృష్టించలేదు గదా!' ... నవ్వుతూ అంది!.

'అదే నిజమైతే ఇప్పటి ఈ సఫకేషన్ వుండేదే కాదు! నాకు అంత కళ లేకపోయిందే!'

ఇంక అంతకంటే రెట్టించి అడగనూ లేకపోయింది.

మరో ఏడాది శశి పెళ్ళి అవడం... పెళ్ళికి వెళ్ళినపుడు కూడా కమలమ్మ వుండాల్సినంత ఉత్సాహంగా లేకపోవడం గమనించింది.

శశి పెళ్ళి జ్ఞాపకాలను నెమరేసుకుంటూ! 'పోనీలే భర్తా పిల్లలతో హ్యాపీగా వుంది! అప్పటి మూడ్‌ని బట్టి ఎట్లుందో ననుకున్నా, ఇన్నాళ్ళూ!' ఉద్యోగం మానేసి కుటుంబం కోసం వుండి పోయేది ఎంతమందీ? శశి చాలా మంచి పిల్ల!...

ఆ మాట అనుకుంటుంటే... తమ స్నేహ పరిమళాలు మరింత గాఢమైనట్లనిపించింది. మనసు ప్రశాంతమైంది. మంచం మీద వెల్లికిలా పడుకుంటే గది పైకప్పులో మెర్క్యురీ చంద్రుడు, చుక్కలూ మెరుస్తుండగా... బెజవాడ ఆకాశాన్ని తలుచుకుంటూ నిద్రలోకి జారింది.

రాత్రి పొద్దు పోయిందేమో! మెలకువ వచ్చేటప్పటికి ఏడు గంటలు దాటింది. 'అబ్బా! చాలాసేపు పడుకున్నా' ననుకుంటూ రూమ్‌లో నుండి హాలులోకి వచ్చింది. చల్లటి గాలి వీస్తోంది.

'అరే! ఆంటీ వచ్చారు. తలుపు వెయ్యండీ! అసలే చలి తనకు' పిల్లలను పురమాయించింది.

పొద్దుటిపూట ఏ ఇంట్లోనూ ఆడవాళ్ళకు తీరిక వుండదు. అట్లా శశికూడా హైరానా పడుతోంది. స్కూలు బస్సు ఏడున్నరకు గేటు దగ్గరకు వస్తుంది. పిల్లల్ని ఏడుంబావుకల్లా 'విల్లా' గేటు దగ్గరకు తీసుకుపోవాలి. ఆరింటికి లేపడానికే నానా తంటాళ్ళు పడుతుంది. లేచిన దగ్గర నుండి జెట్ వేగంతో గంటలో యంత్రాల్లా అన్నీ చెసెయ్యాలి. మొహం, టాయిలెట్, టిఫిన్, స్నానం - అన్నీనూ!'

టాయిలెట్ కోసం శశి వాళ్ళతో చేయించే ఎక్సర్‌సైజులు చూస్తే ఉమకు నవ్వు ఆగదు. 'ఏం చేద్దామే! స్కూల్లో వస్తే కష్టం కదా! ఆయాలైనా విసుక్కోరూ! అందుకే ఈ తిప్పలు మరి'... శశి జవాబు.

మొహం కడుక్కుని, కాఫీ తాగి... 'నీ హడావిడి కానీ, ఈలోపు కిందికి పోయివస్తా!' అని షాల్ కప్పుకుని బయలుదేరింది ఉమ. విల్లాలో ఉండే గార్డెన్ చూస్తుంటే ముచ్చటగా అనిపించింది. మనకూ వుండే గులాబీలే, బంగాళాబంతే, కానీ ఇక్కడెంత ముద్దలో! పూలనూ చెట్లనూ తడుముతూ పలకరిస్తూ... ఆ చల్లని గాలిని ఆస్వాదిస్తూ చుట్టూ తిరిగింది.

ఇక శశి హడావిడి కూడా అయిపోయి వుంటుందనుకుని లిఫ్ట్ ఎక్కి పైకి వచ్చింది. పిల్లలు వెళ్ళిపోయారు. నిశాంత్ టిఫిన్ తిని ఆఫీసుకు రెడీ అవుతున్నారు. పనమ్మాయి ఇంకా రాలేదు. ఉమ కోసమే చూస్తూ వుంది, శశికళ.

ఇద్దరూ కలిసి టిఫిన్ తిన్నారు. నిశాంత్ తయారయి బ్రీఫ్ తీసుకుని గదిలో నుండి రాగానే.. క్యారేజీ బ్యాగ్ అందించింది శశికళ.

'వస్తానండీ ఉమగారూ'! అని 'రాత్రి ఆగిపోయిన సంభాషణ ప్రారంభించుకోండి'... అంటూ, నవ్వి! శశికి 'బై' చెప్పి దిగిపోయాడు.

'నేను వచ్చి పది రోజులైనా పది గంటల్లా గడిచిపోయాయ్! ఇక ఫరవాలేదు, బెజవాడ ఎండలు కూడా తగ్గి వుండొచ్చు.. పిల్లలూ ఇబ్బంది పడతారు.. రేప టెల్లుండిలో బయలు దేరతాను' అంది.

'బెజవాడ అప్పుడే చల్లబడట మేమిటి? చాల్లేగానీ ఈ వారం కూడా వుండు. నీకు బాగా లేదని, బయటకు తీసికెళ్ళనే లేదు. కనీసం సిటీనన్నా చూపిస్తాను'... అంది.

ఇంతలో పనమ్మాయి రావడంతో... చెయ్యాల్సిన పనులు పురమాయించి ఇద్దరూ బాల్కనీలోకి చేరారు. కిందికి చూస్తూ... పొద్దుటే విల్లాలో సర్వెంట్స్ వూడుస్తూ తుడుస్తూ యూనిఫాంతో కనబడతారు... సాయంత్రం అయిందంటే ఎక్కడెక్కడి పిట్టలూ వచ్చి వాలినట్టు పిల్లలంతా చేరతారు. వాళ్ళ కేకలు, అరుపులు, అదో అద్భుతం. ఈ రెండు దృశ్యాలూ ఒకదానికొకటి సంబంధం లేనివి! తమాషా!

'అందుకే ఈ ఎస్టేటు నుండి మారాలంటే నాకు ఇష్టంగా అనిపించదు, గానీ చాలా రెంట్... మామూలు వాళ్ళం భరించలేం!'.

'పిల్లల కోసం వుండిపోతున్నాం... సిటీస్‌లో బాల్యం దొరకడం కష్టం... నేను ఎలాగూ బాల్యాన్ని అనుభవించింది లేదు. నా పిల్లలకు అది అందివ్వాలనే, ఉద్యోగం కూడా మానేశా!'.

శశి మాటలు చాలా వింతగా అనిపించాయి ఉమకు.

'అదేంటే? అప్పుడంతా అమ్మమ్మా అందరూ మీ దగ్గరే వుండేవాళ్ళుగా!'.

నిజమే గానీ! అప్పుడు అమ్మకు తీరికేది? కాలేజీతో సరిపోయేది, ఎండాకాలం వచ్చిందంటే పేపర్లు దిద్దను పోయేది. ఎప్పటికప్పుడు సెమినార్లనీ, థీసీస్‌లని బిజీగానే వుండేది. నన్నేమో ఆ 'సెంట్ జోసఫ్'లో వేశారు. అక్కడ పెద్ద గ్రౌండే వుండేది. కానీ 'నన్స్' ఎవరన్నా సంతోషంగా వుంటే ఓర్వలేరు తెలుసా! ఆటలే ఆడించేవాళ్ళు కాదు. అందుకే కాలేజీలో గేమ్స్ అంటే పడి చచ్చేదాన్ని'.

'నిజమేలే! మనం తీర్చుకోలేని కోరికలను మన పిల్లలన్నా చెయ్యాలని ఆశ వుండటం సహజం'... 'అది సరేగానీ! నీ పిల్లల కోసం నువ్వు తల్లిగా చెయ్యాలనుకుంది చేస్తున్నావు ... అలా చెయ్యగలిగే స్థితిలో వున్నావు ... ఉద్యోగం మానేసినా ఇబ్బంది లేకపోయింది. కానీ అప్పట్లో మీ అమ్మకు ఈ వెసులుబాటు లేకపోయిందేమో, తప్పని సరిగా ఉద్యోగం చెయ్యాల్సి వుందేమో! అలా చెయ్యబట్టే గదా కొంత వనరు మీకివ్వగలిగింది ... లేకపోతే నాలాగే అర్ధాంతరంగా చదువు ఆపాల్సివచ్చేది గదా!'

ఉమ చెప్తూ చెప్తూ ఆగిపోయింది. శశి కూడా మౌనంగానే వుంది.

ఓ క్షణం ఆగి 'పిల్లల్ని ప్రేమిస్తున్నామని నిరూపించు కోవడానికైనా, డబ్బుండాలే!... పిల్లలు అడిగింది ఇవ్వలేని తల్లిదండ్రులు ప్రేమను ఎట్లా రుజువు చేసుకోగలరూ!'

శశి ఏమీ జవాబు చెప్పలేదు.

తెలుగు పేపరు చదవడంలో పడ్డారు. పేపరు చదివి మడిచిపెట్టి 'లోపల కూర్చుందాం! రా! బయట ఎక్కువసేపు ఆ చల్లగాలి మంచిది కాద'ని హాలులోకి దారితీసింది.

టీ చేసుకుని వచ్చి టీ.వీ. ఆన్ చేసింది.

ఏవేవో కన్నడ ఛానల్స్ తిప్పింది. తెలుగు ఛానల్స్‌లో అన్నీ అత్తా

కోడళ్ళ సీరియల్స్ ... విసుగ్గా కట్టేసి, రిమోట్ అవతల పడేసి ... సోఫాలో వొరిగింది శశికళ.

'రోజూ ఎట్లా గడుపుతున్నావు!' అడిగింది ఉమ. శశినిచూస్తూ.

ఉమవైపు చూసి, 'ఈ పది రోజులూ నువ్వుంటే హాయిగా వుంది. పిల్లలూ, నిశాంత్ వెళ్ళిపోయాక నాకెంత బోరుగా వుంటుందో! నన్ను నేను బలవంతంగా ఎంగేజ్ చేసుకుంటున్నా! ... ఇంకో ఐదేళ్ళయినా ఇలా వుండాలని నా ఉద్దేశ్యం. పిల్లలకు తల్లి స్పర్శ, ఆత్మీయత పూర్తిగా అనుభవమైతేనే ... వాళ్ళు మానసికంగా సంతృప్తులవుతారని నా నమ్మకం. అలా కాగలితేనే వాళ్ళల్లో ఆత్మవిశ్వాసం, స్థిరత్వం ఏర్పడతాయి. లేదంటే ఆ అసంతృప్తివల్ల, అస్థిమితం, విసుగు, డిఫిడెన్స్ స్వభావంలోకి 'ఇంకా' యంటే మరీ కష్టం. అవి జీవితాంతం వదలవు. వ్యక్తిత్వాలు ధ్వంసమవుతాయి. అట్లా అవకూడదనే నా ప్రయత్నం'.

'అందుకే నిన్న అన్నాను చూశావా! అదో వైరుధ్యం ... కుటుంబం స్త్రీల భుజాల మీద వున్నంత కాలం ... స్వేచ్ఛగా, వ్యక్తిత్వమున్న మనిషిగా రూపొందటం కుదరదు. పిల్లలూ, సమాజం స్త్రీల ఆలోచనలకు పరిమితి విధిస్తాయి. కుటుంబ గౌరవం పేరుతో పెద్ద మోత బరువు ఆడవాళ్ల భుజాలమీద పడిపోయింది. సొంత కుటుంబాలు లేకపోతే, సొంత ఆస్తులూ వుండవుగా. అది ఎవరికి నచ్చుతుంది? అందుకే ఈ సిస్టమ్‌లో నువ్వెన్ని ఆదర్శాలూ, హక్కులూ అని అరువుగాక ఫలితం లేదు. పిల్లలో, మనమో నష్టపోవాలి. అందుకే నేనే కొంత నష్టాన్ని భరించి, వాళ్ళ భవిష్యత్తును నడిపిద్దామనుకున్నా!...

చాలా కాలమై దాదాపు కాలేజి నుండి విడిపోయాక వాళ్లిద్దరూ ఇన్ని రోజులు కలిసి వుండింది లేదు. శశి మాటలు వింటూ ఎంత ఎదిగిపోయిందీ అనుకుంది.

'శశీ! నిజంగా ఎంత బాగా ఆలోచిస్తున్నావే! అర్థం పర్థంలేని మిడి మిడి జ్ఞానంతో తెల్లారుతున్న వాళ్ళను చూస్తూ బాధపడుతున్నాం గానీ ... జ్ఞానం మనిషికి ఎంత అవసరమో! తనను తాను తగ్గించుకోవడానికి కూడా అదే సాధనమవుతుంది గదా! అట్లా అయితేనే మనిషి నిలకడగా ఆలోచించ గలడే!'

'సరేగానీ, ఈ పది రోజులుగా చూస్తున్నా! నిశాంత్ పట్ల ఎంత ప్రేమగా వుంటున్నావో! మరి పెళ్ళికి ముందూ, పెళ్ళిలోనూ నువ్వెందుకట్లా వున్నావు?, నువ్వే కాదు ఆంటీ, అమ్మమ్మా కూడా మొహాలు చిన్నబుచ్చుకునే వున్నారేమీ?' ... చాలా ఏళ్ళగా వున్న సందిగ్ధం తీర్చుకోవాలన్నట్టుగా అడిగింది.

'ఆంటీ అయితే అప్పటి నుండి మామూలుగా, లేనే లేదు. మరీ అమ్మమ్మ పోయాక ఆమె వంటరిదై పోయినట్లు ... ఎప్పుడన్నా ఇంటికెళ్ళినా ఆ గదిలోకీ, ఈ గదిలోకీ నిస్తేజమైన చూపులతో తిరుగుతూ వుంటోంది, ఆమెను చూస్తుంటే దిగులనిపిస్తుంది' శశీ.

ఇద్దరి మధ్యా నిశ్శబ్దం అలముకుంది.

ఉమ మాటలతో శశి కళ్ళు నిండుకున్నయ్యి.

చాలా సేపు ఎవరూ మాట్లాడ లేదు.

'సారీ శశీ! ... నువ్వింతగా బాధపడతావనుకోలేదు!' క్షమాపణ స్వరంతో అంది.

'ఛ ఛ, అదేం లేదే! నీక్కూడా చెప్పని రహస్యమేం కాదు' క్షణం ఆగి ... 'నాకు ఊహ తెలిసీ ... పాతికేళ్లదాకా నేను పెరిగిన ప్రపంచం, విలువలు, నా కళ్ళముందు ప్రశ్నార్థకంగా నిలబడితే, భరించలేక పోయాను. దానికంతా మా అమ్మే కారణమన్నట్టు ఆమె మీద కినుక వహించాను. ఆ పొరపాటు ఇప్పటికీ అట్లాగే ఉండిపోయింది. ఆ గండి పూడ్చలేనట్లయింది!' ... విచారం నిండిన స్వరంతో అంది.

'మా బాగోగులే ముఖ్యమని తపనపడ్డ ఆమెను ఒక వేపు నుండే చూసి అర్థం చేసుకుని పొరపాటు పడ్డాం!'. 'ఎంతైనా తల్లులంటే తేలిక కదా!' అని చిన్న నవ్వు నవ్వింది. అదే, కాదులే ఆమె ఎక్స్‌ప్రెషన్ కూడా ఎక్కువ దూరాన్ని పెంచింది మా మధ్య.

ఉమ ఆసక్తిగా వింటోంది.

'మా అమ్మా నాన్నా వాస్తవ ప్రపంచాన్ని మాకు అర్థం చేయించీ, చూపించీ వుంటే... ఇంత ఘర్షణ పడకపోయే వాళ్ళం. నిజానికి వాళ్ళే తాము చేసిన ప్రయోగపు ఫలితాలను భూమి మీద నిలబడి ఆలోచించి నట్లయితే బాగుండేది. నిరంతరం జాగరూకతతో మెలగాల్సివుండిన దాన్ని గురించి మర్చిపోయారు.

వయస్సూ, చదువు, విద్యార్థి సంఘాలు ... అప్పటి తరం కొంత ఆదర్శవంతంగా వుండేవారు. కులాంతరం చేసుకున్నారు. అమ్మా నాన్నే కాదు ఇట్లాంటి కొంత మంది తమ ఆదర్శాన్ని జీవితంలో కూడా పాటించారు. మిగిలిన ప్రపంచమూ హర్షించింది. అందుకు వాళ్ళనెప్పుడూ నేను గౌరవిస్తాను. కానీ ఆ తరువాతే వాళ్ళు అతి మెలకువతో చెయ్యాల్సివుండిన ముఖ్యమయిన పనిని అర్థం చేసుకోలేకపోయారు.

ఈ రోజు ఇక్కడ నిలబడి ఇంత స్థిమితంగా మాట్లాడుతున్నా కానీ, అప్పట్లో నేనెంత ఘర్షణ పడ్డానో! మానసికంగా కుంగిపోయాను. ఇది పైకి చెప్తే అర్థమయ్యేది కాదు. ఉమా!' శశికి కన్నీళ్ళు ఆగడం లేదు. గతం తాలూకా వేదనేదో పొంగుకొస్తున్నట్టుగా వుంది. మౌనంగా వుండిపోయింది.

అప్పటికే ఒంటి గంట కావస్తోంది. బాల్కనీలోకి చిరు ఎండపొడ పాకింది. శశిని వదలిపెట్టి ఉమ వంటింట్లోకి పోయి ... అన్నం కుక్కరుపెట్టి అంటించింది.

శశి కూడా బాత్‌రూమ్‌కి వెళ్ళి మొహం కడుక్కొని ... మంచినీళ్ళు తాగింది. పొద్దున్న చేసిన కూరలు 'ఓవెన్' లో వేడిచేసి, టేబుల్‌మీద పెట్టింది. భోజనాలు అయ్యాక ... అన్నీ సర్ది తలుపులు దగ్గరకువేసి, శశి వాళ్ళ బెడ్‌రూంలో నడుం వాల్చారు.

* * *

చిన్న కునుకుతీసి, లేచేటప్పటికి మూడున్నర అయింది. పిల్లలు వచ్చే వేళయిందనుకుంది శశి. అప్పటికి కొంత స్థిమిత పడింది.

'అట్లా ఆదర్శంగా చేసుకున్నారా! ఆ విలువను ఎత్తిపట్టవద్దే! కానీ ఆ మాటే మర్చిపోయారనుకో! ఏం లేదే ఉమా! ఈలోపు మేం పుట్టాం! ఇక పిల్లలూ? భవిష్యత్తూ, ఈ తపనలో మునిగి పోయారు. అసలు సంగతి తలపుల్లోనే లేదు. మాకు నేర్పాల్సిన ... తెలియ చెప్పాల్సిన సంగతులు వాళ్ళకు గమనం లోకే రాలేదు. అది మాకే కాదు, వాళ్ళకీ ఎంత నష్టం' ... టీ తెచ్చి ఉమకూ ఇచ్చి, ఉదయం చెప్పడం ఆపిన చోట తిరిగి ప్రారంభించింది.

'అమ్మా, నాన్న చదువుకునేటప్పుడే పరిచయం కావడంతో స్వేచ్ఛ, చనువూ వాళ్ళ మధ్య వుండేవి. పెళ్ళి తరువాత కూడా అవి వాళ్ళను నడిపించాయి.

సహజంగానే అమ్మలవైపు బంధువులు దగ్గరయినట్టు మాకు అమ్మమ్మ, తాతయ్యలే మా కుటుంబం అనుకున్నాం. మా నాన్న కూడా ఆ కుటుంబంలో వ్యక్తిగా కలిసిపోయేదు. మా నాన్నను కొడుక్కంటే

ఎక్కువగా చూసేది మా తాతయ్య. మాకే బేధం తెలిసేదే కాదు.

మా ఇంట్లో ఎప్పుడూ కుల ప్రస్తావన వచ్చేది కాదు.

మొదటిసారిగా యూనివర్శిటిలో దాని గురించి ఆలోచించాల్సిన అగత్యం ఏర్పడిందిగానీ - నేను పెద్దగా పట్టించుకోలేదు. అంతే' ఉద్యోగంలో పడిపోయాను. నా పనేదో నేను చేసుకుపోతున్నాను. ఈలోపు పెళ్ళి మాటలు సాగుతున్నాయి. అప్పుడే మొదటిసారిగా కులమేమిటో? దాని ప్రభావమేమిటో తెలిసి వచ్చింది! 'అమ్మ కులం' వాళ్ళు నన్ను 'నాన్న కులం' అన్నారు. నాన్నకులం వాళ్ళు ... 'అబ్బో! తల్లి అగ్రకులం కదా! పిల్లకూ అదే పట్టుబడుతుంది గదా! ఇంక అత్తమామల్ని ఏం గౌరవిస్తుందీ?' అన్న అపనమ్మకం.

ఇది ఎంత అవమానంగా వుండేదంటే చివరికి నేను పెళ్ళి చేసుకోను అనే కాడికి వచ్చాను. కాలి కింద నేల కదలి పోయినట్టు అల్లల్లాడిపోయాను.

అసలు నాకు నేను, 'నాన్న కులం' అనుకుని సర్దుకు పోగలనా? అని కూడా ఘర్షణ పడ్డాను. పుట్టింది మొదలు అమ్మ కులంతో ఐడెంటిఫై అవటం వల్ల ఆ సంస్కృతిలో పెరగడం వల్ల - నాన్న కులంలో వాడిని చేసుకుని సర్దుకు పోగలనా? అనిపించేది. దుఃఖం ముంచుకొచ్చేది. ఎంత బాధ ననుభవించానో ఆ దేవుడికే తెలియాలి. ఇది ఎవరు ఎట్లా తీరుస్తారు ఉమా! ఒకరికి చెప్పుకునేదేనా? అర్థమయ్యేదేనా! ఎంత హేళనగా వుంటుందీ?

'ఏమో? ఆ రోజులు ఎట్లా గడిపామో ఉమా!' ... జరిగిపోయిన కాలం దృశ్యమాన మవుతుండగా! ... 'ఎన్నడూ లేనిది మా ఇల్లంతా నిశ్శబ్దం అలుముకుంది ఉమా!' అంది.

తిరిగి తనే! నా అదృష్టం కొద్దీ నిశాంత్ తల్లిదండ్రులు కూడా కులాంతరం అవడంతో ఓ విధంగా ఆ కల్లోలం అణిగి పోయింది.

కానీ ఆ కాలంలో మా అమ్మ మీద నాకు ఎంత కోపంగానో, కసిగానో వుండేది. అప్పుడు అమ్మతో అసలు మాట్లాడక పోయేదాన్ని ... పాపం నా చర్యలు ఆమెను ఎంతో బాధించేవి! నేను మాట్లాడక పోవడం మరింత వేధించేది. అప్పటి నుండే ఆమెలో ఏదో మార్పు, నిర్లిప్తత ... దేనిపట్లా ఆసక్తి లేకపోవడం! చివరికి మౌనంలోకి దారి తీసింది. ఇప్పటికీ తేరుకోనే లేదామె!. అన్నిటికంటే తల్లుల్ని కుంగదీసేది బిడ్డల చర్యలే, ఉమా!.

శశి మాటలు ఆశ్చర్యంగా వింటోంది. అనుకోకుండా లలితమ్మ తలపుల్లోకి వచ్చింది.

'నిజమే శశీ! ఇప్పుడనిపిస్తోంది! ... మీ అమ్మమ్మ వారం పది రోజుల్లో చనిపోద్దేమో!, చూద్దామని వెళ్ళా! ... అప్పటికి మీరింకా ఢిల్లీలోనే వున్నారనుకుంటా! ఎలాంటి స్థితి అంటే, ఆంటీని చూస్తే ఏదో తెలియని బాధ వెంటాడుతున్నట్టుగా వుండేది. ఇంతలా అతలాకుతలమై పోయారని నాకేం తెలుసూ?

లలితమ్మా, కమలమ్మా కళ్ళ ముందు నిలిచినట్లయింది.

ఉమ వెళ్ళేటప్పటికి లలితమ్మ మన స్పృహలో లేదు. కమలమ్మే వేళ ప్రకారం ట్యూబులద్వారా లిక్విడ్ పోస్తోంది. ఇల్లు వంటమ్మాయికి అప్పచెప్పి ... తల్లి మంచం దగ్గరే ఇరవై నాలుగు గంటలూ గడుపుతోంది. ఎవరన్నా వచ్చినా ఆ గదిలోకే వెళ్ళి మాట్లాడి వస్తున్నారు.

అట్లా ఉమ కూడా అక్కడే కూర్చొని మాట్లాడుతుండగా,! లలితమ్మ మూలుగు ప్రారంభించింది. 'ఏమై వుంటుంది? నొప్పిగాని ఎక్కువగా వుందేమో' అంది.

ఉమ మాటలు వినిపించుకున్నట్టే లేదు ... 'నువ్వు అవతలికి పోతావా! ఉంటావా! నీ ఇష్టం' అంది.

'పరవాలేదు ఆంటీ! ఏదైనా సాయం పట్టాలేమో! వుంటాను'

'నీ సహాయం అంత అవసరం రాదులే ... దేవుడు ఇంత శరీరాన్ని ఎందుకిచ్చాడూ!' అంటూనే తల్లి మీద కప్పిన దుప్పటి తీసి ... టాయ్‌లెట్ పాడ్ విప్పి చూసింది.

'సరే! సరే! అందుకే మూలిగింది' పైకే అని, తల్లిని చంకల కింద రెండు చేతులూ వేసి మంచం మీద నుండి దించింది.

ఉమ చూస్తూ వుండలేక ... 'వెంకటమ్మను కేకెయ్యనా ఆంటీ!' అంది.

'వద్దు వద్దు నా కింత బలం మా అమ్మ ఇన్నాళ్ళూ కూడ బెట్టిందే, అమె పెంచిన శరీరం ఆమెకీమాత్రం ఉపయోగపడనీ ఉమా'!.

ఉమ చూస్తుండగానే తల్లిని క్లీన్‌చేసి తెచ్చి తిరిగి మంచం మీద పడుకోబెట్టింది. అదంతా ఓ గంటపైనే పట్టింది. అప్పటికి చీకటి పడిపోయింది కూడా. అయినా ఉమకు కదలాలనిపించ లేదు.

పనమ్మాయి సహాయం కూడా తీసుకోకుండా ఆంటీ ఎందుకిలా చేస్తోంది. తనను తానెందుకు ఇంతలా హింసించు కుంటోందీ? అదంతా చూస్తుంటే మనసు కెలికినట్టయింది. కమలమ్మ తల్లికి సేవ చేస్తుందన్న తృప్తి కన్నా ఆ చెయ్యడంలో ఏదో పోగొట్టుకోబోతున్న వస్తువును ... అతి జాగ్రత్తగా దాచి వుంచాలన్న తపనేదో కనిపించింది.

'ఏమిటీ ఆంటీ ఆవేదన?' అర్థం కాలేదు. చాలాసేపే అలా కూర్చుండి పోయింది.

అటూ, ఇటూ తిరుగుతూ అటుగా వచ్చిన అంకుల్ కూడా!, 'చెప్తే వినదమ్మ! టైం ప్రకారం ఆవిడకు ట్యాబ్ ద్వారా అవన్నీ ఎక్కిస్తుంది! ఎందుకే కమలా! ఆవిడనింకా హింసిస్తావూ అంటే వినిపించుకోదు! ఆవిడకు కాలం పెరిగే కొద్దీ ... బాధే గానీ, తగ్గేది కాదుగా అమ్మా! ... ఏమిటో మీ ఆంటీ?' ... ఆందోళనగానూ, బాధగానూ వుందాయన స్వరం.

ఉమకు ఆ వాతావరణంలో ఏవో కానరాని ప్రశ్నలున్నాయని - ఉప్పొంగే లావాను అణచిపెట్టే ప్రక్రియ ఏదో సాగుతున్నట్టుగా అనిపించింది.

కమలమ్మతో 'వెళ్ళొస్తానాంటీ' అని చెప్పి బయలుదేరింది. వాకిటి దాకా వచ్చిన ఆమెతో ... 'ఎందుకాంటీ! మీరంత శ్రమ పడుతున్నారూ! ఎవరిదైనా సహాయం కూడా తీసుకోకుండా! బాధేస్తోంది చూస్తుంటే!' ...

కమలమ్మ కూడా ఏమీ అనలేదు.

'సరేలేరా! నాదనే వస్తువు అదొక్కటేగా! దాన్ని మాత్రం ఎన్నాళ్ళు కాపాడతానూ!' కమలమ్మ స్వరం లయ తప్పినట్టనిపించింది.

నెవ్వెరపోవడం ఉమ వంతైంది. మౌనంగా వచ్చేసింది.

ఇన్నేళ్ళుగా ఈ ఇల్లు నా కర్థమే కాలేదు. కానీ లోలోపలి వ్యథలేవో తొలుస్తున్నయ్యి? ఏమిటవీ? ఇంటికి వచ్చాక కూడా కమలమ్మ మాటలే వెన్నాడాయి.

'అవును ... ఇప్పుడనిపిస్తోంది ... మీ అమ్మమ్మ చనిపోవడంతో ఆంటీకి తన కెవ్వరూ లేరన్న భావం కలిగింది కావచ్చు. అప్పట్లో అలానే వుంది'. కమలమ్మను తలచుకుంటే ఉమకూ బాధగా అనిపిస్తోంది.

'నిజమేగానీ శశీ! ఇందులో మీ అమ్మ తప్పు మాత్రం ఏమిటీ?'

'అవును నాన్న కూడా చాలా సార్లు ఆమాటే అనేవాడు...' ఇందులో

కథ

దరారే

- మహమూద్

ఉదయం ఏడు గంటలు.

హైదరాబాదు నుండి వచ్చిన బస్సు నన్ను గాంధీరోడ్డులో దింపి వెళ్ళిపోయింది.

చలికాలమైనా హైదరాబాదులోలా చల్లగాలేదు వాతావరణం. ఆహ్లాదంగానే అనిపిస్తూ ఉంది. చెంపలకు తాకుతూ పిల్లతెమ్మెర కొద్దిగా వెన్నులో వణుకు పుట్టించి వెళ్ళిపోయింది.

ఎందుకో తెలియదు చేతిలో ఉన్న బ్రీఫ్కేస్ బరువు అనిపించింది. మొదటి అడుగు బరువు బరువుగా పడింది. తెలిసిన మనిషి కొత్త ఆహార్యంలో విభిన్నంగా కనబడినట్టు తెలిసిన పరిసరాల్లోని కొత్తదనమేదో కొట్టిచ్చినట్టు కనబడుతోంది.

ప్రయాణంలో నిదురపోని కనురెప్పలు, బడలిక బంధంగా మారిన కాళ్ళు, ఒంటి భారాన్ని మోస్తూ...!

ఆటో ఎక్కకుండా వెంకటేశ్వరా హాల్ దగ్గర దిగి, దౌలా టి తాగి నెమ్మదిగా నడుచుకుంటూ వెళదాం అనుకున్నాను. నడుస్తున్నాను. కానీ అక్కడ దౌలా టీ బంక్ లేదు. ఆ స్థానంలో ఏదో షాపింగ్ కాంప్లెక్స్ వచ్చేసింది. దాని పక్కనే ఓ పెద్ద హోర్డింగు "ముసల్మానుల ఆశాజ్యోతి, పేదల పాలిటి పెన్నిధి చంద్రశేఖర్ రెడ్డి జిందాబాద్' అని ఉంది.

గుండె చిపుక్కుమంది.

మా అబ్బాజాన్‌కు ఇష్టమైన టి బంకది. ప్రతి రోజు ఉదయం నేనూ, అబ్బా నమాజు ముగించుకొని అక్కడికి టీ తాగడానికి వచ్చేవాళ్ళం. అక్కడ నాన్నతో చాలా మంది కలిసి చాలా విషయాలు చర్చించేవారు. అవి నాకర్థమైనా, కాకకపోయినా ఆ వాతావరణమూ, వాళ్ళ వాదులాటలూ భలే గమ్మత్తుగా వుండేవి. ఇన్నాళ్ళ తర్వాత వచ్చిన నాకు జ్ఞాపకం తాలుకు తడి స్పర్శ తగిలింది. సంతోషం కలిగింది. కానీ దౌలా టీ బంకు లేకపోవడం ఆ బాధనిపించింది. దౌలా వున్నాడో, లేడో? ఉంటే బాగా ముసలాడైపోయివుండొచ్చు. మారిన ఆ పరిసరాలలో అలా గాంధీరోడ్డు మీద నుంచి నడుస్తుంటే ఏదోలా ఉంది.

"అబ్బ! ఎంత మార్పు" మారిన ఆ పరిసరాలను చూసి నా మనసు సంభ్రమంగా ఉంది.

మనకు తెలియకుండానే మార్పు తన పని తాను చేసుకొనిపోతుంది. మన ప్రమేయం ఏమి ఉండదు. మనం పాత్రధారులం మాత్రమే! కానీ మా ఊరి మార్పులో నేను పాత్రధారిని కాలేదు. ఈ మార్పు తాలూకు స్పర్శ నాకు తెలియదు. నా అనుభవంలో లేదు. నాకు సంబంధం లేని మార్పు కదా మనస్సంగీకరించడం లేదు.

రఫీక్ మామాను ఈ రోజు జోహార్ (మధ్యాహ్నం నమాజు) సమయానికి దఫన్ చేసేస్తారు. ఈ రాత్రికే రిజర్వేషన్ తిరిగెళ్ళిపోతాను. ఇక ఈ ఊరు రాను.

ఇన్నేళ్ళ తర్వాత రావడానికి ఒకే ఒక్క కారణం రఫిక్ మామా చావు!

* * *

అమ్మ తప్పేముందమ్మా! అందరం కలిసే సాగించిన ఈ ప్రయాణంలో అందరికీ ఎంతో కొంత పాత్ర వుంది. నిజానికి నాదే ఎక్కువ తప్పు ... జీవితం ప్రశాంతంగా గడిచి పోతోంది గదాని, దేని గురించీ ఆలోచించలేదు. ఇట్లాంటి స్థితి ఒకటి ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆలోచన వుంటే ముందుగానే జాగ్రత్త పడేవాడిని ... నా తరుపు బంధువులతో మీ సంబంధాలు పటిష్టం చేసేవాడిని. బంధుత్వాలూ, రాకపోకలూ సాగితే ఇప్పుడు మీరింతగా బాధ పడేవాళ్ళు కాదు! నేనంత దూరం ఆలోచించలేక పోయాను' అనేవారు.

'తన బాధ్యత లేనితనం వల్ల పిల్లలు సంఘర్షణ పడుతున్నారన్న పశ్చాత్తాపం ఆయన్నూ కుంగదీసింది. అప్పటినుండీ ఆయన మరీ వెనక్కి పోయారు'.

'అట్లా ఆలోచిస్తున్నావుగానీ శశీ! అంకుల్ వైపు ఎవరికీ పెద్దగా చదువుల్లేవు. సామాన్యమైన కుటుంబాలు ... మీరేమో అంత చదువుకుని, టౌనులో కాస్త పై మధ్య తరగతిలో వున్నారు. నిజానికి సంబంధాలు లేదనుకోవడమే గానీ ... వున్నా మీరెంత వరకు వాళ్ళతో కలిసేవాళ్ళూ?'

'ఒక్కోసారి బంధుత్వాలు, సంబంధాలూ వాళ్ళ వాళ్ళ కుటుంబాల సంస్కృతి, జీవన విధానాన్ని బట్టి కూడా వుంటాయే! .. ఇప్పుడు మా నాన్న వాళ్ళతో మా కుటుంబానికి ఏ మాత్రం కలిసిందీ? మరి ఆయన తరఫువాళ్ళు అంతా చదువుకున్నవాళ్ళూ! ఉద్యోగస్తులూనూ! సహజంగానే పిల్లలకు వాళ్ళతో సంభాషణ సాగడానికి వెసులు బాటుంటోంది!'

'నిజమే ననుకో! కానీ రాను రానూ జీవితాలు ఈ కులాలతో మరింత సంక్లిష్టంగా మారటం లేదూ?' .. అలా అనిపిస్తోంది.

'ఓ! ఈ తరం పిల్లల్ని గురించి నువ్వేం చింతపడకు ... అవన్నీ పాత రోజులు. వీళ్ళిప్పటికే ముదిరిపోయారు. కులం, డబ్బూ, ఉద్యోగం అన్నీ చూసుకునే చేసుకుంటున్నారు. స్నేహాలు వేరు, పెళ్ళిళ్ళు వేరు' ... 'ఏదైనా శశీ! మనుషుల్లో కంటే కాలంతో వచ్చే మార్పులే సమాజాన్ని వేగవంతం చేస్తాయే!'

'ఏమో! ఇప్పుడు చూడూ! పెళ్ళి చూపులూ, తతంగాలకూ తీరికేదీ? ఇదో ప్రపంచం! అందుకే పని చేస్తున్న చోట కాస్త నచ్చితే చేసేసుకుంటున్నారు ... కులాలూ, గిలాలూ ఏం పట్టించుకోవడం లేదు!' కనీసం పైకి అలా అనిపిస్తోంది.

'నిజమేనే గానీ – చూడాలి! నువ్వు చెప్పే ఈ పెళ్ళిళ్ళకు ఏ ప్రాతిపదికా లేదు ... ఎంత వేగంగా చేసుకుంటున్నారో! అంత వేగంగా విడిపోనూ పోతున్నారు. చివరికి ఎలా పరిణమిస్తాయో?'

'ఆఁ మంచి పరిణామమే వస్తుంది. కుటుంబ వ్యవస్థను బోలుచేసి పారేస్తే చాలదూ!' ... 'కులాలను పట్టుకుని వేళ్ళాడటమన్నా తగ్గిపోతుంది'.

మామాను పెద్ద మసీదులో దఫన్ చేశాం!

అబ్బా సమాధి కోసం వెతికాను కానీ గుర్తు పట్టలేకపోయాను. రెండు దశాబ్దాలపై మాటేగా అలాగే ఉండే అవకాశం లేదు. ఖబరస్తాన్ బాగా పాతబడిపోయినా పచ్చదనంతో నిండి ఉంది. కొంత పెద్దగా కూడా అయింది. అబ్బాను ఎక్కడ పాతిపెట్టారో లీలగా గుర్తుంది. అక్కడంతా వేరే సమాధులేవో వచ్చేసినట్టున్నాయి.

రఫీక్ మామా వాళ్ళింట్లోనే ఒక మూల కూర్చున్నాను. ఇల్లు శిథిలావస్థలో ఉంది. ఆ వీధిలో బహుశా మారనిదేమన్నా ఉంటే అది రఫీక్ మామా ఇల్లే! చుట్టు పక్కాల పెద్ద పెద్ద ఇండ్లు వచ్చేశాయి. ఇరుకు సందులైనా ఇప్పుడవి ఖరీదైన కట్టడాలతో నిండిపోయాయి.

నన్నక్కడ ఎవరూ పలుకరించడం లేదు. రఫీక్ మామా స్నేహితులూ, బంధువులు ఎవరెవరో తిరుగుతున్నారు. ఒక్కరు కూడా నన్ను గుర్తుపట్టిన పాపానా పోలేదు. నా పరిస్థితీ అదే! ఇక్కడ ఉండి ఏం లాభం? ఊరన్నా చూసొద్దాం అనుకుంటూ బయలుదేరాను. నా చిన్ననాటి దోస్తులు కనబడకపోరూ, పలకరించకపోరూ అన్న ఆశ నాలో కొట్టుమిట్టాడుతూనే ఉంది. కానీ మళ్ళీ ఏదో జంకు. పలకరిస్తే ఏం మాట్లాడాలి? ఏమున్నాయని మాట్లాడాలి? రాత్రి బస్సెక్కేంత వరకూ ఏం చేయాలో తోచలేదు. ఊరన్నా చూసొద్దాం అనుకుంటూ బయలుదేరాను.

* * *

నా ఊరు నాకి కొత్తగా ఉంది.

మా ఊరు పెద్ద ఊరేం గాదు.

చిన్నపుడు మా బంధువులొచ్చి మా ఊరిని చూసి 'మీ ఊర్లు పెద్దదేం కాదే!' అనేవారు. నాకు చాలా కోపం వచ్చేది.

'పెద్దదో చిన్నదో మాది కూడా ఊరే! ఇక్కడున్నదీ మనుషులే' అనేవాణ్ణి.

అప్పుడు జీవితంలో ఏ గొడవలూ లేవు.

చాలా సాదీసీదా జీవితం. అమాయకత్వమే ఆలంబనగా చిన్న చిన్న సంతోషాలు పంచే స్నేహితులూ, హితులూ, సన్నిహితుల మధ్య ఒక ప్రవాహంలా సాగిపోయింది బాల్యం.

ఏ ఆంక్షలెరుగని పక్షుల్లాగా ఎక్కడికంటే అక్కడికి హాయిగా ఎగురుకుంటూ పోవడమే, కేరింతలు కొడుతూ పోవడమే, దారుల వెంట నవ్వులను రాలుస్తూపోవడమే. ఎవరూ అడ్డుపడేవారు కాదు. ఉత్త కాళ్ళతో ఊరినంతా అలా చుట్టేసేవాళ్ళం.

పుట్టపర్తి సెంటర్‌లో నిలబడ్డాం అంటే ఊరి నలుదిక్కులను నాలుగు ముక్కలుగా కోసుకోవచ్చు. ఉత్తరం కొర్రపాడు, దక్షిణం పొట్లదుర్తి, తూర్పు లింగాపురం, పశ్చిమం బొల్లవరం మా ఊరి నలుదిక్కులకు శివార్లు.

పసిడిని పదునెక్కించడంలోనూ, పదునెక్కి పసిడిని విభిన్నమైన నగలుగా చేయడంలో మా ఊరి షరాఫ్ బజార్ భలే ఫేమస్. మా బంధువులే దూరదూరాల్నించి బంగారు నగల కోసం మా ఊరొచ్చేవారు. మా అబ్బా దోస్తు దస్తగిరి సాహెబ్‌గారి దగ్గరకు పిలుచుకొని పోయి "అబ్బ! ఏం నగలురా బాబు ఇవన్నీ తొడగడానికే?' అని చాలా ఆశ్చర్యపోయేవాణ్ణి.

అందుకే మా ఊరు రెండో ముంబాయి అని పేరుగాంచింది. రేషం ని శిల్కు చీరలా నేసి పడేసే చాలా కుటుంబాల పిల్లలు నా నేస్తులు. పెళ్ళిళ్ళలకు మా ఊరు కంచికో సమానం.

పుట్టపర్తి నారాయణ చార్యులూ, గడియారం వెంకటశేషశాస్త్రి తిరుగాడిన గడ్డ కదా తెలుగు ని పూలమాలగా మెడలో అలంకరించుకుంది మా ఊరు. వందల ఏళ్ళ రామేశ్వరం తిరునాళ్ళ, అన్నే వసంతాలు నిండిన చౌసేన్ వలీ సాహెబ్ దర్గా. మత సామరస్యాన్ని నిలబెట్టాయి. మేం రామేశ్వరం తిరునాళ్ళ భజనల్లోనూ, దర్గా ఉరుసు ఉత్సవాల ఖవ్వాలీల్లోనూ మునిగితేలినాం. దసరా నవరాత్రులప్పుడు మా ఊరు జిగేల్, జిగేల్ మనేది. తొట్టి రోజు అమ్మవారి ఊరేగింపు చూట్టానికి రెండు కళ్ళు చాలవు. పండుగలప్పుడు మా మిత్రగణమంతా మిణుగుర్లమై ఎగిరేవాళ్ళం. అలుపుసొలుపెరుగక పండుగల్లోని ఆనందాన్ని ఆస్వాదించేవాళ్ళం.

అప్పుడు మాకు రెండు పెద్ద స్కూళ్ళు ఒకటి కశెట్టి రెండు అనిబిసెంట్. కొంతలో కొంత బాగున్నవాళ్ళు పోయేస్కూల్ కశెట్టి. కశెట్టి చిన్న వెంకటసుబ్బయ్య కట్టించిన స్కూలు.

మా నాయన అనుంగు మిత్రుడు, చిన్న వెంకటసుబ్బయ్య కుమారుడు అయిన కశెట్టి ఆనందరావు కరెస్పాండెంటుగా ఉన్న ఆ స్కూలులో నా దాఖలా చాలా సునాయసంగా జరిగిపోయింది.

కోటా ప్రైమరీ స్కూలులో నా పరిణితి గురించి ఏ మాత్రం వాకబు చేయకుండా జరిగింది జాయినంగు. మా ఎలిమింటేరి స్కూలు హెడ్మాస్టారు రామయ్యగారు నాకు మంచి మార్కులే వేశారు. ఆనందరావుగారు స్వయానా కశెట్టి హెడ్మాస్టారు రామయ్యగారు నాకు మంచి మార్కులే వేశారు. ఆనందరావుగారు స్వయానా కశెట్టి హెడ్మాస్టారు రంగయ్యగారిని పిలిపించి "వీడు మా వోడి కొడుకు. పేరు రవూఫ్' జాగ్రత్తగా చూసుకోండి అని చెబితే ఉబ్బితబ్బిబ్బయ్యాను. మా అబ్బాకు అన్ని కులాల మతాల వారు బాగా తెలుసు. వీళ్ళూ-వాళ్ళు అని కాకుండా మా ఇంటికి అందరూ వచ్చిపోయేవారు. నాకూ అబ్బా లాగా అందరూ దోస్తులే! ఆరవ తరగతిలో నా మొదటి నేస్తం మల్లిగాడు. ఎంత అన్యోన్యంగా ఉండేవాళ్ళమో? ఎంత హాయిగా ఉండేవో ఆ రోజులు.

మిగతా ప్రపంచం లాగే మా ఊళ్ళో మా స్కూళ్ళు కూడా కనుమరుగౌపోయి ఉంటాయి. దానికి సూచనగా, చాలా కార్పొరేట్ స్కూల్స్ వచ్చేసినట్టు ఊరంతా వాళ్ళ అడ్వర్టైజ్‌మెంట్లు కనబడుతున్నాయి.

గాంధీరోడ్డు, మైదుకూరు రోడ్డు రెండు విశాలమైపోయినాయి. డివైడర్లూ, బ్యూటీఫికేషన్ లైట్లూ ఆధునాతనమైన బిల్డింగులు వచ్చేశాయా. మైదుకూరు రోడ్డులోని అజంతాలాడ్జీ రూపురేఖలు మారిపోయి ఇంటర్నేషనల్ ప్లాజా అయిపోయింది. మైదుకూరు రోడ్డు ఈ మూల నుంచి ఆ మూలకు కనబడే మా స్కూలు ఇప్పుడు ఓ మూలకు పడిపోయింది. అప్పుడు మైదుకూరు రోడ్డొక్కటే మాకు మెయిన్ రోడ్డు. ఇప్పుడు కె.కె స్ట్రీటూ, గాంధీరోడ్డు కూడా విశాలమైపోయాయి.

ఈ పరిసరాల్లోనే ప్రసాద్‌గాని ఇల్లు ఉండాలి! గుర్తుపట్టలేక పోతున్నాను. కనబడితే నన్ను గుర్తుపడతాడా? రెండు దశాబ్దాల సమయం చిన్నదేం కాదు. జ్ఞాపకాలని సునాయాసంగా మరుగుపరచగలిగే శక్తి కాలానిది. పరిచయస్తులేవరన్నా కనబడతారేమోనని ఆబగా చూస్తున్నాను.

అన్నీ అపరిచిత మొఖాలే! అనక నేనే ఊరికి అపరిచితుణ్ణో-! అర్థం కాని ఓ సంధిగ్ధ స్థితి. నాకు తెలిసిన, నేనుఎగిరిగిన వాళ్ళేవరూ కనబడడం లేదు. ఎంతమంది.. ఎంత మంది నాకు తెలుసు. లెక్క తేలడం లేదు.మల్లీ, రాజు, సలీం, శేఖర్, పెద్ద రమణ, యాసీన్,

యాఖూబ్ పేర్లు గుర్తుకు వస్తున్నాయి... కొందరి ముఖాలు గుర్తుకువస్తే, కొందరి పేర్లు గుర్తుకువచ్చి ముఖాలు అస్సలు గుర్తుకురావడం లేదు.

బాగా మారిపోయిన వీథుల్లో కలియ తిరుగుతుంటే కొత్త దేశానికి వచ్చిన అపరిచిత యాత్రికుడిలా ఉంది నాకు.

చౌసేన్వలి సాహెబ్ దర్గా దగ్గరికి వచ్చి ఆగాను. ఆ కట్టడాన్ని చూసి అదిరిపడ్డాను. ముందంతా పెద్దపెద్ద మినార్లు వచ్చేసినాయి. అప్పుడు నేరుగా దర్గా బయటికి కనబడేది. ఇప్పుడు దర్గా బాగా లోపలికి వెళ్ళిపోయి బయట షాపింగ్ కాంప్లెక్స్ వచ్చేసింది. వ్యాపారం సూఫిజాన్ని కూడా వదల్లేదన్నమాట!

ఊరికి వచ్చానన్న ఉద్వేగం మారిన పరిసరాలను చూసి చప్పబడిపోయింది. మనస్సీ మార్పును అంగీకరించడం లేదు. నాకు నా పాత ఊరి పట్ల కదా మోహం. ఈ మారిన కొత్త ఊరితో, కొత్త సంబంధాలతో ఏమి పని?

అయినా ఈ ఒక్కరోజులో ఈఊరితో ఏ లెక్కలు తేల్చుకోగలను.

ఈ ఊరికి ఏమన్నా రుణపడి ఉన్నానా? ఈ ఊరే నాకేమన్న రుణపడి ఉందా? ఒకవేళ అలాంటిదేమన్నా ఉన్నా ఇప్పుడు చేయగలిగిందేమీ లేదు. అదృష్టమేమిటంటే నన్నిక్కడ ఎవరూ గుర్తుపట్టడం లేదు. ఆ పాత గాయాలను, జ్ఞాపకాలను మననం చేసుకోవడం వల్ల నాకొచ్చేది, పోయేది ఏమి లేదు. ఒక ఊరి నుంచి ఇంకో ఊరికి అవసరమ్మీద వచ్చిపోయే యాంత్రిక వ్యాపారస్తుడిలా ఉంది నాకు. చిన్నపుడు సెలవులప్పుడు కూడా ఊరు విడిచి పట్టుమని పది రోజులు కూడా వెళ్ళేవాణ్ణి కాదు. ఒకవేళ పోయినా ఒకటి, రెండు రోజుల కంటేఎక్కువ ఉండేవాణ్ణి కాదు. ఊరి జ్ఞాపకాలు ఇంకోచోట ఉండనిచ్చేవి కాదు. ఇంటికెళ్ళిపోదాం అని అమ్మను పోరుపెట్టేవాణ్ణి. స్నేహితులంతలా గుర్తుకొచ్చేవాళ్ళు. స్కూలు గుర్తుకొచ్చేది. పరిసరాలు గుర్తుకొచ్చేవి. అసలు నిదుర కూడా పట్టేది కాదు. అలా ఉండేది నాకూ ప్రొద్దుటూరు మధ్య బంధం. కానీ ఇప్పుడట్టా అనిపించడం లేదు. ప్రత్యేకమైన భావనలేవి నన్ను ఉక్కిరిబిక్కిరి చేయడం లేదు.

ఎలా ఉంటుందో నా ఊరు? ఎలా ఉన్నారో నా మనుషులు? ఇంతకు ముందులా అన్నీ ఉన్నాయా? ఆ అమాయకత్వం ఇంకా అలాగే ఉంటుందా? లాంటీ నోస్టాల్జిక్ ప్రశ్నలేవి నాలో ఉదయించలేదు. నేను నోస్టాల్జిక్ కావడానికి అవసరమైన ఓ గొప్ప అనుభూతిని మిగిల్చిన అనుభవం లేదు నాకు.

ఉన్నవల్లా భయంకరమైన జ్ఞాపకాలు. అవి నన్ను మళ్ళీ చిన్నప్పటిలా భయపెట్టకపోతే చాలు. మళ్ళీ పీడకలలను నిదురలేని రాత్రులనూ మోసుకొచ్చే మానసిక దౌర్బల్యంలో పడవేయక పోతే చాలు.

అసలు ఊరికి రాకపోదును. రావలని ఎప్పుడు అనిపించినా ఒక భయానక దృశ్యం కళ్ళముందు కదలాడేది. ఒక భయం నరనరం తాచుపాములా పాకేది. ఒక జలదరింపు. మనసునీ మస్తిష్కాన్ని ఊరిపడేసే జలదరింపు. ఊపిరిసలపని పనిలో పడ్డాక గానీ ఆ భయం నన్ను వీడిపోలేదు. దాన్ని ఒదిలించుకోడానికి నేను పడ్డ యాతన అంతా ఇంతా కాదు. నా బాల్యం కాకుండా చేసిందది.

నా ఆలోచనలు ఇబ్బందికరమైన కంక్లూజన్స్ వైపు వెళుతున్నాయి. నా స్థానంలో అబ్బా ఉండి ఉంటే ఎలా ఆలోచించేవాడూ?

నిస్సందేహంగా నాలా కాదు. 'మా అబ్బా ఎలాంటి గడ్డ పరిస్థితులలోనైనా నెగ్గుకురాగల దిట్ట! ముందు మీ అబ్బా పుట్టి తర్వాత మంచి పుట్టి ఉంటుంది. ఇతరులకు మంచి చేయడం తప్ప ఇంకో వ్యాపకం మీ అబ్బాకు లేదు" అని తన స్నేహితుణ్ణి తలుచుకునేవాడు రఫీక్ మామా.

నేను ఇలా ఆలోచించడానికి పరిస్థితులే కారణం. ఆ పరిస్థితులని బోనులో నిలబెడుతున్నానంటే అది నా తప్పు కాదు.

నాకు ఈ ఊరి మీద మమకారం చెల్లిపోయి ఇరవై ఏళ్ళైంది. ఈ ఇరవై ఏళ్ళలో నా కష్టనష్టాలనుఈ ఊరు పట్టించుకుందా? బతుకు పట్ల నాకు భరోసా ఇచ్చిందా? రఫీ మామ ఒక్కడు లేకపోయి ఉంటే నా పరిస్థితి ఏమిటి? పిచ్చివాణ్ణై పోదును కదా?

ఈ ఊరిని వదిలివెళ్ళేటప్పుడు నాకు పదహైదు సంవత్సరాలు. పదవ తరగతి పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న సమయమది. అప్పుడు వొదిలిపోయిన ఊరు. ఇదిగో ఇప్పుడు రావలసి వచ్చింది. రఫీక్ మాము అకాలమరణం నన్నిలా నా ఊరికి లాక్కొచ్చింది. ఇంకే బంధం నన్ను సెంటిమెంటల్ గా మార్చలేపోయింది ఇన్నాళ్ళూ, ఇక ముందు మార్చలేదు కూడా!

ప్రేమపూర్వకమైన గతం ఈ ఊరితో నాకుందా? కొన్ని ఉంటే ఉండవచ్చు కానీ అంతకంటే నన్ను ఇబ్బంది పెట్టినవే ఎక్కువ. నేను ఊరు వొదిలివెళ్ళిన తర్వాత మాతో సంబంధాలు కొనసాగించింది ఒక్క రఫీక్ మామునే! ఊరువొదిలిన కొత్తలో నా స్నేహితులు అప్పుడప్పుడు ఏదైన పనిమీద హైదరాబాద్ వచ్చినపుడు పలకరించి పోయేవారు. కాలంతో ఆ సంబంధాలు కూడా కనుమరుగయిపోయాయి. నేను దల్‌గా ముభావంగా ఉండడం చూసి కొంత సముదాయించి, కొన్ని గుర్తుకు చేసుకొని వెళ్ళిపోయేవారు. అంతకుమించి ఏమీ లేదు. బహుశా నా భయం వాళ్ళను వెన్నాడిందేమో తెలియదు. 'ఊరికి రావచ్చు కదా?' అని ఒక్కరంటే ఒక్కరు అడగలేదు. ఎలాగూ రానని నిర్ణయించుకున్నారో? వస్తే ఏం చేసి బతుకుతాడని అనుకున్నారో? తెలియదు.,

లేదు నేనే కావాలని ఈ ఊరితో సంబంధం తెగ్గొసుకున్నాను. నా చేతులారా నేను బలవంతంగా ఈ ఊరిని మరిచిపోయాను. నా ఊరిని విడిచిపెట్టి వెళ్ళిపోయాను. ఆ రోజు నాకెవరూ అల్విదా చెప్పలేదు. నేనుచెప్పాను.

ఇది నా చివరి వీడ్కోలు కాబోలు ఊరికీ, మాముకీ. ఇక ఈ ఊరికి ఏ అవసరం మీద రానూ? మంచిది కాదని తెలియనంత అజ్ఞానినేం కాదు.

ఈ ఊర్లో పుట్టి ఎన్ని సంబంధాలూ, స్నేహాలు సంపాదించుకున్నా అంతకు మించిన ఒంటరితనం బేలతనం నిస్సహాయత అన్నింటికీ మించి 'నువ్వు బలహీనుడువి' అని నన్ను పదే పదే గుర్తు చేస్తుంది ఈ ఊరు. జీవితం బలహీనుల పట్ల చూపే చిన్న చూపును ఓర్వలేని ఒక నిస్సహాయ నిర్జీవ స్థితి. చలనం లేని ఘనీభవ స్థితి.

నాకెప్పుడైనా కోపం వచ్చినప్పుడు అబ్బా చెప్పేవాడు 'కోపం మనిషిని నిర్వీర్యం చేస్తుందని. సమస్యలకు పరిష్కారంగా కోపాన్ని మనిషి అరువుతెచ్చుకుంటాడు గానీ అదే మళ్ళీ పెద్ద సమస్య అవుతుంది' అనేవాడు. నాకు ఈ ఊరి మీదున్నది కోపమా? అపనమ్మకమా? ఏమో తెలియదు. వీటికి మించిన పదాలేవి నాకు తెలియదు.

నేను దేశం వదిలిపోలేదు కదా? ఎనిమిది గంటల ప్రయాణం మాత్రమే! రావాలనుకుంటే రాగలను. రమ్మనీ, ఒక్కసారి నన్ను చూసిపొమ్మని ఈ ఊరు నన్నడిగిందా? రావాలనే భావనను ఈ ఊరెప్పుడైనా నాకు కలిగేలా చేసిందా? అంత ఆత్మీయత కనబరిచిందా?

అయినా నా ఒక్కడి గురించి ఎవరన్నా ఎందుకు ఆలోచిస్తారు.

ఆలోచించాలి? సమూహంలో నేనొక్కడిని అయినప్పుడు, నన్ను నేను సమూహంలో ఒకనిగా భావించనప్పుడు, నాలాంటి మనిషి బాధని పంచుకోవాల్సిన అవసరం సమూహానికి లేదా?

మా అబ్బా హత్య జరిగినప్పుడు ఈ ఊరు నా కోసం ఏం చేసిందనీ? ఎం.ఎల్.ఎ చంద్రశేఖర్ రెడ్డి మనుషులు హత్య చేసి రోడ్డు పక్కన పడేస్తే ఆ రోజీ ఊరు ఏం చేసింది? ఒక నిశ్శబ్ద ప్రేక్షక పాత్ర పోషించింది.

ఇరవై ఐదు కత్తిపోట్లకు గురై, రక్తపు మడుగులో పడి ఉన్న అబ్బాను చూసి కన్నీళ్ళు కూడా రాలనంత దిగ్భ్రమలో నేనుంటే కనీసపు కరుణ కూడా ఎవరూచూపలేదు. రఫీక్ మామా చేతులు తప్ప నా చుట్టూ ఒక్క ఆత్మీయస్పర్శ లేదు.

ఎవరో పరుగెత్తుకొని వచ్చి 'మీ నాయన్ను చంపెశార్రా?'

'చంపేసారా? ఎందుకూ?'

నన్ను తన కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్నందుకా? ఏదడిగినా రఫీమని ఇస్తున్నందుకా? తన చుట్టుపక్కలా మంచిని మాత్రమే పంచుతున్నందుకా? మీనాన్న లాంటివాడి కడుపున పుట్టినందుకు నువ్వు అదృష్టవంతుడివిరా? అని పదే పదే పొగిడిచ్చుకున్నందుకా?

ఎవరెవరో వచ్చేవారు ఇంటికాడికి! 'కౌన్సిలర్ సాబ్' అని పిలువగానే 'ఆవోజీ! బైఠో! క్యా కాం హై బోలో' అని ఆత్మీయంగా పలకరించినందుకా? వచ్చినవాళ్ళందరి పనులు చేసిపెట్టినందుకా? ఏం చేసినా దేన్నీ ఆశించినందుకా? 'దునియా హమారెలియే ఔర్ హం దునియాకేలీయే' అని నమ్మినందుకా? ఎందుకు హత్య చేశారు మా నాన్ననీ?

ఎప్పుడూ నవ్వుతూ ఉండేవాడే! అంత మంచోడే! అందరికీ ఆత్మీయత పంచుతున్నవాడే! మెతకోడు మెతకోడు అని పిలిపించుకున్నోడి గుండెల్లో గునపం దిగిందంటే ఏమిటీ కారణం?

చాలా సార్లు దెయ్యాల కలలు వచ్చేవి. భయం, భయంగా, 'షైతాన్ హై క్యా బాబా? హమారేకు మార్డాల్తాక్యా బాబా' అని అడిగితే

'షైతాన్ మనలోనే ఉన్నాడు, వేరెక్కాడో లేడు. నువ్వు అందరితో మంచిగా ఉంటే నీ దగ్గరికి ఎవరూ రారు' అనే అజాత శత్రువే! ఎందుకు చంపారు మా నాన్ననీ ఆ షైతానులు?

ఇప్పుడు, అమ్మకూ, నాకూ ఎట్లా? నాకేమన్న కావాలంటే ఎవర్నడగాలి? నాన్నలా నన్నిపుడు ఎవరు చూసుకుంటారు?

ఇన్ని అమాయకపు ప్రశ్నలు! సమాధానం దొరకలేదు.

'మీ నాయన్ను చంపించింది ఎం.ఎల్.ఎ చంద్రశేఖర్ రెడ్డి అంటరా' అని మా మల్లిగాడు చెప్పినప్పుడు. ఆ ఎం.ఎల్.ఎల ఎవరో, మా నాన్నని చంపే అవసరం అతనికిఎందుకు కలిగిందో అప్పుడు నాకు తెలియదు.

'మామూ అబ్బాను చంపించింది చంద్రశేఖర్ రెడ్డి అట కదా? ఎందుకూ?' అని రఫీఖ్ మాముతో అడిగాను.

'మీ అబ్బా చాలా మొండివాడురా! అన్నీ పద్ధతి ప్రకారం జరగాలంటాడు. నీకు తెలియదు కానీ మన ఊర్లో బాగా వెనుకబడిన వాళ్ళం మన ముసల్మానులమే! మనమంతా బాగుండాలి. అందరూ చదువుకోవాలి. మన పిల్లలు మంచి ఉద్యోగాలు చేయాలి. మనం ఐకమత్యంగా ఉండాలి అని అందరితో అనేవాడు. దానికోసమే పుట్టినట్టు పని చేసేవాడు. అందుకే ఈ వార్డులో మీ నాయనకు ఎదురు లేకుండా పోయింది. మన వార్డుకు సంబంధించిన ప్రతి పని దగ్గరుండి చూసుకునేవాడు. మునిసిపాలిటిలో జరిగే అవతవకలన్నీ ఎత్తి చూపేవాడు. ఈ వార్డులోకి ఇంకోపార్టీ వాళ్ళేవరూ మీ నాన్నలా గెలవలేకపోయారు. మీ నాన్న ఇండిపెండెంటుగా మన ఊర్లో గెలిచిన మొదటి ముస్లిం. ఎం.ఎల్.ఎ చాలా సార్లు మీ అబ్బాని తన పార్టీలో చేరమని అడిగాడు. అందుకు మీ నాన్న నిరాకరించడమే కాక ఈ ఇలాకాలో పార్టీ గొడవల్లేకుండా ముస్లీముల మధ్య వైషమ్యాలూ, పార్టీలూ పడకుండా చూసుకుంటూ వస్తున్నాడు. ఊర్లో ముసల్మానులంతా ఒకే మాట మీద ఉండేలా ప్రయత్నించేవాడు. అందుకే మీ అబ్బా అంటే వాళ్ళకు కోపం. మనల్ని విడదీయకపోతే వాళ్ళ బలం పెరగదు. మీ నాన్న దానికి అడ్డుగా ఉన్నాడు' అన్నాడు మాము.

నాన్న చెప్పిన మనలో షైతాన్ చంద్రశేఖర్ రెడ్డి అని అప్పుడనిపించింది. షైతాన్ ఎవరో కాదు ఈ దునియానే అనిపించింది. ఇది మంచోళ్ళను మంచిగా బతకనీయదు.

అమ్మో నన్నూ, చంపేస్తే! ఎల్లక్షన్లప్పుడు నవ్వుతూ తిరిగినోడు, నమస్కారం పెడుతూ పోస్టర్లు వేయించుకున్నోడు ఆ షైతాన్ నా కలలను కలుషితం చేసేశాడు. నా బాల్యానికి భయం తప్ప ఇంకోటీ మిగల్చలేదు. నాన్నంత మంచోడిని చంపినోడు నన్నూ, అమ్మనూ చంపలేడా? అమ్మో! జాగ్రత్తగా ఉండాలి? అమ్మను జాగ్రత్తగా చూసుకోవాలి. ఒక్కటే ధ్యాస! వాడంటే పిచ్చి భయం.

'రఫీక్ భై! ఈ భయం వీడ్ని పిచ్చోణ్ణి చేసేస్తుంది. వీడుకూడా మిగలకపోతే నా పరిస్థితి ఏమిటి?' అమ్మ రఫీక్ మామాతో అనేది.

అమ్మ కన్నీరు మున్నీరై ఏడుస్తూ ఉంటే రఫీక్ మామ తప్ప ఒక్కడంటే ఒక్కడు మా పక్కన వచ్చి నిలబడలేదు. చంద్రశేఖర రెడ్డికి వ్యతిరేకంగా కేసు నమోదు చేసే సాహసం కూడా చేయలేదీ నగరం. నేను నిలువెత్తు గాయాన్నై నిలబడితే నాన్న అచేతన దేహం నా రెటినా మీద ఘనీభవించింది. ఎంతలా... ఎంతలా అంటే - తెల్లటి లాగూ-చొక్కాలో నవ్వుతో నడిచే మనిషిలా నా యాద్‌లలో లేడు మా అబ్బా! రక్తపు మడుగులో పడి ఉన్న ఓ అచేతన దేహం అంతే! ఆ దేహాన్ని మోస్తున్న ఖబరస్తాన్ నా చూపు. పగలూ-రాత్రి ఒకటే భయం. నన్నూ కూడా నాన్నలా చంపేస్తారేమోననీ, నా రక్తం కూడా నాన్న రక్తంలా రోడ్డుమీద ఘనీభవిస్తుందేమోననీ! చిన్న శబ్దం వచ్చిన అదిరిపడే వాణ్ణి. రాత్రులైతే నా పాలిట కాళరాత్రులైపోయాయి. ప్రశాంతంగా, హాయిగా, ఆహ్లాదకరంగా ఉండే మా ఇల్లు స్మశానవైరాగ్యం తాండవించింది. మా నాన్నను చంపిన ప్రదేశాన్ని అప్పుడు తప్ప ఇంకెప్పుడూ చూడలేదు నేను. ఆ భయం నా పాలిట ఇబ్లిష్‌లా తయారైంది.

చంద్రశేఖర్ రెడ్డితో ఎక్కడ వైరం పెట్టుకోవాల్సి వస్తుందోనని కనీసపు జాలి నాపై చూపలేదెవరూ. అప్పటి వరకూ మా నాన్నతో అన్నీ చేయించుకున్న ఊరు. మాకవసరం వచ్చినప్పుడు ఆదుకోలేదు.

నేను పిచ్చివాడిలా అయిపోతున్నానని భయపడి రఫీక్ మామ మమ్మల్ని ప్రొద్దుటూరి నుండి హైదరాబాదులో వాళ్ళ బంధువులున్న పాత బస్తీలో వదిలిపెట్టి పుణ్యం కట్టుకున్నాడు. అప్పుడు పోయింది రఫిక్ మామ చావు కోసం రాక తప్పలేదు.

ఖబరస్తాన్‌లో మాత్రం రఫీఖ్ మామకు, అబ్బాకు స్నేహితుడొకాయన నన్ను గుర్తు పట్టాడు.

'నువ్వు మీ నాయనలాగే ఉన్నావు' అంటూ పలకరించాడు.

'నీకో విషయం తెలుసా మీ నాయన చనిపోయినప్పటి నుండి ఇప్పటి వరకూ చంద్రశేఖర్ రెడ్డి ఎం.ఎల్.ఎగా గెలుస్తున్నాడు. అంతేకాదు ఈ వీధి కౌన్సిలర్ కూడా అతని మనిషే! వాడికి ఉన్నన్ని వ్యాపారాలు,

కథ

హస్బెండ్ స్టిచ్

- గీతాంజలి

'బంగారం అమ్మైనా నీ డబ్బు నీకిస్తా పిన్నీ ఈ సారికెలా అయినా సర్దు' సుశీల బ్రతిమిలాడ్తున్నట్లే అన్నది.

'ఎందుకే ఇరవై వేలు నీకు ఏమంత అక్కరొచ్చిందనీ మీ ఆయన నెలనెలా ఇస్తానే ఉన్నాడు కదా'? అన్నపూర్ణ నిలదీసి అడిగింది.

'అంతా బొటా బొటీగా సరిపోతుంది పిన్నీ ఏం మిగులు లేదు పిల్లలు అవీ ఇవీ అడుగుతూ ఉంటారు లేదని చెప్పలేను, కొనీ ఇవ్వలేను చాలా బాధౌతుందనుకో. ఆయన దగ్గర పిల్లలకు అడిగేంత చనువా లేకపోయె. అయినా ఎక్కడుంటాడనీ ఇంట్లో? ఎంతసేపూ ఆ పెద్దామె దగ్గర్నె ఉంటాడాయె. ఆమెకి మగపిల్లలాయె ఇద్దరూ' సుశీల గొంతు రద్దుమౌతుంటే ఒకింత సేపు మాటలాపి తనను తాను నిభాయించుకునే ప్రయత్నంలో గుటకలు మింగింది. 'అందుకే నేనే ఏమైనా చేద్దామనీ' నసిగింది. 'ఏం చేస్తానే? ఏ మొచ్చు నీకు, ఒద్దే అంటే వినకుండా ప్రేమ ప్రేమంటూ పెళ్ళైనవాడిని చేస్కుంటివి. ఇపుడు బాధపడ్తున్నావ్' అన్నపుర్ణ విసుక్కుంది.

'చీరలమ్ముతా పిన్నీ ఇంట్లోనే సూరత్‌లో తక్కువధరకి చీరలు దొరకుతాయట' సుశీల గబగబా చెప్పేసి పిన్ని మొఖం వైపు చూస్తూ ఉండిపోయింది. ఊపిరి బిగబట్టి.

అన్నపూర్ణ కూర కలియబెడ్తానే నుదురు ముడిచింది. కూర కలుపుతా కలుపుతా ఆలోచనలో పడ్డది. తర్వాత వెనక్కి సుశీలవైపుకి తిరిగింది. సుశీల ఆత్రంగా, అన్నపూర్ణ వైపు చూస్తోంది. సుశీల కళ్ళల్లో కన్నీటి పొరలు, ముఖము, ముక్కు ఎర్రబడ్డాయి.

ఒక నిర్ణయానికొచ్చిన దానిలా అన్నపూర్ణ సరె అన్నట్లు తలాడిరచి, రేపీ టయానికి రాపో, ఎట్టాగో, అట్టా సర్దుతా, మీ బాబాయ్‌ని కొంతదుగుతా అవునుకానీ ఇరవై వేలల్లో ఏం చీరలొస్తాయ్ ఏం బిసినెస్సు చేస్తావే నాకు తెలీక అడుగుతా అంది కూర అయిపోయిందో లేదో అని ఇంకోసారి కలి పొయ్యి ఆపు చేస్తూ.

'నా ఫ్రెండుంది చూడూ మంజుల అదే నా ఇంటరు క్లాస్‌మేటు అదిప్పుడు గవర్నమెంటు టీచరులే పిన్నీ దాని దగ్గర అడుగుదామనుకుంటున్నా అదిస్తుందిలే నమ్మకమే' అంది సుశీల మెల్లగా. సర్లె కుచ్చో తిందువుగానీ అంది అన్నపూర్ణ పీటేసి కంచంపెడ్తూ.

'ఎంత సేపైందే సుశీలా వచ్చి? బస్సుదొరక లేదే బాగా ఆలస్యమైంది' గేటు తీస్కోని లోపలికి వస్తూ అంది మంజుల.

వరండాలో కూచొని ఉంది సుశీల మంజుల అమ్మ చేపిచ్చిన టీ తాగుతూ ఆమెతో కబుర్లాడుతూ ఉంది. 'అరగంటైందిలే నువ్వు ఫ్రెష్ అవుపో' అంది సుశీల అల్సి పోయి సోఫాలో వాలిన మంజులతో. 'టీ తెస్తానుండు' మంజులా వాళ్ళమ్మ లోపలికి కెళ్ళిపోయింది.

మంజుల లోపల్కి వెళ్ళి ముఖం కడుక్కుని మళ్ళీ వరండాలోకి వచ్చింది. సుశీల ఏదో దీర్ఘాలోచనలో మునిగి పోయింది.

ఏంటే ఏం ఆలోచిస్తున్నావు చెప్పు ఏదో ముఖ్యమైన పనిమీద వస్తున్నా అన్నావు ఏంటా పని, పిల్లలూ, మీ ఆయనా బాగున్నారా? మంజుల అడుగుతూనే ఉంది.

అంతా బాగున్నారే బాగా లేంది నాకే సుశీల బలహీనమైన గొంతులో అంది.

'ఏం నీకేమైంది మళ్ళా?' మంజుల అడిగింది. మంజులకి సుశీల ఇంటి పరిస్థితి తెల్సు. ఆమె భర్త శంకర్రావు గురించీ తెల్సు.

'నాకో ముప్పై వేలు కావాలి అర్జంటుగా ఇస్తావా?' సుశీల తనకేమైందో చెపుకుండానే అడిగింది. 'ఎందుకే ఏమైంది అసలు విషయం చెప్పు' మంజుల రెట్టించి మరీ అడిగింది. ప్రతిగా సుశీల తన రెండు చేతుల్లో ముఖం పెట్టుకుని భోరుమని ఏడవసాగింది. మంజుల ఖంగారు పడి ఒక్కసారిగా తను కూచున్న చోట్నించి సుశీల దగ్గర్కి వెళ్ళి ఆమెను దగ్గర్కి తీస్కుంది. సుశీల కొద్దిసేపు అలా ఏడుస్తూనే ఉంది.

ఆమెనలా ఏడవనిచ్చి 'చెప్పవే సుశీలా ఏమైంది అంత డబ్బు ఎందుకు నీకు పిల్లల ఫీసులు కట్టాలా ఏంటీ దు:ఖం?' మంజుల అడిగింది.

'కాదు ఆపరేషన్ చేయించుకోవాలి' సుశీల అంది.

ఆపరేషనా ఏమైంది నీకు? మంజుల ఆందోళనగా అంది. సుశీల మౌనంగా ఉండిపోయింది. 'చెప్పమేమీ ఆపరేషన్ ఎందుకు? మంజుల మళ్ళీ రెట్టించింది.

సుశీల మౌనంగా ఉండిపోయింది ఆత్మీయమైన బాల్య స్నేహితురాలైనా ఆమె దగ్గర ఎంతో చనువూ అధికారమూ ఉన్నా అసలు విషయం చెప్పడానికి జంకుతోంది. చెప్పబోతూ ఆగిపోయింది ఆమె ముఖం ఎర్రబడుతోంది. పెదాలు కంపిస్తున్నాయి. మంజు విచిత్రంగా చూసింది సుశీలవైపు.

ఏం దాస్తోంది ఇది సుశీల జీవితం తనకు తెరిచిన పుస్తకం కదా? ఆశ్చర్యపోతోంది కొంపదీసి దానికేమైనా భయంకరమైన కాన్సర్

ఆస్తులూ ఈ ఊర్లో ఎవరికీ లేవు. ఏ కాంట్రాక్టూ వాణ్ణి కాదని పక్కకు పోదు. మీ నాన్న ఉన్నాన్నాళ్ళు ఏ పార్టీలు ముసల్మానుల మధ్య దూరకూడదనుకున్నాడు. ఇప్పుడిక్కడ మూడు పార్టీలు ఉన్నాయి. మనవాళ్ళు మూడు పార్టీలుగా విడిపోయారు!' అన్నాడు.

ఇంకే కారణం చెప్పి రాను నేనీ ఊరికి. మా అబ్బాని చంపిన వ్యక్తి హాయిగా, సుఖంగా ఉన్నాడు. నేను మాత్రం కన్న ఊరికి కాకుండా పోతిని. మా అబ్బా తర్వాత ఎంతమందిని చంపి ఉంటాడో? ఎన్ని అన్యాయాలు చేసి ఉంటాడో? అలాంటివేమీ చేయకుండానే వరుసగా గెలుస్తూ రాడు కదా? పైకి మాత్రం మారినట్టు కనిపిస్తున్న ఈ ఊరు లోపలంతా చంద్రశేఖర్ రెడ్డి షైతానియత్ కి తలొగ్గి బతుకుతోంది. నేనే పిరికివాణ్ణనుకుంటే నాకంటే పిరికిదీ ఊరు.

ఇక ఈ ఊరికి అల్విదా!

లాంటి రోగ మొచ్చిందో ఏం పాడో మళ్ళీ చెప్పమని నిలదీసింది మంజుల.

'ఆయన నా దగ్గర్కి రావటం లేదు' సుశీల అతి కష్టం మీద చెప్పింది. అదేంటి? మంజుల ఆశ్చర్యపోయింది 'ఇంటి ముందేగా మీ అక్క ఇల్లు ఇద్దరి దగ్గరా ఉంటున్నాడుగా' అంది మంజుల. 'అలా వస్తున్నాడు అన్నీ చూస్కుంటున్నాడు' కానీ 'సంవత్సరం నించి మా మధ్య శారీరక సంబంధం లేదు' ఒక్కోమాట అతికష్టం మీద పలుకుతోంది సుశీల. ఏం ఎందుకు? మంజుల ఆశ్చర్యంగా అడిగింది. నాతో సెక్స్ జీవితం బాగోలేదట నీది ఒదులైపోయింది అందుకే రావాలన్పించడం లేదంటాడు. అక్క దగ్గర్కే వెళతాడు. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కష్టంగా నైనా స్పష్టంగా చెప్పేసింది. మంజులకు అర్థమైంది అయితే ఇప్పుడేం చేద్దామని అడిగింది.

'ఆయన మళ్ళీ నా దగ్గర్కి రావాలి. రావాలంటే నేను ఆపరేషన్ చేయించుకుని పెళ్ళికిముందులా తయారవ్వాలి' సుశీల చెప్తోంది.

'పెళ్ళికి ముందులా అంటే ఏం ఆపరేషన్ చేయించుకుంటున్నావు?' మంజుల అడిగింది.

'నీకు అర్థంకాదు. ఆయన నాది వదులై పోయిందని అంటున్నాడు. కుట్లు వేయించుకుని నా యోని మార్గాన్ని బిగుతుగా చేయించుకుందామని' సుశీల లోగొంతో ఏదో రహస్యం చెప్తున్నట్లుగా చెపుతోంది. మంజుల అమ్మ వినకూడదని ఆమె కళ్ళింకా చెమ్మగిల్లే ఉన్నారు.

మంజుల నిర్ఘాంతపోయింది 'ఏంటీ ఇలాంటి ఆపరేషన్లు కూడా ఉన్నాయా?' అరిచినట్లే అంది. మళ్ళీ వెంటనే, 'అయినా అది కాదు ముందు నువ్వు నీ బీ.పి. మాత్రలు వేస్కుంటున్నావా లేదా అది చెప్పుముందు' అంది సుశీల భుజాలు కుదుపుతూ.

సుశీల ఇంటి తాళం తీస్తూ ఎదురింటి వైపు చూసింది. విజయక్క ఇంటి ముందు హోండా ఆపి ఉంది. అంటే ఆయన వచ్చాడన్నమాట ఈ రోజన్నా ఇటువస్తాడో రాడో అని ఆలోచిస్తూ లోపలికి వచ్చింది.

ఒక్కసారి నిశ్శత్తువుగా అన్పించి మంచంపై ముడుచుకు పడుకుంది. కళ్ళు తిరిగినట్లనప్పించింది. నిన్న, ఈ రోజు బీ.పీ. మాత్రలు వేస్కోనే లేదు అని గుర్తొచ్చి మళ్ళీ మెల్లగా లేచి బి.పి. టేబ్లెట్లు వేస్కొని మళ్ళీ మంచంపై చేరింది. ఎందుకో దు:ఖం తన్నుకు వచ్చింది దిండుని కావలించుకుని కరువు తీరా ఏడ్చింది. అసలీ సమస్య ఏంటి? తనకేనా? ఎంత బాగుండేవాడు తను? 4 సం?లు కొంగు వదలకుండా తిరిగేవాడు. పెళ్ళైన వాడని తెల్సీ ఎందుకో అతనంటే పిచ్చి ఆకర్షణ కలిగి అతనితో పారిపోయి గుళ్ళో పెళ్ళి చేసేస్కుంది. అమ్మ, నాన్న వెళ్ళగొట్టారు. అతని మొదటి భార్య విజయ ఆత్మహత్య ప్రయత్నం చేసి బతికింది ఆమెకిద్దరు మగ పిల్లలు. తనకు కవల ఆడపిల్లలు పుట్టారు ఇంటికి, పిల్లలకు కావల్సినవన్నీ సమకూరుస్తాడు.

కానీ ఈ మధ్య ఒక సంవత్సరం నుంచీ మెల్లమెల్లగా తగ్గించాడు అదీ విజయక్కకి మగపిల్లలు పుట్టాక ఎక్కువైంది. తమకు పెళ్ళైన రెండు సంవత్సరాలకే విజయక్కకు మగపిల్లలు వర్సగా పుట్టారు.

అడగ్గా, అడగ్గా తనతో సంసార జీవితం సంతృప్తి కరంగా లేదని చెప్పాడు వదులై పోయావంటాడు. ఈ వదులై పోవడమేంటో, తనకేనా అందర్కీ ఉందా ఈ సమస్య? విజయక్క దగ్గర ఎందుకు లేదో ఈ సమస్య? ఏం చెయ్యాలి? ఎంత ఆలోచించినా దిక్కుతోచలేదు ఈ పరిస్థితిని పక్కింటి సుమతి గమనించింది 'ఏంటోయ్ సుశీలా ఈ మధ్య మీ ఆయన విజయక్క దగ్గరకే వెళ్తున్నాడు నీ ఇంట్లో ఉండటం లేదు' అని అడిగింది తను సిగ్గు విడిచి చెప్పింది. 'నీకు కుట్లు వేసేప్పుడు డాక్టరు అడగలేదా సుశీలా 'ఎక్స్ట్రా నాట్' వెయ్యాలా వద్దా అనీ' అడిగింది సుమతి.

సుశీలకి అప్పుడు గుర్తుకొచ్చింది. తన తొలి న్పుకి అమ్మరాలేదు. పిన్నే జాలిపడి వాళ్ళ ఊరికి తీసుకుపోయింది కొన్ని రోజులు ఉంచుకుంటానని. అక్కడ ఉన్నప్పుడే ఇంట్లోనే కాన్పయిపోయింది. మంత్రసాని వచ్చింది ఏం చేసిందో ఎలా చేసిందో. తను మగతగా పడుకుండిపోయింది కళ్ళు తెరిచే సరికి పట్నంలో హాస్పిటల్లో తేలింది. రక్తం చాలా పోయిందని రక్తం ఎక్కించారు. అప్పటికే కింద కుట్లు పడిపోయాయి. 'లోపల చాలా చిరుగులున్నాయి సుశీలా అయినా కాన్పు సమయానికి ఊరికి పోయావెందుకు' అని కోప్పడిరది డాక్టరమ్మ.

'ఎక్స్ట్రా నాట్' అంటే? సుశీల అడిగింది 'కాన్పు అయ్యాక మానం వెడల్పుగా సాగుతుంది కదా భర్తకు తర్వాత కలయిక బాగుండాలని, అక్కడ బిగుతుగా ఉండాలని ఒక కుట్టు ఎక్స్ట్రా వేస్తార్లే. నేను నా రెండు కాన్పులకీ వేస్కున్నా... నాకు ముందే తెల్సు డాక్టరమ్మని ముందే అడిగా. ఎక్స్ట్రా మనీ అడిగిందమేకో, కాపురం కంటే ఎక్కువా చెప్పు? మా ఆయనా పోరు బెట్టాడనుకో డాక్టరమ్మ ఎంత డబ్బడిగితే అంతిచ్చాడు తెల్సా నువ్వూ అట్లా చేయించుకోవాల్సింది అంది సుమతి సుశీల వైపు బోలెంత జాలిగా చూస్తూ. సుశీలనో రెల్లబెట్టి వింటుండి పోయింది. ఎక్స్ట్రానాట్, హస్బెండ్ స్టిచ్ ఏంటివి అయ్యెయ్యో తనకు తెలియకపోయెనే? సుశీల బోల్డంత విచారించింది.

సుమతి చెప్పినట్లే డాక్టరమ్మ దగ్గర్ని వెళ్ళింది. అక్కడందరూ ఇంతింత కడుపులు వేస్కుని నీర్సంగా.. మొఖాల నిండా భయంతో కూచుని ఉన్నారు. పాపం కాన్పులయ్యాక వీళ్ళదీ నా పరిస్థితేనా లేకపోతే సుమతి లాగా ఎక్స్ట్రానాట్ వేయించుకుంటారేమో నాకంటే తెలివి లేదు కానీ సుశీలకు, తన పక్కనున్న కడుపుతో ఉన్న స్త్రీకి ఎక్స్ట్రానాట్ వేయించుకొమ్మని చెప్పాలన్పించింది ఆమెకే కాదు అక్కడున్న అందర్కి కడుపులు లేని తనలాంటి స్త్రీలూ ఉన్నారక్కడ. పాపం వాళ్ళ బాధేంటో తనకు లాగే ఏదో సమస్యలలో వచ్చుంటారు. తెల్లబట్ట అనో, ముళ్ళ బట్టలనో, ఖచ్చితంగా అవి మొగుళ్ళనుండే వచ్చుంటాయి. మొగుళ్ళు మంచిగా ఉంటే ఆడదానికి ఏ సమస్యా ఉండదు. ఏంటో ఈ బాధలు ఆడాళ్ళకు.. సుశీల వాళ్ళను చూస్తూ ఒకటే వలపోసింది. ఇంతలో తనవంతు వచ్చింది.

'నా దగ్గర్కి ఆయన రావాలి మేడమ్. పిచ్చెక్కుతోంది ఆయన రాకపోతే. సెక్స్ కోసం కాదు మేడమ్ నాకు ఆయనంటే ప్రేమ, పిల్లలు నాన్న కావాలంటారు. నా దగ్గర ఆకర్షణ లేకపోతే ఎందుకొస్తారు మేడమ్? నాకు ఎక్స్ట్రానాట్ కావాలి పల్లెటూళ్ళో కాన్పు కావడం వల్ల అక్కడ మీ లాంటి డాక్టరమ్మ కాకుండా మంత్రసావితో కాన్పు చేయించుకున్నా అందుకే అక్కడంతా వదులై పోయింది మేడమ్. నేను టైట్ చేయించుకోవాలనుకుంటున్నా.' సుశీల చెప్తూ పోతోంది డాక్టర్ – పద్మజ వింటోంది విభ్రమంగా చూస్తూనే పక్కనే ఉన్న నేపాలీ డాక్టరమ్మ భాషరానందుకో ఏమో She wants husband stitch you know వెజైనోప్లాస్టీ అని చెప్తూ సుశీలతో 'చూడమ్మా కాన్పు తర్వాత యోని కండరాలు మళ్ళీ సంకోచించి పోతాయి. వాటికి సాగే గుణంతో పాటు ముడుచుకునే గుణం కూడా ఉంటుంది. చాలా తక్కువ కేసుల్లో 10,12 మంది పిల్లల్ని కన్న వాళ్ళల్లో, నీలా పల్లెల్లో మంత్రసానులతో

కాన్పులయిన వాళ్ళలో ఈ సమస్య వస్తుంది. అయినా నీకు ఒకసారి పరీక్ష చేస్తాను పడుకో అంది. సుశీల ఎక్సామినేషన్ టేబుల్ ఎక్కింది. డాక్టరమ్మ పరీక్ష చేసి ఆశ్చర్యపోతూ పెద్ద సమస్య లేదమ్మా.. కావలిస్తే నీ భర్తను ఒకసారి కౌన్సిలింగ్‌కి నా దగ్గర్కి తీసుకురా అతనికి అంతా వివరంగా చెప్పి నిన్నిలా వేధించద్దని చెప్తాను. నీకు కొన్ని ఎక్సర్ సైజులు చెప్తాను అవి చేస్తే ఇంకా బిగుతయ్యే అవకాశం ఉంటుంది.' డా? పద్మజ మెల్లగా నచ్చచెప్పే ప్రయత్నం చేస్తోంది. ఎలాగైనా కాన్పులనీ కుట్లనీ, సిజేరియన్లు, హిస్టెరెక్టమీలు - ట్యూబెక్టమీలు రీకేనలైజేషన్లనీ అన్ని గాట్లు, కాట్లు ఆడావాళ్ళకు అవుతూనే ఉంటాయిగా మరింకా ఒక అర్థంలేని విషయంకోసం కావాలని మరీ నీ శరీరానికి నువ్వే కోత పెట్టుకోవడం అవసరమా? అదీ నీ భర్తను తృప్తి పరచడానికి? నేను చెప్పినట్లు చెయ్యి' డా? పద్మజ అంటోంది.

భరించలేని బాధ భరిస్తున్నట్లు వేగంగా, అడ్డంగా తల ఊపేస్తూ, ఆయన రాడు మేడమ్ రాడు అని ఖచ్చితంగా అంటూ సుశీల రెండు చేతులెత్తి దండం పెట్టి మేడం నాకు ఎక్స్‌ట్రానాట్ కావాలి. నా కాపురం నిలబెట్టాలి మీరు ఎంతవుతుందో చెప్పండి కళ్ళనీళ్ళ పర్యంతం అవుతూ అడిగింది సుశీల. డాక్టర్ పద్మజకి విసుగుతో పాటు జాలి కలిగింది. 'నేను ఇంకో సర్జన్ కల్సి చేయాలి. పూర్తిగా సక్సెస్ కాకపోవచ్చు కూడా! ముప్పైవేలు అవుతుంది' ఆలోచించుకో అంది. 'ముప్పైవేలే... సుశీల నోరెళ్ళ బెట్టింది వెంటనే తేరుకుని' వస్తా మేడమ్ అప్పోసొప్పో చేసి తెస్తా' అంటూ ఒక్కసారి వెళ్లానని లేచించి. ఉన్నట్లుండి కళ్ళు తిరిగాయి. సిస్టర్ వెంటనే ఆమెను టేబుల్ మీద పడుకో బెట్టింది. 'నాకు హై బీపీ వుంది డాక్టర్ ఇది నా కలవాటే ఈ రోజు మాత్రలేస్కోలేదు' అంది సుశీల నీర్సంగా బీపీ 160/100 ఉంది 'ఇంత చిన్న వయసులో ఇంత బీపీ ఏంటి' అంది డాక్టర్ పద్మజ ఆశ్చర్యపోతూ 'రెండు సంవత్సరాలైంది డాక్టర్ బీపీ మొదలై ఈ ఆలోచనలు ఎక్కువై పోయిగా' అంది సుశీల.

'చూడు సుశీలా ఈ ఆపరేషన్ గురించి ఇంత ఆలోచన అవసరమా? బీపీ ఎక్కువై ఏ గుండెపోటో పక్షవాతమో వస్తే ఎలా చెప్పు? దానికంటే బీపీకి ట్రీట్‌మెంట్ ముఖ్యం' అంటూ ఒక్కరోజు కూడా బీపీ టేబ్లెట్లు మానద్దని వెంటనే ఆమె రోజూ వేస్కునే మాత్ర నర్సుతో వేయించి రౌండ్స్‌కి వెళ్ళిపోయింది. కొద్దిగా నెమ్మదించాక ఒక అరగంట తర్వాత మళ్ళీ వచ్చి 'నువ్వు ఇంత ఖచ్చితంగా నిర్ణయం తీస్కున్నాక నాకు చేయక తప్పదుకానీ ఈ ఆపరేషన్ అయ్యాక అంతా బాగవుతుందనుకోవద్దు. నీ భర్తకు బాగుండచ్చు కానీ కుట్లు మరీ బిగుతైపోయి కలయిక భరించలేనంత నొప్పిగా ఉండి దాంపత్య జీవితం పట్ల భయం కలుగవచ్చు. మధ్య మధ్యలో యోని నించి రక్తస్రావం అవుతూ ఇన్ఫెక్షన్స్ వస్తాయి. ఎందుకింత రిస్క్ చెప్పు మళ్ళీ ఆలోచించుకో' అని చెప్పి పంపింది.

ఇదిగో అప్పట్నించే తను అప్పులవేటలో పడిరది. పిన్ని ఇస్తుందేమో? ఇస్తే బాగుండు మంజుల ఇస్తుందిలే. అసలు కాన్పుకు ముందే తనకీ ఎక్స్‌ట్రానాట్ గురించి తెలిస్తే బాగుండేది సుశీల అశాంతిగా మంచం మీద కదిలింది.

సుశీల హాస్పిటల్ వార్డులో ఉంది. ఆపరేషన్ అయ్యి రెండు గంటలయ్యింది. స్పృహలోకొచ్చింది. అక్కడ మంజుల తప్ప ఇంకెవరూ లేరు. పిల్లల్ని పిన్నింట్లో వదిలి 'సూరత్‌కెళ్ళి చీరలు తెస్తా పిన్నీ రెండోజులుంచుకో' అని ఒదిలి హాస్పిటల్లో చేరింది.

సమయానికి పిన్నీ మంజుల డబ్బులు సర్దారు కాబట్టి అంతా బాగయ్యిందనుకుంది.

'నిన్ను చూస్తే పెళ్ళి చేస్కోనందుకు సంతోషంగా ఉంది' అంది మంజుల. 'అయినా, ఎన్నిసార్లు చెప్పా వాడిమీద ఆధారపడద్దు ఉద్యోగం చేసుకో అని' కోపంగా అంది మంజుల మళ్ళీ. సుశీల కళ్ళనిండా నీళ్ళు నీకొచ్చేవాడు మా ఆయనలా ఉండడు లేవే' అంది.

సుశీల ఆనందంగా ఉంది. ఆపరేషన్ అయిన తర్వాత ఆమెలో విశ్వాసం పెరిగింది. ఆమె వేయించుకున్న ఎక్స్‌ట్రాకుట్లు ఆమెలో ధైర్యాన్ని భవిష్యత్ పట్ల నమ్మకాన్ని పెంచాయి. ఈ విషయం ఆమె భర్తకి చెప్పలేదు, డాక్టర్ చెప్పినట్లే రక్తస్రావం కుట్ల నుంచి చాలా రోజులు అయింది. రెండుసార్లు చెకప్‌కి వెళ్ళొచ్చింది.

ఆపరేషన్ అయిన నెల తర్వాత సుశీల భర్త శంకర్రావు ఆమె దగ్గర్కి వచ్చాడు. అతని మొదటి భార్య విజయ వారం రోజుల కోసం పుట్టింటికెళ్ళింది.

ఆ రాత్రి సుశీల నరకం అనుభవించింది. కలయికలో నొప్పి భరించలేక గావు కేకలు పెట్టలేక పళ్ళు బిగువన కన్నీళ్ళు కారుతుంటే భరించింది సుశీల. తర్వాత కలయిక అంటే చచ్చేంత భయం ఏర్పడినా భర్త కోసం ఆ భయంకరమైన నొప్పిని భరించసాగింది. భర్త కళ్ళ ముందుంటే చాలు అనుకుంది. కలయిక తర్వాత రక్తస్రావ మవుతున్నా ఆ నొప్పిని తర్వాతి వచ్చిన తెల్లబట్టని, మూత్రంలో మంటనీ అన్నింటినీ భరించింది. శంకర్రావు మునుపటిలా వస్తున్నాడు. అంతే అదేకావాలి పిల్లలు నాన్నా అంటూ శంకర్రావు చుట్టూ తిరుగుతుంటే మురిసిపోసాగింది. విజయక్క ఊర్లో లేనందునా లేక తన ఎక్స్‌ట్రావాట్ మహిమా అన్న సందిగ్ధంలో ఊగిసలాడినా తన భర్త తనతోనే ఉన్నందుకు సంతోష సాగరంలో తేలిపోయింది. ఇటు శంకర్రావు కూడా సంతృప్తి చెందినట్లే కనపడసాగాడు.

విజయ వారమైనాక ఊర్నించి వచ్చింది. అయినా శంకర్రావు సుశీల దగ్గరకి వస్తూనే ఉన్నాడు. వారానికి మూడు రోజులైనా సుశీల మురిసిపోతూనే ఉంది. నొప్పి భరించైనా ఆ బంధాన్ని కాపాడుకోవాలకు కుంటోంది.

మూణెల్లు గడిచాయి.

ఆరోజు రాత్రి 'శంకర్రావు ఏంటి మళ్ళీ మొదటికొచ్చింది మళ్ళీ వదులై పోయావేంటీ ఛీ' అన్నాడు. అటు తిరిగి పడుకుంటూ మళ్ళీ మొదలు శంకర్రావు రాకపోకలు మళ్ళీ తగ్గసాగాయి. నెలా, రెణ్ణెల్లు గడిచాయి. సుశీల గుండెల్లో భయం ఉవ్వెత్తున లేచింది.

భయంలో డాక్టర్ పద్మజ దగ్గర్కి పరిగెత్తింది ఆమె పరీక్ష చేసి 'అలానే ఉందమ్మా ఏం మార్పులేదు అయినా ఈ ఆపరేషన్ పెద్దగా సక్సెస్ కాదని చెప్పాగా, ఒకసారి నీ భర్తను తీసుకురా మాట్లాడుతా' అంది నీరసంగా టేబుల్ పై వాలిపోతున్న సుశీలకు బీపీ చూస్తూ 200/120 %।% ఎఎ నక్ష ఉంచి సిస్టర్ డెపిన్ కేప్సుల్ సబ్ లింగువల్ అని అరిచింది. ఇంతలో సుశీల విరుచుకు పడిపోయింది.

సుశీల హాస్పిటల్లో మంచం మీద పడుకుని ఉంది ఆమె కుడి చేతికి పక్షవాతం వచ్చింది. చేయి వదులుగా భుజంనించి గుడ్డముక్కలా వేలాడుతోంది నోరు కొద్దిగా వంకరైంది. కదలి కదలి ఏడుస్తోంది. సుశీల తల్లిదండ్రులు, పిల్లలు, అన్నపూర్ణ పిన్ని, బాబాయ్ ఆమె చుట్టూ ఉన్నారు. ఒక్క మంజుల మాత్రం గది బయట నిలబడి ఉంది. ముప్పై నిండిన మంజుల మొన్నొచ్చిన సంబంధానికి అవునని చెప్పాలో, కాదని చెప్పాలో తేల్చుకోలేకుండా ఉంది.

కథ

ఏం చేద్దాం?

- పలమనేరు బాలాజి

'నిజం చెపితేనే టీ ఇస్తాను. లేదంటే ఇవ్వను. నిజంగానే... ఊ.. చెప్పండి. ఎందుకదోలా ఉన్నారు?' దబాయింపుగా అడుగుతున్న సీతను చూసేసరికి నవ్వొచ్చింది నాకు.

నేను నవ్వాపుకునే ప్రయత్నం ఏమీ చెయ్యలేదు. ఉక్రోషంగానే మొహం పెట్టి 'ఏదో పోన్లే పాపం నాకంటే వయసులో చిన్నాడు కదా. టీ వేడిగా తాగటం అలవాటు కదా అని ఇస్తున్నా. వేడిగా టీ తాగి నింపాదిగా మీ బాధేమిటో చెప్పండి మాస్టారూ' అంది మా ఆవిడ.

టీ అద్భుతంగా ఉంది. పైగా బాగా వేడిగా కూడా ఉంది. టీ ఎంత మాత్రం వేడి తగ్గినా నేను అస్సలు తాగలేను. ఆ విషయం సీతకు బాగా తెలుసు. అందుకే ఏదైనా తప్పనిసరిగా నేను ఏదైనా పని చెయ్యాల్సి వచ్చిన ప్రతిసారి ఆ పనిని, టీకి ముడి పెట్టేస్తుంది. ఇహ తప్పేదేముంది.

కుర్చీ ముందుకు లాక్కుని, నా ఎదుటే కూర్చుంది. నేను కూర్చున్న కుర్చీకి ఎదురుగా, అడ్డుగా తను కుర్చీ పెట్టి కూర్చుందంటేనే.. నాకు వెంటనే అర్థమైపోతుంది. ఆమె నుండి ఇక తప్పించుకోవటం కానీ, మాట మార్చటం కానీ జరిగే పనులు కావని.

పెళ్లయి పదేళ్లవుతుంది. ప్రేమ వివాహం, కులాంతర వివాహం. ఇరు పక్షాల పెద్దలూ ఒప్పుకున్నారు, కాబట్టి పెళ్లప్పుడు పెళ్లయిన తర్వాత గొడవలేమీ జరగలేదు. ఇద్దరు పిల్లలు. కొడుకుకు ఏడు సంవత్సరాలు, అమ్మాయికి నాలుగు సంవత్సరాలు.

ఆదివారం సాయంత్రం. ఎండ బాగా భయపెట్టి తగ్గు ముఖం పట్టింది. కరెంటు వస్తూ పోతూ ఉంది. ఉండుండి వస్తున్న గాలి కొంత హాయిని కలిగిస్తోంది.

సీత టీ చప్పరిస్తూ, నన్నే తదేకంగా చూస్తూ ఏదో ఆలోచనలో మునిగిపోయింది. పిల్లలు ఉదయమే వాళ్ల పిన్నీ వాళ్లింటికి వెళ్లారు. మరుసటి రోజు కూడా సెలవే కాబట్టి, సోమవారం మధ్యాహ్నం వరకూ అక్కడే ఉంటామని చెప్పేసాడు అబ్బాయి.

ఆనాటి దిన పత్రికలన్నీ కుర్చీ పక్కనే కుప్పగా పడి ఉన్నాయి. ప్రధాన సంచికలు, జిల్లా వార్తలు, మహిళల పేజీలు, ఆరోగ్యం పేజీలు, యువ పేజీలు, సినిమా పేజీలు, క్రీడల పేజీలు - గాలికి మెల్లగా కదులుతూ చప్పుడు చేస్తూ ఉన్నాయి.

'చెప్పండి' అంది సీత. ఆ దినపత్రికల్ని నన్ను మార్చి మార్చి చూస్తూ. అప్పటికే ఆమెకు బాగా అర్థమైపోయినట్లు ఉంది. ఏదో వార్తా కథనం నాలో దిగులు కలిగించి ఉంటుందని.

'భయమేస్తోంది సీతా' సాధ్యమైనంత వరకూ నా ఆలోచనలు, భావాలు, భయాలు మొహంలో కనిపించనీయకుండా ప్రయత్నం చేసాను. క్షణం ఆగి 'ఈ రద్దీ రోడ్లను చూస్తుంటే..' అన్నాను ఆమెవైపు చూడకుండానే. దినపత్రికల నిండా రోడ్డు ప్రమాద దృశ్యాలే.

'అయితే రోడ్లపైన నడవడం, స్కూటర్ నడపటం, బస్సో, ఆటోలోనో వెళ్లడం మానెయ్యండి. ఒక పనైపోతుంది. పోనీ ఆఫీసుకు ఎట్లా వెళ్లొస్తారు? మహానగరాల్లో హెలికాప్టర్స్‌ని ట్యాక్సీలా వాడుతున్నారట కదా? మీలాంటి వాళ్లందరూ కలిసి అదేదో ఈ నగరంలోనూ ప్రయత్నించండి.. పోనీ..' అంది సీత.

'ఛ... ఊరుకో. చెప్పేది విను. కిషోర్‌కి ఫోన్ చేశాను. ఇంతకు ముందే' అని ఆగాను.

అప్పటి దాకా సరదాగా నవ్వుతూ ఉన్న సీత నవ్వాపి, నా వైపు అనుమానంగా చూస్తూ, ఆదుర్దాగా 'ఏమైందండి? ఆ పేషెంట్‌కి ఎలా ఉందంట?' అని అంది. కొంచెం ముందుకు వంగి, సీత.

'ప్చ్. పది నిమిషాలు.. సరిగ్గా పది నిమిషాలు ముందు వెళ్లుంటే కూడా అతని ప్రాణం నిలిచేదంట. ట్రాఫిక్‌లో ముందుగా వెళ్లలేని ఆ పది నిమిషాలు మనిషి నిండు ప్రాణాన్ని తీసేసాయి. ఆ కుటుంబం ఎంత తల్లడిల్లిపోతుందో?' అన్నాను.

సీత జవాబుగా ఏమీ మాట్లాడే ప్రయత్నం చెయ్యలేదు. ఆమె కళ్లల్లో విచారం వల్ల కన్నీళ్లు నిలిచాయి.

పెదాలు బిగపట్టి, 'పాపం' అని మాత్రం మెల్లగా గొణిగింది. కుర్చీలో అలసటగా వెనక్కు వాలి, కళ్లు మూసుకుంది. బహుశా నిన్న మేం 108 అంబులెన్స్‌లో చూసిన పేషెంట్ మొహాన్ని గుర్తు తెచ్చుకునే ప్రయత్నం చేస్తోందేమో.

చిత్తూరు తిరుపతి మధ్యలో ఇంకా అనాగరికంగా రైలు పట్టాలకు అడ్డంగా నాలుగు రైల్వే గేటులు ఉన్నాయి. ప్రభుత్వాలు ఎంత డబ్బు ఖర్చు పెడుతున్నా ఇప్పటికీ అక్కడ ఫ్లై ఓవర్స్ నిర్మించలేదు.

రుయా, స్విమ్స్, బర్డ్‌తో బాటు అధునాతన ఆసుపత్రులెన్నో తిరుపతిలో ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు బయలుదేరిన వాళ్లకైనా, తిరుపతిలో రైలో, విమానమో ఎక్కాల్సిన వాళ్లకైనా ఈ రైల్వే గేట్స్ వద్ద ట్రాఫిక్ ఆగిపోవటం వల్ల జరిగే నష్టాలు అన్నీ ఇన్నీ కావు. రోడ్లపైన రైల్వే క్రాసింగ్స్ ఉన్న ప్రతిచోటా ఇట్లాంటి ఇబ్బందులు ఉండనే ఉంటాయి. ఈ రైల్వే క్రాసింగ్స్ వల్ల ట్రాఫిక్ ఆగిపోయిన ప్రతి సందర్భంలో ఆస్పత్రులకు చేరకుండానే మృత్యువాత పడుతున్న వాళ్లెందరో ఉన్నారు.

108 అంబులెన్స్ డ్రైవర్ కిషోర్ రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఫోన్ చేసాడు. 'సార్, మీరు విలేకరి కదా. ఏమైనా చెయ్యండి సార్. ఇంతకు ముందు కూడా మీరు దీని గురించి వార్త రాసారు. అయినా లాభం లేదు. ఈ రోజు కూడా యాక్సిడెంట్ కేసు. ఎమర్జెన్సీగా తిరుపతికి పోతా ఉంటే రైల్వే గేట్స్ వద్ద బండి ఆపాల్సి వచ్చింది సార్. అయినా అందరికీ తొందరే. గేటుకు ఆ పక్క, ఈ పక్క రోడ్డు. మొత్తం రెండు వైపులా బండ్లు ఎదురెదురుగా నిల్చుంటే ఏ బండైనా ఎట్లా పోతుంది సార్? మనుషులకు ఇంత కూడా ఇంకిత జ్ఞానం లేకుండా పోతోంది సార్. 108కు దారి ఇవ్వాలి కదా. ప్రాణాపాయ స్థితిలో ఎవరు ఉంటారో కదా అనే మానవత్వం కూడా లేకుండా ఎట్లా బడితే అట్ల బండ్లు ఎనకా ముందూ, ఆ పక్కా ఈ పక్కా నిలిపేసినారు. గేటు

ఎత్తేయ్యగానే ముందుకు పోదామంటే వీలు కాలే సార్. పది నిమిషాలు గేటు వల్ల లేటయితే, గేటు తీసిన తర్వాత, పద్దెదు నిమిషాలు పట్టింది గేటు దాటే దానికి. నాకేమో పేషెంట్ పరిస్థితి అనుమానమే సార్. మేం ఎంత పరుగెత్తుకుంటూ పొయ్యి మనిషిని బండ్లో ఏసుకుని ఎలబారితే మాత్రం లాభమేమి సార్. ఇప్పుడా మనిషి ప్రాణం పోతే దానికి కారణం ఎవరు సార్? మన గవర్నమెంట్, మన అసమర్థత, మనలో దయ లేకపోవటమే కదా సార్. మీరు, ఇంత రాత్రి ఫోన్ చేసినానని ఏమీ అనుకోకండి సార్. మీలాంటి పెద్దోళ్లంతా అనుకుంటేనే... ఈ సమస్యకి పరిష్కారం దొరుకుతుంది సార్.'

కిషోర్ యువకుడు, చలాకీగా ఉంటాడు. వేరే ఉద్యోగాలు వచ్చినా 108లోనే పని చెయ్యాలనే ఉత్సాహం కలిగిన వాడు. మున్సిపల్ కమిషనర్‌కు అతడి గురించి చెప్పి, వార్తా పత్రికలో రెండు మూడు సార్లు ప్రత్యేక కథనాలు రాసి, జనవరి 26న అతడికి సత్కారం చేసిన కారణంగా నేనంటే కిషోర్‌కి అభిమానం. ఆ చనువుతోనే అప్పుడప్పుడు ముఖ్యమైన విశేషాలు, వార్తలకు సంబంధించిన వివరాలు ఏవైనా ఉంటే నాకు చెపుతూ ఉంటాడు. యాక్సిడెంట్స్ జరిగిన సమాచారాన్ని కూడా ఫోన్‌లో తెలియజేస్తూ ఉంటాడు.

రాత్రి భోంచేయబుద్ధి కాలేదు. ముభావంగా ఉంటే అప్పుడు కూడా మొహంలో మొహం పెట్టి 'ఏమైందని' అడిగిన సీతకు, కిషోర్ ఫోన్ గురించి చెప్పాను.

అప్పటి నుండి ఆలోచిస్తూనే ఉన్నాను. రాత్రి నిద్ర సరిగ్గా పట్టలేదు. విలేకరిగా చాలా దగ్గరగా చూసిన ఎన్నో యాక్సిడెంట్స్ తాలూకు భయానక దృశ్యాలు గుర్తొచ్చి కలవరపెడుతూనే ఉన్నాయి. పిల్లల్ని కోల్పోయిన తల్లిదండ్రులు, అమ్మా నాన్నల్ని కోల్పోయిన పిల్లలు, వంశాంకురాలే లేకుండా మొత్తంగా మరణించిన కుటుంబాలు, క్షతగాత్రుల దుఃఖాలు, రక్తసిక్తమైన రోడ్లు, చెల్లాచెదురైన శరీర భాగాలు గుర్తొస్తూనే ఉన్నాయి.

ఉదయం నుండి ఎక్కడకూ వెళ్లాలనిపించలేదు. పుస్తకాలూ, పత్రికలూ తిరగేస్తూ ఇంట్లోనే ఉండిపోయాను. ఇంతకు ముందే కిషోర్ మళ్లీ ఫోన్ చేసి విషయం చెప్పాడు.

పది - ఇరవై నిమిషాల కాలయాపన వల్ల మరణించిన ఆ మనిషెవరో నాకు నేరుగా తెలియకపోవచ్చు. కానీ తెలియదని ఎట్లా చెప్పగలను? నాలాగా అతడూ ఒక మనిషే కదా.

నిశ్శబ్దాన్ని చెదరగొడుతూ సెల్‌ఫోన్ గిర్రుమంది. మ్యూట్‌లో, వైబ్రేషన్‌లో ఉండి, చప్పుడు చేస్తూ టీపాయ్ పైన సెల్‌ఫోన్ కదిలింది. సంక్షిప్త సమాచారం.

పద్మశ్రీ థియేటర్ సర్కిల్ వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కాలేజీ కుర్రోళ్లు అక్కడికక్కడే మరణించారని సారాంశం.

పత్రికా ఫోటోగ్రాఫర్‌కి ఆ సమాచారాన్ని సెల్‌ఫోన్ నుండి పంపించాను. క్షణాల్లో బదులు సమాచారం 'ఒకే సార్' అని వచ్చేసింది.

వార్తల పైన బతికే వాళ్లకి, వార్తలే ఆహారం, నిద్ర, విశ్రాంతి. వేరే జీవితం అంటూ ఉండదు. నిద్ర లేచిందగ్గర్నుండి నిద్రపోయే దాకా, అవసరమైతే నిద్ర మధ్యలో అయినా వార్తలదే ముఖ్యమైన పాత్ర.

దినపత్రికలు, వార్తా ఛానల్స్ పెరిగిపోయాక పాత్రికేయుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. ఆ పోటీలో వెనుకబడిపోకుండా పరుగెత్తి, పరుగెత్తి అలసిపోతూ ఉన్నాను.

కిషోర్ చెప్పిన విధంగా రైల్వే గేట్లు మార్చాలనే విషయం పత్రికల ద్వారా అధికారులకి, ప్రజా ప్రతినిధులకి ప్రభుత్వానికి ఇదివరకే చాలాసార్లు చెప్పటం జరిగింది. ఇంకా ఎన్నాళ్లు, ఎన్నేళ్లు పడుతుందో తెలియదు. రహదార్ల పైన రైల్వే క్రాసింగ్స్ వల్ల జరుగుతున్న అనర్థాల గురించి వార్తలు రాసి లాభం లేదనిపించింది.

ఆమాటే అన్నాను సీతతో.

అప్పటికే తను ఏదో నిర్ణయానికి వచ్చిన దానిలా ఉంది. వాళ్ల నాన్న ఆటోలో వస్తూ, లారీ వేగంగా ఢీకొనడం వల్ల మరణించాడు. అప్పట్లో 108 లాంటి సౌకర్యాలు లేవు. గాయాల పాలయి రక్తం కారుతూ రోడ్డుపైన ఏడ్చినా, అరచినా, బతిమిలాడినా అతడ్ని కాపాడటానికి రోడ్డు పైన ఒక్కడు కూడా కదలి రాలేదు. అందరూ సినిమా చూస్తున్నట్లు, చూస్తుండి పోయిన వాళ్లే. గుక్కెడు మంచినీళ్ల కోసం కలవరించి, అదయినా అందకుండానే అతడు మరణించిన దృశ్యం ఆమెను ఎప్పుడూ దుఃఖానికి గురిచేస్తూనే ఉంటుంది.

'లేదండి. నేనూ చాలా కాలంగా ఇదే విషయం గురించి ఆలోచిస్తూనే ఉన్నాను. పత్రికల్లో, టీవీల్లో వార్తలు వచ్చినంత మాత్రాన జనంలో కానీ, అధికారుల్లో కానీ, ప్రభుత్వంలో కానీ చలనం రాదని తెల్సిపోయింది. కానీ ఏదో ఒకటి చెయ్యాలండి. ఇట్లా చూస్తూ ఉంటే లాభం లేదండి. మనమొక సమావేశం ఏర్పాటు చేద్దాం. అంతా వారం రోజుల్లోపలే జరిగిపోవాలి. బాధ్యత కలిగిన వాళ్లని, బాధితుల్ని పిలుద్దాం. రోడ్డు ప్రమాదాలు ఎక్కడెక్కడ ఎక్కువగా జరుగుతున్నాయి, ఆ కారణాలేమిటి? క్షతగాత్రుల్ని బతికించుకోటానికి మనమేం చేయాలో ఆలోచిద్దాం.'

ఆ మాటల్లో ఆమె పట్టుదల కనబడుతోంది.

'.. ఆర్‌టిఒ, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, నేషనల్ హైవే అథారిటీస్, ఊళ్లో పెద్దవాళ్లు, విలేకరులు, ఎన్‌జిఒలు, కాలేజి ప్రిన్సిపాల్స్, పేరెంట్స్, ఆటో యూనియన్ వాళ్లు... ఇట్లా జాబితా రాసుకుందాం ముందు. అందర్నీ కలుద్దాం. అందర్నీ ఒకచోట కలుపుదాం. ఒక్కసారే కుదరకపోతే పోనీ, మళ్లీ ప్రయత్నిద్దాం. మళ్లీ మళ్లీ ప్రయత్నిద్దాం. ఎవరేం చెపుతారో విందాం. ఎవరేం చెయ్యాలో మాట్లాడుకుందాం.'

సీత గొంతు స్థిరంగా ఉంది. ప్యాడ్, పేపర్, పెన్ను ఆమెకు అందించి చెప్పాను.

'నువ్వు అన్నీ రాయి సీతా. ఆలోచిద్దాం. ఇంకా మనమేం చెయ్యగలమో అంతా చేద్దాం. నువ్వు రాస్తూ ఉండు. నేను ఆ యాక్సిడెంట్ న్యూస్ కవర్ చేసుకుని వచ్చేస్తాను.'

* * *

సోమవారం ఉదయం - ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి విపరీతంగా జనం. వందలాది మంది విద్యార్థులు గుంపులు గుంపులుగా. ముందు రోజు సాయంత్రం యాక్సిడెంట్‌లో మరణించిన కుర్రాళ్లిద్దరూ స్వంత అన్నదమ్ములు. ఒకే కాలేజీలో చదువుతున్నారు. వాళ్ల తల్లిదండ్రులిద్దరూ పెద్ద ఆఫీసర్లు. ఆ కుర్రాళ్లు చాలా మంచి వాళ్లని, చదువులో, ఆటల్లో ముందుంటారని, ఇద్దరూ స్నేహితుల్లా ఉంటారని, బైక్ రైడింగ్ అంటే పెద్దవాడికి చాలా ఇష్టమని తెలిసింది.

అక్కడి నుండి కదలబోతుంటే ఎస్సై కనిపించాడు. గుంపులోంచి దూరంగా వచ్చి నిలబడ్డాడు. అతడి దగ్గరకు నడిచాను. పలకరింపులయ్యాయి. అతడు కొత్తగా ఉద్యోగంలో చేరినవాడు. ఏదైనా మంచి చెయ్యాలనే తపన కలిగినవాడు.

కథ

రాజకుమారుడు-కార్వేటమ్మ

- పాణి

ముఖాముఖం

ఆయన రాజకుమారుడు, అయితేనేం.. లక్షలాది మందిని చెంపలు నిమిరి ఓదార్చగలడు. సరిహద్దులు చెరిపేస్తూ సామ్రాజ్యాన్ని విస్తరించుకోగలడు.. ఈ కాలంలో తప్పక అందరూ తెలుసుకోవాల్సిన...

నేనిలా మొదలు పెట్టేనో లేదో.. ఆయన కించిత్ అసహనంగా 'ఇది నా కథలాగే ఉందే..' అన్నారు.

'మరి.. సంతోషించాల్సిందిపోయి..?' అని నేనన్నాను.

'ఈ జెయిలు.. బెయిలు.. మీరేదైనా మాయోపాయం చెప్తారని లోనికి రానిచ్చాను.... కానీ ఇదంతా ఏమిట'ని ఆయనకు విసుగుకలిగినట్టుంది. నిజమే. అతి విశాలమూ, సుందరమూ అయిన ఈ జెయిలులో ఆయన చతురంగబల సమేతుడైన రారాజు వలెఉన్నా, కిరీటము లేని యశో ప్రకాశంతో ఉన్నా.. కనుచూపుల్లోని జిత్తులమారితనాన్ని, గాంభీర్యాన్నీ దాటుకొని పలుచని విచారమేదో ప్రసరిస్తోంది. కానిపని అనేది ఒకటుంటుందనే ఎరుగని మానవుడికి బెయిలు అందని మాను పండుగా మారిపోవడమే ప్రస్తుత విచారానికి కారణం. ప్రచారమంటే ప్రాణంపెట్టే రాజకుమారుడు.. నేను జెయిలు దగ్గరికి వెళ్ళిన తొలిసారి అపాయింట్‌మెంట్ అడిగితే 'వచ్చే వారం చూద్దామ'న్నారు.

ఆయన ఎంత కుశాగ్రబుద్ధి అంటే.. నేనేమంత సుప్రసిద్ధుడ్ని కాకపోయినా, పేరు చెప్పగానే చప్పున పోల్చుకున్నారు.

అట్లా నేనీ వేళ జెయిలు లోపలికి వచ్చాను.

జెయిలులో దొరవారి దర్శనం ఎంత వైభవోజ్వలమంటే-జేబులు దొంగతనం చేసినవాళ్ళతో, తాగి పెళ్ళాన్ని కొట్టినవాళ్ళతో, గట్టి తగాదాపడ్డవాళ్ళతో.. .. వాళ్ళ సంబంధీకులు మాట్లాడాలంటే జాలీకి ఆవల నిలబడి ఉండాల్సిందే. కానీ ఐదు వేల కోట్ల వ్యవహారంపై జెయిలుకు వచ్చిన రాజకుమారుడ్ని నేరుగా ఇలా ప్రధాన ద్వారం దాటి లోపలికి వెళ్ళి కలవవచ్చు.

ఇష్టం వచ్చినంత సేపు తనివి తీరా ముచ్చటించవచ్చు.

ఇద్దరమూ పూతోట నీడలో ఆహ్లాదభరిత వాతావరణంలో ఉన్నాం. ఇందాకటి చిరుకోపాన్ని తుడిచేసుకొని మందహాసంతో ఆయన ఇలా మొదలు పెట్టారు.

'బెయిలు గురించి మీరేమి చెప్పకపోయినా ఫర్వాలేదు. మీ చేతిలోఉన్నది మీరు చేయండి. అయితే నా గురించి నేనే చెప్తాను. మీ ఇష్టం. ఎలాగైనా రాసుకోవచ్చు. ఎలాంటిదైనా ప్రచారం ప్రచారమే అని నమ్మేవాణ్ణి నేను. దాని బలం దానిదే. కాదని.. పదే పదే చెప్పడం వల్ల అవుననే ఫలితం వస్తుంది. దొంగ దొంగ అని కోడై కూస్తే వచ్చే నష్టం ఏమీ లేదు. దొర అనే అర్థం అందులోంచి బైటికి వస్తుంది. ప్రచారానికి ఉండే ఒక అంచు మాత్రమే అందరికీ తెలుసు. నాకు రెండో అంచు కూడా తెలుసు. పెట్టుబడి.. ఎక్కడికి వెళ్ళినా లాభాలను తన వెంటేసుకొని

'సరిగ్గా నెల క్రితం ఈ కుర్రాళ్లిద్దరూ దూకుడుగా బండి నడుపుతుంటే ట్రాఫిక్ వాళ్లు పట్టుకున్నారు. మిత్రమా! ఆ తల్లిదండ్రులిద్దర్నీ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చాను. వాళ్లప్పుడు నా పైనే తిరగబడ్డారు. కుర్రాళ్లన్నాక ఆ మాత్రం స్పీడ్ ఉంటుందంట. ఆ స్పీడ్ కోసమే లక్ష రూపాయలు పెట్టి ఖరీదైన కొత్త మోడల్ కొని ఇచ్చారట. అన్ని రంగాల్లో ఆ కుర్రాళ్లు ప్రతిభావంతులట. వేగంగా రద్దీ రోడ్లపైన స్పీడ్‌గా స్కూటర్ నడపడం కూడా వాళ్ల ప్రతిభేనంట. నేను దాన్ని గుర్తించకుండా, ఆ పెద్దవాళ్లిద్దర్నీ స్టేషన్‌కు పిలిపించటం వాళ్లకి నామోషీ అట, టైం వేస్టంట. అప్పుడే వాళ్లకు చెప్పాను. తల్లీ! ప్రతిభ కన్నా జీవితం, భవిష్యత్తు ముఖ్యమైనవమ్మా. నువ్వన్నా నీ బిడ్డల్ని దూకుడు తగ్గించుకోమని చెప్పమ్మా అని ఎంత చెప్పినా వాళ్లు వింటే కదా. ఇప్పుడు చూడు మిత్రమా ఏమయ్యిందో. ఈ వయసులో ఏం చేస్తున్నారో కుర్రాళ్లకు తెలియదనుకో. వాళ్ల తల్లిదండ్రులక్కూడా తెలియదంటే ఏమనుకోవాలి మిత్రమా! అప్పటికీ స్టూడెంట్స్‌కి అప్పుడప్పుడూ కాలేజీల్లో కౌన్సిలింగ్ ఇస్తూనే ఉన్నాను. అది చాలడం లేదు. ఏదో చెయ్యాలి మిత్రమా! యాక్సిడెంట్స్ విపరీతంగా జరుగుతున్నాయి' బాధగా అన్నాడు ఎస్సై. తలతిప్పి అటువైపు చూస్తూ.

పత్రికా విలేకరులు ఫొటోగ్రాఫర్స్ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ ఉన్నారు. తెలిసినవాళ్లు, తెలియని వాళ్లు ఎవరెవరో వచ్చి వివరాలు తెలుసుకుంటూ, సానుభూతిగా మాట్లాడుతూ ఉన్నారు. ఎవరెంత ఓదార్చినా, ఆ దంపతులకు ఏడుపు ఆగటం లేదు. గుండెలు అలిసేలా రోధిస్తున్నారు.

సైరన్ మోతతో, అప్పుడే 108 వచ్చి ఆగింది.

కిషోర్ కనిపించాడు. అతడి మొహంలో విచారం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. అతడి చొక్కాపై అక్కడక్కడా రక్తపు మరకలు.

'చిన్న గుంత సార్. తారు ఎగిరిపోయి గుంత పడింది. దాన్ని పూడ్చాలంటే అర్ధగంట కూడా పట్టదు. మహా అంటే ఐదొందలు కూడా అవదేమో సార్. మొన్నొకడు స్పాట్‌లోనే పోయాడు. ఇప్పుడు ఇంకొకడు పెండ్లయ్యి నెల కూడా కాలేదంట. బతికేది అనుమానమే సార్' మేం అడగక ముందే వివరాలు చెప్పుకొచ్చాడు కిషోర్.

పెదవి కొరుక్కుంటూ, ఎస్సై తల అడ్డంగా ఆడిస్తూ 'ప్రమాదాలకు అంతమే ఉన్నట్లు లేదు. చిన్న చిన్న తప్పిదాలు, ఏమరిపాటు, నిర్లక్ష్యం, పది నిమిషాలు ముందు వెళ్లాలనే ఆరాటం, నిద్రలేకపోవటం, పనికి రాని రోడ్లు, తాగుడు ఎన్నో కారణాలు.. రోడ్డు ప్రమాదాలకు. ఎంతమంది మిత్రమా ఇట్లా...' అంటూ సెల్‌ఫోన్ మోతతో మాటలాపేసాడు.

కిషోర్ జేబులో సెల్ మోగింది.

క్షణాల తేడాతో నా సెల్‌ఫోన్ కూడా గుర్ అంది. ముగ్గురూ సెల్‌ఫోన్స్ చేతుల్లోకి తీసుకుంటూ, ఒకర్నొకరు చూసుకున్నాం.

ఎక్కడో మళ్లీ ఏదో యాక్సిడెంట్ జరిగినట్లే ఉంది. కిషోర్ ఫోన్ ఆన్ చేసి అటువైపు కదిలాడు, మాట్లాడుతూనే. 'ఏం చేద్దాం. ఎలా చేద్దాం? ఎలా?' ఇద్దరం ఒక్కసారే అన్నాం.

ఎట్లా వస్తుందో ప్రచారం కూడా అంతే. లింక్ రిటర్న్స్ ఉండే వ్యాపారం లాంటిది. ఎవరికి అమ్ముతాం, ఏం అమ్ముతాం.. అనేది కాదు, అది తెచ్చే లాభాల మీదే శ్రద్ధ ఉండాలి. ప్రచారానికి ప్రచారమే పెట్టుబడి, అదే సరుకు, అదే లాభం...'

ఎందుకో ఓ క్షణం ఆపారు.

చుట్టుపక్కల చాలా ఖరీదైన ఖైదీలు ఉన్నారు. వాళ్ళంతా అల్లంత దూరాన ఉన్నా రాజకుమారుడి వైపు పదే పదే ఆపేక్షగా చూస్తున్నట్లు నాకు అర్థమైంది. మధ్యలో జైలు అధికారి విధేయంగా వచ్చి సార్.. ఏం కావాలన్నట్లు కొంచెం శిరసు వంచి కళ్ళలోకి చూశాడు. దానికాయన ఎడం బుగ్గ మీద చిరు సొట్ట పడేలా పళ్ళు బిగించి నవ్వుతూ 'ఏమీ అవసరం లేద'ని అతి మన్ననగా సమాధానం ఇచ్చారు. అయినా గుమ్మపాలతో చేసినట్లుండే చిక్కటి కాఫీ వచ్చింది. అది ఒక కప్పు మాత్రమే.

తీసుకోండి.. అన్నట్లు మళ్ళీ అలాగేనవ్వుతూ నా వైపు చూశారు.

రెండు నిమిషాల్లో నిమ్మకాయ సువాసన వెదజల్లుతూ లేత బంగారురంగులో ఉండే డికాషన్ ఓ ప్రత్యేకమైన కప్పులో వచ్చింది. సదరు అధికారి అతి జాగ్రత్తగా ఆ కప్పును ఆయన చేతికి అందించి వెళ్ళిపోయాడు. దాన్నాయన నాజుకుగా ఆస్వాదిస్తూ.. మళ్ళీ ఇలా మొదలుపెట్టారు.

'నాన్నగారి గురించి పత్రికలు అవాకులూ చవాకులూ పేలుతూ ఉంటాయి. కానీ ఆయన మహానేత. ఈ సంగతి ప్రజలు తదేకంగా చాటుతున్నారు. ఆయన తన అధికారాన్ని ప్రజల కోసం, తన కోసం, తన వాళ్ళ కోసం సమానంగా వినియోగించారు. ప్రజాస్వామ్యంలో అధికార ఫలాలను పంచిపెట్టడమంటే ఇంతకంటే అర్థం ఏముంటుంది? ఈ స్ఫూర్తితోనే ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారు. ఆయన నన్ను చిన్నప్పుడు ఎంతగా లాలించారో ఈ ప్రజలను అంతగా పాలించారు. అందుకే ప్రజలనూ, నన్నూ సమానంగా చూశారు. ప్రజలకు ఎంత ఇచ్చారో నాకూ అంతే ఇచ్చారు. నాకు ఎంత ఇచ్చారో ఆశ్రితులకూ అంతే ఇచ్చారు. ఇవ్వడం, తీసుకోవడం అనేవి ఆయనలా మరెవరికీ తెలియదని నా అభిప్రాయం. నీ వల్ల నాకు లాభం.. నా వల్ల నీకు లాభం అనే పరస్పర పరోపకార సూత్రాన్ని ఆయన తొలిసారి ఆవిష్కరించారు. ప్రజలకు ఎన్నో బంజరు భూములు ఇచ్చారు. గనులు తవ్వుకోడానికి నాకు లక్షలాది ఎకరాలు ఇచ్చారు. అయినవాళ్ళు అడిగితే కాదనకుండా భూమి కట్టబెట్టడంలో ఆయన రంతిదేవుడ్ని మించిపోయారు. ఇదంతా ఏకబిగిన చెప్పారు. అప్పుడాయన ఎంత నిరావేశంగా ఉండాలనుకున్నా సాధ్యపడలేదు. ఒక దీర్ఘమైన శ్వాసతోపాటు విరామం తీసుకున్నారు. అలా ఆయన చెప్తోంటే ఎవరైనా తమకంలో ఊగిపోవాల్సిందే అనిపించింది. నేనలా ఆలకిస్తుండిపోయానో, రాసుకుండిపోయానో.. రెండూ చేయకుండా చూస్తుండిపోయానో...

ఇది సరే..కాని ఆయనలో ఎంత తర్కశుద్ధి ఉంది? అనిపించింది.

రాజకుమారుడు మళ్ళీ అందుకున్నారు.

'మా తాతగారు దయాళువు. కష్టజీవి. మా నాన్నగారు గెలిచిన సామ్రాజ్యానికీ, నేను కోల్పోయిన ప్రాభవానికీ ఆయనే ఆధారం. ఆయన పిచ్చుకలాంటి వాడు. కష్టపడి వాణ్నీ వీణ్నీ కొట్టి పుల్లాపుడక సేకరించి గూడు కట్టారు. నేల మీద దొరికేవాటితో సరిపెట్టుకోక, నేల లోపల ఉండేవాటి మీద ఆయన పదునైన చూపు పడ్డాక వాటిని వెలికి తీయడానికి చాలా పరిశ్రమించారు. ముగ్గురాయి విలువను మా సీమలో మొదట కనుగొన్నది ఆయనే. మతం మార్చుకోవడమంటే ఏమిటో ఆయనకు తెలిసినట్టు మరెవ్వరికీ తెలియదు. జీసస్ ఆయనను క్షమించకపోవచ్చు. కానీ జీసస్ ఎట్లా అక్కరకు వస్తాడో తాతగారికి బాగా తెలుసు. అంతే.. ఇక ఆయన నిర్మించిన పిచ్చుకగూడు సామ్రాజ్యమైనది. రాజ్యమన్నా, సామ్రాజ్యమన్నా.. అక్కడ పువ్వుల తోటలూ విరబూస్తాయి. ఇంద్ర ధనస్సులు చేతికి అందుతాయి. అడ్డం వచ్చిన తలలు తెగిపడతాయి. తప్పదు. ఆయన తన కోసం ఏమీ చేసుకోలేదు. తన సామ్రాజ్యం కోసమే ఎన్నో చేశారు. అంత వరకు సంపద పోగేయడమే తెలిసిన మా కుటుంబానికి లాభాలు అంటే ఏమిటో అప్పుడప్పుడే తెలిసిన కాలం అది. లాభం అయస్కాంతంలాంటిది. మాలాంటి వాళ్ళ ఆత్మ అందులో ఉంటుంది. ..'

అని క్షణ కాలం ఆగి,

'..ఇంతకూ మీకు నంపదకు, లాభాలకు ఉన్న తేడా తెలుసనుకుంటాను?' అన్నారు.

నేను భలే ఇబ్బందిపడిపోయాను. తెలుసనాలా? లేదనాలా? అసలు ఇంత సీరియస్ వ్యవహారంలో ఈ కొంటె ప్రశ్న ఏమిటి?. ..అని నేను మనసులో అనుకోవడం పసిగట్టినవాడిలా, 'ఇది చాలా సీరియస్ విషయం..' అన్నారు.

నేను తారెత్తిపోయాను.

కొంపదీసి ఈ జెయిల్లోగాని కర్ణ పిశాచిని వశపరుచుకున్న మంత్రగాడు లేడు గదా? వాడు ఏ దిక్కుమాలిన కేసు మీదనో ఈ జెయిలుకు వచ్చి, అమావాస్య అర్ధరాత్రి చీకటి పరదాల చాటున తన విద్యలను రాజకుమారుడికి నేర్పిస్తున్నాడా? ఏమి? అనిపించింది.

ఆయన వైపే చూస్తున్నవాడినల్లా అప్రయత్నంగా నాలుగు వైపులా చూశాను. అలాంటివాళ్ళు ఎవరైనా కంటపడతారేమో అని. ఆ క్షణాలు గడిచాక నా ప్రవర్తనకు నాకే నవ్వొచ్చింది. బార గడ్డం, నామాలు, పెద్ద బొట్టు పెట్టుకున్న వ్యక్తి ఎవరైనా కనిపించి ఉంటే.. నేను నిజంగానే నమ్మేవాడినేమో!

అలాంటి వారెవరూ నాకు కనిపించలేదు గాని, ఆ జెయిలు అంతర్ ప్రాంగణం అంతా ఇంతకు ముందటికంటే జన మంద్రమైనట్లు కనిపించింది. అక్కడక్కడా కొందరు దట్టమైన చూపులు నలుదిశలా విసురుతూ నిలబడి ఉన్నారు. వారంతా రాజకుమారుడి అంతరంగిక భద్రతా సిబ్బంది అన్నట్లుగా ఉన్నారు. జెయిలు అయితేనేమి? రాజ మహలు వలె ఉంది గదా? అనిపించింది. రాచకార్యములన్నీ సాగుతూ ఉన్నప్పుడు ఈ జెయిలును మహలు అంటే వచ్చే లోపం ఏముంది?

మధ్యాన్నం సూరీడు నెత్తిమీదికి వచ్చాడు. ఆ చల్లని తోట నీడలో గాలులు తోలుతున్నా రాజకుమారుడి ముఖంపై చిరు చెమటలు ముసురుకున్నాయి. నేనిలా ఆలోచిస్తూ ఉండగా ఆయన విప్పారిన కన్నులతో ఇలా అందుకున్నారు.

'ఎంతైనా మా తాతగారు పాత కాలపు మనిషి. గట్ల తగాదాల నుంచి అన్నీ పట్టించుకునేవారు. దుప్పటి పంచాయితీల్లో ఖ్యాతి గడించారు. ఏ మాత్రం నాజూకుతనం లేకుండా తలలు తీసేవారు. మహానేత, ప్రియతమ నాన్నగారిది గద్ద చూపు. మా తాతగారు పాటించిన పాత పద్ధతుల్లో చాలా వాటికి ఆయన స్వస్తి చెప్పారు. తాతగారికి సంపద పోగేయడం మీద, ఊళ్ళో అధికారం మీదే ఎక్కువ ధ్యాస. అయినా ఆయనది ఏ పాటి సామ్రాజ్యం! అంతా అక్కడక్కడే. ఆయన లాభాల గురించి కాస్త తెలుసుకున్నా.. మా నాన్నగారు మాత్రం అచ్చంగా లాభాలకు, అత్యధికారానికి పునరుత్పత్తి అయ్యారు. చాలా మంది సామంతరాజులను తయారు చేసుకున్నారు. ఆయనలా పునరుత్పత్తి కావడానికి ఆయన సమకాలీకులు ఎంత తపనపడ్డారో! ఒక్కమాటలో చెప్పాలంటే నాన్నగారు రాజులకు రోల్ మోడల్. ఆయన తెల్లని దుస్తులను, చిరునవ్వును నిత్యం కవచాలుగా ధరించి ఉండేవారు. తాతగారు గనులు ప్రారంభించారు.

అంతే. కానీ నాన్నగారు గనులకు రారాజు అయ్యారు. అయినవాళ్ళకు, ఆశ్రితులకు తొవ్వుకున్నన్ని గనులు అప్పగించారు. గనుల జ్ఞానంలో, గనుల ఎకానమీలో ప్రియతమ నాన్నగారు తరగని గని. దేశం దేశమంతా పాదయాత్ర చేసి ఎక్కడెక్కడ గనులు ఉన్నదీ, ఏ నేలలో ఎంత సంపద దాగి ఉన్నదీ, దాన్ని ఎట్లా లాభాలుగా మార్చుకోవచ్చనేదీ అంగుళం అంగుళం గమనించివచ్చారు. దేశంపట్ల ఎంతో ప్రేమ ఉన్న మహానేత ఆయన. అధికారాన్ని హస్తగతం చేసుకున్నాక ఆయన ప్రభుత్వాన్ని గనుల పరం చేశారు. గనులను లాభాల పరం చేశారు. గనులను, భూములను ప్రభుత్వం పరం చేయాలనే చాదస్తాన్ని ఆయన తిరగేసి ప్రభుత్వాన్నే గనుల పరం చేశారు. గనులు ఉన్నాక గన్నులు ఉండాల్సిందే కదా? లాభాలకే కాదు, ఆయన శాంతిభద్రతలకూ ప్రాణం పెట్టే మనిషి. ఈ దేశానికి ఆయన చేసిన అతి ముఖ్యమైన మేలు ఏమిటని చరిత్రలో ఎప్పుడు, ఎవరు పరిశీలించినా గనులు-గన్నులు ఇంతగా వినియోగంలోకి తేవడంలోని దూరదృష్టి కనిపిస్తుంది. ఆయన జీవన తత్వం ఇదే. దీంతో అంత వరకు తల్లకిందులుగా ఉన్నదంతా సవరించినట్లయింది. ఈ నేలలోని లాభాల మొలకను ఆయన తీర్చిదిద్ది, నీరు పోసి కాపాడారు. రాజ్యాంగాన్ని, రాజ్యయంత్రాన్ని, చట్టబద్ధపాలనను కంచెగా వేసి ఆ మొక్కలను మాన్లుగా పెంచారు. ఇప్పుడు అందరూ సేద తీరుతున్నది ఆయన సాకి సంతరించిన వనం నీడలోనే...'

ఈ విషయాలు చెప్తున్నప్పుడు రాజకుమారుడు ఒకింత పారవశ్యానికి లోనైనట్టుంది. అదే స్థితిలో ఉండి ఉంటే ఇంకెన్ని అద్భుతాలు చెప్పేవారోగాని, ఈ లోగా జెయిలులో భోజన వేళ అయింది. ఏదో సైరన్ మోగినట్లు ఖైదీల్లో చెట్ల కింద ఉన్నవాళ్ళూ, బ్యారెక్‌లో ఉన్నవాళ్ళూ బిలబిలమంటూ ఆవరణలోకి మూగారు.

ఆ సందడికి రాజకుమారుడు డిస్టర్బ్ అయ్యారు. చెబుతున్న వాక్యం తెగిపోయింది.

తండ్రిగారి జ్ఞాపకాల నుంచి బయటికి వస్తూ ఓ సారి ఓరగా భుజం మీది నుంచి వెనుకకు మెడ తిప్పి చూసి భోజన సందోహాన్ని అర్థం చేసుకొని, ముఖాన్ని తేటగా మార్చుకొని 'మీరూ తినాలేమోగా..!' అన్నట్లు చూశారు. నేను అంతే సాధారణంగా, మన ముందున్న పని ముందు అదేమంత ముఖ్యం కాదనీ, తినడంలాంటివన్నీ ముగించుకొనే వచ్చాననీ అన్నట్లు చూశాను.

అందంతా యథాలాపమే.

మళ్ళీ మొదలు పెట్టారు.

'నాన్నగారు అధికారంలోకి వచ్చేనాటికి నాకు వీటి పట్ల అవగాహన లేదనే చెప్పాలి. శరీర తమకంతో ఉండేవాడిని. ఆ తర్వాత నాకు ఒక ముఖ్యమైన విషయం తెలిసింది. అదేమంటే-క్షాత్రమున్నవాడే క్షత్రియుడని పాత రోజుల్లో అన్నట్లు .. ఆర్జన తెలిసినవాడే రాజకుమారుడు.. అని. బహుశా నాన్నగారు ఈ దేశ ప్రజల ప్రియతమ నేతగా అధికారాన్ని చేజిక్కించుకునే క్రమంలో నాకు ఈ జ్ఞానోదయం అయింది. ఆయన పాలనా కాలంలో ఎన్ని అద్భుతాలు జరిగాయంటే, పొరుగు రాజ్యంలో ఉండే మా దాయాది ఒకాయన.. వాళ్ళ దేశంలో గనులు తవ్వుకుంటూ తవ్వుకుంటూ నేరుగా సరిహద్దులు దాటి మనదేశంలోకి వచ్చేశారు. ఇది ఎంత అపురూపమైన సన్నివేశం! అట్లా ఆయన వేల ఎకరాల్లో గనులు తవ్వుకొని పది రూపాయల ఖర్చుకు పది వేలు చొప్పున ఆర్జించారు. ఆయన మనదేశంలో గనులు తవ్వి, ఇక్కడి నుంచి సముద్రం దాకా సొంతంగా రైలు మార్గం వేసుకొని ఇతర దేశాలకు ఎగుమతి చేశారు. మట్టే అయితేనేం. దాని విలువ నాన్నగారికి తెలిసినట్లు మరెవరికీ తెలియదు. అక్కడిదాకా ఎందుకు? జనాలకు నీళ్ళు కావాలని చెప్పి హడావుడిగా నదిని మా రాచ నగరి వైపు మళ్ళించారు. అప్పటికే వేల ఎకరాల్లో నా కోసం ముచ్చటగా స్థాపిస్తున్న ఇనుప పరిశ్రమ కోసం ఏకంగా నదినే తరలించారు. అంతేకాదు.. ఆయన కోట్ల కోట్ల రూపాయలతో కాలువలు తవ్వించిన వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోతారు. నీళ్ళు పారుతాయా లేదా? అనేది కాదు. కాలువలు తవ్వామా? లేదా అనేదే ముఖ్యం. కానివాళ్ళు దీన్ని వేలెత్తి చూపించారు. అయినా నాన్నగారి ఉక్కు సంకల్పం సడలలేదు. తవ్వుకున్నవాళ్ళకు తవ్వుకున్నంత... అనే పద్ధతిలో ఎందరో ఈ కాలువల సంతర్పణతో లాభపడ్డారు. లాభాలకు కుల మతాలు, జాతి బేధాలు ఉండవని చాటి చెప్పడంలో నాన్నగారిని మించిన వారెవరూ లేరు. అందుకే నేను దేశ దేశాల్లో పెట్టుబడులు పెట్టడానికి ఆయన తన అధికారంతో సరిహద్దులన్నీ చెరిపేశారు. దాని కోసం ఈ దేశాన్ని అంగుళం అంగుళం కొలిచి వాళ్లకు అప్పగించేశారు. ఎక్కడ లాభం వస్తుందంటే అక్కడికి వెళ్ళిపోయి పాగా వేశాను.. ప్చ్.. ఈ వేళ ఇలా కానికాలం దాపురించి ఈ జెయిలుపాలై బెయిలు కూడా రాకపోవచ్చుగాని ఆ మహానేత చూపిన ఒరవడిలో లాభాలనే సూత్రం మీద నిలబడి ఈ ప్రపంచానికి ఎగబాకడమనే జీవన తత్వాన్ని అలవర్చుకున్నవాణ్ణి...'

ఈ చివరి వాక్యాలను.. ఆయన నిజంగానే చేజారిపోతున్నవాటిని కూడగట్టుకుంటూ, ధీరోధాత్తంగా తమకంతో, పారవశ్యంతో.. పలవరింతగా.. పదే.. పదే..

2

బావి తవ్వకం:

ఎండ మిటమిటలాడుతోంది. ఊళ్ళోని మవాళ్ళంతా రచ్చకట్ట కింద కువ్వయినారు. అప్పటికే పెళ్ళాం పిల్లలతో వలస పోయినవాళ్ళు పోయారు. కరువు వచ్చి ఊరు ఎట్లున్నదీ. అక్కడున్నవాళ్ళ ముఖాల్లోనే కనిపిస్తోంది. తిండి కత సరే, నీళ్ళకు ఎట్లరా భగవంతుడా? అని తనకలాడుతున్నారు. ఎవరి రంధితో వాళ్ళు కాళ్ళూ చేతులు ఆడక అక్కడికి వచ్చారు.

'ఏందిరా? నీళ్ళ కోసం ఈ బాధ ఏంది? ఏ పొద్దన్న ఇట్ల ఉండెనా? లంగనా కొడుకు రాజ్యమైంది..' అని ఒకాయన కడుపులో ఉండేది బయట పెట్టుకున్నాడు.

'నెలకు మూడు వానలు మనకు యానాడు లేవుగాని, మా చిన్నప్పుడు బాయిలు ఈతరాన ఎండిపోయిందిల్యా. ఈ బోర్లొచ్చినాకనే ఇట్లయింది?' అని ఒక ముసలాయన అన్నాడు.

'నిజమే. పై నుంచి వానలు కురిసేవి. కింది బాయిల్లో నీళ్లు ఊరేవి. ఏదో కాలమట్లా గడచిపోయేది. అట్లాంటిది బాయిలు చూస్తుండగానే ఎండిపోయాయి. బోర్లు వేసినందుకే బాయిలు ఎండిపోయాయని ముసలోల్లు అంటే ఈ కాలం వాళ్ళు ఒప్పుకోరు. 'బాయిలు ఎండిపోయినందుకే బోర్లు ఏపించాల్సి వచ్చింది. లేకుంటే దుడ్లు ఏమన్నా ఒత్తుకుంటుండెనా?' అని అంటారు.

అందులో నిజం లేకపోలేదు. అంతకంటే నిజం ఏమంటే-ఇప్పుడు బాయిల్లో నీళ్ళు లేవు. బోర్లలో అసలే లేవు.

సుడిడబ అందరూ మాట్లాడారు. ఏం చేయాలంటే ఏం చేయాలని తీవ్రంగా ఆలోచించారు. ఆవేశపడిపోయారు. ఆవేదన చెందారు. ఇంక ఇట్ల కాదుగాని, గొంతు తడుపుకోవాలంటే బాయి తవ్వాల్సిందే అని కొందరు పట్టుపట్టారు.

తవ్వుతం అనుకో.. నీళ్ళు పడతాయని గ్యారెంటీ ఏంది? అనే సందేహం కూడా వచ్చింది.

దానికి కొందరు అడ్డం తిరిగారు.

'కొనదాకా బతుకుతామనే ఈ ఊళ్ళో ఉంటుందమా? ఏంది? చస్తమో బతుకుతమో తెలేకుండానే ఉండడంలా? ఇది కూడా అంతే. ఊరిక చేతులు కట్టుకోని యాపమాను కింద కూచోడం కంటే తవ్వకం మొదలు పెడితే ఏం నష్టం?' అని ఎవరో భరోసా ఇచ్చారు.

ఊరికి రెండు దిక్కుల జలయజ్ఞం కింద తవ్విన కాలువలు ఉన్నాయి. కానీ ఊర్లోకి నీటి చుక్క రాలేదు. మనుషుల గొంతులు, పొలాలు నెర్రెలు వారాయి.

'సరే కానీంఢ్రా.. పని మొదులు పెట్టాల్నా లేదా అనేకాన్నే ఇంత ఎవ్వారం దేనికి? వంట్లో ఉసి ఉన్నోల్లంతా పార పలుగు తీసుకొని రాంఢ్రి..' అని ఒకాయన తేల్చేశాడు. అందరూ ఒప్పుకున్నారు. ఇంతకూ కొత్తగా బాయి తవ్వాల్నా, యాడ తవ్వాల?, లేకపోతే పాత బాయిలోనే పూడు తీయాల్నా? అనే చర్చ కాసేపు జరిగింది.

'కొత్తగా తవ్వడం దేనికిరా, పనార్ల కాకపోతే. తిక్క ఓబులేసుగాని బాయి మా తాత ముత్తాతల కాన్నించి ఏనాడు ఎండిపోలేదని అంటారు. వాన పడ్నా పడకపోయినా జల ఆరిపోదని అనేటోల్లు. అట్లాంటిది కూడా కడాకు మొండిబాయి అయిపాయె. దాంట్లోనే పని మొదలు పెడదాం. సులభంగా ఉంటుంది...' అనే సలహాను అందరూ అంగీకరించారు.

ఇదంతా ఓ పక్కన ఉండి వింటున్న మాల మద్ది వాళ్ళ జేజినాయిన అందుకోని.. 'రేపుల్యా, ఎల్లుండి మొదలు పెట్టండి..మంచి దినం. పనైతది..' అన్నాడు.

పేటలో ఇట్లాంటివి చెప్పేది ఆయన ఒక్కడే.

సరే అంటే సరే అన్నారు. ఆనాడు పొద్దున్నే తిక్క ఓబులేసు బాయి కాడికి వెళ్ళారు. ఆ సగాల పోనీక దారి లేకుండా సర్కార్ తుమ్మ వనంలాగా పెరిగింది. బాయి చుట్టూ ఉండే కట్టకం లోపలికి కూలి పడింది. ఊళ్ళోంచి నాలుగు గొడ్డళ్ళు వచ్చాయి. అడవి కొట్టి ఊరు పొందించినట్లు ఉంది కత. తిక్క ఓబులేసుగాని బాయి ఎట్లాంటిది? ఊళ్ళో నవమి పండగనాడు తీర్థానికి ఈ బాయి నీళ్ళే తీసపోయేవారు. ఇప్పుడు దారి కోసమే అగసాట్లు పడుతున్నారు. రెండు గంటలు కష్టపడ్డాక అక్కడికక్కడ రాళ్ళు మోపి లోపలికి దిగి ఎక్కేందుకు కూడా ఏర్పాటు చేశారు. మాల మద్ది వాళ్ళ జేజి నాయన అందరినీ తోసుకుంటే ముందుకు వచ్చాడు. అటూ ఇటూ చూసి బాయిలో అడుగున ఓ దిక్కుకు వెళ్ళి నిలబడ్డాడు. కాలితో ఒకటికి మూడు సార్లు రాసి ఈడ..ఈడ అని అన్నాడు. ఎవరో రెండు రాళ్ళను తెచ్చి అక్కడ నిలబెట్టారు. ఊళ్ళో నుంచి తెచ్చిన మంచినీళ్ళ చెంబు అందుకోని ములాయన కుడి చేతిలోకి వంచుకొని ఆ రాళ్ళ మీద చిలకరించాడు. పసుపు కుంకుమ రాశాడు.

ఇంతలో గసపోకుంటూ ఇద్దరు కుర్రాళ్ళు జనాన్ని తోసుకుంటూ బాయిలోకి దిగి మద్దివాళ్ళ జేజి నాయిన చేతిలో టెంకాయ పెట్టారు. 'లంగనాయాల... ఇంకాదోడుంటే అయిపోయేది గదరా?' అని ఆ ముసలోడు అన్నాడు.

'పొద్దున్నే పోయినం, మెయిన్ రోడ్డు దాటినాక పెట్రోలు అయిపోయింది. మళ్ళీ వెనక్కి బండి తోసుకుంటూ టర్నింగ్‌లో ఉండే పెట్రోలు బంకు కాడికి పోయి తిరిగి వచ్చే సరికి లేటాయె..' అన్నాడు.

'అయితే మాన్లే అందుకుందరు. అదేసాలు..' అని ముసలోడు కాయ కొట్టాడు. కొబ్బరికాయ రెండు సమానమైన ముక్కలుగా పగిలిపోయింది. నీళ్ళు భళ్ళున ఆ పక్క ఈ పక్క ఎగసిపడ్డాయి. అందరి ముఖాల్లో ఒకరకమైన ఆనందం చిలికింది.

'యాపొద్దు మనకిట్లా బాయి తోగాలని అనిపించిందోగాని, నీళ్ళు పడతాయిరా..' అని మద్ది వాళ్ళ జేజినాయన నమ్మకంగా అని పక్కకు జరిగి.. 'ఈడ గడ్డపార దించండి..' అన్నాడు. అంతే దెబ్బ మీద దెబ్బ.. ఖణేల్ ఖణేల్ మని పడ్డాయి.

మధ్యాన్నానికి ఆడోల్లు బాయికాడికే బువ్వలు తెచ్చారు. తిని గడి సేపు ఉండి మళ్ళీ పని మొదలు పెట్టారు. మొదటి దినం ఆడోల్లు పనిలోకి రాలేదు. రెండో రోజు ఒకరిద్దరు బాయి గడ్డ మీద నిలబడి తట్టలు అందుకున్నారు. మూడో నాటికి ఊళ్ళోని ఆడ మగా తేడా లేకుండా కాళ్లూ చేతుల్లో ఉసి ఉండేవాళ్ళంతా పనిలోకి దిగారు. నీళ్ళు ఎట్ల పడవో చూద్దాం.. అని పట్టుదల పెరిగింది. అక్కడక్కడ చెమ్మతగిలిన మట్టి వచ్చిన రోజు మరింత ఆశగా ఉండేది. కానీ మళ్ళీ పెద్ద రాళ్ళు అడ్డం పడ్డాయి. వాటినీ పగలకొట్టారు. ఇంకా లోపలికి తవ్వారు.

వారం దినాలు ఊరందరికీ అదే పని.

ఆ దినం పైటాల.. ఇక పని ఆపి బువ్వలు తిందాం అనుకుంటుండగా ఓ గునపం తగిలి మట్టి రంగు మారిపోవడం గమనించారు. అంతే.. గునపాలు ఆగిపోయాయి. నీళ్ళ చెమ్మనా? ఏమి అని సంభ్రమంతో మట్టి చేతిలోకి తీసుకున్నారు. చేతికి ఎర్రగా అంటుకుంది. రెండు మూడు రక్తం చుక్కలు జారి కింద పడ్డాయి. తవ్వకం పనిలో ఉన్న వాళ్ళు భయపడి పక్కకు జరిగారు.

ఏమైంది.. ఏమైంది.. అని తట్టలు అందుకుంటున్నవాళ్ళు.. అంత వరకు పని చేసి విశ్రాంతిలో ఉన్నవాళ్ళు.. గడ్డ మీద ఎవారాలు చేస్తున్నవాళ్ళు తోసుకొని వచ్చారు.

ఇంతలో బుసబుసమని గునపం దిగిన తావు నుంచి రక్తం బైటికి వచ్చింది. చుట్టూ మూగినవాళ్ళు అసంకల్పితంగా రెండడుగులు వెనక్కి వేశారు. హేతువాది అయిన ఒక యువకుడు ముందుకు వచ్చి 'రంగురాయి ఉందేమో .. నీళ్ళు పడి..' అని మాట ఇంకా పూర్తి చేయకముందే ఒకరకమైన కర్కశ స్వరం వినిపించింది. ఆ మధ్యాహ్నపు ఎండ వల్లనో, మరెందు వల్లనో రక్తం చిందిన నేల నుంచి కాంతి పుంజం బైటికి ఎగజిమ్ముతూ మాటలు వినిపించాయి. అందులో ఆగ్రహం, నొప్పి రెండూ ధ్వనించాయి.

'నేను కార్పొరేటమ్మను.. నా అభీష్టానికి వ్యతిరేకంగా మీ అంతకు మీరు బాయి తవ్వుకోని నీళ్ళు తాగుదామనుకుంటారా? ఈ భూమి మీద ఏ తవ్వకాలకైనా నా అనుమతి ఉండాల్సిందే. అట్లాంటిది మీ అంతకు మీరు తవ్వకం మొదలుపెట్టి నాకు కోపం తెప్పిస్తారా? నా అధికారాన్ని ధిక్కరించిన మీ అంతు చూస్తా.. మీ ఊళ్ళను వల్లకాడు చేస్తా. నా రక్తం పారిన గడ్డన నెత్తురు చెమ్మ బైటికి రాకుండా శవాలు లేస్తాయి..' అని భీకరమైన మాటలు వినిపించాయి.

అంతా ఠారెత్తిపోయారు. కాళ్ళూ చేతులు చల్లపడిపోయాయి. గుండెలు లడలడ కొట్టుకున్నాయి. చేతిల్లోంచి గడ్డపారలు, సలికెలు జారిపోయాయి. కళ్ళు బైర్లుగమ్మి ఇదంతా నిజమా? కలా అనుకున్నారు.

గుర్రు గుర్రుమని శబ్దం వస్తూనే ఉంది.

మాల మద్ది వాళ్ళ జేజినాయన అక్కడికి వచ్చి చేతులు జోడించి 'తల్లీ నీకు కోపం తెప్పించినందుకు మన్నించు. నీవు శాంతించాలంటే ఏం చెయ్యాలో సెలవియ్యి. నీ మాట మీరం. మా మీద ఆగ్రహం వద్దు తల్లీ... ఏం చేయమంటావు?' అని గొణిగినట్లు అన్నాడు.

'మీ దేశానికి పడమటి సముద్రం అవతల నా పుట్టిల్లు ఉంది. నేను ఏనాడో ఇక్కడికి వచ్చి మందిరం కట్టుకున్నాను. ఆ తర్వాత నాకు తోబుట్టువులు ఇక్కడే చాలా మంది పుట్టారు. నాకు నా పుట్టింట్లో గుడి కట్టివ్వాలి. దినం పొద్దు పూజలు చేయాలి. రోజుకు అర్ధ నూటాపదహారు ఎకరాల భూమి నైవేద్యంగా సమర్పించుకోవాలి. లేకపోతే మీ ఊళ్ళు

శ్మశానాలు అవుతాయి. నన్నే గాయపరుస్తారా?.. వారం దినాల్లో నా పుట్టింట్లో గుడి కట్టించాలి. లేకుంటే శాంతించ..' అనే మాటలు వినిపించాయి.

ముసలోడు భయంతో, భక్తితో ఆ తావున మోకరిల్లాడు.

'అట్లనే తల్లి.. అట్లనే చేస్తాం. మా మీద కోపగించుకోవాకు..' అని దండం పెట్టుకున్నాడు.

కాసేపటికి అక్కడి వెలుగు మాయమైంది. కానీ రక్తం మాత్రం బుడబుడమని గుబ్బలు గుబ్బలుగా వస్తూనే ఉంది.

ఎర్రగా చిన్న వాగులాగా కిందికి పారి మట్టిలో కలిసిపోతోంది.

అందరూ నోట మాట పోయినట్లు వణుకుతున్న కాళ్ళను స్వాధీనంలోకి తెచ్చుకుంటూ గడ్డకు వచ్చారు.

- - -

సాయంత్రం రచ్చకట్ట దగ్గర గుంపయ్యారు. అందరి ముఖాల్లో భయం తాండవిస్తోంది. మధ్యాన్నం తిండి కూడా కొందరు తినలేదు. ఏం ముంచుకొని వస్తుందో తెలియడం లేదు.

ఏదేదో లోపల్లోపల మాట్లాడుకుంటున్నట్లు అందరూ తోచింది అనుకుంటున్నారు. ఏం చేయాలో ఎవ్వరూ ఇతమిద్దంగా తేల్చి చెప్పడం లేదు.

కాసేపయ్యాక ఒకాయన అన్నాడు గదా.. 'దీని గురించి మదనపడేదేందిరా? అమ్మ చెప్పినట్లు తలా ఇన్ని దుడ్లు ఏసుకొని గుడి కట్టియ్యాల్సిందే. ఎవరెవరు ఎంత ఇచ్చేది చెప్పండి..' అన్నాడు.

దానికి ఇంకెవరో మండి పడుతూ, 'యాండే కట్టించేది? మనూరి పొలిమేరలో కట్టడమా ఏంది, ఇంతకూ మనకెల్లి ఎల్లమ్మ, సుంకులమ్మ, మద్దమ్మలు ఉండారుగాని ఈ కార్పేటమ్మ పేరు ఎప్పుడూ వినలేదే? అయినా ఈ ముసల్నా కొడుకుని అనాల. పెద్ద పుటింగి మాదిరి గుడి కట్టిస్తామని మొక్కుకున్నాడు...' అని ఆగ్రహించాడు.

దాన్ని ఎవ్వరూ ఒప్పుకోలేదు.

'అందరికీ ఉచ్చులుపడతా ఉంటే ముసలోడే ధైర్నం చేసి అమ్మతో మాట్లాడినాడు. ల్యాకపోతే ఈపాటికల్లా ఏమయ్యేదో?' అన్నారు.

దాంతో ఆ మనిషి గమ్మున ఉండిపోయాడు. కానీ ఈ కార్పేటమ్మ ఎవరు అనే ప్రశ్న మాత్రం మిగిలే ఉంది.

'మా చిన్నప్పటాల్నుంచి ఈ చుట్టుముట్టు యా ఊళ్ళో గూడ ఈ అమ్మ పేరు వినలేదు...!' అంటుంటే మాల మద్ది వాళ్ళ జేజినాయిన కల్పించుకొని, 'దేవుండ్ల కత మనుషులం మనకేం తెలుసురా లంగనాయాల? మనకు తెలేకపోతే లేనట్టేనా ఏంది? ఏ దేవుడు యాడ పుడతాడో, యాడికొచ్చి కొలువయితాడో ఎవరికి తెలుసు? ఆ యమ్మ పుట్టిల్లు పడమటికెల్లి అని చెప్పింది గదా?' అన్నాడు.

అందరికీ నిజమే అనిపించింది. మళ్ళీ ముసలోడే.. 'గుడి యాడకట్టాల్నో ఆలోచించండి' అన్నాడు.

'ఏముంది రేపు మండలానికి పోయి తాసిల్దారుకు ఈ కతంతా చెప్పాల్సిందే. మన చేతిలో ఏముంది?' అని దినాం తాసిల్దారు ఆఫీసుకాడ యవారాలు చేసే యువకుడు అన్నాడు. దేనికైనా సరే అతడికి తాసిల్దార్ ఆఫీసు దగ్గరికి పోవడం అలవాటు.

పొద్దున్నే కట్టకట్టుకోని మండల కేంద్రానికి బయల్దేరారు.

వీళ్ళు వెళ్ళేటప్పటికి తాసిల్దార్ లేదు.

కలెక్టర్ ఆఫీసులో చుక్కల మందు కార్యక్రమం మీద మీటింగుకు వెళ్ళి పొద్దువాలుతూ ఉన్నప్పుడు అలిసిపోయి తిరిగి వచ్చాడు. ఈ కత అంతా విని ఆయన కొంచెం విసుగు కలిగినా తమాయించుకొని 'మన మండల పరిధిలో పని ఏదైనా ఉంటే చెప్పండి. అది కూడా ఏ పథకం కిందికి వస్తుందో చెప్తే ఆలోచిస్తాను. గవర్నమెంట్ యవారాలు మీరు అనుకున్నట్లు చెయ్యనీక లేదు. ముందు ఎస్టిమేషన్ రాయాలి. మీకు ఏం తెలుస్తది. పైన ఉండేది నా మొగుళ్ళు. కాగితం చూడగానే ఏ స్కీం కింద రాసినావ్ అని దొబ్బుతారు...' అన్నాడు.

ఈ సలహా ఇచ్చిన యువకుడికి గవర్నమెంట్ పథకాలన్నీ కొట్టిన పిండి. దేనికిందికి వస్తుందబ్బా? అని సీరియస్‌గానే ఆలోచించాడు. తాసిల్దార్ కూడా నువ్వే చెప్పు అన్నట్లు అతడి వైపు చూశాడు.

ఉపాధి హామీ పథకం కింద అడిగితే ఎట్లుంటది అనిపించింది. ఆఫీసర్‌కు కూడా అదే తోచింది.

గుడి యాడ కట్టాల్నో తేలితే పనులు ఉపాధి కింద రాసేయవచ్చు.. అనుకొని 'యాడ కట్టిస్తున్నారు?' అని మళ్ళీ అడిగాడు.

మద్ది వాళ్ళ జేజినాయిన ముందుకు వచ్చి అమ్మ చెప్పిన మాట మరోసారి గుర్తు చేశాడు.

తాసిల్దారుకు అప్పుడుగాని మేటర్ పూర్తిగా అర్థం కాలేదు.

'ఏందీ.. దేశానికి అవతల ఉండే సముద్రం దాటి, పడమటి దిక్కునా?' అని తెగ ఆశ్చర్యపోయాడు.

'ఏంది మీ ఊళ్ళో అందరికి తిక్కలేచిందా? నాక్కూడా లేపడానికి వచ్చినారా? పొండి ముందు బైటికి..!' అని కసురుకున్నాడు.

ఇంక పని కాదని తెలిసిపోయి చీకటి పడుతుండగా ఊరికి తిరిగి వచ్చేశారు.

రెండు దినాలు కింద మీదా అయ్యారు. హేతువాదైన కుర్రాడు బాయి దగ్గరికి వెళ్ళి తొంగి చూశాడు. బుడ బుడమని రక్తం బైటికి వస్తూనే ఉంది. మధ్య మధ్యలో గుర్రు గుర్రుమని శబ్దం వినిపిస్తూనే ఉంది. నమ్మబుద్ది కాలేదు. కానీ నమ్మాల్సిందే అన్నట్లు ఉంది.

మూడో రోజు తెల్లారేసరికి ఊళ్ళో ఓ దిక్కు ఉండే గడ్డి వాములు బూడిదైపోయాయి. మేతకు పోయిన బర్రెలు సాయంత్రం తిరిగి వస్తూ కావలివాడితో సహా నిట్టనిలువునా శవాలైపోయాయి. నెత్తురు చెమ్మ రాలేదు. అది తెలిసి ఊళ్ళో వాళ్ళకు రాత్రి కంటి మీద కునుకు రాలేదు.

తెల్లారేసరికి పేపర్లలో బాయి తవ్వకం దగ్గరి నుంచి అంతా మొదటి పేజీల్లో కథనాలు వచ్చాయి. గొట్టాల వాళ్ళు వచ్చి గ్రామస్తులను ఏమైంది? ఏం చేద్దామనుకుంటున్నారు? అని సతాయించారు.

ఎవరు సలహా ఇచ్చారోగాని అన్ని పేపర్లు చంకనపెట్టుకొని కలెక్టర్ దగ్గరికి పోయారు. సరిగ్గా వీళ్ళు వెళ్ళే సరికి సదరు తాసిల్దార్‌ను కలెక్టర్ పిలిపించాడు. అధికారులు అంతా కలిసి సమావేశమయ్యారు. గ్రామస్తులను నేరుగా సమావేశ మందిరంలోకి పిలిపించారు. పేపర్లవాళ్ళకు, టీవీల వాళ్ళకు మేసినంత మేత. హాల్లో వాళ్ళదే గడిబిడి. కలెక్టర్, ఎస్పి ఓపిగ్గా గ్రామస్తుల మాటలు విన్నారు. అప్పుడు వాళ్ళను బాధితులు అని అందరూ పిలవడం మొదలు పెట్టారు. ఆ మాట మొదటిసారి విన్న మద్దివాళ్ళ జేజినాయినకు బోధపడలేదు.

'బాధితులు అంటే ఏందిరా? మనల్ని అట్లా పిలుస్తుందారు..? మనల్ని మాల్లోల్లని, గొల్లోల్లని.. ఫలానా ఊళోల్లని పిలుస్తారు గదా? ఇక్కడేంది ఇట్లా పిలుస్తున్నారు?' అని అడిగాడు.

'అదంతేలే.. ముసల్నాకొడుకివి నీకేం తెలుసు. అట్ల అంటే దుడ్లు వస్తాయి...!' అని మండలాఫీసుల కాడ వ్యవహారాలు చక్కబెట్టే కుర్రాడు అన్నాడు.

చివరికి గొట్టాలవాళ్ళు.. ఈ ఘటనపై ఏం చర్యలు తీసుకుంటున్నారు? అని కలెక్టర్‌ను అడిగారు. దానికాయన గుంభనంగా

'ప్రభుత్వ పరంగా అన్ని చర్యలూ తీసుకుంటాం. బాధితులకు పరిహారం వాళ్ళ బ్యాంకు అకౌంట్లలోకి నేరుగా వెళ్ళిపోయేలా చర్యలు తీసుకుంటాం' అన్నారు. ఆ మధ్యఏదో పథకం కింద బాధితులకు రావలసిన పరిహారం పంపిణీలో అవినీతి జరిగి కోట్ల రూపాయలు వృథా అయ్యాయని పత్రికల్లో వచ్చి పై నుంచి అక్షింతలు పడ్డాక ఆయన ఏదైనా నేరుగా బ్యాంకు అకౌంట్లలోకి పంపించే పద్ధతి మీదే నమ్మకం పెట్టుకున్నాడు.

ఎస్‌పిని కూడా గొట్టాలవాళ్ళు అడిగారు. దానికి ఆయన 'గ్రామంలో శాంతిభద్రల పరిరక్షణ కోసం పోలీస్ పికెట్ ఏర్పాటు చేస్తున్నాం..' అని చెప్పి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే నేను రాజకుమారుడిని కలిసి, నగరంలో ఓ మీటింగుకు హాజరై ఊళ్ళో దిగాను. ఆ రాత్రంతా నేను బస్సులో నిద్రపోతే ఒట్టు. మానవ నాగరికత-గనుల గురించే ఆలోచిస్తుండిపోయాను. మహానేతకంటే ముందు చరిత్రలో గనుల గురించి ఇంతగా తెలిసినవాళ్ళు ఎవరైనా ఉన్నారా? రాజకుమారుడు చెప్పిన గనుల ఉదంతాన్ని క్రాస్ చెక్ చేసుకోడానికి ఆధారాలేమైనాఉన్నాయా? గనుల తవ్వకాల్లోకి, కాలువల తవ్వకాల్లోకి ఒకేసారి తొంగి చూస్తే ఏ అంతర్లోకాలు కనిపిస్తాయి? వాటి తాలూకూ వివరాలు ఎలా తెలుస్తాయి? ఎవర్ని అడిగితే చెప్తారు? అని బుర్రపాడు చేసుకున్నాను. పొద్దున పేపర్లో చదివి, టివిలో కార్వేటమ్మ బాధితుల వాయిస్ లైవ్‌లో చూసి పరిగెత్తుకుంటూ కలెక్టరేట్ దగ్గరికి వెళ్ళాను.

ఇదేమన్నా విఠలాచార్య సినిమా కాదు గదా? అనిపించింది.

అప్పటికే వాళ్ళు ఊరికి వెళ్ళిపోయారని తెలిసింది.

ఆ వార్తలతో ఆ పూటకు ఇరవై నాలుగ్గంటల చానెళ్ళకు సరిపోయింది. మెరుగైన సమాజం కోసం పాటుపడే ఒక టివి ఛానల్ సాయంకాలమంతా చర్చలు నడిపించింది. మా అక్షరం మీ ఆయుధం అని ఘోషించే దిన పత్రికలో మర్నాటి నుంచే వ్యాసపరంపర మొదలైంది.

ఇది ఇలా ఉంటే.. ఆ తెల్లారి మరో ఘోరం జరిగిపోయింది. ఊరును అనుకొని ఉండే లంబాడా వాళ్ళ గుడిసెల్లో పిల్ల మిగలకుండా నిద్ర మంచాల్లో శవాలైపోయారు. మధ్యాన్నానికల్లా కంకాళాలు, పుర్రెలతో లంబాడాల గూడెం భయానకంగా తయారైంది. కార్వేటమ్మ చెప్పింది చెప్పినట్లే అవుతోందని గ్రామస్తులు భయపడిపోయారు. ఊరు వదిలి పోదామని కొందరు అనుకున్నారు. ఎక్కడికిపోతే మాత్రం చేసింది పోతుందా? అనే నిశ్చయానికీ వచ్చారు. బాయిలోంచి గుర్రు గుర్రుమనే శబ్దం వస్తూనే ఉంది. నెత్తురు బుడగలు వస్తూనే ఉన్నాయి.

మధ్యాన్నానికల్లా నేషనల్ మీడియా కూడా వచ్చింది.

దేశమంతా గనుల కోసం తవ్వకాలు జరుగుతోంటే.. మీకు నీళ్ళ కోసం తవ్వాలని ఎందుకు అనిపించింది? అని వేధించారు.

దేశం దేశం అంతా ఇదే. తవ్వకాలు.. తవ్వకాలు. .. అని ఒకటే చర్చ. మొత్తం ఎన్ని రకాలు తవ్వకాలు ఉంటాయి? వాటిమధ్య తేడా ఏమిటి? మహానేత తవ్విన గనులకు-రాజకుమారుడు తవ్వుకుంటున్న గనులకు, ఇతర గనులకు తేడా ఏమైనా ఉందా? ఇంతకూ గనులు తవ్వితే ఏం వస్తుంది? బావులు తవ్వితే ఏం వస్తుంది? చరిత్రలో ఏం జరిగింది? ప్రజలు తమంతట తాము ఇట్లా తవ్వకం చేపట్టవచ్చునా? అంతర్జాతీయ తవ్వకాల నిబంధనలకు లోబడే ఈ తవ్వకం జరిగిందా? వాటి ఉల్లంఘనకు, కార్వేటమ్మ ఆగ్రహానికి ఏమైనా సంబంధం ఉందా? అనే దిశగా లోతైన చర్చలు జరిగాయి.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు, 2014 ఎన్నికల తాయిలాలు, కాంగ్రెస్‌లో పిసిసికి, ముఖ్యమంత్రికి మధ్య విభేదాలు, బిజెపిలో అవినీతి ఆరోపణల మీద అధ్యక్ష మార్పు, కర్ణాటకలో యడ్డీ ఎత్తులు, పసలేని లోక్‌పాల్ బిల్లుపై అభినవ గాంధీ నిరాహార దీక్షలు, రాంలీలా మైదాన్ హడావిడీ .. అన్నీ గాలికి కొట్టుకపోయాయి. అందరి కళ్ళూ చెవులు కార్వేటమ్మ మీదే. ఆమె తనకు కట్టివ్వమన్న గుడి మీదే.

పార్లమెంట్‌ల బడ్జెట్ ప్రవేశపెట్టకుండా ప్రతిపక్ష నేతలు అడ్డం పడ్డారు. ఆలయనిర్మాణం అనేసరికి ప్రతిపక్షానికి రామ మందిరంనాటి పూనకం వచ్చేసింది. బడ్జెట్ కాయితాలు స్పీకర్ మీదికి విసిరేసి బైటికి వెళ్ళిపోయారు. స్పీకర్ చాలా మందస్మితంగా కాయితాలు ఏరుకొని టేబుల్ మీద పెట్టుకున్నారు.

ఈ మధ్యలో కాశీ విశ్వవిద్యాలయంలోని వైదిక శాఖ అధిపతి కార్వేటమ్మ కూడా హిందూ దేవతే అని సాక్షాధారాలతో బైటికి వచ్చారు. నేషనల్ ఛానల్స్‌కు అది భలే వినోదంగా మారింది. ఆ ప్రొఫెసర్‌గారు ధార్మిక విషయాలతోపాటు రాజకీయాలు వినిపించడం మొదలుపెట్టారు. దేశీయ సంస్కృతికి పట్టుగొమ్మగా ఉండాల్సిన ప్రతిపక్షం కార్వేటమ్మ దేవాలయం కట్టివ్వడానికి ఏమీ చేయడం లేదని. పేరు కార్వేటమ్మ అని ఉన్నంత మాత్రానా మన దేవత కాదనుకుంటే ఎలా? హిందుత్వ విషయంలో మరీ అధమ జ్ఞానం ఉన్నందున ఇట్లా నిర్లక్ష్యం వహిస్తోందని తీవ్ర స్వరంతో ఆరోపించారు. కార్వేటమ్మ మన దేశీయ దేవతలకు వేలు విడవని చుట్టమని చెప్పడానికి ఆయన కొన్ని తాళపత్రాలను కూడా మీడియా సమావేశంలో ప్రవేశపెట్టారు.

దానికి పార్లమెంట్‌లో ప్రతిపక్షనేత గంభీరమైన హిందీలో హిందుత్వను ప్రస్ఫుటిస్తూ ఇలాంటి విషయాల్లో మేం బాధ్యత రాహిత్యంగా లేం. బాధితులు హిందువులు. మాకు అదే ముఖ్యం. అంతకంటే వాళ్ళు ఈ దేశంలో ఓటర్లు మాకు అన్నిటికంటే అదే ముఖ్యం. ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రభుత్వమే నిర్లక్ష్యం వహిస్తోంది. ఈ విషయంలో మేం చూస్తూ ఊరుకొనేది లేదు.. అన్నారు.

అయితే ఏం చేయాలో అధికారపక్షానికి పాలుపోలేదు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే రాజకీయ సమస్యలు తలెత్తుతాయని ఇప్పటికే అర్థమైపోయింది. విడతలవారీగా సమావేశాలయ్యారు. కానీ ఏమీ తేల్చలేకపోయారు. దేశానికి పడమటి దిక్కున సముద్రం ఆవల ఉండే భూభాగం మీద మనం ఎట్లా గుడి కట్టిస్తాం? రాజ్యాంగం భారత భూభాగం మీదే మనకు అధికారాన్ని ప్రసాదించింది గదా? అని వాళ్ళలో వాళ్ళు అనుకున్నట్లు ప్రజలను కూడా నమ్మమన్నట్లు చెప్పడం మొదలు పెట్టారు. ఈ లోగా మరో పల్లె కంకాళాల గుట్టగా మారిపోయింది. పత్రికలు మరింత వేడెక్కించాయి.

ఈ మొత్తం వ్యవహారంపట్ల కొందరు పెడసరంగా మాట్లాడడం మొదలుపెట్టారు.

'.. . సార్వభౌమాధికారం గురించి ప్రభుత్వానికి బైటి దేశాలతో యుద్ధాలు చేసేటప్పుడు మాత్రమే గుర్తు వస్తుంది అనుకున్నాం. లేకపోతే కాశ్మీర్‌లో సైన్యం దించేటప్పుడు తప్ప మరెప్పుడూ గుర్తు రాదనుకున్నాం. ఫర్వాలేదు. ఈ సందర్భంలో కూడా గుర్తుకు వచ్చింది. కార్వేటమ్మ అవతారం గురించి తేల్చాల్సిందే. అసలు ఆమె ఇక్కడికి ఎందుకు వచ్చింది? ఆమెకు గుడి కట్టిస్తారా లేదా? అనేది కాదు, అసలు సార్వభౌమాధికారం ఎవరిది? ప్రజల పొలాలు గుంజుకొని, ఊళ్ళు ధ్వంసం చేసి పెట్టుబడిదారులకు అప్పగించడాన్ని సార్వభౌమాధికారం ఎట్లా అంగీకరిస్తుంది? బయటి దేశాల పెట్టుబడిదారీ సంస్థలు యథేచ్ఛగా ఈ దేశంలోకి వచ్చి కంపెనీలు నిర్మించుకోవడం ఏం సార్వభౌమాధికారం?' అనే విమర్శలు పుంజుకున్నాయి.

దీంతో రాజ్యాంగ నిపుణులు తెరమీదికి వచ్చారు. విదేశాంగ శాఖను రంగంలోకి దించి సమస్యను పరిష్కరించడానికి అవకాశం ఉందేమో..

చూడాలని ప్రతిపక్షం పట్టుపట్టింది. అధికార పక్షానికి కూడా చాలా ఆదుర్దాగా ఉంది. దీన్ని వీలైనంత జనరంజకంగా పరిష్కరిస్తే రాబోయే ఎన్నికల్లో ఇది కూడా ఉపయోగపడుతుందని అనుకుంది. అడ్వొకేట్ జనరల్‌ను సలహా అడిగారు. రాజ్యాంగం ప్రకారం కార్పేటమ్మ ఆలయం నిర్మించడానికి అవకాశం లేదని తేల్చేశారు.

మొదటి సారిగా ప్రభుత్వ పెద్దలకు రాజ్యాంగం మీద అంతులేని కోపం వచ్చింది. మామూలుగా అయితే ఆ పుస్తకంలో ఏం రాసి ఉన్నా తమకు తోచినట్లు పాలించడానికి ఏనాడూ వాళ్ళు ఇబ్బంది పడలేదు. 'అంతగా అయితే దానికి కావాల్సిన సవరణలు చేసుకుంటూ పోయాం. అట్లా ఎన్ని చేయలేదు. ఎన్ని సార్లు చేయలేదు. ఈ సారే గడ్డు సమస్య వచ్చింది. దాన్ని పట్టుకొని వేలాడడానికీ లేదు. సవరించడానికీ లేదు...' అని యాష్టపడ్డారు.

' లక్షల ఎకరాల్లో అధికారికంగానే తవ్వకాలు చేపట్టడానికి ఎన్ని చట్టాలు తెచ్చాం. ఉన్నవాటిని ఎన్నిటిని గనుల్లో పూడ్చేశాం. తవ్వకాలే ప్రభుత్వ కార్యక్రమంగా నడుస్తోంది గదా? ఈనాడు ఈ ఆటంకం ఏంది? ఎంత కాదనుకున్నా మన అధికారమేమో రాజ్యాంగం పెట్టిన హద్దుల్లోనే చెల్లుబాటయ్యేది.. ఆ కార్పేటమ్మ ఏమో ఎల్లలు లేని దేవత.. ఆమె కోరికను ఎట్లా తీర్చాలి?' అని భక్తి ప్రపత్తులతోనే చింతాక్రాంతులయ్యారు.

'ఆ దిక్కుమాలిన పల్లెలో నీళ్ళ కోసం తవ్వకం చేపట్టడమేంది? ఈ ఉపద్రవం రావడం ఏంది? నీళ్ళు లేకుంటే చస్తారా ఏం? మళ్ళీ ఏడాదిలో ఎట్లా ఎన్నికలు వస్తున్నాయి గదా? అప్పటిదాకా ఆగితే ఏం పోయింది? ఆ ఇంత ఎన్నికలు అయ్యాక ఇట్లాంటివి ఏం జరిగినా మళ్ళీ ఐదేళ్ళ దాకా ఏ ఇబ్బంది ఉండేది కాదు..!' అని అధికార పార్టీ అధిష్ఠాన దేవత చిటపటలాడిపోయింది.

ఇది ఇట్లా ఉంటే చర్చ కార్పేటమ్మ మన దేశంలోకి వచ్చి తిష్ట వేయడం ఏమిటి? అనే దిశగా మళ్ళింది. ఇది అటువడీ ఇటువడీ తవ్వకాలు-గనులు-కార్పేటమ్మ అనే చర్చగా మారి తుదకు పర్యావరణ సమస్యగా ముందుకు వచ్చింది.

సమావేశ మందిరం ముందు..

పంచ భూతాత్మకమైన ప్రకృతి-పర్యావరణ సమస్య అనే అంశం మీద జాతీయ స్థాయిలో సదస్సు ఏర్పాటయింది. గాలి, నీరు, నిప్పు, నేల, ఆకాశం అన్నీ కలుషితమవుతున్నాయని, ఈ అన్ని విభాగాల్లో క్రియాశీలంగా పని చేస్తున్న మంచి మంచి ఎన్జీవోలు ఈ సదస్సుకు పూనుకున్నాయి. 'సందర్భం.. కార్పేటమ్మ ఆవిర్భావం..' అని చిన్న ఉప శీర్షిక కూడా పెట్టారు. ఆ రంగాలకు చెందిన ప్రభుత్వ అధికారులను కూడా ఆహ్వానించారు. సందర్భోచితంగా ఉంటుందని, క్రియాత్మకంగా కూడా ఉంటుందని కార్పేటమ్మ ఆవిర్భవించిన ప్రాంతానికి సమీపంలో భారీ ఎత్తున సదస్సుకు సన్నాహాలు చేశారు. ఎన్జీవోల వ్యవహారం అనేసరికి సహజంగానే అనేక వైపుల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం నుంచి కూడా నిధులు తీసుకొని ఈ సదస్సు పెట్టి ఏం ఉద్ధరిస్తారట..? అనే ప్రశ్న తీవ్రంగా ఎదురైంది. దానికి సమాధానంగా ఆ సదస్సు నిర్వాహక బృంద నేత ఒకరు ఓ ఇంటర్వ్యూలో.. 'మేం ప్రభుత్వాన్ని వదిలిపెట్టే రకం కాదు. ప్రభుత్వం విచ్చలవిడిగా గనులకు భూమి ఇచ్చేయడం అనే సమస్య కేంద్రంగానే సదస్సు జరుగుతుందని సమాధానం ఇచ్చారు. 'ఇది తమ ప్రగతిదాయకతకు చెరగని గీటురాయి' అని వక్కాణించారు.

ఎకరాల ఎకరాల ఆవరణలో సదస్సు కోసం ఒక కొత్త నగరాన్నే నిర్మించారు. పర్యావరణ విధ్వంసం గురించిన అనేక అధివాస్తవ, వాస్తవ, ఊహా చిత్రాలను నలుదిశలా అలంకరించారు. నాలుగు రోజులపాటు జరిగే కార్యక్రమంలోనలభై పత్రాల సమర్పణ, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, వీడియోల ప్రదర్శన, బృంద చర్చలు, అవసరం అయినప్పుడు వెరిఫై చేయడానికి పంచ భూతాల గురించి ప్రపంచంలో వచ్చిన సాధికార గ్రంథాలతో పెద్ద లైబ్రరీ, పరీక్షలకు, పరిశోధనలకు అవసరమైన తాత్కాలిక ప్రయోగశాలలు.. సమస్తం అమర్చారు. ఇన్ని ఉండడంతో దేశంలోని ప్రముఖులు అందరూ హాజరవుతున్నందున ప్రభుత్వం భారీ ఎత్తున పోలీసు బలగాలను మోహరించింది. మామూలు పోలీసులు చాలక పారా మిలటరీని కూడా వారం ముందు నుంచే ఏర్పాటు చేసింది.

ఈ సదస్సు కార్పేటమ్మలాంటి సమస్యలకు శాశ్వత పరిష్కారం వెతుకుతుందని ఆశిస్తున్నాను. అని ప్రధాని తన సహజ శైలిలో అతి ముక్తసరిగా ప్రకటించారు.

మొదటి రోజు.. సదస్సు విజయవంతంగా జరిగిందని, అనేక సమస్యల క్రోడీకరణ జరిగిందని మొదటి రోజు కార్యక్రమం ముగిశాక నిర్వాహకులు పత్రికలతో చెప్పారు.

రెండో రోజు కూడా సుమారుగా అదే చెప్పారు. దానికి గొట్టాల వాళ్ళు.. 'బయట కార్పేటమ్మ సమస్యకు ఈ సదస్సు పరిష్కారం చూపుతుందని ఆశతో ఉన్నారు. మీరు ఏం చెప్తారో అని టెన్షన్ పెరిగిపోయింది. ఈ రెండో రోజుకూడా మీరు ఏమీ చెప్పలేకపోవడాన్ని మీ వైఫల్యంగా భావించాల్సి ఉంటుందా?' అని అడిగారు.

దానికి వాళ్ళు చెమటు తుడుచుకుంటూ 'ఇది చాలా దశాబ్దాల నాటి సమస్య. విడతలవారీ అధ్యయనంలో తేలుతుందని ఆశిస్తున్నాం..' అన్నారు.

ఆ రోజు మర్నాడు పత్రికల్లో వచ్చిన కథనాలను దృష్టిలో ఉంచుకొని పారా మిలటరీ ఫోర్స్‌ను మరింతగా పెంచారు. మూడో రోజు మధ్యాహ్నం పన్నెండు గంటలప్పుడు కార్పేటమ్మ బాధితులు వందల సంఖ్యలో సమావేశ మందిరం ముందుకు ఎట్ల వచ్చారోగాని ఉసిళ్ళపుట్టలాగా వచ్చారు. పోలీసు ఫోర్స్ అప్రమత్తం అయింది. బారికేళ్ళతో వాళ్ళను అడ్డుకున్నారు. జనాలు వాళ్ళ మీద తిరగబడ్డారు. గాలిలోకి కాల్పులు జరిగాయి. వీళ్ళు రాళ్ళు విసిరేశారు. అది వాన జల్లులాగా సమావేశ మందిరం కిటికీల్లోంచి లోపలికి దూసుకెళ్తున్నాయి. పోలీసులు రెచ్చిపోయారు.

'కార్పేటమ్మ కత ఆనిగాల్లకు ఇంకా తేలలేందంట. ఆమె ఈడికి ఎందుకు వచ్చిందో, అసలు ఈ గూడుపుఠాని ఏం జరిగిందో మాకు తెలుసు.. లోపలికి పోనివ్వండి. చెప్తాం. కార్పేటమ్మ కత మాకు తెలుసు.. మమ్మల్ని చెప్పనియ్యండి..' అని హేతువాది అయిన కుర్రాడు కేకలు వేసే సరికి జనాలు అందుకున్నారు. ఒకరి మీది నుంచి మరొకరు దూసుకొని సమావేశ మందిరంలోకి పోవడానికి ప్రయత్నించారు.

సరిగ్గా ఈ గడిబిడి జరుగుతున్నప్పుడే రోడ్డు మీద బస్సు దిగి అక్కడికి పరిగెత్తాను.

పోలీసులకు జనాలు మళ్ళబడుతున్నారు. 'కార్పేటమ్మ కత మేం చెబుతాం.. మాకు తెలుసు.. ' అందరిదీ ఒకే మాట. దూసుకొని పోతున్నారు. నేను ఆ జనంలో చిక్కుకపోయాను. కెరటం విసిరేసినట్లు ముందుకుపోయి గుంపులో పడ్డాను. ఇక పోలీసులు నిభాయించుకునేలా లేరు. లాఠీలు, తుపాకులు నేరుగా మంది మీదికి లేచాయి. జనం అంతకంటే తీవ్రంగా ఉన్నారు.

ఈ గలాటాకు శీతల మందిరం నుంచి ఆహూతులు బయటికి ఉరికెత్తుకుంటూ వచ్చారు.

'వాళ్ళను లోనికి రానీయకండి.. ఆడ్డుకోండి.. ఆడ్డుకోండి..' అని కేకలు వేశారు. 'వీళ్ళంతా తీవ్రవాద సానుభూతిపరులు రానీయకండి.. ' అని గగ్గోలు పెట్టారు. తలలు పగిలాయి. గుండెలు చీరుకపోయాయి. జనంపై లాఠీల దాడి, తూటాల దండయాత్ర.

☆

కథ

నీళ్లెంత రుచి

- తాయమ్మ కరుణ

అసలే మే నెల. విపరీతమైన ఎండలు. రాత్రి పదవుతుందేమో. ఎక్కడివాళ్లు అక్కడ నేల మీద పడుకుని ఉన్నారు. విపరీతమైన అలసట. అంతకు మించిన దాహం. ఎవరి దగ్గరా గుక్కెడు నీళ్లు లేవు. బాటిళ్లలో ఉన్న అడుగు బొడుగు నీళ్లని మూతలో తీసుకుని కొందరు పెదవులను తడుపుకుంటున్నారు.

'వనజక్కా, ఓ మూత నీళ్లివ్వవా? తర్వాత ఇస్తగని' శ్రీను వేళాకోళమాడాడు.

శ్రీను అందరిలోకి చిన్నవాడు. పంతొమ్మిది ఏళ్లు ఉంటాయేమో. అందరినీ ఆట పట్టిస్తుంటడు. అల్లరి ఎక్కువ. ఎవరికి సాయం చేయాల్సి వచ్చినా తానే ముందుంటడు.

'ఆ మాట నేనే అడుగుదామనుకుంటున్న శీను' నవ్వడానికి ప్రయత్నించింది లక్ష్మి. ఎండిపోయిన పెదవులు నొప్పిపెట్టినయి.

'ఏం జోకులేస్తారబ్బా!' అసహనంగా రుసరుసలాడింది శాంత.

విన్నవాళ్లంతా నవ్వారు.

'లేకపోతె చూడరాదు. పెదవులు తడుపుకోవడానికి నీళ్లు లేవంటే.. ఉద్దెర కావాలంట. అయినా ఇప్పుడు శీను దగ్గరే పావులీటరు దాకా నీళ్లున్నయి. అందరిని అడుగుతున్నడుగని' శ్రీను చాలా అమీరు అన్నట్టుగా శ్రీను పక్కనే పడుకున్న విజయ అంది.

'నా దగ్గర ఉంటే నేనెందుకు అడుగుత' శ్రీను.

'బాటిల్ ఊపి చూడనా' విజయ.

'చప్పుడు చేయకండి' రమేష్ దగ్గరికి వచ్చి గుసగుసగా చెప్పి పోయిండు.

అందరూ సైలెన్స్.

అక్కడున్న వాళ్లందరికీ ఒకటే ఆలోచన గబాగబా నీళ్లు తాగాలి. కడుపునిండా తాగాలి.

మాగన్ను నిద్రలోకి జారుకున్న చిన్నక్క.. తియ్యటి నీళ్లని గుటగుట తాగినట్టే కలగంటోంది.

అలర్ట్‌గా ఉండి, అందర్నీ గమనిస్తున్నారు రాష్ట్ర కమిటీ సభ్యుడు మహేందర్, మరొకరు డిప్యూటీ కమాండర్ మమత.

మహేందర్ ఇంజినీరింగ్ చదువు అయిపోగానే వచ్చిన ఉద్యోగాన్ని వదిలిపెట్టి ఉద్యమంలోకి వచ్చాడు. ఎన్నికలను బైకాట్ చేయమంటూ పార్టీ వేసిన పోస్టర్ చూసి, వెతుక్కుంటూ వచ్చాడు. కొంత కాలం కార్మికవర్గంలో, విద్యార్థుల్లో పని చేశాడు. ఆ తర్వాత దళంలోకి వచ్చాడు. మహేందర్ సహచరి జిల్లా కమిటీ మెంబరు. వేరే దళంలో ఉంటుంది.

మహేందర్‌కు ఇద్దరు గార్డులు. ఒకరు మల్లికార్జున్, ఇంకొకతను భగత్.

కమాండర్ సుధాకర్, మహేందర్ గార్డు మల్లికార్జున్, ఇంకో ముగ్గురు కామ్రేడ్స్.... మొత్తం ఐదుగురి టీమ్ నీళ్ల కోసమని సుమారు సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో వెళ్లారు. పది దాటుతున్నా ఇంకా రాలేదు.

నీళ్లు దొరికాయో లేదో... వాళ్లకు పోలీసు బ్యాచ్ ఎదురుకాలేదు కద... ఆలోచిస్తున్నాడు మహేందర్. ప్రతి చిన్న శబ్దాన్ని శ్రద్ధగా వింటున్నాడు. ఎక్కడా కాల్పులు జరిగిన శబ్దమైతే వినిపించలేదు. ఇంత రాత్రి పూట కాల్పులు జరిగితే దూరమైనా వినిపించే అవకాశం ఉంటుంది. ఈ అడవిలో నీటి తావులు కూడా చాలా తక్కువ. ఉన్న చెలిమలు కూడా ఈ ఎండలకు ఎండిపోతాయి. దారేమైనా తప్పారా. వాళ్లు రాకపోతే వీళ్లందరి పరిస్థితి ఏంటి? ఇప్పటికే బాగా నీరసించి పోయారు. లేచి తుపాకి భుజానికి వేసుకున్నాడు మహేందర్. నిజానికి మహేందర్ పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. కానీ వీళ్లందరి బాధ్యత తనది. 'మనుషులు ఎంత శక్తిహీనంగా ఉన్నా అవసరమైనప్పుడు ఎక్కడాలేని శక్తి వస్తదని నాకు ఇక్కడకు వచ్చినాకనే అర్థమైంది. బహుశా ఆ శక్తి 'బాధ్యత' నుంచి వస్తదనుకుంటా.' అని బయటి నుంచి వచ్చిన ఓ కామ్రేడ్ అన్న మాటలు గుర్తుకువచ్చాయి మహేందర్‌కు.

అలికిడి విని గార్డు భగత్ లేచాడు. మహేందర్‌ను అనుసరించాడు. పొద్దుటి నుంచి పదే పదే చెమటకు తడిసిన బట్టలు ఆరిపోయి గట్టిగా అయినయి. అక్కడొకరు ఇక్కడొకరు లెక్కన 'కవర్ల'కు దగ్గర్లో పండుకున్నరు. ఎవరి తలల కింద వాళ్ల కిట్లు పెట్టుకున్నరు. ఒక్కరు కూడా పట్టాలు (పాలిథిన్ కవర్లు) తీసి పరువలేదు. ఏ క్షణం ఏం జరుగుతుందో..

* * *

పోలీసులు కూంబింగ్ చేస్తున్నారనే వార్త నిన్న పొద్దునే అందింది. ఎందుకైనా మంచిదని గుట్టపైకి వెళ్లారు. ఇలాంటి సందర్భాల్లో నీళ్ల పాయింట్లకు ఎంత దూరం ఉంటే అంత మంచిది. 'పోలీసులు ఎప్పుడూ తిరుగుతనే ఉంటరు కద. మోసేటోళ్లకు తెలుస్తది. అసలే చాలా దూరం. మళ్లా గుట్టమీదికి మొయ్యాలి' కొందరు గులిగారు. అనారోగ్యంతో ఉన్నవాళ్లు తప్పితే రాష్ట్ర నాయకత్వం కూడా ఒకోసారి నీళ్లకు వెళుతుంటారు - ప్రమాదమైనప్పటికీ.

కింద కొన్ని సామాన్లు ఉంటే తీసుకురావడానికి పొద్దున ఏడున్నర గంటల ప్రాంతంలో ఒక బ్యాచీ బయలుదేరింది. కింద నుంచి పోలీసులు పైకి ఎక్కుతున్నారు. పోలీసులు వీళ్లను చూడలేదు. వెంటనే వెనక్కి వచ్చి.. పోలీసుల విషయం సెంట్రీకి చెప్పి, రాష్ట్ర కమిటీ మెంబరు మహేందర్‌కు, కమాండర్ సుధాకర్‌కు ఇన్ఫర్మేషన్ ఇచ్చారు.

ఒక టీమును సెంట్రీకి సపోర్టుగా పంపారు. వెంటనే అందరినీ పిలిచి, 'ఎవరూ కంగారు పడొద్దు. పోలీసులు పైకి ఎక్కుతున్నారు. ఇక్కడికి వచ్చేసరికి ఇంకో ఐదారు నిమిషాల టైమన్నా పట్టుద్ది. సెంట్రీకి సపోర్టుగా అస్సాల్ట్ టీమ్ వెళ్లింది. కిట్లు తీసుకుని మీ కవర్లలోకి పోండి. 'ఆర్.వి.' (విడిపోతే కలుసుకునే ప్లేసు) గుర్తుంది కదా' అని 'ఆర్.వి' ప్లేసు పేరు మళ్లొకసారి గుర్తుచేశాడు కమాండర్ సుధాకర్.

సుధాకర్ ఎం.ఏ ఇంగ్లిష్ చేస్తూ ఆర్ఎస్‌యూ నుంచి పార్టీలోకి.. అక్కడికి నుంచి దళంలోకి వచ్చాడు. తన సహచరి వేరే దళంలో

ఉంటుంది.

తమ కిట్లు, తుపాకి కాకుండా వాళ్ల వాళ్ల వస్తువులు తీసుకున్నారు. ఒకరు బియ్యంమూట ఎత్తుకుంటే, ఇంకొకరు కంప్యూటర్, మరొకరు ఇంకొంత సామాను ఇలా.. శాంత అప్పటికే వండిన నూకల అన్నాన్ని గబగబా మూటగట్టింది. ఆ కాలే మూటను ఉరుకుతున్న ఓ కామ్రేడ్‌కు ఇచ్చి, తన 'కవర్'లోకి పరిగెత్తింది. శాంతకు నలభై వరకు వయసుంటుంది. కొంచెం లావు కూడా. శాంత సహచరుడు రాష్ట్ర కమిటీ సభ్యుడు. వేరే ప్రాంతంలో ఉంటున్నాడు.

శ్రీను వెళ్లి ఓ వాటర్ క్యాన్ పట్టుకున్నాడు. ఇంకో రెండు వాటర్ క్యాన్లను ఇంకో ఇద్దరు కామ్రేడ్స్ తీసుకున్నారు. ఇవి కమాండర్ అప్పచెప్పని బరువులు. కానీ అవసరానికి ఉపయోగపడేవి. అదనపు బరువైనా వ్యక్తిగత చొరవతో తీసుకున్నారు.

గార్డులిద్దరూ మహేందర్‌కు అటొకరు ఇటొకరు 'కవర్ల' (రక్షణ: ఫైరింగ్ జరిగితే తూటాలు తగలకుండా చెట్టో, పుట్టో, రాయో ఏదో ఒకదానిని రక్షణగా చేసుకోవడం)లో నిలుచున్నారు. రెండు నిమిషాల్లో అందరూ 'కవర్ల'లోకి వెళ్లిపోయారు. చీమ చిటుక్కుమంటే ఒట్టు. క్షణాలు దొర్లుతున్నాయి.

పోలీసులు తెలిసే వచ్చారా? జనరల్ కూంబింగ్‌లో భాగంగా వచ్చారా? జనరల్‌గా వస్తే చూడకుండా పోయే అవకాశాలే ఎక్కువ. జనరల్ కూంబింగ్‌లో వస్తే ఇంత పైకి రారే. ఎవరైనా తీసుకువచ్చారా? ఒకటే బ్యాచ్ వచ్చిందా? ఎవరికి వాళ్లే ఆలోచిస్తూ, చుట్టూ పరికించి చూస్తున్నారు మహేందర్, సుధాకర్‌లు. నాలుగు నిమిషాలవుతోంది.

'ఢాం...'తో మొదలైంది శబ్దాల హోరు.

మొదటి తూటా సెంట్రీ నుంచే పేలింది.

మామూలుగా అయితే మొదట ఎవరి వైపు నుంచి ఫైరింగ్ స్టార్టవుతుందో వాళ్లకు నష్టం జరగదు. జరిగినా తక్కువగా ఉంటుంది – అలర్ట్‌గా ఉంటారు కాబట్టి – కానీ వీళ్లు 'గ్రేహౌండ్స్'. నక్సలైట్ల బలాలు, బలహీనతల మీదనే ముఖ్యంగా ట్రెయినింగ్ పొందినవాళ్లు. ఫైరింగ్ చేస్తూ ముందుకు దూసుకువస్తున్నారు. అయితే అడవిలోకి వచ్చిన పోలీసులకూ తూటాలు ఇబ్బడిముబ్బడిగా వచ్చే అవకాశాలు లేవు. వారి దగ్గర ఉన్నవి అయిపోతే ఇక అంతే. ఆ సంగతి కామ్రేడ్స్‌కు తెలుసు. పోలీసులను తీసుకొచ్చిన ఇన్ఫార్మర్ కాల్పులు మొదలవ్వగానే కాలికి బుద్ధి చెప్పాడు. దళం గుట్ట కింది నుంచి గుట్ట పైకి మకాం మార్చిన సంగతి వాడికి తెలియదు. అడుగులను చూస్తూ పైకి తీసుకొచ్చాడు.

ఇద్దరు సెంట్రీ కామ్రేడ్స్, వాళ్లకు సపోర్టుగా వెళ్లిన అస్సాల్ట్ టీమ్‌లోని ఐదుగురు టీం కవర్లలో ఉండి నిబ్బరంగా ఫైరింగ్ చేస్తూనే ఉన్నారు. ఇలా కాదని.. డిప్యూటీ కమాండర్ మమత గుండెల నిండా శ్వాస తీసుకుని క్షణం ఆగింది. గురిచూసి కాల్చింది. ఒకడికి గాయమైంది. ఒరిగిపోయాడు. అదే విషయాన్ని కమాండర్ సుధాకర్‌తో వాకీటాకీలో చెప్పింది. అప్పటికే ఫైరింగ్ స్టార్టయ్యి రెండు నిమిషాలవుతోంది.

'గ్రేహౌండ్స్ వాళ్లు ప్లటూన్ (30 మంది) వరకు ఉన్నారు. ఒకడికి గాయమైంది. ఇప్పుడు కొంచెం ఆగారు. కానీ మిగతా దూకుడుగానే ఉన్నారు' రిట్రీట్ అవుదామన్నట్టుగానే చెప్పింది డిప్యూటీ మమత.

ఇన్ఫార్మర్ తీసుకొచ్చిన పోలీసులు. ఎన్ని బ్యాచీలు దిగినాయో తెలియదు. ఇప్పుడే తూటాలన్ని అయిపోగొట్టుకునే పరిస్థితి లేదు. మళ్లీ ఎక్కడన్నా పోలీసులు ఎదురుకావచ్చు. క్షణం ఆలోచించిన కమాండర్ సుధాకర్ 'రిట్రీట్' కోడ్ చెప్పాడు.

అలాగే తన దగ్గరున్న కామ్రేడ్సందరికీ రిట్రీట్ కాషన్ ఇచ్చాడు.

అందరూ రిట్రీట్ అవుతున్నారు. ఫైరింగ్ జోరుగా సాగుతూనే ఉంది. అస్సాల్ట్ టీం ఫైరింగ్ చేస్తూ వెనక్కు వెనక్కు వస్తున్నారు. లక్ష్మి మాత్రం తన కవర్ దగ్గరి నుంచి ఒక్క ఇంచు కూడా కదల్లేదు. పాటలు రాసే, పాడే దయాకర్ వెళ్లిపోతూ గమనించాడు. తనకి లక్ష్మి అంటే ఇష్టం. లక్ష్మి కూడా జానపదాలను బాగా పాడుతుంది. మంచి గొంతు. కమాండర్‌కు చెప్పాడు – లక్ష్మి కదలడంలేదని. 'లక్ష్మీ, రా' పిలిచాడు కమాండర్. అయినా నిశ్చేష్టురాలైన లక్ష్మి అలాగే నిలుచుండిపోయింది. 'వెళ్లి, లాక్కురాపో' రిట్రీట్ అవుతూనే సుధాకర్ ఆర్డర్. దయాకర్ వెళ్లి చెయ్యి పట్టి గుంజిండు. అయినా లక్ష్మి కదల్లేదు. బర్రబర్ర గుంజుకుంటూ రిట్రీట్ అవుతున్నాడు. కాని వెనుకబడిపోయాడు.

ఫైరింగ్ స్టార్టయి నాలుగు నిమిషాలు అవుతుందేమో. చావుకు బతుక్కి రెండు నిమిషాల వ్యవధి. తూటా రేంజ్‌ని దాటితే బయటపడినట్టే. ప్రాణాలకు ప్రమాదం లేనట్టే. అందరి గొంతులు ఎండుకపోయినవి. విపరీతంగా ఆయాసం. 'కవర్లు చూసుకుంటూ రిట్రీట్ అవ్వండి', 'పక్కన వాళ్లను చూసుకోండి. ఎటుపడితే అటు ఉరుకొద్దు' సుధాకర్ కాషన్లు ఇస్తనే ఉన్నడు. మరోపక్క మహేందర్‌ను చూసుకుంటూనే ఉన్నడు.

అందర్నీ సమన్వయం చేసుకుంటూ రిట్రీట్ అవుతున్న సుధాకర్ వీళ్లని ఒక కంట కనిపెడుతూనే ఉన్నడు. దయాకర్‌వాళ్లు వెనుకబడిపోవడం చూసి ఆగమని కాషన్ ఇచ్చిండు. చాలా మందికి ఇది వినిపించలేదు. కొందరు గందరగోళంలో ఎవరికి తోచిన రీతిలో వారు రిట్రీట్ అవుతూనే ఉన్నరు. సీనియర్ కామ్రేడ్స్ వాళ్లను నెమ్మదిగా పిలుస్తున్నా ఆగడం లేదు. ఇక లాభం లేదని సుధాకర్ సన్నగా నోటితో విజిల్ వేశాడు. అందరూ ఆగి వెనక్కి చూశారు. ఆగమన్నట్టు సైగ చేశాడు. 'డేంజర్ జోన్ దాటాం. పరిగెత్తకండి. చూసుకుంటూ నడవండి' అని. అవసరమైతే దయాకర్ వాళ్లకు సాయంగుండమని వినయ్, అజయ్‌లకు చెప్పాడు. మహేందర్ తన చుట్టూ ఉన్నవారిని కలుపుకుని సుధాకర్ కాషన్స్ ఫాలో అవుతున్నాడు. ఎంతటి నాయకుడైనా కమాండర్ కాషన్ ఫాలో కావాల్సిందే.

శాంత పరుగెత్తలేకపోతోంది. విపరీతంగా రొప్పుతోంది. అడుగు తీసి అడుగు వేయడం కూడా కష్టంగా ఉంది. రమేష్‌కు ముందుగానే శాంత బాధ్యతను అప్పగించడం వల్ల, శాంతను చూస్తూ నెమ్మదిగా రిట్రీట్ అవుతున్నాడు రమేష్.

ఫైరింగ్ ఆగిపోయింది. అస్సాల్ట్ టీం స్పీడ్‌గా రిట్రీట్ అవుతూ వీళ్లకు కనిపిస్తోంది.

అస్సాల్ట్ టీం వాళ్లు దయాకర్‌వాళ్ల దగ్గరికి వచ్చేశారు. లాభం లేదని లక్ష్మిని ఎత్తుకుని రిట్రీట్ అవడం మొదలుపెట్టిండు దయాకర్.

ఫైరింగ్ స్టార్టయ్యి ఐదు నిమిషాలవుతుందేమో. పోలీసులకు వీళ్లకు గ్యాప్ పెరిగింది. వెంటనే ఫార్మేషన్లోకి వచ్చారు. అస్సాల్ట్ టీం వచ్చి వీళ్లతో కలిసింది. అప్పటికే అందరి నీళ్ల బాటిళ్లు ఖాళీ అయ్యాయి.

ఓ గంటసేపు నడిచాక, అడవి చిక్కగా ఉన్నచోట ఆగిపోయారు. సెంట్రీ కామ్రేడ్స్ వెళ్లిపోయారు. 'రోల్‌కాల్' (అందరూ లైన్లో నిలుచుంటే ఆ రోజు లేదా తక్షణ కార్యక్రమాన్ని కమాండర్ చెప్తాడు). 'అరగంట ఆగి మళ్లీ ఇక్కడి నుంచి వెళతాం. క్యాన్లల్ల నీళ్లని బాటిళ్లలో నింపుకోవాలి' అని, మళ్లొకసారి 'ఆర్.వి.'ని గుర్తు చేశాడు సుధాకర్. 'రోల్‌కాల్' కాగానే

'కవర్స్' చూసుకోవడం తప్పనిసరి. కవర్లు చూసుకుని ఎవరి కవర్ల దగ్గరవాళ్లు కూచున్నారు.

శాంత ఎలా రొప్పిందో శ్రీను విత్ యాక్షన్‌తో చూపిస్తున్నడు. నీళ్ల క్యాన్ల చుట్టూ మూగిన కామ్రేడ్స్ కిసకిస నవ్వుతున్నరు. 'లొల్లి, లొల్లి' సుధాకర్ హెచ్చరించాడు తనూ నవ్వుతూనే. మహేందర్ వాళ్లను చిరునవ్వుతో చూస్తూ కూచున్నాడు. లక్ష్మి కొంచెం తేరుకుంది. కానీ ఒంట్లో సత్తువనంతా చెయ్యిపెట్టి తోడేసినట్టుగా బలహీనంగా కూలబడిపోయింది.

లక్ష్మి గురించి కూడా శ్రీను చెప్పబోయాడు. వద్దన్నట్టుగా సైగ చేశాడు మహేందర్.

తనను ఎక్కిరిస్తున్నారని శాంత మూతి ముడుచుకుంది. మాట కటువే అయినా తల్లి మనసున్న శాంత నెమ్మదిగా లేచి సద్దిమూట తెచ్చి విప్పింది. కారం, ఉప్పు కలిపి తలా కొంత పెట్టింది. అది తిని నీళ్లు తాగారు. అరగంట అయిపోయింది. వెళ్లిపోదామని సుధాకర్ సర్దుకుంటూ ఉంటే దయాకర్ వచ్చి... లక్ష్మి పరిస్థితి చెప్పి, కొద్దిసేపు ఆగుదామన్నాడు.

ఇంకో పది నిమిషాలు ఆగారు. లక్ష్మి కూడా షాక్ నుంచి ఇంకొంచెం తేరుకుంది. అన్నలంటే ఉన్న అభిమానంతో దళంలోకి వచ్చింది కానీ స్వతహాగా భయస్తురాలు. అది గమనించే ఇంటికి పొమ్మని కూచబెట్టి చెప్పారు. అయినా వినలేదు. 'నేనేం భయపడను. పొమ్మనొద్దు' అన్నది. ఇప్పుడిదీ పరిస్థితి.

వెళ్లిపోవడానికి నోటితో విజిల్ వేశాడు సుధాకర్. ఎంత చిన్నగా విజిల్ వేసినా చాలా దూరం వినిపిస్తుంది. ఈ విజిల్‌ను గుర్తుపట్టడం కష్టం. పక్షులు వేసినట్టుగా అనిపిస్తది కొన్నిసార్లు. అలవాటైన వాళ్లకు మాత్రమే అది తమవాళ్లు వేసిందనేది అర్థమవుతది. అందరూ కిట్లు సర్దుకుని, తామున్న ప్రాంతంలో ఆనవాళ్లను 'కెమోఫ్లేజ్' చేసి వచ్చి 'రోల్‌కాల్'లో నిలబడ్డారు.

'ఎన్ని బ్యాచ్‌లు దిగినయో తెల్వదు. ఇప్పటివరకైతే బయటపడ్డం. అందరూ అలర్ట్‌గా ఉండాలి. ఇంకో నాలుగు గంటలు నడిచినంక ఆగుతాం. క్యాన్లల్ల నీళ్లన్నీ అయిపోయినయి. ఇక ఇప్పుడు మన బాటిళ్లలోని నీళ్లే మిగిలినయి. మళ్లీ దొరికేవరకు ఇవే నీళ్లు. జాగ్రత్తగా వాడుకోండి' సుధాకర్ చెప్పాడు. అప్పటికి సమయం ఉదయం పది గంటలు కావస్తోంది.

నడక మొదలైంది. సీదా నడిస్తే మధ్యలో మైదానం కూడా వస్తుంది. త్వరగా అనుకున్న ప్రాంతానికి వెళ్లవచ్చు. ఎక్కడెక్కడ పోలీసులు తిరుగుతున్నరో తెల్వదు కాబట్టి చెట్లున్న ప్రాంతం నుంచే నడుస్తున్నారు. కాబట్టి ఎక్కువ దూరం నడవాల్సి వస్తోంది. నడక మొదలై మూడు గంటలవుతోంది. అనుకున్న దాంట్లో సగం కూడా రాలేదు. తిన్న రెండు ముద్దలూ అరిగిపోయినయి. అంతకంటే ముందు అందరి బాటిళ్లలోని నీళ్లు అయిపోయినయి – అనుభవమున్న కొందరి దగ్గరతప్ప. మిట్ట మధ్యాహ్నం ఒంటి గంటవుతుంది. అగ్గిపుల్ల గీకి వేస్తే అడివంత క్షణాల్లో కాలిపోయేలా ఉంది. కొమ్మ ఊగుతలేదు. అందరి డ్రెస్సులు చెమటతో తడిసి ముద్దయిపోయినయి. చాలామంది నీరసించారు. అందరినీ ఓ కంట కనిపెడుతనే ఉన్నరు మహేందర్, సుధాకర్. కొంచెం చిక్కటిచెట్లు రాగానే కమాండర్ ఆగుదామన్నట్టుగా విజిల్ వేశాడు. ఎక్కడివాళ్లు అక్కడే ఫార్మేషన్‌లో కూచుండిపోయారు.

'పది నిమిషాలాగి వెళదాం. కిట్టుని, తుపాకిని భుజం మీది నుంచి తీయకండి' చెప్పాడు సుధాకర్. కిట్టుని భుజానికి ఉంచుకుని అట్లాగే వెనక్కి ఒరిగారు చాలా మంది. కొద్దిమంది మాత్రం కిట్టు తీసి కాళ్లమీద పెట్టుకుని రాయో రప్పో చూసుకుని దానిమీద కూచున్నరు. తుపాకిని మాత్రం ఎవరూ భుజం మీంచి తీయలేదు. ఓ రెండు నిమిషాలు గడిచాక....

కొన్ని నీళ్లిమ్మని అడుగుతున్నరు బాటిళ్లు ఖాళీ చేసుకున్నవాళ్లు. వాళ్లకూ తెలుసు, నీళ్లు ఎవరి దగ్గరా లేవని. అయినా గొంతు అర్రుకుపోయే దాహం. జీవితంలో మొదటిసారి ఈ అనుభవం. ఎవరూ ఎవరికీ యివ్వలేదు. ఇప్పుడిప్పుడే బాటిళ్లు ఖాళీ అయినయి. నీళ్లిచ్చామా ఉన్నవాళ్ల దగ్గరవి కూడా ఇప్పుడే అయిపోతాయి. ఇంకా ఎన్ని గంటలు నడవాలో తెలియదు. తప్పనిసరి పరిస్థితిలోనే దాచుకున్న నీళ్లు తీస్తారు ఫైరింగ్ అనుభవం ఉన్నవాళ్లు. తమ దగ్గర ఉన్నవాళ్లు కూడా నీళ్లు తాగలేదు కొందరు.

వనజ నీటి కోసం అల్లాడుతోంది. దళంలోకి వచ్చి రెండేళ్లవుతున్నా తనకు ఇదే మొదటి ఫైరింగ్. ఎవరిని అడిగినా ఇవ్వలేదు.

'కాసేపు ప్రశాంతంగా కూర్చో. దప్పిక ఆగుతుంది. తిరిగితే ఇంకా ఎక్కువైతది.' తన అనుభవమే చెప్పింది చిన్నక్క. తన దగ్గర ఓ చాయ్ గ్లాసుడు నీళ్లున్నాయి. ఇక తాను కూడా అత్యవసరమైతే తప్ప వాటిని బయటికి తియ్యదు.

బాటిల్ మూతలోకి కొన్ని నీళ్లు ఒంపి, దాన్ని వనజకు ఇచ్చిరమ్మని తన గార్డు భగత్ చేతికి ఇచ్చాడు మహేందర్. భగత్ వెళ్లి వనజకు ఇచ్చిండు. వాటిని గొంతులో పోసుకుంది వనజ. ప్రాణం లేచొచ్చింది. ఇంకా తాగాలనుంది. ఎక్కడి నుంచి వస్తాయి? అట్లాగే కిట్టుమీదికి ఒరిగింది.

సుధాకర్ విజిల్ వేసిండు, వెళదామన్నట్టుగా. 'కొద్ది దూరం నడిచినాక కాలిబాట వస్తది. గమనిస్తూ నడవండి' చెప్పాడు.

ఓ పావుగంట నడిచాక రానేవచ్చింది కాలిబాట. మిగతా టీమంతా బాటకు చాలా లోపలే ఆగారు. అస్సాల్ట్ టీం బాట దగ్గరికి కవర్లను చూసుకుంటూ వెళ్లి మంచి కవరున్న చోట ఆగి చుట్టూ చూస్తున్నారు. బాట మలుపు తిరుగుతూ పోలీసు బ్యాచీ కనిపించింది. కమాండర్‌కు విషయాన్ని చేరవేశారు. అక్కడే ఇంకాసేపు ఆగారు. భగత్‌కు సివిల్ డ్రెస్సు వేసి 'రెక్కీ' కోసం పంపించారు.

భగత్ లోకల్. పోలీసులు అటకాయించి ఏదైనా అడిగినా స్థానికుల యాసలో మాట్లాడగలడు. తెలివైనవాడు. ధైర్యం ఒక్కటే ఉంటే చాలదు, అవసరమైతే అనుమానం రాకుండా అబద్ధాలాడైనా తప్పించుకోగల నేర్పు ఉండాలి.

'అడుగులను బట్టి పదిహేను లేదా ఇరవై మంది వరకు పోలీసులు ఉన్నట్టు అనిపిస్తుంది. కాలిబాట అవతలివైపు నుంచి వచ్చిండ్రు. బాట అవతలివైపు చెట్లళ్ల కాస్సేపు ఆగినట్టున్నరు. వాళ్లు కూచున్నచోట ఆకులు నలిగిపోయి ఉన్నయి.' ఓ పావుగంట తర్వాత తిరిగి వచ్చిన భగత్ సమాచారాన్ని కమాండర్‌కు, మహేందర్‌కు చెప్పిండు.

సుధాకర్ విజిల్ వేసిండు. కిట్టు, తుపాకి భుజాలకు తగిలించుకుని ఫార్మేషన్‌లో నిలబడ్డారు. 'మనం అనుకున్న ప్లేసు వరకు ఆగకుండా వెళ్లాలి' చెప్పాడు సుధాకర్.

మధ్యలో ఆగొద్దనకున్నా.. నడవలేని స్థితికి చేరుకున్న కొందరి కోసం ఆగారు. అత్యవసరమైన వాళ్లకి ఉన్న నీళ్లల్లోనే 'త్యాగం' చేశారు. అట్లా నడిచీ నడిచీ సాయంత్రం ఆరున్నర గంటల సమయంలో

అనుకున్న ప్రాంతానికి చేరుకున్నరు. ఇప్పుడు పది పదిహేను మిల్లీ లీటర్ల కంటే ఎక్కువ ఎవరి దగ్గరా లేవు. ఆ నీళ్లల్లో కూడా కొందరికి పెదవులు తడుపుకోవడానికి దానం చేశారు కొందరు. కొద్ది మంది దగ్గర ఆ నీళ్లు కూడా లేవు.

'రాత్రికి ఇక్కడే ఆగుతాం. నీళ్లు ఎక్కువ దొరికితే వంట. లేదంటే రేప్పొద్దునే. కొన్ని బిస్కట్లు ఉన్నయి. ఈ రాత్రికి అవే.' రోల్‌కాల్‌లో సుధాకర్ చెప్పిండు. అలాగే నీళ్లకు వెళ్లే వాళ్ల పేర్లు చెప్పిండు.

ఎండిపోయిన ఆ వాగుకు చుట్టూ ఎవరి 'కవర్లు' వాళ్లు చూసుకున్నరు. కవర్లకు దగ్గర్లో నేలమీద పడిపోయిండ్రు. సూర్యుడు అప్పుడప్పుడే మబ్బుల చాటుకు వెళ్లిపోయిండు. భూమిలోంచి కూడా అగడి వస్తుంది. నల్లమలలో రాళ్లు ఎంతగా ఉంటాయో అన్నిరకాల మల్లెలు కూడా పూస్తాయి. చిక్కటి మల్లెతీగ పైనంతా పరుచుకుని ఉంది. మల్లెలు విచ్చుకుంటూ మంచి వాసన వెదజల్లుతున్నాయి. ఆ గమనింపు ఎవరికీ లేదు. చెమటకు తడిచి, ఎండిపోయి, మళ్లీ తడిచి ఇలా ఎన్నో సార్లు అయ్యా అట్టలు కట్టిన బట్టలు. చెమట కంపు. ఎండుకపోయిన గొంతులు. వాళ్లకు ఇపుడు ఒకటే కోరిక నీళ్లని గుటగుట ఆగకుండా తాగాలి.

* * *

అర్ధరాత్రి కావస్తుంది పుల్ల విరిగినా వినిపించే నిశ్శబ్దం. ఒక్కొక్కర్నీ చూస్తూ కదిలాడు మహేందర్. కొందరు నిద్రపోయారు. కొందరు దాహంతో నీళ్ల మీద ప్రాణాలన్ని పెట్టుకుని ఎప్పుడు వస్తాయా అనుకుంటూ ఎదురుచూస్తున్నారు. అయినప్పటికీ విపరీతమైన అలసటతో మాగన్ను నిద్రలో ఉన్నారు. వాతావరణం చల్లబడి ఆ మాత్రం దాహానికి తట్టుకుని ఉండగలుగుతున్నారు.

సెంట్రీ దగ్గరికి వెళ్లాడు మహేందర్. సెంట్రీ అలర్ట్‌గానే ఉన్నాడు.

'మనవాళ్లు వస్తున్నట్టు ఏమైనా వినిపిస్తుందా?' అడిగాడు సెంట్రీలో నిలుచున్న రఘుని.

'ఏం వినిపిస్తలేదు మహేందర్.' బదులిచ్చాడు ఇరవయ్యేళ్ల వయసున్న రఘు.

మహేందర్ ఒక్కడికే నలభైఐదు వరకు వయస్సుంది. కమాండర్‌కు ముప్పైఐదు వరకు ఉంటాయేమో. శాంత మినహా మిగతా అందరూ ఇరవైఐదు లోపువారే.

ఎంత పెద్ద నాయకుడినైనాసరే పేరుతోనే పిలుస్తారు. 'అన్నా', 'అక్కా' అనే పదాలు హోదా లేదా మరేదానికైనా కావచ్చు.... చిహ్నాలుగా మారాయని, పేరుతోనే పిలవాలనే రాష్ట్రకమిటీ తీర్మానం. దీంతో వయసు, హోదాలతో సంబంధం లేకుండా పేరుపెట్టే పిలుచుకుంటున్నారు. ఈ తీర్మానం ఎందుకు చేయాల్సి వచ్చిందంటే ఊర్లోకి వెళ్లినప్పుడు తమకంటే వయసులో చిన్నవాళ్లు కదా అని ఎవరైనా పెద్ద వయసువారు పేరు పెట్టి పిలిస్తే... 'అన్నా' అని పిలువాలనే దబాయింపు. ఒకటి రెండు సంఘటలే కావచ్చు. ప్రజలకంటే 'మేం భిన్నం' అనే ధోరణి. ఇది నెమ్మదిగా పెత్తందారీతనానికి దారితీస్తదని ఆ తీర్మానం.

'సెంట్రీ అయిపోలేదా.'

'ఇంకో అరగంట ఉంది మహేందర్' అని, 'ఇక్కడికి దగ్గర్లో నీళ్లు లేవా' సెంట్రీలో ఉన్న రఘు అడిగాడు.

రఘు చాలా చురుకైనవాడు ప్రతీది ఒక అంచనాతో ఉంటాడు. ఫైరింగ్ తర్వాత వేరే ప్రాంతానికి వచ్చారు. ఈ ఏరియా రఘుకి తెలియదు.

'రెండు, రెండున్నర గంటల దూరంలో ఒక బాయి ఉండాలి. మరి అందులో నీళ్లున్నాయో లేవో. లేకపోతే తోడాలెకద. ఈ పాటికి దగ్గర్లోకి వచ్చి ఉంటారు.' చెప్పి వెనుదిరిగాడు మహేందర్. అనుసరించాడు గార్డు భగత్.

దళం నుంచి ఎవరు ఎక్కడికి వెళ్లినా నాయకుడికి చెప్పకుండా తెలియకుండా ఏదీ జరుగదు.

నాయకుడి పలకరింపు క్యాడర్‌ను వెన్నుతట్టి నిలబెడుతుంది. ధైర్యాన్ని, సహనాన్ని నింపుతుంది.

డిప్యూటీ కమాండర్ మమత దగ్గరికి వెళ్లాడు. అలర్ట్‌గా ఉండాలని ఎంత ప్రయత్నించినా కండ్లు మూతలు పడుతున్నాయి. మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచి చూస్తోంది. అయినా అవి వినకుండా వాటి పని అవి చేసుకుపోతున్నాయి. అలికిడికి లేచి కూచుని 'మహేందర్...' పిలిచింది.

'ఆ... నేనే' వెళ్లి పక్కనున్న రాయిమీద కూచున్నాడు మహేందర్. పక్కనే గార్డు కూచున్నాడు.

'నీళ్లు అందరి దగ్గరి అయిపోయినట్టుంది కదా' మహేందర్

'ఆ... అయిపోయినవ్. బహుశా శ్రీను దగ్గరే కొన్ని ఉన్నాయనుకుంటా' మమత.

తెలుసన్నట్టు నవ్వాడు మహేందర్.

'సెంట్రీ టైమ్ అయిపోతుందనుకుంటా' మహేందర్.

'అవును. వనజను పంపాలె'

'భగత్‌ను పంపు'

'మల్లికార్జున్ కూడా లేడు. భగత్‌ను కూడా పంపితే ఎట్లా? ఒక్కరన్నా నీకు సెక్యూరిటీ ఉండొద్దా?' మమత

'వనజ పరిస్థితి బాగున్నట్టు లేదు కద'

పోయినవాళ్లు ఐదుగంటలు దాటినా ఇంకా రాలేదు. అందరూ సేఫ్ అని తెలిసే వరకు అలర్ట్‌గా ఉండడమే మంచిది. అనుభవం నేర్పిన పాఠం.

'శ్రీనుని పంపుతాలె'

'అటువైపు సెంట్రీ?'

'అటువైపు ఇద్దరున్నరు. ఇంకొకరు మారుతరు'

ఆరిపోయి అట్టకట్టుకుపోయిన ప్యాంటును దులుపుకుని లేచి నిలబడింది మమత. తుపాకీ భుజానికి వేసుకుంది. మమతకు ఈ మధ్యే పెళ్లైంది. ఆమె భర్త వేరే దళంలో కమాండర్. మమత పెద్దగా చదువుకోలేదు. ఊర్లో ఉన్న పదో తరగతి వరకు చదువుకుంది. దళంలోకి వచ్చి ఐదేళ్లవుతోంది.

'శ్రీను' మెల్లగా పిలిచింది.

'ఆ...'

'సెంట్రీకి పోదువులే'

వెంటనే లేచి తుపాకి భుజానికి వేసుకుని, కిట్టు వేసుకుని, 'నీ బాటిల్ ఇటియ్యి. నీళ్లు పోస్త. ఏమన్నా అయితే ఎవరి దగ్గరా లేవు' శ్రీను.

'ఎందుకులే శీను. నీ దగ్గర ఉంటేనే మంచిది' మమత.

'కాదులే మమత. నీ బాటిలిటియ్యి' అంటూ మమత బాటిల్ గుంజుకుని కొన్ని నీళ్లు పోసిండు.

ప్రతి ఒక్కరి వెంట తుపాకి ఎట్లా ఉంటదో నీళ్ల బాటిల్ కూడా ఎప్పుడూ ఓ భుజానికి లేదా బెల్టుకు వేళ్లాడుతూ ఉంటది. ఈ వేసవిలో ఫైరింగ్ జరిగితే తూటాల నుంచి తప్పించుకున్నా నీళ్లు లేకపోతే

గొంతెండుకపోయి చచ్చిపోతరు. అందుకే తప్పనిసరిగా నీళ్ల బాటిల్ వెంట ఉంటది.

శ్రీను సెంట్రీకి వెళ్లి, రఘుని రిలీవ్ చేసిండు. కిట్టు వేసుకుంటున్నవాడల్ల ఆకులు విరిగిన శబ్దమవుతుంటే ఆగి వింటున్నడు రఘు.

'ఏమైంది?' ప్రమాదాన్ని పసిగట్టిన శ్రీను గుసగుసగా అడిగిండు.

'విను' రఘు

'అవును ఆకులు విరిగిన చప్పుడు' శ్రీను

ఇద్దరూ కవరు చాటుకు వచ్చి పొజిషన్ తీసుకున్నరు.

'మన కామ్రేడ్స్ ఇటు నుంచి వస్తరా?' రఘు.

'ఏమో. నాకేమీ చెప్పలేదు. వెళ్లేటప్పుడు ఆ సెంట్రీవైపు నుంచి వెళ్లారుకద' శ్రీను.

శబ్దం దగ్గరగా వినిపిస్తోంది. తుపాకుల లాక్ తీసేశారు. ట్రిగ్గర్ మీద వేలు పెట్టారు. ఇటువేపే వచ్చారా ఫైరింగ్ షురూ. ఇటువైపే వస్తున్నట్టు ఆకారాలు కనిపిస్తున్నాయి. చంద్రుడు కూడా ఇందాకే మబ్బుల చాటుకు వెళ్లిపోయాడు. మసక వెలుతురు.

వెలుతురులో ఇద్దరూ కళ్లు చించుకుని, ఊపిరి బిగపట్టి చూస్తున్నరు. ఇంత అర్ధరాత్రి పోలీసులైతే తిరగరు. వెళ్లిన కామ్రేడ్సే దారి తప్పి ఇటువైపు నుంచి వస్తున్నారేమో... కొద్ది దూరంలో ఒకటి, రెండు, మూడు... ఐదు ఆకారాలు. చేతుల్లో క్యాన్లు.

'మనవాళ్లే' శ్రీను అన్నాడు.

'ఆగు. ఎందుకైనా మంచిది కోడ్ చెప్దాం' రఘు.

'కోడ్' అడిగారు. రిప్లై వచ్చింది.

కవర్లలోంచి రఘు, శ్రీను వచ్చి నిలబడ్డారు. పది క్యాన్ల నిండా నీళ్లు పట్టుకుని కామ్రేడ్స్ వచ్చారు.

'అంతా బాగేనా?' రఘు అడిగిండు.

'ఆ.. బాగే' అనుకుంటూ క్యాంపులోకి నడిచారు.

రఘు కూడా సెంట్రీ నుంచి రిలీవ్ అయ్యి వాళ్లను అనుసరించాడు.

శ్రీను తన బాటిల్‌లోని నీళ్లను గబగబా రెండు గుక్కలు తాగాడు.

నీళ్లొచ్చినయని వినగానే అందరూ క్యాన్ల చుట్టూ మూగారు. 'ఎవరిష్టం వచ్చినట్టు వాళ్లు తీసుకోకండి. మమత అందరికీ కొలిచి పోస్తది. మనిషికి మూడు లీటర్లు మాత్రమే.' సుధాకర్ చెప్పాడు.

మొదట లక్ష్మికి, వనజలతో పాటు అందరికీ గ్లాసుడు చొప్పున నీళ్లు వడగట్టి తాగడానికి ఇచ్చారు. నోట్లో నీళ్లు పోసుకుని గుటుక్కున మింగి 'బురద, ఇసుక' అన్నారు. ఎంతో ఆశగా ఎదురుచూస్తున్న వాళ్లకి నిరాశే ఎదురైంది. అయినప్పటికీ ఇప్పటికివే అమృతం. రెండు మూడు వరుసల బట్ట పెట్టి నీళ్లు వడబోసుకుంటున్నారు. మమత, భగత్ నీళ్లు పోస్తున్నరు.

అయినా ఇసుక ఇసుగ్గానే ఉన్నాయి నీళ్లు.

సుధాకర్ వెళ్లి మహేందర్ పక్కన కూచున్నడు.

'ఎందుకింత లేటయ్యింది' రాయికి ఒరిగిన మహేందర్ సీదాగా కూచుంటూ అడిగాడు.

'ఆ బాయిల నీళ్లన్ని ఎండిపోయినయి. దిగి తవ్వితే బురద నీళ్లు. అవి కూడా కొన్ని కొన్ని ఊరుతున్నయి. పది క్యాన్లు నిండేసరికి ఇంత టైమయింది.' వివరించిండు సుధాకర్.

మహేందర్ బాటిల్‌లో నీళ్లు నింపి పట్టుకొచ్చి ఇచ్చి వెళ్లారు గార్డులు. గబగబ రెండు గుక్కలు తాగి, బాటిల్‌ను బెల్టుకు కట్టుకుంటూ 'రేపటి సంగతి' అడిగిండు మహేందర్.

'పొద్దున్నే ఇక్కడి నుంచి వెళ్లడమే మంచిది. దగ్గర్లోనే ఊరుంది. మన దగ్గరున్న బియ్యం కూడా ఒక్కపూటకే వస్తాయి. మన దంపులు కూడా దగ్గర్లో లేవు.' సుధాకర్

'తెల్లవారిన తర్వాత నడిస్తే ఫర్వాలేదా?' మహేందర్

'ఆ ఇదంతా అడవే. అడవికి ఆనుకున్న ఉన్న గ్రామమే.' సుధాకర్

'గ్రామంలో మీటింగు ఏమన్నా పెడతారా?' మహేందర్.

'పెట్టాలి. ఊర్లో చెరువు పూడిక తీయక చానా ఏండ్లవుతుంది. నీళ్లు లేవు. వానల్లేక పంటలు కూడా పండుతలేవు. పోయినసారి వచ్చినప్పుడు ఈ ఎండాకాలంలో చెరువు పూడిక తీయాలని తీర్మానం చేసినం. ఎట్లాగూ వచ్చినం కద. మీటింగు పెట్టి బ్యాచీలుగా చెయ్యాలి.' సుధాకర్.

'సరే. మమతతో మాట్లాడు' చెప్పిండు మహేందర్.

ఏరియాకు సంబంధించి కమాండర్‌కు పట్టు ఉంటది కాబట్టి, వాళ్లు చెప్పిందే ఫాలో అవుతారు. గైడెన్సు మాత్రమే నాయకులు ఇస్తారు.

సుధాకర్ లేచి నీళ్ల క్యాన్ల దగ్గరికి వచ్చిండు. పట్టుకున్న వాళ్లు కూడా అక్కడే ఉండి ముచ్చట్లు పెడుతున్నారు. దాహం తీరిన అలసట తర్వాతి ఆనందం వాళ్లల్లో.

'రమేష్ కాస్త నెమ్మదిగ తాగు. నీళ్లు ఎన్నడు తాగనట్టు అగుడగుడు అన్నట్టు తాగుతున్నవేంది' రఘు.

'ఆహా! గొంతెండుకపొయ్యి ఉంటే నువ్వు మాత్రం చాయ్ లెక్క గుటక తర్వాత గుటక తాగుతవుగద' తాగడం ఆపి చురక అంటించిండు రమేష్.

'మమత, నువ్వు నీళ్లు పోస్తుంటే ఇప్పటికి ఓ ఇరవయ్యో, నలభయ్యో, ఎనభయ్యో చుక్కలు కింద పోయినయి తెలుసా?' తన బాటిల్‌లోకి నీళ్లు ఒంపుకుంటూ అన్నాడు రఘు.

'చీకట్లో కూడా నీ కళ్లు భలే కనిపెడతాయే' అని, 'నువ్వు పొయ్యి బాబు, ఒక్క చుక్క ఒలకకుండా. ఎట్లా పోస్తావో నేను కూడా చూస్తా' మమత నవ్వుతూ అంది.

'కామ్రేడ్స్' సుధాకర్ గొంతు విని అందరూ సైలెన్స్ అయ్యారు. ఏం చెప్తడా అని శ్రద్ధగా చెవి ఒగ్గారు.

'గబగబా నింపుకుని వెళ్లండి రేప్పొద్దున నాలుగున్నరకల్లా లేవాలి. ఐదు గంటలకల్లా ఇక్కడి నుంచి కదలాలి' ఆర్డరు వేసిండు సుధాకర్.

అప్పటికి రాత్రి ఒంటి గంట. ఇంకా మూడున్నర గంటలే ఉంది తెల్లవారడానికి. ఎవరి ప్లేసుల్లోకి వాళ్లు వెళ్లిపోయారు.

డిప్యూటీ కమాండర్ మమతోపాటు మరో ముగ్గురికి మాత్రం ఈ మూడున్నర గంటల్లో ఓ గంట సెంట్రీకి పోతది.

'రాష్ట్ర కమిటీ తీర్మానం ప్రకారం రేపు చెరువు పూడికతీయడం గురించి సంఘం వాళ్లతో మాట్లాడాలి. అంతా ప్రశాంతంగా ఉంటే రాత్రిపూట జనంతో మీటింగు వేసి, బ్యాచీలుగా చేద్దాం.' అని రేపు గ్రామానికి వెళ్లాక చేయాల్సిన పని గురించి చెప్పాడు. పొద్దుటే మమతతో పాటు మరో ఇద్దరు కామ్రేడ్స్ గ్రామానికి వెళ్లాలని చెప్పాడు. ఎవరి కవర్లలోకి వాళ్లు వెళ్లి పడుకున్నారు.

* * *

తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు సెంట్రీలో ఉన్న వినయ్ వచ్చి డిప్యూటీ కమాండర్ మమతను లేపిండు. ఒక విజిల్‌తో అందరూ లేచారు. కాలకృత్యాలు తీర్చుకుని ఐదుగంటలకల్లా ఫార్మేషన్‌లో నడక మొదలైంది. అప్పటికే తెల్లటి వెలుగు వచ్చేసింది. ☆

కథ

మిగిలేటోళ్లు

- ఎం.ఎ. బాసిత్ -

'అన్నా టీవిలో స్క్రోలింగ్ చూస్తున్నవా?' ఫోన్లో ప్రభాత్, ఆ గొంతులో ఏదో ఆందోళన, ఆవేదన దోబూచులాడుతున్నాయి. ప్రూఫులు చూసే పనిలో ఉన్న ఫయాజ్, 'ఏం జరిగి ఉంటుందా?' అనుకుంటూనే, 'లేదు. వేరే పనిలో ఉన్నాను, ఏంటి విశేషం?' ఆదుర్దాగా అడిగాడు.

'చూడట్లేదా? ఘోరం జరిగిపోయిందన్నా' గొంతు గద్గదమైంది.

'ఘోరమా? అసలేం జరిగింది, ప్రభాత్?'

ప్రభాత్ సింగ్ మైదానప్రాంత గిరిజన ఉద్యమాల్లో చురుగ్గా ఉంటూనే, అటవీ చట్టాల పట్ల, ఆదివాసీ పోరాటాల పట్ల న్యాయబద్ధంగా ఆలోచిస్తాడు. ప్రభాత్ పట్ల ఫయాజ్ స్నేహం సామాజికమైంది. ఫయాజ్ పట్ల ప్రభాత్ గౌరవమూ సామాజికమైందే.

'తొమ్మిది మంది..................................దుఃఖంతో ప్రభాత్ గొంతు పూడుకుపోయింది'.

'షాకింగ్!...................................' ఏం మాట్లాడాలో తోచక, నిరుత్తరుడైపోయాడు. నెమ్మదిగా ఉబికివస్తున్న దుఃఖాన్ని తమాయించుకున్నాడు, ఫయాజ్.

వెంటనే ప్రూఫులు దిద్దటం పక్కన పెట్టి 'సార్'కు ఫోన్ చేసాడు.

'సార్, నేను భద్రాచలం వస్తాను'.

'వద్దు. వరంగల్ నుంచి నువ్వొచ్చేలోగ శవపంచనామా పూర్తయ్యి, డెడ్ బాడీస్ తీసుకొని కుటుంబ సభ్యులతో పాటు మేం వాపసు రావచ్చు'.

'..................సరే, సార్...........' మనసంతా దిగులు కమ్ముకొంది, ఫయాజ్‌కు, వరంగల్ నుంచి భద్రాచలంకు ఎంత లేదన్న ఆరేడు గంటల టైం పడుతుంది. ఈ లోగా ఏమైనా జరుగొచ్చుకదా! మనస్సు పీకుతున్నా బలవంతంగా అణుచుకొని టీవి ఆన్ చేసాడు.

మూడు నాలుగు గంటల పాటు అవే స్క్రోలింగులు. 'మృతుల్లో కెకెడబ్ల్యు కార్యదర్శి సుధాకర్, ఆయన సహచరి పుష్ప' అంటూ బ్రేకింగులు. యూనిఫైడ్ కమాండ్ చేతుల్లో పెద్ద కేడర్ నాయకులున్నట్లు కూడా ప్రత్యేక కథనాలు, నిజానిజాల సంగతి ఎట్లా తెలిసేది?

సాయంకాలానికి భద్రాచలం ఆసుపత్రిలో బీభత్సదృశ్యాలు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సంఘం, ప్రజా సంఘాలు, హక్కుల సంఘాల వాళ్లు కుళ్లిన పార్థివ శరీరాల చుట్టు మూగారు. ముక్కులకు కర్చీఫులడ్డం పెట్టుకొని తొంగి తొంగి చూస్తున్నారు. మధ్య, మధ్య 'సార్' మీడియాతో మాట్లాడుతున్నారు. అసలు చుట్టు ముట్టి చంపింది, పోలీసులు ప్రకటించినట్లు (పదహారు, ఎప్రిల్) ఇవ్వాళేనా? నిన్ననా? లేక అంతకు ముందు రోజే చంపి, ఇవ్వాళ ప్రకటించారా? ఇంతలోనె అంతలా ఎలా కుళ్లిపోయాయి?

'సార్' చెప్పినట్లు ఆరోజు రాత్రిలోగా పార్థివ శరీరాలు అమరుల పుట్టిన ఊళ్లకు చేరే అవకాశం లేదని తెలిపోయింది.

పౌరహక్కుల సంఘం వాళ్లు హైకోర్టులో లంచ్ మోషన్ వేశారు. కుటుంబ సభ్యులు, పౌరహక్కుల సంఘం బాధ్యుల సమక్షంలోనే పోస్టుమార్టం నిర్వహించాలని హైకోర్టు తీర్పునిచ్చింది.

అంతలోనె పోలీసు బుర్ర చురుగ్గా పనిచేసింది. అందర్ని ఇబ్బంది పెట్టి హింసానందం పొందాలనుకున్నారో ఏమో! జ్యూరిస్‌డిక్షన్ పేరు చెప్పి అంతగా వసతుల్లేని కుంట ఆసుపత్రికి తీసుకెళ్లి, అందులో స్థలం లేక చెట్టుకొకర్ని, పుట్టకొకర్ని పడేసి మొనగాడి ఫోజులు గొట్టినారు.

భద్రాచలంలో మృతవీరుల్ని సరిగా చూడని వారు ప్రకృతి ఆవరణలో చెల్లాచెదురుగా పడివున్న అమరుల్ని కొంచెం స్వేచ్ఛగా చూడగల్గుతున్నారు. గుడ్లల్ల నీళ్లు కుక్కుకొని, జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ మాట్లాడుకుంటున్నారు.

తొమ్మండుగురిలో ఏడుగురు వరంగల్ జిల్లాలో పుట్టిన వాళ్లె, ఒక్కరిదేమో కరీంనగర్ జిల్లా మంథని. ఇంకొగరిది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా వరంగల్ తలాపున ప్రవహిస్తున్న గోదావరి ఆవలిగట్టు ఊరు తాళ్లగూడెం, దానినె అన్నవరం అని కూడా పిలుస్తారట. గోదావరికి అటుపక్కనో, ఇటుపక్కనో ఎంత మంది వీరులో అమరత్వం పొంది ప్రవాహంలో కొట్టుకుపోయారో! సల్వాజుడుం, కోయకమాండోలు, సీఆర్‌పిఎఫ్ జవాన్ల అత్యాచారాలు, హత్యాకాండలకు ఇంద్రావతి, ప్రాణహిత, శబరి నదులు సాక్షం పలుకుతాయంటారు. అత్యాచారం చేసి చంపివేసిన ఆదివాసీ మహిళల శవాలను ఇంద్రావతి, ప్రాణహితలో కంటె శబరిలో వేస్తే 'సేఫ్' అని కోయకమాండోలు తమ 'స్థానిక' పరిజ్ఞానంతో సి.ఆర్.పి.ఎఫ్ జవాన్లకు సలహాలిస్తుంటారని చెప్పుకుంటారు. లోతైన శబరి నదిలో వేస్తే శవం దొరకడం, పోస్టుమార్టం 'బెడద' ఉండదని ఆ సలహా సారాంశం.

ఎండకు శవాలు బాగా కుళ్లినా, చెట్ల కింద ఓపెన్ ప్లేస్‌లో వాసన పది దిక్కులు విచ్చిన్నమై విస్తరించడం వల్ల తగ్గినట్లు అన్పిస్తోందేమో! కుటుంబ సభ్యులు మరింత పరిశీలనగా తమ వారిని గుర్తులన్నీ చూసుకొని నిర్ధారించుకొనె అవకాశం కల్గింది. మూడు జిల్లాల నాయకుడి తండ్రి కొడుకును దగ్గరగా చూసి, తన కొడుకు కాడేమోనని సందేహపడ్డాడు. పద్దెనిమిది సంవత్సరాల క్రితం ఇల్లు వదిలిన కొడుకుని సజీవంగా గుర్తుపట్టడమే కష్టం. ప్రాణం పోయి, అదీ ఎప్పుడు పోయిందో నిర్దిష్టంగా తెలియక, చిత్రహింసల పాలై ఛిద్రమైన తల, విరిగిన ఎదమకాలు, కనుబొమల నడుమ తూటా తగిలి ఆనవాలు మాయం అయిన స్థితిలో గుర్తుపట్టడం ఆ తండ్రికి కష్టమవడంలో అసహజమేమి లేదు. అయితే నిత్యం ప్రజలతో మమేకమైన వాడు కావడంతో ఆ ప్రజలు తమ నాయకున్ని పోల్చుకోగలినారు. 'ఇతను మా సుధాకరన్నే' అని వాళ్లు చెప్పడంతో ఆ తండ్రి ఒప్పుకోలు లాంఛనమైపోయింది. మిగతా అమరుల్ని గుర్తించడంలో ఎన్ని ఇబ్బందులెదురైనా మొత్తం మీద ఆ పని పూర్తయ్యింది.

బంధువుల చేతిలో పెట్టేసరికే రాత్రయింది. ఇంకో అమరురాలు శరీరాన్ని ఎవరూ గుర్తుపట్టలేదు. అనుమానం ఉన్న తల్లిదండ్రులు, బంధువులు గుర్తుపట్టడానికి వచ్చిపోతున్నారు. గుర్తించిన వారిలో ఏడుగురు వరంగల్ జిల్లాలోనివే అయిన అటవీ గ్రామాలకు చెందిన వారు. మరో మృతవీరుడు వరంగల్ పక్క జిల్లా కరీంనగర్‌లోని మంథినికి చెందినవారు. వారందరి పార్థివ శరీరాల్ని కుటుంబ సభ్యులు

తెచ్చుకునేసరికి తెల్లవారు ఝాము ఒంటిగంటయ్యింది.

కుళ్లిన సమాజాన్ని మార్చడం కోసం, కుళ్లి మాంసం ముద్దలైన తమ పేగు బంధాల్ని ముందర పెట్టుకొని దుఃఖ సముద్రాలకు ఆనకట్టలు వేసుకున్నారు. గుండెలవిసిన తల్లులు, తల్లడిల్లిన తమ్ములు, చెల్లెలు, ఆర్ద్రమైన మనసుల్తో, అన్నలు, అక్కలు చెరువు గట్టు తెగుతుందా, అన్నట్లున్న తడియారని కన్నుల్తో బంధుమిత్రుల సంఘం హక్కుల సంఘం నాయకుల కోసం వెల్లువెత్తుతున్న జనం నడుమ ఎదురుచూస్తున్నారు.

వదిలి వచ్చిన అమరురాలు కామ్రేడ్ వసంత శరీరాన్ని తల్లిదండ్రులు వచ్చేదాక కూడా చూడకుండానే ఆ రాష్ట్ర పోలీసులు ఖననం చేసి చేతులు దులుపుకున్నారు.

ఈ ఎనమండుగురికి ఒకే రోజు అంతిమ సంస్కారాలు చేయాల్సిరావడం ఎంత పెద్ద విషాదం! బంధుమిత్రుల సంఘం నాయకురాలు ప్రమద తలపట్టుక్కూర్చున్నారు. ఇంతమందిని రాజ్యం ఒక్కసారి బలిగొనడమే విషాదమంటే, అందరికీ ఒకే రోజు అంత్యక్రియలు జరపాల్సి రావడం నిజంగానే ఊహించలేనంత దుఃఖం కద!

ఒక్కొక్కరి అమరత్వం నిజానికి చాలా పెద్ద విషాదమే. కామ్రేడ్ సుధాకర్ ఉద్యమ జీవితం మోరంచవాగు ప్రవహించిన గ్రామాల వెంట చిన్న కాలువలా మొదలై, గోదావరి ఉద్రిక్తలా నదికిరువైపులా ఒరుసుకొని ప్రవహించి, ఒక కెరటంలా విరుచుకుపడిన ఉత్తేజమైంది. అటు చెల్పూరు, వీరయ్యపల్లె, పెద్దాపురం, లక్ష్మీదేవిపేట ఇటు లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లి, గాంధీనగర్, గణపురం, ధర్మారావుపేట, వెల్తుర్లపల్లె అట్లా ములుగు డివిజన్ కలుపుకుంటూ మైదాన ప్రాంతాలతో సహా వరంగల్ జిల్లా అంతా అల్లుకున్నాడు. గుండాల ఏరియా గుండా పాల్వంచ, కొత్తగూడెం, భద్రాచలం, ఖమ్మం జిల్లాకు విస్తరించాడు. మరోవైపు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్‌లను అలుముకుంటూ కరీంనగర్ జిల్లాలంతా పెనవేసుకున్నాడు. అట్లా ఉత్తర తెలంగాణ అంతా పులుముకున్న ఉద్యమ అనుబంధం గోదావరి దాటి చత్తీస్‌గడ్‌కు వ్యాపించిన తెలంగాణ పోరు విత్తనమయ్యాడు.

అట్లాగే కామ్రేడ్ పుష్ప భూపాలపల్లి మండలం, రాంపూర్‌లో పేద లంబాడ కుటుంబంలో పుట్టి ఉద్యమ గమనంలో కామ్రేడ్ సుధాకర్‌ను జీవిత సహచరుడిగా ఎంచుకున్నది. బయ్యారం, గుండాల ఏరియాలో గెరిల్లా పోరాట యోధురాలుగా, మిల్ట్రీ యాక్షన్ నిపుణురాలుగా పేరొందినారు. లక్ష్యఛేదనలో ఆమె ఎప్పుడు గురి తప్పలేదు. కామ్రేడ్ సింగన్న 'ఎన్‌కౌంటర్' సందర్భంలో తొడకు గాయమైనా చాకచక్యంగా తప్పించుకున్నారు.

మహదేవపూర్-ఏటూరు నాగారం ఏరియా కమిటీ మెంబర్‌గా శత్రువుకు ముచ్చెమటలు పోయించిన కామ్రేడ్ సబిత గురించి చెప్పనక్కరలేదు.

ఇట్లా ఒక్కొక్కరిది ఒక్కో వీరగాథ.

వీళ్ళెవరూ స్వీయ ప్రయోజనం కోసం సర్కారుతో తగాదా పడ్డవారు కాదుకదా? వ్యవస్థలో వేళ్ళూనుకున్న దోపిడిని, అణచివేతను, సామ్రాజ్యవాద దురాక్రమణను అడ్డుకున్నారనే కదా, కేంద్ర, రాష్ట్ర బలగాలు వీళ్ళందరిని తుదముట్టించాయి? మరి పాలకులు, ప్రభుత్వాలు రకరకాల దోపిడీదారులకు ఊడిగం చేయడం కోసమే తామున్నామన్నట్లు నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని, ఈ దేశంలోని నీతిమంతులు, సత్యనిష్టులు, న్యాయకోవిదులం అనుకునేవాళ్ళంతా అర్థం చేసుకుంటున్నారా? పాలకులు నిజంగానే ప్రజలకు ఏదో ఒరగబెడుతున్నారని ప్రజాస్వామ్యవాదులమని అనుకునేవాళ్ళంతా ఇంకా భావిస్తున్నారా? 'పోస్కో'లు, 'వేదాంత'లు, 'జిందాలు'లు, 'టాటా'లు వంటి బహుళజాతి సంస్థలు వనరులున్న ఆదివాసీ ప్రాంతాలలో ఎందుకు తిష్టవేస్తున్నాయో సామాజిక దర్పణంలా పని చేయవలసిన మీడియా పరిశోధనాత్మకంగా 'వాచ్' చేస్తున్నదా? లేక పెట్టుబడికి పుట్టిన విషపుత్రికల దోపిడికి బాకా ఊదుతున్నదా?

దోపిడిదారులు, వాళ్ళ తొత్తులు ఒక్కసారి ఆగి అమరులైన ఈ తొమ్మండుగురు ఎందుకు చనిపోయారో తలచుకునేలా అమరుల స్మారక చిహ్నాలు నిర్మిస్తే, వాటిని చూసినప్పుడైనా వాళ్ళ 'అంతరాత్మ' అనే కావలి కుక్క ఒక హెచ్చరికలా మొరుగుతుందేమో! అనుకున్నాడు ఫయాజ్.

'ఒక వీరుడు మరణిస్తే ప్రభవింతురు వేలకొలది' అనే కవితాత్మక వాస్తవికతను, భౌతిక వాస్తవికత చేయడానికి పునర్నిర్మాణ కృషి ఎంత జరుగాలో కద! ఇట్లా ఆలోచిస్తూనే అందరికీ ఫోన్లు చేశారు. ప్రమద బంధుమిత్రుల సంఘం సభ్యులతో కలసి ములుగు చేరుకోవలసిందిగా ఫయాజ్‌కు సూచించారు ప్రమద. అందరు ములుగు చేరుకునే సరికి ఉదయం పదిగంటలైంది.

'అన్నట్లు 'సారు' రావాలి కద? నక్షత్ర, ప్రమదను అడిగారు.

'సారుకు ఆరోగ్యం బాగాలేదు, కుంటలోనే బాగా ఇబ్బంది పడ్డారు. పెద్ద వయస్సు కద? మనం అర్థం చేసుకోకపోతే ఇంకెవ్వరు అర్థం చేసుకుంటారు?' ప్రమద వివరణ ఇచ్చారు.

'అవును, నిజమే కద!' నక్షత్ర అర్థమైనట్లు ఒప్పుకున్నారు.

మంథని నుంచి ప్రమద కోసం, గౌతం కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు. తను వస్తే తప్ప శరీరాన్ని లేపేది లేదని తెగేసి చెప్పిండ్లు. గోగుపల్లిలో సబిత కుటుంబ సభ్యులు కూడా అదే మాట ఫోన్‌లో చెప్తున్నారు. కాల్వపల్లి నుంచి కూడా పదే, పదే ఫోన్లు వస్తున్నాయి. ఇంకెంత సేపు పడుతుందని. బుట్టాయి గూడెం నుంచి రాజు అన్న అదేపనిగా ఫోన్లు చేస్తున్నడు 'రెడిమేడ్ స్థూపం కూడ తయారు చేస్తున్నాం. కనుక రాష్ట్ర నాయకులు రావాలని, ఆయన దుఃఖంలోనూ లాజికల్‌గా మాట్లాడుతున్నాడు. ఒక పక్క దుంకుతున్న కన్నీటి వరదను రెప్పల మాటున కప్పిపెడుతూనె మరోవైపు కుటుంబసభ్యులు అనుమంతించిన మేరకు విప్లవ సాంప్రదాయంలో అంతక్రియలు జరుపడానికి పురమాయించారు, ప్రమద. తను మంథినికి బయలుదేర్తానన్నారు. అట్లా నక్షత్ర, రాజకుమారి, ప్రమీలలు సీతారాంపురంకు, నిత్య, అంజలిలు కాల్వపల్లికి, గిరిజ, ఫయాజ్‌లు గోగుపల్లికి వెళ్లాలని, ముందుగా అంత్యక్రియలు ముగించుకున్న టీం బుట్టాయగూడెం వెళ్ళాలని, తిరిగి వచ్చేటప్పుడు అజయ్ అంత్యక్రియలు జరిగే మొండాలతోగుకు వెళ్లాలని బాధ్యతలు పంచుకున్నారు. వీలైతే అందరు లేదా ఎవరికి వీలైతే వారు సరిహద్దు గ్రామం పూరేడుపల్లికి వెళ్లాలని గుర్తుచేసారు ప్రమద. అమరురాలు సీత తండ్రి భీమయ్య పదే పదే కుంటలో బిడ్డ అంత్యక్రియలకు రావాలని ప్రాధేయపడ్డాడని ఆమె చెప్పారు.

ప్రమద ఇట్లాంటి దుఃఖ సందర్భాల్ని ఎన్నో చూసారు. ఎన్ని సార్లు చూసినా ప్రతీ సంఘటన ఆమెను తీవ్రంగా కలిచివేస్తుంటది. ఒకప్పుడు ఆమె కూడ టెర్రైన్ మీద పట్టున్న ఆక్షన్ టీం కమాండర్‌గా శత్రువుల్ని గడగడలాడించారు. రాజ్యహింసకు ఆమె కాళ్ళు బాగా దెబ్బతిని ఒళ్ళంతా హూనమైనా కొండలు, గుట్టలు తిరగడం మానకపోవడంతో ఒక రాజకీయ నిర్ణయంతో లీగల్ సంఘంలో రాష్ట్ర కార్యదర్శిగా ఆమెకు బాధ్యతలు అప్పగించబడ్డాయంటారు. ఆమె పట్ల ఫయాజ్‌కు ఎనలేని గౌరవం. అమరుల కుటుంబాల పట్ల పట్టింపుతో ఆమె అప్పగించిన

పని నిర్వర్తించడం తన కనీస కర్తవ్యం అనుకున్నాడు ఫయాజ్. ఈలోగా అవసరమున్నన్ని పూలదండలు, నిలువెత్తు ఎర్రజెండాలు తీసుకొచ్చి అందరికి ఇచ్చాడు. ఎవరికి కేటాయించిన అంత్యక్రియలకు వాళ్లు వెళ్లాలని చెప్తూ, 'ఉద్యమకారుల్ని ఈ రాజ్యం ఎందుకు పొట్టనపెట్టుకుందో నిలదీయాలని', అట్లా నిలదీయకపోతే అది పొలిటికల్ తప్పవుతుందని' ఆఖరి మాటగా ప్రమిద చెప్పారు.

గోగుపల్లికి వెళ్లేసరికి 'మహదేవ్‌పూర్, ఏటూర్‌నాగారం ఏరియా కమాండర్ సబితక్కకు – జోహార్లు అంటూ నినాదాలు మిన్ను ముట్టుతున్నాయి. ఎర్ర గుడ్డ కప్పి, పూలదండ వేసి ఘనంగా నివాళి అర్పించగానే పార్థివ శరీరాన్ని లేపి ట్రాక్టర్ మీదికి ఎక్కించారు. గోగుపల్లి నడి ఊళ్లో నుంచి వీథులవెంట, ఊరు వెలుపల కుటుంబ సభ్యుల స్వంత చెలక దాక రెండు కిలోమీటర్ల పొడవూత వేలాది మంది ఆదివాసీ ప్రజానీకంతో అంతిమయాత్ర సాగుతోంది. సబితక్క మేనమామ స్వామి, ఆలస్యంగా వచ్చినందుకు బాగానొచ్చుకున్నాడు. ఫయాజ్‌ను దొరకపట్టుకొని 'నువ్వు కుంటకు ఎందుకు రాలేదని తప్పుపట్టినాడు. కుంటలో తామెంత ఇబ్బంది పడ్డారో ఏకరువు పెడుతూ, కుంటకు రాని వాడివి, గోగుపల్లికి ఎందుకు వచ్చావని ఫయాజ్‌ను నిలదీసాడు. కామ్రేడ్ సబిత పోలికలు ఉన్న ఆ పెద్దయన ఎన్ని మాటలన్నా, ఫయాజ్‌కు ఆత్మీయ గౌరవమే తప్ప కోపం రాలేదు. అయితే ఫయాజ్ ఇచ్చిన వివరణలెవ్వి ఆయనను సంతృప్తి పరచలేదు.

అంతిమ యాత్ర పొడవూత గిరిజతో పాటు ఆదివాసీ హక్కుల కార్యకర్త రమేశ్, లంబాడ హక్కుల కార్యకర్త ప్రభాత్‌సింగ్, కామ్రేడ్ సబితను తలపోస్తు స్మృతిగీతాలు పాడ్తున్నారు. ప్రభాత్ ఎంత మధురంగ పాడ్తున్నాడు! ఏ మానసిక బంధం లేకుంటే అంత మధురంగా పాడగలడు? నిజానికి అక్కడున్న ప్రతి ఒక్కరితో ఆమెకు ఏదో విడదీయరాని అనుబంధం పెనవేసుకొని ఉందనిపించింది. ఎంత ఆత్మీయం కాకపోతే రాజ్యహింసకు, పోలీసు బలగాల హింసాకాండకు బలైన తమ గూడెం బిడ్డను అంత ప్రగాఢంగా తలుచుకుంటారు? ఆమె నడిచిన దారి పట్ల ఎంత గౌరవం ఉంటె అంతబిగ్గరగా, ఎవరికి భయపడకుండా పువ్వర్తి అమర వీరులకు 'జోహార్లంటూ' నినదిస్తారు? ఫయాజ్ ఆలోచనలు మరింత వెనక్కి వెళ్లాయి. ఆర్నెల్ల క్రితం గుత్తికోయల జీవనస్థితి గతుల్ని అధ్యయనం చేయడానికి ఆదీవాసీ ప్రాంతానికి వెళ్లినపుడు అధ్యయన బృందానికి ఒక కోయ గూడానికి దారి చూపడానికి ఆమె తన్ను తాను కేటాయించుకున్నారు. ఆమె ఏదోపని మీద, ఆదివాసీ కుటుంబానికి ఏదో వైద్య అవసరం ఉంది, వచ్చానని చెప్పారు. బృందంలో అందరి కంటె వెనుక నడుస్తున్న ఫయాజ్ దగ్గరికి వచ్చి 'ఏమైంది మోకాళ్ల నొప్పా' అని అడిగిన విషయాన్ని గుర్తుకుతెచ్చుకున్నాడు. తన ఎడమ మోకాలికి నొప్పని చెప్పడంతో, ఆమె వెంటనే అందుకొని, 'నొప్పి అని చెప్పి సందేహిస్తు వదులుగా వేయొద్దు. నొప్పన్న కాలునే స్థిరంగా వేయాలి. మనకన్న పెద్దవారు ఆరుపదులు, ఏడు పదుల వయస్సున్న వాళ్లు రోజూ పదుల కొద్ది కిలో మీటర్లు నడుస్తున్నారని' చెప్పారు. దాన్తో నొప్పి మరిచి ఇంకో ఐదారు కిలో మీటర్లు నడిచాడు. కాని ఇంకో కిలో మీటరు నడిచాక, ఇక నడవలేక కూలబడిపోవడంతో ఆమే, స్వయంగా ఒక చెట్టు కొమ్మవిరిచి ఇచ్చి ఊతంగా పట్టుకొమ్మన్నారు. కాని కర్ర సహాయంతో గుట్టెక్కడం కష్టం అవడంతో తన 'కిట్' లోంచి నీక్యాప్ తీసి ఇచ్చారు. ఆ తర్వాత చాలా దూరం గుట్టలు ఎక్కుతూ, దిగుతూ నడిచాడు.

ఆమె ఇచ్చిన నీక్యాప్ (మోకాలును పట్టి ఉంచె తొడుగు) కంటె, ఆమె చెప్పిన మాటలె టానిక్‌లా పనిచేసాయా అన్పించింది. ఇంత స్ఫూర్తిదాయకంగా మీరెలా మాట్లాడగలుగుతున్నారంటె, ఆమె ఎంతో గర్వంగా తన విప్లవ సహచరుడు తనకెన్ని విషయాలు చెప్పాడో! అని మురిపెంగా తలుచుకున్నారు. తన సహచరుడి సైద్ధాంతిక అవగాహన, వైద్య పరిజ్ఞానం, శాస్త్రీయ ఆలోచన విధానం, అడుగడుగున అప్రమత్తంగా ఉండె తీరు ఎన్నింటినో పంచుకున్నారు. పేరు అడిగినపుడు మాత్రం అట్లా చెప్పడం టెక్నికల్‌గా తప్పన్నారు. వాళ్ళిద్దరు విప్లవసహచరులని ఆమె అమరత్వం తర్వాత, ఇప్పుడు తెలిసిన వారిలో ఆమె ఇప్పుడు అర్ధంతరంగా శత్రువు వేటకి చిక్కి అమరత్వం పొందినారు.

ఇంత మంది శత్రువుకు ఎలా చిక్కారు?

ఎవరైనా కోవర్టు సమాచారామిచ్చాడా?

కోవర్టును గుర్తించేదెట్లా?

మంచేదో, చెడేదో సైదోడెవరో పక్కలో బల్లెమెవరో ఎట్లా తెలిసేది? సామ్రాజ్యవాద విషసంస్కృతి తలకెక్కిన విషపురుగులు శత్రువు ఆశ చూపిన ఎంగిలి మెతుకులకు ఆశపడి ఏమైన తిండిలో విషం కలిపి శత్రువుకు ఉప్పందించారా? యుద్ధ నీతిని మరిచిన రాజ్యం దొంగచాటుగా మాటువేసిందా? అసలు ఎలా జరిగింది ఇంత పెద్ద సంఘటన?

నిజానికి, ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ఉద్యమాన్ని అణచాలని అనుకోవడం కొత్తకాదు. వనరులు బహుళజాతి సంస్థలకు దోచి పెట్టలనే ఏకైక ఏజెండా తప్ప ఇంకేం కారణాలుంటాయి?

ఇట్ల, ఆలోచిస్తున్న ఫయాజ్‌కు జోహార్–కామ్రేడ్ సబితక్క' అనే నినాదం వినపడటంతో, 'జోహార్' అంటూ ఈ లోకంలోకి వచ్చాడు.

పంచప్రాణాలు బిడ్డ మీద పెట్టుకున్న బక్కచిక్కిన సబిత తల్లి సమ్మక్క కుండపట్టుకుని పేర్చిన చితి చుట్టు తిరుగుతున్నారు. ఏ మత విశ్వాసాల్తో సంబంధం లేకుండా ఫయాజ్ దండకారణ్యంలో అమరురాలైన యోధురాలి పాడె మోస్తున్నాడు. అమరుల అంతిమ సంస్కారం సందర్భలోనైనా మతకర్మ కాండ లేకుండా ప్రత్యామ్నాయ ఆచరణ మరింత ఆదర్శవంతగా ఏర్పడితే బాగుండుననుకున్నాడు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ సమూహమంతా ఒకటే గొంతై మరింత బిగ్గరగా నినదిస్తోంది. దాంతో ఆలోచన్లను కట్టడి చేసుకుంటూ అందరితో పాటు నడుస్తున్నాడు ఫయాజ్.

గోగుపల్లిలో అంత్యక్రియలు ముగించుకొని ప్రభాత్ ఏర్పాటు చేసిన వెహికిల్ మీద మొండాలతోగులో అజయ్ అంత్యక్రియలు వాళ్లన్న ఎల్లయ్య, వాళ్ల పాత ఊరు కేశెట్టివాయి చుట్టు పక్కల ఐదారు ఊర్ల నుంచి వచ్చిన ఆదివాసి కుటుంబాల సమక్షంలో పూర్తి చేసాడు. తాడ్వాయి రోడ్డెక్కేసరికి కాల్వపల్లికి వెళ్లిన టీం బుట్టాయగూడెం ఆటోలో వెళ్తు ఫయాజ్ టీంను 'వస్తారా?' అని అడిగారు. 'సరే వెళ్దాం' అనగానే అందరం కలసి ఒకే వెహికిల్‌లో వెళ్దామని ఆటోలోంచి నిత్య, అంజలిలు దిగి వీళ్ల వెహికిల్‌లో సర్దుకున్నారు.

దారిలో 'కాల్వపల్లిలో చాలా సేపు జరిగినట్లుందే?' అంటూ సందేహం తీరక అడిగాడు ఫయాజ్. అవును ఆ ఊళ్లో గతంలో 20 మంది దాకా అమరులయ్యారు. ఈ సంఘటనలో అమరురాలైన ఊర్మిళ 'బడే' కుటుంబానికి చెందినవారు. ఆ ఒక్క కుటుంబంలోనె నల్గురు అమరులయ్యారు. అంతేకాదు గోగుపల్లి అమరురాలు కామ్రేడ్ సబితక్క సహచరుడు ఇంకా ఉద్యమంలో ఉన్నాడని, అతడు కూడా ఇదే కుటుంబానికి చెందిన వాడని, అతని పెంకుటింటి దగ్గర్లోనె ముప్పై ఏళ్ల క్రితం ఉద్యమంలో అమరుడైన రాంబాబు, పదేళ్ల క్రితం అమరులైన నాగేశ్వర్, మురళిల ఇండ్లు ఉన్నాయని, వాళ్లందరి ఇండ్లకు వెళ్లి అమరుడు రాంబాబు సహచరి లలితను కలిసి వచ్చామని ఆమె కూడా

అంజన్న జమానాలో ఉద్యమంలో పనిచేసిందని, అందువల్లే మీరు రెండు చోట్ల కార్యక్రమం పూర్తి చేసుకొని వచ్చేసరికి మాకు ఒక్క కాల్వపల్లిలోనె ఇంత సేపయ్యిందని నిత్య, అంజలిలు ఎంతో ఉద్వేగంతో చెప్పుకొచ్చారు.

బుట్టాయిగూడెం వెళ్లేసరికి మహదేవ్‌పూర్ యాక్షన్ టీం కమాండర్ రాజు అంత్యక్రియలు జరిగాయి. వాళ్లు ఏర్పాటు చేసిన రెడీమెడ్ స్థూపాన్ని ఏటూరునాగారం సి.ఐ ఆదేశాలతో పోలీసులు తొలగించారు. కామ్రేడ్ రాజు చితి వద్ద నివాళి అర్పించి వస్తుంటే ఎన్మిదేళ్ళ క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన కొడుకు మాంసం ముద్దగా రావడంతో తల్లి, అన్నా, వదినలు కన్నీరు, మున్నీరు అయ్యారు. వాళ్లను అట్లా వదలి రాలేక అట్లాగే ఉండిపోయాడు. ఆ కుటుంబ సభ్యుల్ని ఎట్లా ఊరడించాలో అర్థం కాలేదు, 'పోయిన కొడుకుని ఎట్లాగు తేలేం మమ్మల్ని మీ కొడుకు, బిడ్డలమనుకోమ్మా' అని అందరూ ఊరడించే ప్రయత్నం చేశారు. అమరుడు రాజు తల్లీ, చెల్లెల్ని, అన్నల్ని, వదినెల్ని ఊరడించడం ఎవరి తరం కాలేదు!

'అది కాదయ్య, నా కొడుకు గుర్తుగా మేం తయారు చేసి పెట్టుకున్న స్థూపాన్ని ఎందుకు తీసేయ్యాలంటాండ్లు, ఈ పోలీసులు? మా జాగాల్నే మేం పెట్టుకుంటిమి. వీళ్ల సొమ్మేమైన తింటున్నామా?' అంటూ దుఃఖాన్నంత ఆపుకుంటూ ముక్కు చీది, ఖాండ్రించి ఉమ్మివేసింది. 'ఈ రాజ్యం మీద అసహ్యంతో ఆమె అలా చేసినారా?' అన్పించింది.

'అత్తా నువ్ ఏడ్వకు...ఎట్లన్నజేసి మళ్లీ మనం స్థూపం కట్టుకుందాం...నాకు తాపిపని వస్తది' గుంపులోంచి ఒక యువకుడు ముందుకు వచ్చి నమ్మబలికాడు.

'నాక్కూడ ఉప్పరి పని వస్తది. నేను కూడా ఓ చేయి వేస్తా'. ఇంకోగాయన ముందుకు వచ్చాడు.

'అక్కల్లారా, అన్నల్లారా.. వారం రోజుల్ల స్థూపం పని పూర్తి చేస్తం.. మిమ్మల్ని పిలుస్తాం...అందరూ రావాలి' రాజు బంధువు ఒకాయన అందరికి చేతులు జోడించి చెప్పాడు.

ఆమాటల్తో రాజు తల్లి దుఃఖం కొద్ది కొద్దిగా నెమ్మదించింది. స్థూపం కట్టాక మళ్లీ వస్తామని చెప్పి ఫయాజ్, నిత్యల టీంలు రెండూ వెనుదిరిగాయి.

'ఇంతలో నక్షత్ర టీం, సీతారాంపురం లో మూడు జిల్లాల ముఖ్య నాయకుడు సుధాకర్, ఆయన సహచరి పుష్పల అంత్యక్రియల్ని పూర్తి చేసుకొని అమరురాలు సీత ఊరు పూరేడుపల్లి వెళ్లడానికి వస్తూ ఎదురయ్యారు.

'సుధాకరన్న, పుష్పక్కల అంత్యక్రియలు ఎట్ల జరిగినయి?' ఫయాజ్ ఆత్రంగా అడిగాడు. 'ఓ ఎంతో ఘనంగా, కొడుకు సిద్దూ ఒక చేత్తో ఎర్రజెండా పట్టుకొని, ఇంకో చేత్తో తల్లిదండ్రులకు తల కొరివి పెట్టిండు, రంగసముద్రం చెరువు దగ్గర. వేలాది మంది ప్రజలు, జిల్లాల నుండి పక్కరాష్ట్రం నుంచి రావటమే కాకుండ దాదాపు అన్ని ప్రజా సంఘాల వాళ్లు సభలో మాట్లాడారు. బూర్జువా పార్టీల వాళ్లు కూడా దొంగ సానుభూతి, బూటకపు ఖండనలు బాగనే చేసుకుంట మాట్లాడిండ్లు'. నక్షత్ర వివరంగా చెప్పారు.

'నేనే పాల్గొన లేకపోయా'. ఫయాజ్ దిగులుగా, అసంతృప్తితో అన్నాడు.

'నాగ్గూడా వాళ్ల తల్లిదండ్రులు, కొడుకు, చెల్లెల్తో మాట్లాడే అవకాశం అంత మందిలో రాలేదు'.

'మరైతె పూరేడుపల్లికి పోయొచ్చాక మళ్లీ వెళ్దామా?' ప్రమీల ప్రపోజల్‌కు అందరూ సరే చూద్దాం అనుకున్నారు. కాని అప్పటికే చీకట్లు అలుముకున్నాయి. ఏటూరునాగారం నుంచి పూరేడుపల్లికి నల్భై, యాభై కిలో మీటర్ల దూరం కనుక అందరు కలిసి తెల్లవారి వెళ్దామనుకున్నారు.

మర్నాడు, ఏటూరునాగారం నుండి మంగపేట మీదుగా మల్లూరు ఊళ్లోంచి శనగ్గూడెం దాటి గాంధీనగర్ దగ్గర ఎడమవైపు తిరిగి మూడు కిలో మీటర్లు ప్రయాణం చేస్తే పురేడుపల్లి వచ్చింది. ఆ ఊళ్లో నీళ్లట్యాంక్ వెనుక, లోపలికి సీత తల్లిదండ్రులు ఉంటున్న ఇల్లు. వెళ్లగానే సీత తండ్రి భీమయ్య 'నా బిడ్డకు పూలదండ తెచ్చిండ్లా?' అని అడిగాడు. ఆమె తల్లి సమ్మక్క సీత ఫోటో పట్టుకు ఇంటి ముందుకు వచ్చారు.

పూలదండ మరిచి పోయామనడంతో భీమయ్య కొంత నిరాశపడ్డాడు. ఫోటో పట్టుకొని తల్లి, ఆమె పక్కన తమ్ముడు రాజు, వదినెలు, తండ్రి, బంధు మిత్రుల సంఘం వాళ్లు కూర్చొని ఫోటో దిగారు.

'ఏడాది క్రితమే తను ఇష్టపడ్డ యువకుడితోనే పెళ్లి చేద్దామనుకున్నంతలోనే, పెళ్లికంటే పార్టీని ఎక్కువ ఇష్టపడి లోపలికి పోయిందని, అందుకే ఆమె గుర్తుగా స్థూపం కట్టాలని ఉందని', తండ్రి భీమయ్య బంధు మిత్రుల సంఘంతో చెప్పాడు. 'ఊళ్లో ఫారెస్టు అధికారులు పోడు చేసుకోనివ్వటం లేదని, ఇటువంటి వాళ్లకు నా బిడ్డ పోయిన దారే సరైందని చెప్పాలనుకున్నట్లు' చెప్పాడు. అట్లా మాట్లాడుకుంటు సీత అంత్యక్రియలు జరిగిన స్థలానికి తీసుకెళ్లాడు. ఊరు నుంచి లోపలికి రెండు కిలో మీటర్ల దూరంలో అడవిలో దహనం చేసారు. దహనక్రియ జరిగిన చోట పొడవాటి చెట్టు మీద ఎర్రజెండ రెపరెపలాడుతోంది. చితాభస్మం చుట్టూ పగిలిన కుండ, సత్తుగిన్నెలు, పళ్లెం, గ్లాసు, గరిటె వంటివి చెల్లా చెదురుగా పడివున్నాయి. ఇవన్నీ ఏమిటంటే కోయసాంప్రదాయంలో ఇట్లాగె ఉంటాయన్నాడు.

'మరి ఊరికి ఇంత దూరంగా అడవిలో స్థూపం కట్టిస్తారా?' రాజకుమారి ఉండబట్టలేక అడిగారు. రాజకుమారి సహచరుడు కూడా రెండేళ్ల క్రితం అమరుడయ్యారు. పార్టీలో ఉన్నత స్థాయి కేడర్‌కు చెందినవాడు.

'కాదమ్మా, ఇక్కడ కట్టిస్తే ఎవరు చూస్తారు? నా ఇంటి ముంగట, రోడ్డు పక్కనే కట్టిస్తా...మీరంతా తలోచెయ్యి ఎయ్యాలె.. నా బిడ్డ పార్టీలో పోయిదంటే, నాకెంతో గొప్ప!' భీమయ్య చెప్పుకుంటూ పోతున్నాడు.

'అది, కాదమ్మ, మేం పోడు చేసుకుంటాంటే, చేసుకోనిత్త లేదు గా బీట్ ఆపీసర్‌గాడు... వాణ్నేమయినా చేయాలమ్మా?' అన్నాడు, పక్కనే ఉన్న సీతకు పిన తండ్రి వరుసైన బుచ్చయ్య.

'నువ్వే చేయాలె... ఏంచేసిన'... నక్షత్ర అన్నారు, పరీక్షగా చూస్తు. నక్షత్రకు మైదాన ప్రాంతంలో గొప్ప పోరాటాలు నిర్వహించిన నేపథ్యం ఉంది. ఆమె సహచరుడు కూడా బూటకపు ఎన్‌కౌంటర్‌లో అమరుడయ్యారు.

'నేనేం చేయగలనమ్మా....నేనేమన్నా అన్ననా?.... మా ఇంటావిడ, ఇదిగో పుల్లక్క, ఈమె పోయొచ్చింది నాలుగేళ్లు', నేనంత గొప్పోణ్ణి కాకపోతి....' బుచ్చయ్య భావోక్తితో ఆగిపోయాడు.

'నువ్వు బీట్ ఆఫీసర్ని తన్నావనుకో... నువ్వు కూడా అన్నవైతవు...' అంటూ, నక్షత్ర ధైర్యాన్ని నూరిపోసారు.

'సరే, గీ నల్భై, యాభై ఏండ్ల వయసుల నేనన్ననైతనా?..., అద్సరే గాని మేం ఇరవై ఇండ్లోండ్లం, ఇంటికి రెండున్నర ఎకరాలె పోడుచేసుకున్నం. ఈ భీమన్నైతే గా కోర్టుకెళ్లి మా దిక్కు అయేటట్లు దెచ్చిండుగాని... గీ ఆఫీసర్‌గాడు, మా రెక్కల కష్టం మాగ్గాకుండా

చేస్తాండు. గందుకే మా సీతవ్వ పట్టిన బాట సక్కని బాట అని లోకానికి ఎరుక చేసేటందుకే, మా భీమన్న సీత షేరిట గూడెంలో స్థూపం కట్టాలానుకుంటున్నాడు'. బుచ్చయ్య దారి పోడవునా చెప్పుకుంటు ఊళ్లోకి దారితీసిందు.....

'ఇక్కడికి గూడా స్థూపావిష్కరణకు మనం రావాల్సి ఉంటుందనుకుంట' అంటూ, రాజకుమారి భవిష్యత్ కార్యక్రమాన్ని గుర్తుచేస్తూ, మిగతా వారిని ఉద్దేశించి అన్నారు.

'అన్నట్లు, నిన్న మనం అనుకున్నట్లు సుధాకరన్న తల్లిదండ్రుల్ని కలసొద్దామా? హైద్రాబాదు నుంచి ప్రమదక్క కూడా నేరుగా అక్కడికే వస్తున్నానంటూ ఫోన్ చేసింద్లు' నక్షత్ర అందర్కి విషయం వెల్లడిచేసారు.

ఇంక ఆమె మాట పూర్తి కాకుండానే 'చలో, చలో సీతారాంపురం చలో..' అంటూ వెహికిల్ డ్రైవర్‌కు మార్గనిర్దేశం చేసేశారంతా.

సుధాకరన్న తల్లి ఐలమ్మ బంధుమిత్రుల సంఘం నాయకుల మీద పడి బోరున ఏడ్చారు.

'నా కొడుకును మోసంతో చంపింద్రు అయ్యా...'

'నా కొడుకును కుట్రతో చంపింద్రు అవ్వా...'

'నా కొడుక్కు ఎదురుపడి కోట్లాడె మొనగాడు పుట్టలేదయ్యా...'

'ఎదురుపడి కోట్లాడితే అవ్వా...'.

'నేనింతగనం ఏడ్వకపోదునయ్యా...'

'దెబ్బకు దెబ్బైతె అవ్వా...'

'ఎవరు చచ్చిన నియ్యతే అనుకుందునయ్యా...'

'ఈ పాపకారి రాజ్యం కూలవ్వో!...'

'ఈ మోసకారి రాజ్యం కాలి పోనయ్యో!...'

మూడు జిల్లాల నాయకున్ని కన్న తల్లి మూడు జిల్లాల పొడవూత సాగిన విషాద గోదారిలా దుఃఖాన్ని ప్రవహిస్తూనే ఉన్నారు.

చుట్టు పక్కల అమ్మలక్కలు, పక్కింటి పటేలమ్మ ఎంత ఓదార్చినా ఆ తల్లి దుఃఖం అంతులేకుండ సాగుతూనే ఉంది.

సుధాకరన్న తండ్రి వెంకటయ్య గుడ్ల నీళ్లు కుక్కుకుంట 'ఇగ ఊకోవె' అన్నా ఆ తల్లి కన్న పేగు తీపి తీరక దుఃఖం స్రవిస్తూనే ఉంది.

'అన్నను నువ్వు గుర్తు పట్టలేదట బాపూ?' టాపిక్ మళ్లించడానికా అన్నట్లు అడిగాడు, ఫయాజ్.

"అవునయ్యా...- కొడుకును నూనూగు మీసాలప్పుడు చూశా... నడుమ, నడుమ చూస్తె గట్టిగా గుర్తుండేది.....కనుబొమ్మలు కలిసుండుడొక్కటే ఆనవాలు చెప్పిందీవె. వాడేమో అక్కడే కాల్చిండాయె..."

ఇంతలో విలేకరులొచ్చారు...

'దేశసంపదను బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టడానికి గ్రీన్‌హంట్ ఆపరేషన్‌లో భాగంగా మరీ ముఖ్యంగా, మూడు జిల్లాల ఇనుప గనులను పెట్టుబడి దారులకు తరలించడానికే, కేకెడబ్ల్యు దళాన్ని దొంగచాటుగా, దుర్మార్గంగా సంయుక్తబలగాలు కుట్ర పూరితంగా చంపివేశాయని' ప్రమద విలేకర్లకు చెప్పారు.

'అమరుల డెడ్ బాడీలను శీతలీకరణ పెట్టెల్లో భద్రపరిచి కుటుంబ సభ్యులకు ఇవ్వాలని' ప్రమీల ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. విలేకర్లు రాసుకొని వెళ్లిపోయారు.

సుధాకరన్న కొడుకు సిద్ధు, ఆయన చెల్లెలు కోమల దగ్గర ఉండి రెండో తరగతి చదువుతున్నాడు. తల్లిని కోల్పోయిన సిద్ధూకు, కోల్పోక ముందు నుంచి కోమల తల్లి అయ్యింది. 'ఎర్రజెండాను ప్రేమించిన తల్లిదండ్రుల కడుపున పుట్టి, ఎర్రజెండా పట్టుకొని జంట చితులకు నిప్పంటించిన సిద్ధు రేపు ఏమవుతాడు?' ఇట్లా ఆలోచిస్తు అక్కడ్నుంచి వాళ్లను విడిచి పోలేక పోలేక భారంగా కదిలారు, వాళ్లంతా.

* * *

తెల్లారగట్ల బుట్టాయిగూడెం నుంచి ఫోన్. ఊళ్లో, అందునా స్థూపం కడ్తున్న యువకుల్ని ఏటూరునాగారం సి.ఐ. పట్టుకెళ్లి వేధిస్తున్నాడని, ఊళ్లో స్థూపం కడ్తే కూల్చేస్తామని బెదిరిస్తున్నాడని సారాంశం. ఫోన్ చేసింది, కామ్రేడ్ రాజు అన్న సత్యం.

'మరి మీరేమనుకుంటున్నారు'? అడిగాడు, ఫయాజ్ ఏమనాలో తోచక.

'స్థూపం కట్టకపోతె మా అవ్వ ఊరుకోదు... కొడుకు రూపు స్థూపంలో చూసుకుంటానని మీతో అన్లేదా, సార్!' 'మా అవ్వ కంటే మా ప్రాణాలు ఎక్కువ కాదు సార్..' స్థిరంగా అన్నాడు.

'మరి పోలీసుల బెదిరింపులు?'

'గందుకే మీకు ఫోన్జేస్తున్నా సార్, మీరు అండగా ఉండాలె....ఎట్లైన స్థూపం కడుతాం.. ఆవిష్కరిస్తాం... దానికి మీరు రావాలె...'

పోలీసుల బెదిరిపులు, బైండోవర్‌లు, కవ్వింపుల నడుమ స్వయంగా కుటుంబ సభ్యుల చేతి కష్టంతో, కన్న తల్లి కడుపు తీపిని కలిపి బుట్టాయగూడెంలో కామ్రేడ్ రాజు స్థూపాన్ని ఆవిష్కరించుకున్నారు.

ఆవిష్కరణ సభలో 'స్థూపానికేమన్న జరిగితే, బెదిరించిన పోలీసులే బాధ్యత వహించాలని' ప్రమద హెచ్చరించారు.

'ప్రజాయుద్ధ వీరులు మృత్యుంజయులని, వారికి గుర్తుగా స్థూపాలు కట్టుకోవడం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల హక్కని' రాజకుమారి పోలీసులకు గుర్తుచేసారు.

'మీ త్యాగం ఉన్నతమైంది... అది హిమశిఖరాల వంటిదని' నక్షత్ర పాట పాడినారు.

'శ్రీకాకుళం కొండల్లో అమరులైన సత్యం, కైలాసంల చూపులా...

ఇంద్రవెల్లి అమరుల కండ్లలోని వెలుగులా...

తెలంగాణ తండ్లాటను తొక్కిపెట్టి, మూడు జిల్లాల ఇనుమును, మొత్తంగా తెలంగాణ వనరుల్ని, సంపదను దోచుకెళ్తున్న వలసాంధ్ర పాలకులకు జారీ చేసిన అల్టిమేటంలా....

ఆదివాసి పోడు భూమికి హామీలా...

సబ్బండ వర్ణాల, సమస్త వృత్తి కులాల ఆకాశమెత్తు స్వావలంబ దీపస్తంభంలా...

దేశసంపదను పరాయిదేశాలకు, బహుళ జాతి సంస్థలకు దోచిపెడ్తున్న దళారీపాలకులకు సవాల్ లా...

దండకారణ్య వేగుచుక్కల వెలుగులా...

మాతృ గుండె గర్వంతో పొంగిన, ఆ కన్నతల్లుల కన్నుల్లో జ్యోతుల్లా...

విముక్తి దివిటీలైవాళ్లు...

సమస్త పీడిత ప్రజల గుండెల్లో స్మారక స్థూపాలై...

మిగిలెటోళ్లు వాళ్లు!'

మనస్సులో అనుకున్నాడు ఫయాజ్.

సమీక్ష

దండకారణ్య కథా సమయం

- జగతి

దండకారణ్య రచయితలు తెలుగులోకి కొత్త కథావరణను ప్రవేశపెడుతున్నారు. అక్కడి నుంచి ప్రస్తుతం ఓ అర డజను మంది కథకుల పేర్లు ప్రముఖంగా వినిపిస్తూ ఉన్నాయి. సంఖ్యలో ఇప్పటికీ తక్కువే కావచ్చు. కానీ గుణం రీత్యా చాలా కొత్త కథలివి. అయితే ఈ కథలను మొత్తంగా దండకారణ్య విప్లవోద్యమంలో భాగంగా, అక్కడసాగుతున్న అతి పెద్ద సాంస్కృతికోద్యమంలో భాగంగా చూడాలి. ఆ ఉద్యమం ఆదివాసీ జన జీవితంలోనిది కాబట్టి సహజంగానే మౌఖిక, దృశ్య కళా రూపాలు ప్రధాన భాగం ఆక్రమించాయి. అయితే అక్కడ జరుగుతున్న సంఘర్షణకు, పరివర్తనకు లిఖిత ప్రక్రియలు కూడా కావాలనే ఎరుక ఉన్నందు వల్ల అక్కడి రచయితలు మొదటి నుంచీ కథలు, నవలు రాస్తున్నారు.

1980లో విప్లవోద్యమం దండకారణ్యం చేరుకున్నాక.. అక్కడ జరిగిన తొలి ప్రయత్నాలనే మైదాన ప్రాంత పాఠకుల కోసం కథలు రాయడం ప్రారంభించారు. విరసం 1991లో ప్రచురించిన నేల తల్లి విముక్తి కోసం కథా సంకలనం ఓసారి చూడండి. అందులో ఉన్న 43 కథల్లో 35 దండకారణ్యం నుంచి వచ్చినవే కనిపిస్తాయి. ఇవేగాక అప్పట్లో సృజన పత్రికలోనూ, ఆ తర్వాత అరుణతారలోనూ, ఝంకార్ పత్రికలోనూ దండకారణ్య కథలు అనేకం అచ్చయ్యాయి.

నేల తల్లి విముక్తి సంకలనంలోని కథలను, బిఎస్ రాములు, సాహు తదితరులు అప్పట్లో రాసిన కథలను చూస్తే ఒక విశేషం కనిపిస్తుంది. అదేమంటే.. తెలుగు రచయితలకేగాదు, పాఠకులకు కూడా పరిచయం లేని జీవన వైవిధ్యాన్ని, పోరాటాన్ని అందివ్వాలనే బాధ్యతాయుతమైన సాహిత్య రచనా కర్తవ్యం అది. ఆ వైవిధ్యానికి విప్లవ సాహిత్యోద్యమం చాలా ప్రాధాన్యత ఇచ్చింది. అందుకే అనేక విప్లవ కథా సంకలనాల్లో దండకారణ్య కథలకు సముచిత స్థానం ఇస్తూ వచ్చింది.

ఆ వైవిధ్యపూరిత జీవితం ఇవాళ చాలా పరివర్తనాయుతంగా ముందుకు సాగుతున్నది. అందువల్ల అక్కడి కథల్లో కూడా ఈ గుణాత్మక మార్పు కనిపిస్తోంది. నేల తల్లి విముక్తి కోసం సంకలనం నాటి నుంచే ఒక సుగుణం దండకారణ్య కథల్లో కనిపిస్తుంది. అదేమంటే. ఆదివాసీ జీవితంలోని ఏ మారుమూల వైపు నుంచి ఇతివృత్తాన్ని ఎంచుకొని కథ రాసినా అందులో నేరుగాగాని, సూచన ప్రాయంగాగానీ ఏదో ఒక పరిష్కారం కనిపిస్తూ ఉంటుంది. ఇది రచయిత ఆకాంక్షగాగాక, కృతకంగా అతికించినట్టుగాక ఆదివాసులు ఎంచుకున్న కొత్త జీవన విధానంలోనే వాళ్ళను చుట్టుముట్టిన సమస్యలు, వాటి గురించి ఆచరణాత్మకమైన ఎరుక, పరిష్కారం.. అనే క్రమం ఉంటూ వచ్చాయి. ఆ పరిష్కారం దగ్గరే మరో సమస్య తలెత్తవచ్చు. అది మరో ఆలోచనా క్రమానికి, పోరాటానికి దారి తీసి ఇంకో పరిష్కారాన్ని ఆశించవచ్చు. అయితే ఒక సంఘర్షణ క్రమం మాత్రం అనేక పాయలుగా విస్తరిస్తూ వస్తోందని మొదటి నుంచి దండకారణ్యం నుంచి వస్తున్న కథలను చదివితే అర్థమవుతుంది.

ఈ క్రమం సుమారుగా 2000 సంవత్సరం నుంచి మరింత ముందుకు పోయింది. నూతన అభివృద్ధి విధానాన్ని అమలు చేయడం ప్రారంభించడంతో దండకారణ్యంలో విప్లవోద్యమం కొత్త దశలోకి ప్రవేశించింది. సరిగ్గా అదే సమయంలో సాల్వాజుడుం ప్రారంభమైంది. ఉత్పత్తిలో, రాజకీయాధికారంలో ప్రజల భాగస్వామ్యం పెరగడం, ప్రయోగాలు సాగడం అనే వర్గపోరాట రూపాలు రాజకీయార్థిక సాంఘిక సాంస్కృతిక రంగాల్లో ముమ్మరమయ్యాయి. వీటిని కాపాడుకోడానికి, ముందుకు తీసుకపోవడానికి ప్రజా సైన్యం అనేక విభాగాలుగా బలపడింది. దండకారణ్యకథా వికాసాన్ని ఈ నేపథ్యంలో చూడాలి. 1980ల నాటి కథలకు, 2000 తర్వాత అక్కడి నుంచి వస్తున్న కథలకు ఈ తేడా స్పష్టంగా కనిపిస్తుంది. స్థూలంగా ఇటీవలి దండకారణ్యకథలను సాల్వాజుడుం, గ్రీన్‌హంట్-జనతన సర్కార్ నేపథ్యాలలో చూడవచ్చు.

మొదటే చెప్పినట్లు దండకారణ్యం నుంచి ఆది నుంచి వస్తున్న కథలో ఉండే పరివర్తనా రూపాలు, సమస్య-పరిష్కార క్రమాలు ఈ రెండు నేపథ్యాల్లో మరింత స్పష్టంగా కనిపిస్తాయి. బైటి కథల్లో అనేక సమస్యలను గాఢంగా, గొప్పగా చిత్రించినా.. వాటికి పరిష్కారం ఊహించలేని అసహాయత ఉంది. అది రచయితల పరిమితి కాదు, సామాజికంగానే ఏ పరిష్కారమూ లేని సమస్యలు అనేకం చుట్టుముడుతున్న సమయమిది. కానీ దండకారణ్యంలో కూడా అనేక సమస్యలు (అంతర్గత కారణాల వల్లా, బాహ్య కారణాల వల్లా) అక్కడి ఆదివాసులను చుట్టు ముడుతున్నా వాళ్ళు ఎంచుకున్న దృక్పథం వల్ల పోరాటం వల్ల పరిష్కారాలు కూడా కనిపిస్తున్నాయి. కొన్ని సాహసోపేతమైన ప్రయోగాలు చేస్తున్నారు.

ఈ ఆచరణలోని సంఘర్షణలను, అనుభవాలను, ఫలితాలను అక్కడి రచయితలు మనకు అందివ్వడానికి కథలు రాస్తున్నారు. మొత్తంగా ఇవాళ తెలుగు కథా రచయితలు అనేక ప్రగతిశీల ధోరణులతో, దృక్పథాలతో లోతైన జీవన వాస్తవికతను చిత్రిస్తున్నారు. గొప్ప శిల్పనైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. అయితే దండకారణ్య రచయితలు వీటన్నిటికంటే భిన్నమైన, అద్భుతమైన జీవన క్రమాలను, సంఘర్షణ క్రమాలను కథల్లోకి తీసుకొని వస్తున్నారు. బహుశా మనకు అందని, అందుబాటులోకి రాలేని జీవిత అనుభవాలు ఇవి. మనలో చాలా మందికి తెలియని సాంఘిక సాంస్కృతిక వైవిధ్యాల నుంచి ఈ కథలు వస్తున్నాయి. కేవలం జీవితం ఇలా ఉందని కాకుండా, అక్కడ జరుగుతున్న యుద్ధాన్ని, ప్రయోగాలను, విషాదాలను, విజయాలను ఎత్తిపడుతున్న కథలివి. ప్రతి వర్ణను, చిత్రణను, అనుభూతిని, అనుభవాన్ని అతి జాగ్రత్తగా కల్పనా సాహిత్యంలోకి అనువదిస్తున్న ప్రయత్నమిది. యుద్ధంలో ఉన్న రచయితలు రాస్తున్న కథలని మాత్రమే వీటిని ప్రత్యేకంగా చూడనవసరం లేదు. ఆ పేరుతో ఏ మినహాయింపులు

కథ

ప్రయాణం

- పద్మకుమారి

బెల్లంపల్లి స్టేషన్లో మేం దిగేసరికి రాత్రి తొమ్మిది గంటలైంది.

మమ్మల్ని రిసీవ్ చేసుకోడానికి ఇద్దరు మిత్రులు వచ్చారు. వాళ్ల బండ్ల మీద, నేను, అంజమ్మ, శాంత ఆటోలో బయల్దేరాం. అప్పటికే స్టేషన్ రోడ్ నిర్మానుష్యమైపోయింది.

ఆ ఇంటి ముందు అరుగుల మీద, కుర్చీల్లో కొంతమంది కూర్చొని ఉన్నారు. మేం ఆటో దిగేసరికి అందరూ లేచారు. అలాంటి సన్నివేశంలోకి ఎన్నోసార్లు వెళ్ళినా ప్రతిసారీ ఇబ్బందిగా, మనసును కలిచివేసేదిగానే ఉంటుంది. అయినా సంతోష సమయాలకంటే ఇలాంటి సమయాల్లోనే మనుషుల మధ్య దగ్గరితనం కలుగుతుందేమో! ఓ ముగ్గురు ఆడవాళ్ళు వచ్చి మా మీద పడి ఏడవడం, మేం ఓదార్చడం..అదో భావోద్వేగ సందర్భం. కన్నీరు ఎన్నోసార్లు వస్తుంది. కానీ సొంతమైనవాళ్ళు దూరమైనప్పుడు కలిగే దుఃఖం, బాధ వేరేగా ఉంటాయి.

సాంబిరెడ్డి పాతికేళ్ళ కింద లోపలికి వెళ్ళాడట. ఈ మధ్య కాలంలో తల్లిదండ్రులు, ఒక అన్న చనిపోయారు. మిగిలింది ఒక అన్నా వదిన, చనిపోయిన అన్న భార్య.

ఈ వివరాలు చెప్తూ, ఎన్నడో ఇల్లు వదిలిపోయిన సాంబిరెడ్డి శవాన్ని బీజాపూర్ దాకా వెళ్ళి వాళ్ళు తెచ్చుకోలేరేమో..! అని ఉదయం ఓ మిత్రుడు ఫోన్లో అన్నాడు. అయినా ప్రయత్నించాలి గదా. మామూలప్పుడు బంధాలు ఎలా ఉన్నా మరణించాక అట్లా అనుకోలేరు. మనిషి ఎన్నేళ్ళ కింద దూరమైనా, అతడి జ్ఞాపకాలు సజీవంగానే ఉంటాయి.

ఆ ఆడవాళ్ళను ఓదార్చుతూ అట్లా కుర్చీల్లో కూచోబెట్టాం.

సాంబిరెడ్డి అన్న మల్లారెడ్డి వచ్చి పరిచయం చేసుకున్నాడు. ఆయనకు అరవై ఏళ్ళు ఉంటాయి. ఇద్దరు యువకులు ఓ పక్కగా గోడకు జరిగి నిలబడి ఉన్నారు. నా చూపు వాళ్ళ మీద పడింది. వాళ్ళు మమ్మల్నే గమనిస్తున్నట్టున్నారు.

మా మీద పడి ఏడ్చిన సాంబిరెడ్డి వదిన రాజేశ్వరి కొంచెం తేరుకొని ఆ పిల్లలను చూపిస్తూ... మా భయం వీళ్ళకోసమే. శవాన్ని తెస్తే పోలీసులు ఏమంటారో అని భయంగా ఉంది. ఇప్పటికే ఇంటికి పోలీస్ స్టేషన్‌కూ దారి పడింది అన్నది.

ఆ ఇద్దరికీ ఇరవై పాతికేళ్ళ వయసు ఉంటుంది. మల్లారెడ్డి కొడుకు ఒకరు. ఇంకో అతను ఇంటి అల్లుడు.

ఆ ఇంటి ముందు వీధి లైటు వెలుగుతోంది. ఉదయం నుంచి ఏడ్చి ఏడ్చి వాళ్లు అలిసిపోయినట్లు ఉన్నారు.

...పొద్దటి నుంచి మా బంధువులు, తెలిసినవాళ్ళు శవాన్ని ఎప్పుడు తీసుక వస్తారని ఫోన్లు చేస్తున్నారు. శవాన్ని తెచ్చుకోకపోతే కులంలో చిన్నతనం కదక్కా. మా బావకు తన తమ్ముడ్ని చూసుకోలేదనే బాధ ఉంటది కదా... అందుకే మీరు తోడొస్తే వస్తామని చెప్పింది..అని సాంబిరెడ్డి చిన్న వదిన పద్మ అన్నది.

మల్లారెడ్డి మమ్మల్ని పక్కకు తీసికెళ్ళి పొద్దున ఫోన్లో మాట్లాడినదాని గురించి ప్రస్తావించాడు. మళ్ళా ఏమవుతుందో అనే భయంతోనే అలా అన్నాను.. అని చెప్పుకొచ్చాడు. మొదట ఫోన్ చేసినప్పుడు అంతదూరం పోయి శవాన్ని మేం తెచ్చుకోలేం... అని తేల్చి చెప్పాడు. ఆ మాట అన్నందుకు ఇప్పుడు ఆయన చాలా బాధ పడ్డాడు.

విలేకర్లు వచ్చేశారు. సాంబిరెడ్డి శవం ఇంటికి వస్తుందా? రాదా? అనేది వాళ్ళ ఆసక్తి. అందుకని మేం వచ్చామని తెలియగానే వచ్చారు. రేపు పొద్దున వెళ్లి శవాన్ని తెచ్చుకుంటాం.. అని మల్లారెడ్డి వాళ్లతో చెప్పాడు.

అప్పటిదాకా ఉన్న బంధువుల్లో కొందరు లేచి ఇండ్లకు వెళ్ళిపోయారు. తెల్లారేసరికల్లా వాహనం చూడమని ఓ మిత్రుడికి చెప్పాను.

* * *

ఆరు గంటలకు నిద్ర లేచాం. అంత ఉదయాన్నే మళ్ళీ చాలామంది బంధువులు, తెలిసినవాళ్ళు ఆ ఇంటి దగ్గరికి వచ్చారు. ఏడు అవుతుండగా ఒక అంబులెన్స్ వచ్చింది. కానీ శవాన్ని తేవడానికి అందులో బాక్స్ లేదు. అయినా ఇంకో వాహనం చూద్దామనే ఆలోచన కూడా చేయలేదు. పోలీసుల వేధింపులు ఉంటాయని తెలిసీ అక్కడిదాకా రావడానికి సిద్ధపడడమే గొప్ప. రెండు రోజులుగా పత్రికల్లో సాంబిరెడ్డి ఎన్‌కౌంటర్, శవం ఇంటికి వస్తుందా? లేదా? పోలీసుల పహారా.. మొదలైన వార్తలు వస్తూనే ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో వచ్చిన వాహనంలో వెళ్ళి రావడమే మంచిది అనుకున్నాం. డ్రైవర్‌కు దారి చెప్పాను.

పొందనవసరం లేకుండా వర్తమాన తెలుగు కథకు దీటుగా ఈ కథలు ఉన్నాయి. మనందరికి తెలిసిన సుప్రసిద్ధ దండకారణ్య రచయితలు షంషేర్, సాధన, నిత్య, మిడ్కో షహీదా.. వంటి వాళ్ళేగాక మరి కొందరు కూడా కథా రచనా రంగంలో ఉన్నారు. రచనను ఒక ముఖ్యమైన ఆచరణగా భావిస్తున్న వారెందరో అక్కడ ఉన్నారు. వారి నుంచి మరిన్ని కథలు తప్పక ఆశించవచ్చు. దండకారణ్య కథకు ఆద్యులని చెప్పదగ్గవారెందరో ఎన్నో మంచి కథలు రాసి అమరులయ్యారు. వాళ్ళ ఒరవడిని జనతన సర్కార్ నేపథ్యంలో ఇవాళ దండకారణ్య రచయితలు మరింత విస్తృత రూపంలో అందిస్తున్నారు. దేశంలోనే అతి పెద్ద దండకారణ్య సాంస్కృతికోద్యమంలో నిజానికి కథ ఉద్యమం చాలా చిన్నదే. ఎందుకంటే వాళ్ళకు వచన ప్రక్రియలకంటే మౌఖిక, దృశ్య కళారూపాలు, కవిత్వమే చాలా అత్యవసరం. వాటితోపాటు మనకు అక్కడి పరివర్తనా క్రమాన్ని, చైతన్య క్రమాన్ని, వీటిలో సృజనాత్మకమూ, నిర్ణయాత్మకమూ అయిన మానవ కర్తృత్వాన్ని మనకు అందించడానికి ఈ కథలు రాస్తున్నారు. ఆదివాసీ భాషా సాంస్కృతిక జీవితం నుంచి తెలుగులో వస్తున్న ఈ కథలు చదవడం మనకు ఒక గొప్ప అనుభవం.

పొద్దున్నే సిద్ధమైనా బయల్దేరేసరికి పది గంటలైంది.

రెండు కేన్లలో నీళ్ళు, బట్టలు తీసుకొని రాజేశ్వరి అంబులెన్స్ ఎక్కింది. అప్పుడు ఇంటి దగ్గర ఉండాల్సిన ఆడ పిల్లలకు ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. చివరగా దుఃఖంతో... ఎన్ని రోజులవుతుందో.. వచ్చినా రాకున్నా జాగ్రత్తగా ఉండండని గొంతు పూడకపోతుంటే అన్నది.

రాత్రి అక్కడిదాకా పోయిరావడంలోని ఇబ్బందులన్నీ చెప్పుకున్నాం. దాంతో ఆమెకు అలా అనిపించిందేమో.

ఆమె గుమ్మం దాటుతూ ఉంటే ఆడవాళ్ళు, పిల్లలు గొల్లున ఏడ్చారు. రెండో వదిన పద్మ కూడా వచ్చి అంబులెన్స్ ఎక్కింది. మల్లారెడ్డి, ఆయన మామ రాజిరెడ్డి ఎక్కారు. మా వాహనం వెనుకే ఇంటలిజెన్సీ వాళ్ళ జీపు కదిలింది. అంతకముందే సిఐ వచ్చి మల్లారెడ్డికి ఒక ఉత్తరం ఇచ్చి వెళ్ళాడు. అందులో సాంబిరెడ్డి బీజాపూర్ అడవుల్లో పోలీసులతో జరిగిన ఎదురుకాల్పుల్లో చనిపోయాడని, శవం తెచ్చుకోవాలంటే వెళ్ళవచ్చని ఉంది. బీజాపూర్ పోలీస్ స్టేషన్ నెంబర్ కూడా అందులో ఉంది.

డ్రైవర్‌కు ఎపి సరిహద్దుల వరకు తెలుసు. ఇక అక్కడి నుంచి అంతా మేం సేకరించుకున్న సమాచారం ప్రకారం పోవాల్సిందే. మాకు కూడా ఈ మార్గం కొత్త. గతంలో చత్తీస్‌గడ్‌కు భద్రాచలం మీదుగా వెళ్ళాం-ఇప్పుడు మహారాష్ట్రలోని గడ్చిరోలి మీదుగా వెళ్ళాలి. నిజానికి చెన్నూరు నుంచి ప్రాణహిత నదిని దాటితే ఒక్కరోజు ప్రయాణమే. నది దాటి సిరొంచ వెళ్లి బీజాపూర్‌కు వెళ్లవచ్చు. అయితే నది మీద వంతెన లేకపోవడంతో చుట్టూ తిరిగి కాగజ్‌నగర్, చంద్రాపూర్ మీదుగా పోవాల్సి వస్తోంది. భద్రాచలం మార్గంలో అయితే 700 కి.మీ. మాత్రమే. గతంలో అటు వెళ్ళినప్పుడు నానాఇబ్బందులు పడడంతో ఈ మార్గం ఎంచుకున్నాం.

డ్రైవర్ సంతోష్‌తో కలిసి ఎనిమిది మందిమి. రెండు గంటల వరకు ప్రయాణం సాఫీగా సాగింది. డ్రైవర్ చాలా చురుకుగా మాటలు కలుపుతున్నాడు. ఈ రోజు వాళ్ళ పాప పుట్టిన రోజట. గుడికి వెళ్ళి వచ్చి వెహికల్ తీసుకుని బయల్దేరానని చెప్పాడు. సాయంత్రంలోపు తిరిగి వస్తారని ఓనర్ చెప్పాడట. అతనికి సిరొంచ దాకా అనే చెప్పాడు. దాంతో తిరిగి వచ్చాక సాయంకాలం వాళ్ళ పాప బర్త్‌డే కేక్ కట్ చేయించాలని కూడా మాతో చెప్పాడు.

నేను అయ్యో.. అనుకున్నాను. బయల్దేరకముందే బీజాపూర్ దాకా వెళ్ళాలని అన్నప్పుడే సంతోష్ ముఖం వాడిపోయింది. కొంచెంసేపు ఇబ్బందిగా ఉండిపోయాడు. ఆ తర్వాత మామూలైపోయాడు. ఆ తర్వాత ఇవన్నీ చెప్పడం మొదలుపెట్టాడు.

అతని మాటకు అంజమ్మ నా వైపు చూసింది.

ఓనర్ ఇట్లా చెప్పడం ఏమిటి? అని.

పాపం... కూతురు మొదటి బర్త్‌డే అట... అదే మమ్మల్ని కొన్ని క్షణాలు ఇబ్బంది పెట్టింది. ఇప్పుడు ఏమీ చేయలేం. మరోసారి స్పష్టంగా ప్రోగ్రాం చెప్పడం మంచిదని ..సంతోష్! మనం బహుశా రేపు రాత్రికిగాని రాలేం... అన్నాను.

మళ్ళీ అతడి ముఖం కళ తప్పింది. కొన్ని నిమిషాలే. ఆ విషయాన్ని అంతటితో వదిలేసి మాతో ముచ్చటలోకి దిగాడు. దారి గురించి, చుట్టూఉన్న అడవుల గురించి మాటలు సాగాయి. నేనూ, శాంత, అంజమ్మ సంతోష్ మాట్లాడుతుకుంటున్నాం గాని మాతోపాటు వెనుక కూర్చున్న రాజేశ్వరి, పద్మ అసలు మాట్లాడటమే లేదు. రాజిరెడ్డి పెద్దాయన కావడం వల్ల ఏమో మాతో మాట్లాడిందే తక్కువ. మల్లారెడ్డి డ్రైవర్ పక్కన కూర్చున్నాడు. ఆయన ఏం ఆలోచిస్తున్నాడో తెలియడం లేదు.

కాసేపయ్యాక సాంబిరెడ్డి గురించి సంతోష్ అడగడం మొదలుపెట్టాడు. వాళ్ళ వీధిలో ఉండే ఓ ఫ్రెండ్ వాళ్ళ బాబాయి కూడా పదేళ్ళ కింద ఇట్లా ఎన్‌కౌంటర్‌లో చనిపోయాడని చెప్పాడు. అతను చెప్పే వివరాలనుబట్టి ఆ కామ్రేడ్ ఎవరో నేను పోల్చుకోగలిగాను. ఆయన బొల్లం రాజనర్సు. నేను కాసేపు ఆయన గురించిన ఆలోచనల్లో ఉండిపోయాను. బెల్లంపల్లిలో మిలిటెంట్‌గా పని చేస్తున్న రోజుల్లోనే తెలుసు. ఆ తర్వాత ఆర్గనైజర్‌గా, సింగరేణి ఉద్యమంలో పని చేస్తూ ఉద్యమంలోకి వెళ్లి అమరుడయ్యాడు. అట్లా సంతోష్ ఇక పూర్తిగా మాలో ఒకడైపోయాడు. అందరితో అక్కా.. అక్కా అని మాట్లాడడం మొదలుపెట్టాడు.

ఫిబ్రవరి నెలే అయినా ఎండ తీవ్రంగా ఉంది. వాహనంలో ఎక్కువ మందిమి ఉండడంతో మరింత వేడిగా ఉన్నట్లనిపించింది. వెనక ఇద్దరు కూర్చునే సీట్లో ముగ్గురం, అంబులెన్స్‌లో పెషెంట్‌ను పడుకోబెట్టే బల్లమీద ముగ్గురం కూర్చున్నాం. ఇరుకుగా ఉండడం, కనీసంగా సపోర్టుగాని, పట్టుకోడానికి ఆధారంకాని లేకపోవడంతో చాలా కష్టంగా ఉంది. రోడ్డు బాగా లేనిచోట ఇక చెప్పాల్సిన పని లేదు.

మా మాటలు కొంచెం తగ్గాక రాజేశ్వరి మాటలు కలిపింది. ఆ తర్వాత పద్మ. వాళ్ళు సాంబిరెడ్డి జ్ఞాపకాల్లోన్నే ఉన్నట్లుంది. అవే బైటికి చెప్తున్నారు.

తమ పిల్లల్ని ఆయన చూడలేదని, ఆయన గురించి రహస్యంగా మాట్లాడుకునే వాళ్ళమని రాజేశ్వరి చెప్పింది. ఎక్కడ ఏది జరిగినా పోలీసులు ఇంటి మీదికి వచ్చేవాళ్ళని అన్నది.

మా మరిది చానా మంచోడక్కా.. అన్నది పద్మ కల్పించుకుంటూ.

ఈ విషయం తెలిసినప్పటి నుంచి సాంబిరెడ్డి ఒక అన్న చనిపోయాడని అనుకుంటున్నామేగాని ఎట్లా చనిపోయిందీ ఎవ్వర్నీ అడగలేదు. అందుకేనేమో పద్మ మాట్లాడుతోంటే శాంత అడిగింది.

'అక్కా!.. మీ ఆయన ఎట్లా చనిపోయాడు..?' అని.

పద్మ ఒక నిమిషం ఆగిపోయింది. రాజేశ్వరి కూడా తనే చెప్తుంది గదా అన్నట్లు తోడికోడలు వంక చూస్తుండిపోయింది.

ఒక నిమిషమయ్యాక... మా ఆయన్ను కూడా పోలీసులే పొట్టనపెట్టుకున్నారక్కా.. అనింది. మేం దిగ్భ్రాంతికి గురయ్యాం. దాన్నుంచి తేరుకోకముందే.. మా మరిది కోసం ఆయన్ను స్టేషన్‌కు తీసకపోయి కొట్టేవాళ్ళు. తమ్ముడ్ని వెనక్కి తీసకరాకపోతే చంపుతమని కొట్టి, తిట్టి బెదిరించేవాళ్ళు. ఒకరోజు ఆయన ఈ బాధలు ఇంక పడలేను. చచ్చిపోత.. అన్నాడు.

నేను ధైర్యం చెప్పాను. ఆడ పిల్లలున్నారు. నీవు లేకపోతే ఆగమైపోతరు. నేను దిక్కులేనిదాన్నయిత అని ఎంతగానో చెప్పిన. కాకపోతే ఏ దేశానికైనా పోయి బతుకుదాం. ఎక్కడైనా కష్టం చేసుకోవాల్సిందే గదా అని కూడా చెప్పిన. కానీ వినలేదు...

ఆమె ఇంక చెప్పలేకపోయింది. గతంలోకి జారిపోయినట్లుంది. మనసులో సుళ్ళు తిరుగుతున్నదాన్ని బైటికి మాట్లాడుతున్నట్టుగా కాసేపయ్యాక మొదలుపెట్టింది.

అందరం ఆమెవైపే చూస్తున్నాం. సన్నగా, పొడుగ్గా, తెల్లగా ఉన్న పద్మకు ముప్పై అయిదేళ్ళుంటాయేమో. కానీ జీవితానికి మొత్తం సరిపడ

కష్టాలు అనుభవించినట్లు బలహీనంగా, పీలగా కనిపిస్తోంది. ఆమె మాట్లాడుతున్నప్పుడు జ్ఞాపకాల భారంతో చిగురుటాకులా వణికిపోతోంది. అవన్నీ నిన్నటివే అన్నట్టుగా ఉంది.

ఆమె మావైపు చూడకుండా ఏదో ధ్యాసలో ఉన్నట్టు చెప్తోంది.

... అట్ల అన్న మనిషి రెండు రోజుల నుంచి కనిపించకుండా పోయాడు. పిల్లలకు ఏం వండిపెడుతున్నానో కూడా తెలియడం లేదు. అందర్నీ అడిగాం. మా బావ, బంధువులు, మా అన్నదమ్ములు, నేను ఎక్కడెక్కడో తిరిగాం. ఎక్కడా జాడలేదు. తిరిగివస్తాడని నమ్మకం. ఎందుకంటే-ఎప్పట్లాగే పోలీసులు తీసుకునిపోయి ఉంటారని అనుకున్నాం. మా బావ స్టేషన్‌కు కూడా పోయి వచ్చాడు. పెద్దదానికి నాలుగేళ్ళు. చిన్నది చంటిబిడ్డ. ఆ రోజు వంట చేయనే లేదు. ఎక్కడెక్కడో వెతికి ఇంటికి వచ్చి ఇంత వండి పిల్లలకు కలిపిపెడ్తంటే ఆకలితో పెద్దది నా చేతిలోంచి కంచం లాక్కొని గబగబ తిన్నది. నాకు ఏడుపొచ్చింది. నేనట్లా వాలిపోయాను.

బైట ఎవరో పద్మక్క... పద్మక్క.. అని పిలిచారు.

బైటికి వెళ్ళాను. మాకు తెలిసిన గొల్లాయన.

ఏంది బిడ్డా.. అల్లుడు వచ్చిండా? అని అడిగాడు.

లేదు చిన్నయ్యా అన్నాను.

అడివికి గొడ్లను కాయడానికి పోతే చెట్టుకు మన రెడ్డిలాగే కనిపించాడు.. అన్నాడు.

గుండె వశం తప్పింది. ఏడుస్తూ పక్కింటివాళ్ళను పిలిచాను. అందరం ఊరి పక్కన ఉండే అడవికి వెళ్ళాం. చెట్టుకు ఉరేసుకొని వేలాడుతున్న మనిషిని చూచి కుప్పకూలిపోయాను. శవం నిండా పురుగులు పారాడుతున్నాయి.

ఆమె ఇప్పుడూ ఆ దృశ్యాన్ని చూస్తున్నట్టే చెప్పింది.

ఆ తర్వాత ఆమె ఇంక మాట్లాడలేకపోయింది.

మేమూ అట్లే ఉండిపోయాం. మా మధ్య మాటలు కరువయ్యాయి. ముందు వరుసలో కూచున్న మల్లారెడ్డికి ఏం గుర్తుకు వచ్చిందో పొలమారినట్లు దగ్గాడు. సంతోష్ డ్రైవింగ్ చేస్తూనే తల వెనక్కి తిప్పి మా వైపు చూశాడు.

ఇంత వరకూ ఒక దుఃఖంలో ఉన్నవాళ్ళం మరో దుఃఖంలోకి జారిపోయినట్టయింది. ఆమె ఎక్కిఎక్కి ఏడుస్తోంది. రాజేశ్వరి సన్నగా వెక్కిళ్ళు పెట్టింది. కాసేపు కాలం అట్లాగే గడిచిపోయింది.

ఎక్కడైనా వాహనం నిలుపుకుంటే బాగుండనిపించింది. అప్పటికి సమయం మూడైంది. ఎవ్వరికీ తిండి తినాలనిపించలేదు. దారిలో భోజన హోటళ్ళు కూడా కనిపించలేదు. ఏదో ఊరు వస్తే.. రోడ్డు మీద అమ్ముతున్న పుచ్చకాయ ముక్కలు, అరిటిపండ్లు తీసుకున్నాం. మళ్ళీ ప్రయాణం మొదలైంది.

* * *

గంటయ్యాక రోడ్డు రెండుగా చీలిపోయింది. ఎటుపోవాలో తెలియలేదు. సంతోష్ ఆపేశాడు. వెనక నుండి స్కూటర్ మీద పోతున్న ఇద్దరు కుర్రాళ్ళని ఆపి గడ్చిరోలికి ఎటు వెళ్ళాలి? అని అడిగాడు.

ఇక్కడి నుంచి బంగారం తడుద్ది అనే ఊరు 12 కి.మీ ఉంటుందని, అక్కడి నుంచి 7 కిమీ పోతే విటల్‌వాడీ వస్తుందని, అక్కడి నుంచి కుడి వైపు పైకి వెళ్తే హైవే వస్తుందని చెప్పారు. తాము అటే వెళ్తున్నామని రమ్మని చెప్పారు వాళ్లు.

సంతోష్ అంబులెన్స్‌ను కదిలించాడు.

వాళ్ళు ఒక ఊరి దగ్గర ఆగారు. అది చంద్రాపూర్ ఏరియా కిందికి వస్తుందని, ఇక్కడి నుండి మహారాష్ట్ర మొదలవుతుందని చెప్పారు. వాళ్లు అక్కడే ఆగి ముందుకు వెళ్లమని చెప్పారు.

అక్కడి నుంచి మేం బంగారంతడుద్ది దిశగా బయల్దేరాం. గంటన్నర ప్రయాణించి సాయంత్రం ఐదు గంటలకు గడ్చిరోలి జిల్లాలోకి ప్రవేశించాం. ఆ ప్రాంతం నుంచి ఎప్పుడూ పేపర్లలో వినిపించే కథలు గుర్తుకు వచ్చాయి. దట్టమైన అడవుల మధ్య తార్రోడ్డు మీద ప్రయాణం సాగుతోంది. దారి మధ్యలో ఆదివాసులు కట్టెలు, గొడ్డళ్ళు భుజాన వేసుకొని వెళ్తూ కనిపిస్తున్నారు. భారీ లారీలు అటుఇటూ తిరుగుతున్నాయి.

అప్పటికే బాగా అలిసిపోయాం. ప్రయాణం మా అంచనాల ప్రకారం సాగదని అర్థమైపోయింది. చాలా చోట్ల రోడ్డు బాగ లేదు. అయిన సంతోష్ సాహసం చేస్తూనే ఉన్నాడు. ఇంకొద్ది దూరం వెళ్ళాక సంతోష్ తనంతతానే ఓ లారీని ఆపి బీజాపూర్ ఎలా వెళ్ళాలి? అని అడిగాడు. ఆ డ్రైవర్ చెప్పలేకపోయాడు. మహారాష్ట్ర సరిహద్దు రాష్ట్రమే అయినా చత్తీస్‌గడ్‌లోని బీజాపూర్ అంటే తెలిసినట్టు లేదు. అందుకని మేం సిద్ధం చేసుకున్న రోడ్‌మ్యాప్ ప్రకారం రోడ్డు చీలికలు వస్తే దాటిపోయిన ఊరు నుంచి ఆ తర్వాత వచ్చే ఊరి గురించి మాత్రమే అడగడం మొదలుపెట్టాం. ఆ ప్రకారంగా చత్తీస్‌గడ్‌లోని భానుప్రతాప్‌పూర్‌కు దారి ఎటు అని మరో చోట అడిగాం. ఒక లారీ డ్రైవర్ వివరంగానే చెప్పాడు. ఇంకా ముందుకు పోతే హైవే వస్తుంది. దానిమీద కుడివైపు రోడ్ భానుప్రతాప్‌పూర్ వెళ్తుంది అన్నాడు. ఆయన ఇంకా ఇలా చెప్పాడు. రాత్రి ఏడు గంటలు దాటాక ఆ వైపు వెళ్ళకూడదు. పైగా ఆడవాళ్ళున్నారు. జాగ్రత్త.. ఏదైనా వెహికిల్ వెళ్తోంటే వెనకే వెళ్ళండి అని.

సంతోష్‌కు ఆయన చెప్తున్న మాటలు మా అందరికీ వినిపించాయి. మేం ముగ్గురం అప్రయత్నంగా ఒకరి ముఖాల్లోకి ఒకరం చూసుకున్నాం. మల్లారెడ్డి కొద్దిగా కునుకు తీసినట్టుంది. మిగతావాళ్ళు ఆ మాటలను పట్టించుకోలేదు.

రెండు రోజులుగా మేం ఎక్కడికి వెళ్ళాలనుకుంటున్నదీ, అక్కడి పరిస్థితులు ఎలా ఉండేదీ తెలిసిందే అయినా...ప్రయాణం మొదలయ్యాక మొదటిసారిగా ఆ లారీ డ్రైవర్ మాటలతో అవన్నీ స్ఫురించాయి.

అక్కడ దొంగలు ఉంటారేమో అక్కా... అన్నాడు సంతోష్.

ఏమో మరి, జాగ్రత్తగానే వెళ్దాం... ఏమనాలో తోచక ఆ మాటతో సరిపెట్టాను.

ఈ చివరి మాటలు పద్మ, రాజేశ్వరి విన్నారు. కొంచెం ఆందోళనపడ్డట్లు కనిపించారు. మేం ముగ్గురం మాట్లాడుకోవడం లేదుగాని మా అందరికీ గతంలో ఛత్తీస్‌గడ్‌లో ఎదురైన అనుభవాలు గుర్తుకు వస్తున్నాయి.

నాలుగేళ్ళ కింద కంచాల ఎన్‌కౌంటర్ జరిగినప్పుడు శవాల స్వాధీనానికి అక్కడికి వెళ్ళాం. అప్పటికి సాల్వాజుడుం చాలా బలంగా ఉంది. మేం ఏపి నుంచి వెళ్తున్నామనే వార్తలు తెలుసుకొని సల్వాజుడుం నాయకుడు సోయముఖ అనేవాడు టివిలో... ఏపి నుంచి శవాలను తీసుకోడానికి వచ్చే వాళ్ళకు మా వాళ్ళు బల్లేలతో స్వాగతం పలుకుతారు అని ప్రకటన ఇచ్చాడు.

మేం భద్రాచలం ఎస్పిని కలిసి చత్తీస్‌గడ్ ప్రయాణం గురించి చెప్పాం.ఆ ఎన్‌కౌంటర్లో చనిపోయిన కామ్రేడ్స్ బంధువులు కూడా

మాతోపాటు వస్తున్నారని, రక్షణ కల్పించాలని అడిగాం. గ్రేహౌండ్స్ పోలీసులతో కలిసి మేం కుంట బేస్ క్యాంపు ఏరియా చేరుకున్నాం. ఆ పక్కన పదిహేడు శవాలను పడేశారు. అప్పటికి ఎన్‌కౌంటర్ జరిగి నాలుగు రోజులు. శవాలు పురుగులు పట్టి ఆకారాలు పూర్తిగా మారిపోయాయి. ఎన్‌కౌంటర్ సంగతి తెలిసినప్పటి నుంచి తమవాళ్ళ శవాలను చూసుకోవాలని వచ్చినవాళ్లు తీరా అక్కడికి చేరుకున్నాక శవాల దగ్గరికే పోలేకపోయారు. వెళ్ళినా గుర్తించడానికి కూడా వీల్లేకుండా అన్నీ ఉబ్బిపోయి ఉన్నాయి. మూడు రోజుల నుంచి నిద్రాహారాలు లేక అందరూ నీరసించిపోయి ఉన్నారు. శవాలను పోల్చుకోవడానికి వాళ్ళు పడ్డ ఇబ్బంది అంతా ఇంతా కాదు. సాగర్ భార్య...' తన భర్త అరచేతిలో ఉన్న కుంకుడు గింజ అంత పుట్టుమచ్చ చూసి శవాన్ని పోల్చుకున్నది. ఆమె బిడ్డ కూడా ఉద్యమంలోనే ఉంది. కూతురు కూడా చనిపోయిందనే వార్తలు వచ్చాయి. దాంతో కూతురు కోసం వెతుక్కుంది. కొంచెం దూరంలో ఉంగరాల జుట్టు, వెడల్పు ముఖం ఉన్న మహిళ శవాన్ని చూసి గొల్లున ఏడ్చింది. అది కూతురు శవమే. అందరూ ఇట్లా ఏదో ఒక పోలికతో గుర్తు పట్టాల్సి వచ్చింది.

మేం అక్కడికి వెళ్ళేసరికి అక్కడ వందమంది దాకా సాల్వాజుడుం వాళ్ళు ఉన్నారు. చత్తీస్‌గడ్ పోలీసులు కూడా చాలా మందే ఉన్నారు. సాల్వాజుడుం వాళ్ళు మమ్మల్ని చుట్టుముట్టారు. మీడియా వాళ్ళు, ఏపి పోలీసులు ఉన్నా వాళ్ళు మా మీదికి వచ్చి బెదిరించారు.

కుటుంబ సభ్యులు తమ వాళ్ళ శవాలను గుర్తు పడుతూ ఉంటే చత్తీస్‌గడ్ పోలీసు అధికారి రాసుకుంటున్నాడు. సాగర్ భార్య తన కూతురు శవం దగ్గర కుప్పకూలిపోయి ఏడుస్తోంటే-సాల్వాజుడుం వాడు వచ్చి ఓ కర్రతో శవం అండర్‌వేర్ మీద పొడుస్తూ... నీ బిడ్డ ఆడా? మగా? అని ఆమెతో అసహ్యంగా మాట్లాడాడు. అల్లంత దూరంలో ఉన్న పోలీసు అధికారులు ఇదంతా చూస్తూనే ఉన్నారు.

ఏడ్చిఏడ్చి కొందరికి గొంతెండిపోయింది. అక్కడ ఒక చెట్టుకింద నీళ్ళకుండ ఉంది. కానీ ఎవరమూ సాహసం చేయలేకపోయాం. ఆ పక్కనే ఒక కల్లుకుండ కూడా ఉంది. ఇద్దరు సాల్వాజుడుం వాళ్ళు వెళ్ళి కల్లు ముంచుకొని తాగారు. అక్కడి నుంచి తూలుతూ తూలుతూ శవాల గుట్ట దగ్గరికి వచ్చారు. ఒకడు తూలి శవాల మీద పడబోయి పక్కనే ఉన్న మొండిగోడ మీద కూలబడిపోయాడు. ఇంకొకడు తన చేతిలో ఉన్న కర్రతో ఓ శవం పొట్ట మీద గట్టిగా కుచ్చి బైటికి తీశాడు. శవం బాగా ఉబ్బిపోయి ఉండడంతో కర్రతోపాటు లోపలి నుంచి పేగులు కూడా బైటికి వచ్చాయి. ముట్టుకుంటే శవాలు ఎక్కడ ఛిద్రమవుతాయో అని రక్త సంబంధీకులు చూస్తోంటే సాల్వాజుడుం వాళ్ళు పేగులు బైటికి తీసి ఆనందిస్తున్నారు.

మేం ఆ దృశ్యం చూడలేకపోయాం. పక్కకు వెళ్ళి కూర్చున్నాం. ఐదారు మంది సాల్వాజుడుం వాళ్ళు మేం ఉన్న చోటికి వచ్చి కూర్చొని బూతులు తిట్టడం మొదలుపెట్టారు. బెదిరిస్తూ మాట్లాడుతున్నారు. ఈ శవాలను తీసుకుని మిమ్మల్ని బైటికి పోనివ్వం, వీటికే కాదు, మీకు కూడా గుంతలు తీశాం. కలిపి పూడ్చిపెడతాం... అని వికృతంగా చూస్తూ భయపెడుతున్నారు. వాళ్ళంతా బాగా తాగి ఉన్నారు. పోలీసులు ఉన్నా రాజ్యం వాళ్ళదే. ఏమైనా చేయగలరని అనిపించింది.

ఎలాంటి పరిస్థితిలో ఉన్నాం? అని ఆందోళనగా ఉన్నది. మిగతావాళ్ళ కళ్ళలో కూడా ఆ భయం కనిపిస్తూనే ఉన్నది. శవాలను తీసికెళ్లడానికి చత్తీస్‌ఘడ్ నుంచి జీపులు రానీయమని సాల్వాజుడుం వాళ్లు అంటూనే ఉన్నారు. ఎలా తీసికెళ్లాలి?

అయినా పని చేసుకొని వెళ్ళాల్సిందే... శవాలను తీసుకునే ఇక్కడి నుంచి బైటపడాలి. వాళ్ళ తిట్లు, బూతులు వింటుంటే మాలో హిందీ తెలిసినవాళ్ళకు భయమే కాదు, వెగటనిపించింది. ఈ మాత్రమైనా హిందీ రాకుండా ఉంటే బాగుండు కదా? అనిపించింది నాకు ఆ క్షణాన.

చీకటి పడుతూ ఉండగా భద్రాచలం నుంచి వాహనాలు రావడం, వెంటనే అక్కడి నుంచి శవాలతో సహా బైటపడడం జరిగిపోయింది.

....

....

ఇప్పుడు అవన్నీ గుర్తుకు వచ్చాయి. ఆనాటి ఆందోళన అంజమ్మ, శాంత కళ్ళలో నాకు కనిపిస్తూనే ఉంది. నాకూ అలాగే ఉంది. అప్రయత్నంగా ఈసారి ఎలా ఉంటుందో... అన్నాను బైటికి.దానికి వాళ్లు ఏమీ అనలేదు. ఎలా ఉన్నా వెళ్లిరావాల్సిందే గదా అన్నట్లు చూశారు.

చీకటి పడుతోంది. ఆలోచనల్లో ఉండగానే హైవే మీదికి చేరుకున్నాం. అక్కడ మహారాష్ట్ర పోలీసులు వాహనాలను చెక్ చేస్తున్నారు. మాది అంబులెన్స్ కావడంతో సంతోష్ వాళ్ళతో చత్తీస్‌గడ్ వెళ్ళాలి అన్నాడు.

వాళ్ళే దారి చూపించారు.

కొద్ది సేపయ్యాక.. ఏందీ మనల్ని వదిలేశారు? అని సంతోష్ ఆశ్చర్యపోయాడు. అతడికి పూర్తిగా ఈ ప్రయాణంలోని రిస్క్ అర్థమైపోయింది. నిజానికి ప్రతి రెండు గంటలకు ఒకసారి ఆంధ్ర ఇంటలిజెన్స్ పోలీసులు నాకు ఫోన్ చేస్తూనే ఉన్నారు. మేం ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తున్నది అడిగి తెలుసుకుంటున్నారు. బహుశా మేం దారిలో ఎక్కడైనా మావోయిస్టులను కలుస్తామేమో.. అనే దృష్టి వాళ్ళకు ఉన్నట్టనిపించింది.

ఇంకొంచెం దూరం వెళ్ళాక సంతోష్ తల తిప్పి.... అక్కా! నీవు ముందు కూర్చుంటావా? అని అడిగాడు.

ఎందుకులే... మల్లన్నకు అక్కడైతే కొంచెం సౌకర్యంగా ఉంటుంది కదా? అన్నాను నేను. కానీ సంతోష్ వదిలిపెట్టలేదు.

రాత్రి కదా.. నెంబర్ రాళ్ళ మీద అక్షరాలు అర్థం కావడం లేదు.. అన్నాడు. మహారాష్ట్రలోకి ప్రవేశించినప్పటి నుండి రోడ్డు పక్క ఉండే మైలురాళ్ళ మీద హిందీలో ఊర్లపేర్లు కనిపిస్తున్నాయి.

ఈసారి నా సమాధానం కోసం చూడకుండా వెహికిల్ ఆపేశాడు. నేను ముందుకు వెళ్ళి కూచున్నా.

అక్కడి నుంచి 180 కి.మీ. వెళ్తే భానుప్రతాప్‌పూర్ చేరుకుంటాం. అయితే ఇది ఖచ్చితమైన అంచనా కాదు. ఎందుకంటే మేం హైవే ఎక్కగానే మళ్ళీ చంద్రాపూర్ డైరెక్షన్ కనిపిస్తోంది. ఇదేమిటి? అని అయోమయంలో పడ్డాం. అయితే అటే వెళ్ళాలని అందరూ చెప్తున్నందున ముందుకే సాగాం. అరగంటయ్యాక ఒక చౌరస్తా వచ్చింది.

అది ఒక తాలూక కేంద్రం వంటి పట్టణం.

సంతోష్ బాగా అలసిపోయాడు. టీ కోసం ఆపాడు. టీ తాగుతూ ఎంక్వైయిరీ చేశాం.

బీజాపూర్ వెళ్ళాలని అడగ్గానే అక్కడున్న కొందరు కుర్రాళ్ళు దగ్గరిగా వచ్చి ఎక్కడి నుంచి వస్తున్నారు? అని అడిగారు. అలా అడగడంతో కొంచెం ఆశ్చర్యం కనిపించింది. కాగజ్‌నగర్ నుంచి ..

అని చెప్పాం.

అది నక్సల్స్ ఏరియా కదా. మీకేం పని. రాత్రిళ్ళు అటుపోవడం చాలా కష్టం.. పైగా ఆడవాళ్ళున్నారు... అన్నారు. కానీ వాళ్ళు మమ్మల్నీ నక్సల్స్‌గా సందేహిస్తున్నట్లు ఆ మాటల్లో ఉంది.

మా బంధువు ఒకరు అక్కడ చనిపోయారు. తీసుకరావడానికి వెళ్తున్నాం అనడంతో, పైగా అంబులెన్స్‌ను చూసి వాళ్ళకు నమ్మకం కలిగింది.

వాళ్ళు రెండు మార్గాలు చెప్పారు.

భానుప్రతాప్‌పూర్ వైపు వెళ్తే.. అక్కడ ఆరుగంటలకే చెక్‌పోస్ట్ మూసేసి ఉంటారు. అడవిలో చిక్కుకపోతారు. కాబట్టి నేరుగా 15 కి.మీ. వెళ్తే ఓడిసా అనే తాలూకా కేంద్రం వస్తుంది. అక్కడ రాత్రికి ఆగవచ్చని చెప్పారు. మేం రెండో మార్గాన్ని ఎంచుకున్నాం. అంతా దట్టమైన అడవి. అటు అడవి.. అని ఇటు వస్తే ఇటు కూడా అడవే గదా? అనింది అంజమ్మ.

అప్పటికి టైం ఎనిమిది కూడా కాలేదు. కానీ రోడ్డు మీద ఎదురయ్యే ఊళ్ళ వద్ద జనం కనిపించడం లేదు. వెనుక వచ్చే వాహనాన్ని ఆపి ఇది ఓడిసానా? అని అడిగితే.. కాదు కుర్కేడా అని చెప్పారు. హోటళ్ళు అవీ ఆ కనిపించాయి. అక్కడే ఆగుదాం అనుకున్నాం. అన్నాలు తినడానికి వెళ్ళి హోటల్ ఆవిడ్ని.... ఈ రాత్రికి ఈ ఊళ్ళో ఉండే అవకాశం ఉంటుందా? అని అడిగాం.

దానికి ఆమె అలాంటి సౌకర్యాలు లేవని, ఓడిసా వెళ్ళాల్సిందేనని చెప్పింది.

కానీ అటు వెళ్ళడం ప్రమాదం అంటూనే, ఈ ఊళ్ళో ఆర్ అండ్ బి వాళ్ళ గెస్ట్‌హౌస్ ఉంది. అక్కడ ఉండొచ్చు. కాకపోతే అది పోలీసుల ఆధీనంలో ఉంటుంది అని చెప్పింది.

ఎటువెళ్ళినా ప్రమాదమే కదా. ఓడిసా దాక వెళ్ళి ప్రమాదంలో పడేకంటే ఇక్కడే పోలీసులను గెస్ట్‌హౌస్ గురించి అడిగితే వచ్చే ప్రమాదం ఏముంది? అనుకొని స్టేషన్‌వైపు వాహనాన్ని కదిలించాం.

స్టేషన్ బైట ఉన్న లైట్ కింద అంబులెన్స్‌ను ఆపేశాం.

నేను, అంజమ్మ లోపలికి వెళ్ళాం. గేటు దగ్గర ఎవ్వరూ లేరు. ఆశ్చర్యం కలిగింది. కాంపౌండ్ లోపల పోలీసుల వాహనాలు ఉన్నాయి. వాటిలో కొందరు కూచొని తాగుతున్నట్టు కనిపించారు. బిల్డింగ్‌పైన ఉన్న సెంట్రీ మమ్మల్ని చూసి మాయమైపోయాడు.ఇదేదో ప్రమాద సంకేతంలాగా ఉందే అనిపించింది. అనుకున్నట్లే .... ఇంతలో స్టేషన్ లోపలి నుంచి, బైట ఉన్న వాహనాల్లోంచి అరుపులు, కేకలు మొదలయ్యాయి. వాళ్ళు ఫోన్లలోనో, వైర్‌సెట్‌లోనో అరుచుకుంటున్నారు. ఒక్క ముక్కా అర్థం కాలేదు.

అంతా అలజడి.

ఏమైనా జరుగుతుందా? అని ఆందోళన పడ్డాం.

నేను హిందీలో మీ హెల్ప్ కోసం వచ్చాం... అని గట్టిగా ఒకటికి రెండు సార్లు అరిచాను. నా మాటకు ఎవ్వరూ వినిపించుకోవడం లేదు. వాళ్ళ అరుపులే సరిపోయింది. ఏదో టెన్షన్.. ఒకరినొకరు అటెన్షన్‌లో పెట్టడంలాగా ఉందా హడావిడి.

మొత్తానికి మేం వెళ్ళడంతో అప్రమత్తం అయ్యారని అర్థమైపోయింది. ఒకవేళ ఫైరింగ్ జరిగితే.... ఇంకేముంది? జల్లెడ అయిపోతం అనిపించింది. లోపలి నుంచి మనుషులు ఎవరూ కనబడడం లేదు. వాహనల్లో ఉన్న వాళ్లు కూడా కిందికి దిగలేదు. అలజడి పెరిగింది.

ఇక అక్కడ ఉండటం మంచిది కాదనిపించింది. క్షణంలో వెనక్కితిరిగాం. భయంతో వణికిపోతూనే బైటికి నడిచాం. అప్పటికీ స్టేషన్ లోపలి నుంచి ఒక్కరు కూడా బయటికి రాలేదు. మనుషులు కనిపించడం లేదుగాని అరుపులూ, కేకలే.

మేం అంబులెన్స్ ఎక్కి భోజనం చేసిన హోటల్ దగ్గరికి వేగంగా చేరుకున్నాం. మా వెనుకే పోలీసులు వస్తారని నా నమ్మకం. అప్పుడు అసలు విషయం చెప్పొచ్చు అనుకున్నాం. కానీ రాలేదు.

ఏదైతే అదవుతుంది అనుకొని ఓడిసా బయల్దేరాం.

వాహనంలో వెళ్తుంటే చల్లగాలి సోకుతోంది కాని మేం భయం నుంచి తేరుకోలేదు. లోపలికి మేం వెళ్ళాక జరిగిన అలజడికి అంబులెన్స్‌లో ఉన్నవాళ్ళు కూడా ఏం జరుగుతోందో అని కంగారుపడ్డారు. ఏమైంది... ఏమైంది? అని అడిగారు. మేం చెప్పింది విని మరింత ఆందోళనపడ్డారు.

మళ్లీ ఘాట్ రోడ్డు, దట్టమైన అడవిలో ప్రయాణం. కొద్దిదూరం వెళ్ళాకగాని అందరం కుదుటపడలేదు. మళ్ళీ ఓ ఉపద్రవం వచ్చింది.

ఉన్నట్టుండి ఎడమ చేతి పక్క నుంచి మా వాహనంపైన ఫోకస్‌లైట్లు పడ్డాయి. ఎక్కడి నుంచి వచ్చాయో అర్థం కాలేదు. వెంటనే ఆరిపోయాయి. మా గుండెలు జల్లుమన్నాయి. రాత్రిపూట, దట్టమైన అడవిలో.... అందరూ ఈ దారిన ఎందుకు వెళ్ళవద్దని చెప్తూ వచ్చారో..

సంతోష్ తేరుకొని స్పీడ్ పెంచాడు.

అయిదారు నిమిషాల తర్వాత అతనే నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ.. ఆ లైట్లు ఎవరివి అక్కా అని నన్ను అడిగాడు. అంత వరకు గుండెలు చీల్చుకొనిపోయే నిశ్శబ్దమే.

ఏమో... ఎవరివైతేనేం.. బయటపడ్డట్టే... అని నేను ధైర్యం కూడగట్టుకొని అతనికీ ధైర్యం కలిగేలా అన్నాను. కాని మనసు లోపల మాత్రం క్షేమమేనా? అనే సందేహం పీడిస్తోంది. రోడ్ కొంచెం బాగుండడంతో సంతోష్ మరింత స్పీడ్ పెంచాడు.

ఓడిసా చేరుకున్నాక ఓ లాడ్జిలో అందరం బస చేశాం. బాగా అలిసిపోయినందువల్ల భయంతో వణికిపోయిన శరీరాలు అదమర్చి నిద్రలోకి జారుకున్నాయి.

* * *

మర్నాడు బయల్దేరే ముందు మళ్ళీ వాకబ్ చేశాం.

గోందియా జిల్లా అడవి మార్గంలో వెళితే దేవిరి అనే పట్టణం వస్తుంది... అక్కడి నుంచి జగదల్‌పూర్ మీదిగా వెళ్ళవచ్చు... అని చెప్పారు. దేవిరి-జగదల్‌పూర్ మధ్య అడవి కూడా లేదని చెప్పారు. గోందియా అడవి నుంచి జనతన సర్కార్ ఏరియా ప్రారంభమవుతుందని పుస్తకాల్లో, పత్రికల్లో చదివింది గుర్తుకు వచ్చింది.

బీజాపూర్ పోలీసులకు ఫోన్‌చేసి మేం దేవిరీ మీదుగా వస్తున్నాం అని చెప్పాను. రెండు గంటల ప్రయాణం తర్వాత చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోకి వెళ్ళామని అర్థమైంది. వాహనాలపైన సీజీ నెంబర్లు కనిపిస్తున్నాయి. అయినా ఇంకో రోజు ప్రయాణం ఉన్నదని మాకు తెలియదు.

సాయంకాలం ఐదు గంటలకు భానుప్రతాప్‌పూర్ దాటి నారాయణ్‌పూర్ చేరుకున్నాం.

అక్కడి నుంచి 150 కిమీ ప్రయాణిస్తే జగదల్‌పూర్ వచ్చింది. ఆ రాత్రి అక్కడే ఉండాలనుకున్నాం. ఎందుకంటే బీజాపూర్ వెళ్లే దారిలో

ఉండే గీదం దగ్గర సాయంకాలం కాగానే చెక్‌పోస్టు దగ్గర రోడ్డు మూసేస్తారని చెప్పారు. సరిగ్గా నిన్నటి పరిస్థితే ఇక్కడా ఎదురైంది.

జగదల్‌పూర్ పట్టణం చేరుకోడానికి ముందే సీఆర్పీఎఫ్ క్యాంపు కనిపించింది. అది చాలా విశాలంగా ఉంది. దాన్ని దాటుతూ ఉండగానే బీజాపూర్ నుంచి పోలీసులు ఫోన్ చేశారు. ఎక్కడిదాకా వచ్చారు? అని అడిగారు. నేను చెప్పాను.

ఆ తర్వాత అక్కడున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లాం. మేం వచ్చామని సమాచారం ఇవ్వడానికి. నేను అంతపెద్ద స్టేషన్ ఎన్నడూ చూడలేదు. అక్కడ అధికారులతో మాట్లాడి స్టేషన్ ఎదుటే ఉన్న లాడ్జిలో ఆ రాత్రి బస చేశారు. మా పక్క గదిలోనే బీజాపూర్ నుంచి వచ్చిన కానిస్టేబుళ్ళు దిగారు. వాళ్ళు రిజిస్టర్‌లో బీజాపూర్ ఠాణా అని రాయించడం నేనూ, అంజమ్మ గమనించాం.

మనకు బాడీగార్డ్స్ వచ్చేశారే.. అని నవ్వుకున్నాం.

ప్రయాణంలో రెండో రోజు ఇలా ముగిసింది.

* * *

మర్నాడు జగదల్‌పూర్ దాటుతూ ఉంటే పద్మను కలియకపోయామే... అని మరోసారి అనుకున్నాను. నిన్నటి ప్రయాణంలో ఈ ఊరి ప్రస్తావన రాగానే నాకు కామ్రేడ్ పద్మ గుర్తుకు వచ్చింది. రాత్రి నుంచి ఎన్నోసార్లు తన జ్ఞాపకాలే. తను నాకు ఇష్టమైన స్నేహితురాలు. ఎన్నోఏండ్లు కలిసి పని చేశాం. ఆమె హైదరాబాదు నుండి వెళ్లి ఎవోబి ఉద్యమంలో పని చేస్తూ అరెస్టై ఈ ఊళ్లో జైయిల్లో ఆరేళ్ళ నుంచి ఉంటోంది. తనను ప్రత్యేకంగానే కలవాలని ఎన్నోసార్లు అనుకున్నాను. కానీ వీలు కాలేదు. ఎప్పటికప్పుడు సమాచారం తెలుస్తునే ఉన్నా కలవకపోవడం నన్ను వేధించే వెలితిగానే ఉండిపోయింది.

అక్కడి నుండి గీదం దాకా దారిపొడవునా పూలకోసం ప్రయత్నించాం. బీజాపూర్‌లో ఉంటాయో లేదో అని అనుమానం. అమరవీరుడికి పూలు వేయడానికని. ఎక్కడా దొరకలేదు.

బీజాపూర్ జిల్లా ఎంట్రన్స్‌లో పెద్ద కర్రను చెక్‌పోస్ట్‌లాగా పెట్టారు. అయితే అక్కడ ఎవ్వరూ లేరు. దాన్ని దాటుకున్నాం. మళ్ళీ అడవి మార్గం మొదలైంది.

రోడ్డు చాలా అధ్వాన్నంగా ఉంది. రోడ్లు ఇట్లా కూడా ఉంటాయా? అని మనం ఊహించలేం. నల్లగా జీపుల్లాగా ఉండే ఆటోలు రోడ్డుమీద వస్తూపోతూ ఉన్నాయి. దారిలో ఒక జింక రోడ్డు దాటుకొని అవతలివైపుకు వెళ్ళింది. అక్కడ ఒక జింకల గుంపే ఉంది. ఇది ఎగిరి దుంకడంతో అక్కడున్న జింకలన్నీ కదిలి కెరటంలాగా పచ్చిక బయళ్ళలోకి పరిగెత్తాయి. ఇలాంటి అందమైన దృశ్యాలు దారిపొడవున ఎన్నో కనిపించాయి. చాలాసార్లు మేం వాటిని ఎంజాయ్ చేయలేక పోయాం. దారి తెలియని అయోమయం, భయం. వొత్తిడి... ఇవే సరిపోయింది.

కేవలం 120 కి.మీ. దూరాన్ని మధ్యాన్నానికిగానీ చేరుకోలేకపోయాం. వొళ్ళంతా హూనమైపోయింది. కానీ గమ్యం చేరుకున్నామనే నిర్ధారణకు రావడంతో కొంచెం తేలికగా ఉంది. చుట్టుపక్కల అడవి అందాలను కూడా అందరం గమనించగలుగుతున్నాం. ఒకచోట మిందాచల్ అని పిలవబడే ఇంద్రావతి నదిని దాటాం. వంతెన దాటుతూ ఉన్నప్పుడు ఆ నీటిలో దిగి స్నానం చేద్దామా తాతా? అని రాజిరెడ్డిని అడిగాడు సంతోష్. ముసలాయన కూడా ఆ నది అందానికి పరవశం చెంది తలూపాడు. అందరి ముఖాల్లో ముసి ముసి నవ్వులు.

మీరిద్దరూ ఇక్కడికి మరోసారి తీరిగ్గా రండబ్బా.. అన్నాను నేను.

పచ్చని అడవి, వచ్చీపోయే ఆదివాసీ గ్రామాలు, దారిలో కనిపిస్తున్న ఆదివాసులు.. కొంచెం ఆనందం కూడా కలిగింది. అక్కడక్కడ యూకలిప్టస్, టేకు చెట్లను నరికి దుంగలు పేర్చారు. ఒక్కోచోట అడవిని బాగా కొట్టేసిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. అక్కడక్కడ తగలబడిపోయిన ఇళ్లూ, పై కప్పులు తొలగించిన ఇళ్లూ కనిపించాయి. ఈ ఊళ్లన్నీ ఏమయ్యాయి? అని అనే సందేహం కలిగింది. బహుశా ఇట్లా అనేక ఊళ్లను ధ్వంసం చేసి జనాలను బేస్‌క్యాంపులకు తరలించారని చదివినవి గుర్తుకు వచ్చాయి. ఇట్లా ఆలోచిస్తూ ఉండగా కొంగుపల్లి బేస్ క్యాంపు దాటిపోయింది. అడవి చివరికి వచ్చాం. అక్కడ బీజాపూర్ మిలటరీ క్యాంపు ఉంది. అది దాటుతూ ఉంటే.. బహుశా కూంబింగ్‌కు వెళ్లేందుకే కావచ్చు.. క్యాంపు నుంచి కొన్ని వందల మంది మిలటరీ వాళ్లు రోడ్డు మీదికి వచ్చారు. వాళ్ల ముందు నుంచే మా అంబులెన్స్ దాటుకొని వెళ్లింది. ఏపీ వాహనాన్ని చూసి వాళ్లు గట్టిగా కేకలు వేశారు. అయినా వాళ్లు మమ్మల్ని ఆపాలనుకోలేదు. దాంతో ముందుకు సాగాం.

ఇంతో మళ్ళీ పోలీసుల నుంచి ఫోన్.

నేరుగా స్టేషన్‌కు వచ్చేయమని.

అక్కడికి వెళ్ళాక, నేనూ, మల్లారెడ్డి, అంజమ్మ లోపలికి వెళ్ళాం. ఒక పోలీసు వచ్చి మమ్మల్ని తీసుకెళ్ళాడు. లోపల పెద్ద హాలు. అందులో అటుఇటూ టేబుళ్ళ ముందు పోలీసు అధికారులు కూర్చొని ఉన్నారు. మమ్మల్ని ఓ పక్కన కూచోమని చూపించారు.

వాళ్ళు మా కోసమే ఎదురుచూస్తున్నట్లు అర్థమైంది.

మా ఐడెంటిటీ కార్డులు చూపించాం. అడ్రస్‌లు రాసుకున్నారు. బెల్లంపల్లి పోలీసులు ఇచ్చిన కాగితాన్ని ఒకటికి రెండుసార్లు సరి చూసుకున్నారు. అన్నీ ధృవీకరించుకున్నాక కూడా ఓ పోలీసు ఆఫీసర్ మళ్లీ మా అందరి వివరాలు అడిగాడు. అతను సివిల్ పోలీసు అధికారి కాదని అర్థమైంది. ఇంకో ఆఫీసర్ మళ్ళీ అవే వివరాలు అడిగాడు. మాకు విసుగు కలిగింది. ఇక్కడ మూడు విభాగాల పోలీసులు ఉన్నారనిపించింది. ఇన్నిసార్లు అడగడానికి కారణం అదే అని మాటల్లో వాళ్ళలో ఒకరు చెప్పారు.

కాసేపయ్యాక అడిషనల్ ఎస్‌పి లోపలికి వచ్చాడు. అతనితోపాటు ఒక ఎస్ఐ కూడా. వాళ్ళు నేరుగా లోపల ఉన్న మరో గదిలోకి వెళ్ళిపోయారు. అందరూ అలర్ట్ అయ్యారు. మమ్మల్ని ఆ గదిలోకి తీసికెళ్ళారు. మళ్ళీ ఐడెంటిటీ కార్డులు-వివరాలు అడిగే తంతు నడిచింది. మృతుడి కుటుంబ సభ్యులం కాని మమ్మల్ని అదర్స్ అని రాసుకున్నారు.

అదయ్యాక.. శవాన్ని తీసికెళ్తారా? అని అడిషనల్ ఎస్‌పి అడిగాడు. శవాన్ని ఐస్‌బాక్స్‌లో పెట్టారా? అని అడిగాను.

దానికాయన, ఈ జిల్లాలోనే అది దొరకదు.. అన్నాడు.

మేం నిర్ఘాంతపోయాం. నిజమా? అనే సందేహం కలిగింది. ఒకరి ముఖాలు ఒకరం చూసుకున్నాం. బెల్లంపల్లి నుంచి మొదటిసారి ఫోన్ చేసినప్పుడే శవాన్ని భద్రపరచండి.. మేం వచ్చి తీసుకొని వెళ్తాం అని గట్టిగా చెప్పాను. ఇప్పటికల్లా శవం ఎలా తయారై ఉంటుంది! సందేహం కలిగింది.

మేం అక్కడ ఉండగానే బెల్లంపల్లి పోలీసుల నుంచి ఫోన్.

డెడ్‌బాడీ తీసుకొని వస్తున్నారా? అక్కడే అంత్యక్రియలు చేస్తారా?

అని.

కుటుంబ సభ్యులకన్నా, మా సంఘానికన్నా పోలీసులకే తొందర ఉన్నట్టుంది. శవాన్ని భద్రపరచకపోవడంతో కోసం, విసుగు కలిగాయి.

అయినా ఇప్పుడే చేస్తాం?

మా వెంట అడిషనల్ ఎస్‌పి, ఎంఆర్‌ఓ, ఎస్‌ఐ వచ్చారు. అందరం మార్చురీకి వెళ్ళాం. అప్పటికే అక్కడ మీడియావాళ్ళు ఉన్నారు. హాస్పిటల్లోనివాళ్ళు కొందరు గుంపయ్యారు. పత్రికల్లో వస్తున్న వార్తలనుబట్టి, సహజంగానే ఉండే పోలీసుల హడావిడిని బట్టి సాంబిరెడ్డి ఎన్‌కౌంటర్ గురించి హాస్పిటల్‌లోని రోగులకు, రోగుల బంధువులకు తెలిసినట్టుంది.

మేం నేరుగా అవతలివైపు ఉన్న హాస్పిటల్ బిల్డింగ్‌వైపు నడుస్తోంటే, పోలీసులు అటు కాదు.. ఇటు... అని దారి చూపించారు. అక్కడ ప్రహరీని ఆనుకొని చెట్లు చేమలు, చెత్తా చెదారం ఉన్నాయి. అక్కడే ఓ చెట్టుకింద ఉన్న శవపేటిక దగ్గరికి తీసికెళ్ళారు. దూరం నుంచే దాన్ని చూచి రాజేశ్వరి, పద్మ పెద్ద పెట్టున ఏడ్చారు. దిక్కులేని శవంలాగా వదిలేశారని దుఃఖపడ్డారు. అంత వరకు అక్కడున్న కొత్త వాతావరణానికి భయం భయంగా ఉన్న రాజేశ్వరి అడిషనల్ ఎస్‌పిని తిట్టడం మొదలుపెట్టింది. ఆ మాటలు ఆయనకు అర్థం కాకపోయినా తనను సాపిస్తోందని తెలిసినట్టే ఉంది. ముగ్గురు ఆదివాసులు వచ్చి ఆ పెట్టె మూత తీశారు.

ఒక్కసారిగా దుర్గంధం బైటికి ఎగజిమ్మింది. దాంతో అందరికీ కళ్ళు మండిపోతున్నట్లనిపించింది. అయిదు నిమిషాలపాటు ఎవ్వరం అటువైపు వెళ్ళలేకపోయాం. మొదట మల్లారెడ్డే ప్రాణం ఆగక దగ్గరికి వెళ్ళాడు. ఆ తర్వాత మేమూ కదిలాం.

ఆ పెట్టె నిండా పసుపురంగు నురగ నిండిపోయి ఉంది. ఉబికి బుడగలు చిట్లిపోతూ మెల్లగా పాల్తీన్ కవర్‌లో చుట్టిపెట్టిన శవం కనిపించింది.

ముఖం చూపించండి అని అడిగాం.

ఎంఆర్‌వో ఆదివాసులవైపు చూశాడు. వాళ్ళు ఒక పొడవాటి కర్ర తీసుకొని ముఖం మీద ఉన్న పాల్తీన్ పొరలను తొలగించారు. నల్లటి గుండ్రటి బంతిలా తల కనిపించింది. మనిషిని పోల్చుకోడానికి ముఖం కనిపించడం లేదు.

ఏం గుర్తు పట్టాలి?

మల్లారెడ్డి గొల్లున ఏడ్చాడు. ఆయన ఈ ప్రయాణం మొదలైనప్పటి నుంచి దుఃఖంతో ఉన్నట్టు కనిపిస్తున్నాడు గాని ఇప్పుడు ఇక కట్టలు తెంచుకున్నది. రాజేశ్వరి, పద్మ కూడా గుండెలు అవిసేలా రోదించారు. రాజిరెడ్డి ఓ పక్కన నిలబడి మౌనంగా ఏడుస్తున్నాడు. అయిదు రోజుల నుంచి ఆరాటపడుతూ, మూడు రోజులపాటు ప్రయాణం చేసి వచ్చింది ఇట్లా చూడడానికా? అని వలపోసుకున్నారు. మనిషి శవం ఇట్లా ఉంటుందా? అనే వ్యథతో వాళ్ళు తట్టుకోలేకపోయారు.

శవపేటిక చుట్టూ తిరుగుతూ మల్లారెడ్డి చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. మనిషికి ఇలాంటి స్థితి కూడా వస్తుందని వాళ్ళు ఎన్నడూ ఊహించి ఉండరు. కానీ విప్లవకారులు కుటుంబ సభ్యులను ఇది వెంటాడుతూనే ఉంటుంది. వాళ్ళు ఏడ్చిఏడ్చి అలిసిపోయారు.

అక్కడ ఉండలేక కొంచెం పక్కకు కదిలాం. మల్లారెడ్డి మాత్రం అక్కడి నుండి రావడానికి ఇష్టపడడం లేదు. పాతికేళ్ళ కింద ఎడమైపోయిన తమ్ముడు... ఇంకొంచెం సేపట్లో ఈ ఆనవాలు కూడా కనిపించకుండాపోతుంది కదా... అన్నదమ్ములుగా ఇన్నేళ్ళపాటు ఎవరిదారిలో వాళ్ళు బతికినా ఈ మరణంతో ఇక ఆ బంధం ముగిసిపోయినట్టే కదా... ఇద్దరు తమ్ముళ్ళు ఇలాంటి దుస్థితిలోనే శవాలై కనిపించారు. ఆయన్ను అదే కుంగదీస్తోంది.

నేను, శాంత వెళ్ళి ఆయన్ను పట్టుకొని ఇవతలికి తీసుకొచ్చాం.

మనిషి స్పర్శ తగలగానే ఆయన మరింతగా ఏడ్చేశాడు. రాజేశ్వరి లేచి వచ్చి భర్తను చేతుల్లోకి తీసుకున్నది. పద్మ కూడా వచ్చింది. వాళ్ళట్లా ఒకళ్ళమీద ఒకరు పడి రోదించడం గుండెలు పిండేసింది. ఎక్కడలేని నిస్సత్తువ మమ్మల్ని ఆవహించింది. అక్కడే గోడకు చేరగిల పడ్డాను. ఒకరిద్దరు ఆదివాసీ మహిళలు నా దగ్గరికి వచ్చి.. వీళ్లు చనిపోయిన ఆయనకు ఏమవుతారు? అని అడిగారు.

నేను చెప్పాను.

మొన్న మూడురోజుల కిందట కూడా ఇతనితోపాటే చనిపోయిన గంగులూరు అబ్బాయి శవం కోసం అతడి అమ్మా నాయినలు వచ్చారు. వాళ్ళకు శవం ఇవ్వకుండా పోలీసులే పూడ్చేశారు. వాళ్ళను పోలీసులు భయపెట్టి దగ్గరికి కూడా రానివ్వలేదు. వాళ్ళు మా జాతివాళ్ళే... అన్నారు.

మా మాటలు వింటున్న ఓ విలేఖరితో వీళ్లది ఏ ఊరని అడిగాను. ఆయన చెప్పింది విని ఆశ్చర్యపోయాను. వాళ్లను బీజాపూర్ బేస్ క్యాంపులో బలవంతంగా ఉంచారని, జుడుం రద్దయ్యాక చాలా మంది తిరిగి గూడేలకు వెళ్లిపోతే... ఇక్కడే ఉండిపోయిన వాళ్లకు ప్రభుత్వం హాస్పెటల్ వెనుకే ఫారెస్టు భూమిని పంచి, ఇళ్లు కట్టించి ఇచ్చిందని చెప్పాడు.

అయితే ఇందాక ఇక్కడికి నడిచి వస్తున్నప్పుడు ఇంకో శవం ఏమైంది? అని నేను అడిషనల్ ఎస్‌పిని అడిగాను. దానికి ఆయన.. వాళ్ల బంధువులు వచ్చి తీసికెళ్ళారు... అని చెప్పాడు.

సాంబిరెడ్డి శవాన్ని ఈ స్థితిలో తీసికెళ్ళలేమని అందరికీ అర్థమైపోయింది. అంత్యక్రియలు ఇక్కడే చేస్తామని చెప్పాం. ఎంఆర్‌వో ఏవో హిందీలో రాసుకుని మా అందరితో సంతకాలు తీసుకున్నాడు. మల్లారెడ్డి తన తమ్ముడి శవం ఆనవాళ్ళు గుర్తుపట్టినట్లు రాసుకున్నారు.

అందులో ఏముంది? అని అడిగారు అంజమ్మ, శాంత.

మనం శవం ఆనవాళ్ళను పోల్చుకున్నట్లు రాశారు అన్నాను. వీళ్లు మనుషుల ఆనవాళ్ళు మిగలనిచ్చేవాళ్ళేనా? పోల్చుకోడానికి అన్నది అంజమ్మ. అంత్యక్రియలకు కావాల్సిన కొన్ని వస్తువులు తేవడానికి వాళ్లిద్దరూ అంబులెన్స్‌లో ఊళ్ళోకి వెళ్ళారు.

మధ్యమధ్యలో కాసేపు ఆగినా రాజేశ్వరి, పద్మ పోలీసులను శాపనార్థాలు పెడుతూనే ఉన్నారు.

పోలీస్ స్టేషన్ ముందున్న చెరువుకట్ట దగ్గరికి శవాన్ని తరలించారు. మేం ఆ ఊళ్ళో దిగినప్పటి నుంచి చెరువుకట్ట దగ్గరికి చేరుకునే వరకు అడుగడుగున సాల్వాజుడుం వాళ్ళు, సి-60 కమేండోస్, ఇంటలిజెన్స్ పోలీసులు మా చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

చెరువు కట్ట దగ్గర ప్రోక్లెయినర్ వచ్చి గుంత తవ్వింది. అంతక ముందు కూడా అక్కడ ఇట్లాగే గుంతలు తీసి శవాలను పూడ్చేసిన ఆనవాళ్ళు కనిపిస్తున్నాయి. మామూలుగా మనుషులు గుంతలు తీసి, శవాలను పూడ్చినట్టు కనిపించడం లేదు. ఆ పక్కన దూరంలో ఒక సమాధి ఉంది. దానికి ఏదో శిలాఫలకం కూడా ఉంది. ఈ తవ్వి పూడ్చిన గుంతల్లో ఎన్ని శవాలు ఉన్నాయో.... ఎంత మంది సాంబిరెడ్డిలాంటి వాళ్ళున్నారో... అనిపించింది.

శవాన్ని కడిగించి పూడ్చాలని మల్లారెడ్డి అన్నాడు. కుళ్ళిపోయి, పురుగులుపట్టిన మృతదేహాన్ని అట్లాగే పూడ్చడానికి ఆయనకు మనసు వొప్పుకోలేదు. చివరి జ్ఞాపకం ఇంత దయనీయంగా ఉండకూడదని ఆయన మనసు ఘోషించింది.

హాస్పిటల్ స్వీపర్, ఓ నలుగురు ఆదివాసులు పనిలోకి దిగారు. పెట్టెలో నుంచి బైటికి తీయడానికి శవం వీలుగా లేదు. ఏం చేయాలో వాళ్ళకు కాసేపు అర్థం కాలేదు. శవానికి కాళ్ళవైపు పెట్టెకు ఉన్న చెక్క తొలగించి, మృతదేహం మీద నీళ్ళు పోశారు. పైన నీళ్ళు పోస్తుంటే కింది నుంచి నురగ ప్రవాహంలాగా వచ్చేసింది. దాంతోపాటు పురుగులు కుప్పలు కుప్పలుగా కలిసిపోతున్నాయి.

దాన్ని చూడడం వల్ల కాలేదు.

మల్లారెడ్డి, రాజారెడ్డి తెల్లని వస్త్రం కప్పారు.

ఆపైన అంజమ్మ, శాంత, నేనూ ఎర్రబట్ట కప్పి జోహార్లు చెప్పాం.

మేం జోహార్లు చెప్తోంటే-అలవాటు లేకపోయినా, గొంతు దుఃఖంతో పూడుకపోతున్నా మల్లారెడ్డి, రాజేశ్వరి, పద్మ అందుకున్నారు. ఆ తర్వాత సెంటు చల్లి, పూలమాల వేశాం. ఆ పెట్టెను అట్లాగే గోతిలోకి దించారు.

తలా పడికెడు మట్టి వేశాం.

రాజేశ్వరి మరో పిడికెడు మట్టి తీసి అంత దూరంలో నిలబడి ఉన్న పోలీసుల వైపు చల్లింది. నేల మీద అరచేతులతో చరిచింది.

* * *

నాలుగంటలప్పుడు బరువెక్కిన గుండెలతో తిరుగు ముఖం పట్టాం. ఏం తీసికెళ్లాలని ఇంత దూరం వచ్చాం? ఎన్నేళ్ళ కిందనో దూరమైపోయిన మనిషి ఈ అడవిలో నూతన మానవుడి సృష్టికోసం పరితపించి యుద్ధంలో ఒరిగిపోయాడు. ఇంత దూరం వచ్చినా రక్త సంబంధీకులకు ఇక్కడ ఏం దొరికింది? ఈ బరువైన అనుభవం తప్ప.

అక్కడి విలేఖర్లు ఒక మాట అన్నారు. ఇది పోలీస్ జిల్లా. ఎన్‌కౌంటర్ మృతదేహం కోసం అంతదూరం నుంచి ఇక్కడికి వచ్చి పోలీస్ స్టేషన్ ఎదుటే ఇంత గౌరవంగా అంతిమ సంస్కారం జరపడం మా బీజాపూర్లో ఇదే మొదటిసారి.. అన్నారు.

మా తిరుగు ప్రయాణంలో మా వాహనాన్ని రెండు స్కూటర్ల మీద సాల్వాజుడుం మనుషులు వెంబడించారు. ఈసారి మేం ఇంద్రావతి నదిని దాటి భద్రకాళి మీదుగా భద్రాచలం వెళ్ళాలనుకున్నాం. భద్రకాళి దగ్గరే ఇంద్రావతి, గోదావరి సంగమం ఉంటుంది. ఇందులో నుంచి వచ్చే ఒకపాయను చింతవాగునాల అని పిలుస్తారు. అక్కడే నదిని దాటాలి. అయితే ఈ దారిలో సీఆర్పీఎఫ్ ట్రైనింగ్ క్యాంపును, బీజాపూర్ బేస్ క్యాంపునూ కూడా దాటుకొని వెళ్లక తప్పదు. అందుకనే వచ్చేటప్పుడు ఆ మార్గాన్ని ఎంచుకున్నాం. ఎందుకో మరి తిరుగు ప్రయాణం ఈ దారిలోనే పోదామని అనుకున్నాం. ఈ దారి దగ్గర కూడా. అందరం స్మశాన వైరాగ్యాన్ని మోస్తూ అలిసిపోయాం. మమ్మల్ని నిస్సత్తువ ఆవహించింది. ఇక జాగ్రత్తలు పాటించాలనే ఆలోచనే కలగలేదు. ఇంతకంటే జరిగేదేముంది? అన్నట్లుగా ఈ దారి ఎన్నుకున్నాం.

కొద్దిదూరం వెళ్ళాక సాల్వాజుడుం క్యాంపు వచ్చింది. దీన్ని బీజాపూర్ క్యాంపు అని కూడా అంటారు. దాని చుట్టూ కంచె ఉంది. దానికి టార్పాలిన్ కట్టారు. దాని గేటు దాటుకొని వెళ్తున్నప్పుడు లోపల చాలా పెద్ద సంఖ్యలో మిలటరీ వాళ్ళు ఉన్నట్లు కనిపించింది.

అక్కడ మమ్మల్ని ఎవరూ అడ్డుకోలేదు. అయితే ఇలాంటివి ఎన్ని దాటుకోవాలో? అనిపించింది. రాత్రంతా ప్రయాణం చేద్దామని అనుకున్నాం. భూపాల్ పట్నం చేరుకోగానే తెలంగాణకు వచ్చినట్లనిపించింది. ఎందుకంటే అక్కడి తునికాకు, వెదురు, ఇసుక లారీల పనులకు తెలంగాణ, ఆంధ్రా ప్రాంతాల నుండి చాలా మంది వెళ్తారు. చెన్నూరు ప్రాంతం నుంచి వెళ్లినవాళ్లలో రాజేశ్వరికి తెలిసినవాళ్ళు, దూరపు చుట్టాలు ఇక్కడ ఉన్నారు.

రాజేశ్వరి వాళ్ళను గుర్తు చేసుకున్నది. మా వాహనం ఆ ఊరు దాటబోతోంటే ఒక వ్యక్తి వచ్చి ఆపాడు. బీజాపూర్ విలేఖరి ఒకాయన తనకు నా ఫోన్ నెంబర్ ఇచ్చాడట. దారిలో ఏవైనా అవసరాలు ఉంటాయేమో కలసి మాట్లాడమని చెప్పాడట. నీళ్ళ సీసాలు, తినుబండారాలు, పండ్లు ఇచ్చాడు. ఆయన పేరు కాశీంభాయ్.

ఈ రాత్రికి ఇక్కడే ఉండి పొద్దున్నే వెళ్తే బాగుంటుందని కాశీంభాయ్ అన్నాడు. కానీ మాకు వెళ్ళిపోవాలని ఉంది. మా మూడ్ గమనించి ఆయన.. ఒక్క నిమిషం ఆగండి. నదిలో మీ వాహనం చిక్కుకొని పోయే ప్రమాదం ఉంది. ఏదైనా ట్రాక్టర్ ఉంటేగాని బయటపడలేరు.. అని ఎవరికో ఫోన్ చేయడం... ట్రాక్టర్ రెడీ కావడం అంతా నిమిషాల్లో జరిగిపోయింది.

కాశీంభాయ్ మా వాహనం ఎక్కాడు. వెనుక ట్రాక్టర్. మేం నేరుగా ఆ దారెంట వెళ్లి ఉంటే ఇబ్బంది పడిపోయి ఉండేవాళ్ళం. సిరొంచ మీదుగా చెన్నూరు వెళ్ళేదారి అది. అక్కడ వంతెన లేకపోవడంతో ప్రాణహితలో పడవ ప్రయాణం తప్ప వేరే దారి లేదు. అందుకని ఆయన మమ్మల్ని వేరే దారిలో తీసుకెళ్ళాడు. అది చింతవాగునాల గుండా భద్రాచలం వెళ్ళే మార్గం. ఈ దారిలో కూడా మాకు కష్టాలు తప్పలేదు-వాహనం నదిలో ఇరుక్కుపోయింది. అప్పటికే బాగా చీకట్లు ముసురుకున్నాయి. పగటిపూట అహ్లాదాన్ని పంచే అడవి ఆ రాత్రి భయపెడుతోంది. ఎత్తయిన ప్రాంతం నుంచి నదిలోకి దిగాం. మాకంటే ముందు అటుగా వాళ్తూ నదిలో చిక్కుకపోయిన బియ్యం లారీల వాళ్ళు అక్కడే ఇసుకలో పొయ్యిపెట్టుకొని వంట చేసుకున్నారు. వాళ్ళు వేయించుకుని తింటున్న శనగలను తలా ఇన్ని ఇప్పించుకుని తింటూ నది దాటాం. కాశీంభాయ్ పక్కనే ఉన్న గూడెం వాళ్లను పిలుచుకొని వచ్చాడు. వాళ్లు మా అంబులెన్స్‌ను ఒడ్డుకు చేర్చారు.

ఆ తర్వాత కాశీంభాయ్ వాళ్లతోపాటే వెళ్లిపోయాడు.

ఆయన ఇచ్చిన తినుబండారాలే ఆ పూట మాకు ఆహారం.

అంబులెన్స్ బయలుదేరింది. ఆదివాసీల్లోని ఒక పెద్దాయన తను మాతోపాటే కొద్ది దూరం వస్తానని, తను అటే వెళ్లాలని అన్నాడు. ఆయన వెనుక వైపు ఎక్కాడు.

దారంతా చీకటే. రోడ్డు చాలా కష్టంగా ఉంది.

ఇటు వెళ్తే క్యాంపు వస్తుందట గదా? అని ఆ పెద్దాయన్ను అడిగాను.

ఉందిగాని, ఇప్పుడు ఏం ఇబ్బంది లేదమ్మా.. అని, ఈ దారి గుండా వెళ్తే భద్రాచలం వస్తుందని చెప్పాడు.

ఆ సంగతి తెలిసిందే అయినా సంతోష్‌కు ఊపు వచ్చింది.

తెల్లారే సరికల్లా ఊరు చేరుకుంటాం కదక్కా అన్నాడు.

మల్లారెడ్డి మాత్రం బండి ఎక్కినప్పటి నుంచి ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఆయన మనసు కకావికలంగా ఉన్నట్లు ఆయన ముఖమే చెప్తోంది.

దూరం నుంచి మిణుకు మిణుకుమంటూ వెలుతురు కనిపించింది.

ఆదివాసీ పెద్దాయన.. మా ఊరు వచ్చింది .. బండి ఆపండి అన్నాడు. మేం కళ్లు మిటకరించి చూసినా అక్కడ ఊరు కనిపించలేదు. ఆయన ఆ చీకట్లోనే కలిసిపోయాడు. మళ్లీ వాహనం బయల్దేరింది. ఆ రోడ్డు అధ్వాన్నంగా ఉండటంతో సంతోష్ మెల్లగా నడుపుతున్నా బండ్లో అందరం కిందా మీద పడుతున్నాం. ఆదివాసీ పెద్దాయన దిగిపోయాక ఏదో భయం అనిపించసాగింది. ఎవ్వరూ ఏం మాట్లాడటం లేదు. వాహనం వెళ్తున్న శబ్దమే మా చెవుల్లో జియ్‌మంటోంది. అంతెత్తున కనిపిస్తున్న చెట్లు భయం గొలుపుతున్నాయి. రోడ్డు మీద నాలుగైదు సార్లు ఏవో జంతువులు అటూ ఇటూ తిరిగాయి. అడవిలో ఆకు కదిలినా తుపాకుల మోగుతాయనే మాటలు గుర్తుకు వచ్చాయి.

ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ ..

ఈ రోడ్డంతా ఇట్లే ఉంటే రాత్రంతా జర్నీ చేసినా భద్రాచలం చేరుకోలేం.. అన్నాను. అయితే నేను ఆలోచిస్తున్నది దీని గురించి కాదు. ఒక వేళ క్యాంపు దగ్గర ఆపితే ఏం చేయాలి? అని.

భూపాలపట్నంలో బంధువుల ఇంటికి వచ్చామని, వరంగల్ తిరిగి పోతున్నామని, లోపల పేషెంట్ ఉన్నాడని చెప్పాలనుకున్నాం.

మేం ఇది మాట్లాడుకుంటుండగానే ఎక్కడి నుంచో కేకలు వినిపించాయి. హిందీలో అరుస్తున్నారు. సంతోష్ స్పీడ్ బ్రేక్ వేశాడు.. అంబులెన్స్‌లో మిగతా లైట్లు కూడా వెలిగాయి. క్యాంపు లోపలి నుంచి కొందరు మగవాళ్లు గేటు దాకా వచ్చారు. సంతోష్‌కు పేపర్లు ఇచ్చి లోపలికి పంపించాం.

అతను లోపల ఉండగానే ఒక కానిస్టేబుల్, ఇద్దరు జుడుం వాళ్లు మా దగ్గరికి వచ్చి వాహనాన్ని చెక్ చేశారు. ఇంతలో సంతోష్‌తోపాటు మరో పోలీసు బయటికి వచ్చాడు. వాళ్లందరి నుంచి ఘాటైన గుడుంబా వాసన వస్తోంది. దానికి మా తల తిరిగినంత పనైంది. అంతలో అనుకున్నట్లే రాజేశ్వరి ఏడుపు మొదలుపెట్టింది. మా ఆయనకు బాగాలేదు. ఆస్పత్రికి పోవాలి.. వదిలేయమని ఏడుస్తూ బతిమిలాడింది.

అంబులెన్స్‌కు ఎర్రలైటు ఉన్నందుకు ఫైన్ వేస్తామని కానిస్టేబుళ్లు బెదిరించారు. మా ఫోన్లు లాక్కొని నంబర్లు చూశారు. ఏవేవో ప్రశ్నలతో వేధించడం మొదలు పెట్టారు. చివరికి అసలు విషయం చెప్పాం. బీజాపూర్, సుక్మా ఎస్పీలకు మేం రావడం తెలుసని, వాళ్లతో మాట్లాడిన ఫోన్ నెంబర్లు కూడా చూపించాను.

వాళ్లు పక్కకు వెళ్లి మాట్లాడుకున్నారు. పోలీసులు మౌనంగా ఉండిపోయినా, జుడుం వాళ్లు మాత్రం మా నుంచి డబ్బులు గుంజుకోవాలని చూశారు. ఇంకా ముందుకు వెళ్తే తాళ్లగూడా దగ్గర ఇంకో క్యాంపు ఉంది.. అక్కడ ఫైర్ చేస్తారని బెదిరించారు.

ఆ రాత్రి.. ఆ చీకటి..వాళ్ల మాటలకు అందరికీ భయం కలిగింది. కానీ ఏం చేయాలి? అయితే అక్కడి దాకా మీదే రండి.. అని నేను మొండిగా అడిగాను. ఇదేం పరిష్కారం! అని నాకు ఆ క్షణాన అనిపించలేదు. నా మాటలకు వాళ్లూ ఆశ్చర్యపోయినట్లే ఉంది.

ఈ రాత్రిపూట మేం నాలుగువందల మందిమి ఉన్నా క్యాంపు దాటి బయటికి రాం.. అని జుడుం నుంచి ఎస్పీవోలుగా మారిన వాళ్లు అన్నారు.

అసలు విషయం డబ్బులు అని అర్థమయ్యాక వాళ్లను పక్కకు తీసికెళ్లి మా దగ్గర ఉన్నవాటిల్లోంచి రెండు వందలు తీసి ఇచ్చాను. డబ్బు తీసుకొని ఒక ఎస్పీవో పోలీసుల దగ్గరికి వచ్చి.. ఆడవాళ్లు కదా.. పేషెంట్ కూడా ఉన్నాడు కాబట్టి వదిలేద్దాం అన్నాడు.

వాడి కపటానికి ఆ స్థితిలో కూడా మా అందరికీ నవ్వు వచ్చింది.

ఈ వ్యవహారం అంతా గంట పట్టింది.

క్యాంపు లోపలి నుంచి కంజిర మోత, పాటలు వినిపిస్తున్నాయి. ఈ బేస్‌క్యాంపులో ఆడవాళ్లను అత్యాచారం చేసి ఇంద్రావతి నదిలో పారేస్తారనే వార్తలు గుర్తుకు వచ్చాయి. ఇక్కడ ఒక గంట గడపడానికే ఇంత భయంగా ఉంది కదా? ఈ క్యాంపుల మధ్యే ఆదివాసీ ఆడవాళ్లు ఎలా ఉంటున్నారు? అనిపించింది.

జుడుం వాళ్లు వదిలేయడంతో సంతోష్ బండి స్టార్ట్ చేశాడు.

ఈ మూడు రోజుల్లో అప్పుడప్పుడు అంబులెన్స్ ఓనర్ సంతోష్‌కు ఫోన్ చేస్తూనే ఉన్నాడు. అన్నా బండిని పూవుల్లో పెట్టి తీసుకొని వస్తా అని చెప్తున్న సంతోష్ ఇప్పుడు ఆ సంగతి పూర్తిగా మర్చిపోయాడు. జేమ్స్‌బాండ్‌లాగా బండి నడిపిస్తున్నాడు. ఆ రోడ్డు మీద, ఆ వేగానికి బండి కుదేలైపోతోంది. ఎక్కడి భాగాలు అక్కడే ఊడిపోతాయా? అనిపిస్తోంది. లోపల మేం సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోంది. అయినా మేం ఎవరం కూడా కొంచెం మెల్లగా పోనియ్ అనలేకపోయాం. రోడ్డు చీలిపోతున్న చోట భారీ వాహనాల టైర్ల గుర్తుల ప్రకారం బండిని పోనిస్తున్నాడు. మా అందరికీ తాళ్లగూడెం క్యాంపు ఒక భూతంలా వెంటాడుతోంది. దారిలో ఏదైనా గూడెం వస్తుందేమో అని ఎదురు చూడసాగాం. ఎంతకూ అడవి చిక్కదనం తగ్గడం లేదు. దట్టంగా ఆవరించి ఉన్న అడవిని అంబులెన్స్ చీల్చుకొని వెళ్తోంది. క్షణాలు యుగాలుగా గడవడం అంటే ఏంటో అనుభవంలోకి వస్తోంది. ఒకరితో ఒకరు మాట్లాడే సాహసం చేయలేకపోతున్నాం. దారికి అడ్డంగా ఒక కుందేలు వచ్చింది. వాహనం బ్రేక్ పడటంతో అందరం అప్రమత్తం అయ్యాం.

ఆ తర్వాత అడ్డ రోడ్డు వచ్చింది. ఎటువైపు వెళ్లాలో తోచలేదు. ఎటు వెళ్లినా ఏదో ఒక క్యాంపుకు చేరుకుంటాం.. అనుకున్నాం. సంతోష్ ఎడం వైపు తిప్పాడు. అంతకంటే చెప్పడానికి ఎవ్వరికీ ఏమీ తెలియదు. అట్లా ఓ గంట ప్రయాణం. అందరి ఆలోచనలు కుటుంబాల చుట్టూ, పిల్లల చుట్టూ తిరిగి మళ్లీ వెనక్కి వస్తున్నాయి. రాత్రి ఇంత భారంగా ఉంటుందని ఎన్నడూ అనుభవంలోకి రాలేదు. కిటికీ లోంచి చల్లటిగాలి వీస్తున్నా అందరం తడిసి ముద్దవుతున్నాం. సంతోష్ అయితే నుదుటి మీద చెమటను తుడుచుకోకుండా ఆ అడవి మార్గంలోని మలుపుల్లో స్టీరింగ్ తిప్పుతున్నాడు.

ఓ మలుపులో దారికి అడ్డంగా చెట్టు పడి ఉంది. దాన్ని చూసి బెంబేలెత్తాం. సంతోష్ మాత్రం పక్కనే ఉన్న సన్నని బాట గుండా వాహనం ఒక వైపు చక్రాలను పైకి లేపి ముందుకు తీసుకపోయాడు. ఆ కుదుపుకు వెనుక కూర్చున్నవాళ్లంతా కుప్పకూలిపోయారు.

మరో పది నిమిషాలయ్యాక రోడ్డుకు ఇరువైపులా పొలాలకు కంచె కట్టినట్టు కనిపించింది. అందరికీ చెప్పలేనంత సంతోషం కలిగింది. ఏదో గ్రామం వచ్చినట్లుంది అని సంతోష్‌తో అన్నాను.మరో మలుపు తిరిగే సరికి లైటు కనిపించింది. దాని కిందే ఇల్లు కనిపించింది. అది ఒక ఆదివాసీ గ్రామం. అందరికీ ప్రాణం లేచివచ్చినట్లయింది . వాహనం సరాసరి ఆ ఇంటి ముందు ఆగింది.

ఆ ఇంటి ముందు కొద్ది మంది యువకులు నిలబడి ఉన్నారు. అంబులెన్స్ నుంచి అందరూ కిందికి దిగాం. ఆ యువకుల దగ్గరికి

వెళ్లి, భద్రాచలం వెళ్తున్నాం.. చీకట్లో దారి తప్పుతామని భయంగా ఉంది.. ఈ రాత్రికి ఇక్కడ ఉండేందుకు వీలుందా? అని అడిగాను.

వాళ్ల సమాధానం కోసం చూడకుండానే అక్కడున్న అరుగుల మీదికి ఆడవాళ్లం చేరాం. గడపలో కూర్చోని టీవీ చూస్తున్న ఆదివాసీ ఆడవాళ్లు మమ్మల్ని ఓసారి చూసీ చూడనట్లు టీవీ చూడటంలో మునిగిపోయారు. ఎందుకో వాళ్లు అదోరకంగా ఉన్నట్టనిపించింది. నా వెనుకాలే ఉన్న రాజేశ్వరి లేచి వాకిలి దాకా వెళ్లి అక్కడున్న ఆడామె కాళ్ల మీద పడిపోయి, ఈ రాత్రికి ఇక్కడే ఉండనివ్వండి.. అని ప్రాధేయపడింది.

నాకు ఆ సన్నివేశం చాలా చిత్రంగా తోచింది.

ఆమె తానేంటో మర్చిపోయినట్టుంది. తానో శరణార్థి వలె ఆ ఆదివాసీ ఆడామెను వేడుకుంది. నేను ఆ ఇంట్లోపలికి పరీక్షగా చూస్తే అదొక సారా కొట్టు మాదిరి కనిపించింది. ఇప్పపువ్వు వాసన గుప్పున వచ్చింది. ఆ మహిళలు బాగా తాగి ఉన్నట్లుంది. మా పరిస్థితి గమనించిన మగవాళ్లు.. ఇక్కడ ఉండేందుకు బాగా లేదుగాని, పక్కనే ఉన్న ఇంట్లో పడుకుందురు రండి .. అని దారి చూపారు. మల్లారెడ్డి, రాజిరెడ్డి మాతోపాటే నడిచారు. అంబులెన్స్‌ను ఆ ఇంటి సందులో చీకట్లో పెట్టమని సంతోష్‌కు చెప్పాను.

ఆ ఇంటి గడపకు ఇరువైపులా విశాలమైన అరుగులు, ఒక వైపు ధాన్యపు గిద్దలు ఉన్నాయి. మాతో వచ్చిన మగవాళ్లు ఆ ఇంట్లో ఉన్న ఆడామెకు ఏదో చెప్పి వెళ్లిపోయారు. ఆమె మమ్మల్ని ఆప్యాయంగా ఆహ్వానించింది. ఆమె చాలా సౌమ్యంగా కనిపించింది. లోపల వాళ్లాయన భోజనం చేస్తున్నాడు.

ఎక్కడికి వెళ్తున్నారు? అని ఆమె మమ్మల్ని అడిగింది. భద్రాచలం వెళ్తున్నామని చెప్పాం. ఆమె అడగకపోయినా ఈ రాత్రి వెళ్లడం భయంగా ఉందని, పొద్దున్నే లేచి వెళ్తామని చెప్పాం.

అన్నం తింటారా అని అడిగింది. వద్దని అనడంతో ఆమె టీ ఇచ్చింది. నున్నగా అలికిన నేల మీద కొందరు కూచోబోతే ఆమె వారించి చద్దరు ఇచ్చింది.

టీ తాగుతూ నేను అరుగు మీద కూర్చోగానే పక్క నుంచే టార్చిలైట్ల వెలుతురు కనిపించింది. ఆ చీకట్లో అవి పక్కనే వెలుగుతున్నట్లనిపించింది. వెంటనే అరుగు మీద ఉన్న వాళ్లం లోపలికి వెళ్లాం. అప్పుడే సేద తీరుతున్నామనిపించిందిగాని, ఈ లైట్లు పడటంతో మళ్లీ ఆందోళన మొదలైంది.

కొన్ని నిమిషాలయ్యాక, ఇంతకూ అదేమిటో కనుక్కోవాలనిపించింది.

ఆదివాసీ ఆడామె పక్కనే కూర్చొని ఏం పేరక్కా అని అడిగాను. అంత వరకు ఆమె తనతో మాట్లాడే అవకాశమే ఇవ్వలేదు.

మల్లక్క అని చెప్పింది.

సంకోచంగానే.. ఆ లైట్లు ఏంది అని అడిగాను.

ఇంతలో ఆమె భర్త కూడా మా దగ్గరికి వచ్చాడు. ఆ లైట్లు తాళ్లగూడెం క్యాంపు నుంచి పడ్డాయి... మీ వాహనం లైట్లు చూసి క్యాంపు నుంచి సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్ జవాన్లు పొజిషన్ తీసుకొని అలా కంచె దగ్గరికి వచ్చి ఉంటారని చెప్పారు. వాళ్లకు అనుమానం వస్తే ఒక్కోసారి ఫైరింగ్ కూడా చేస్తారని ఆ ఇంటాయన చెప్పాడు. లైట్లు ఆగిపోయాయి కదా.. ఇంక ఇటు రాకపోవచ్చు. అప్పుడప్పుడు పత్తి పంట తీసుకపోవడానికి ట్రాక్టర్లు వస్తుంటాయి...అవే అనుకొని ఉండొచ్చు.. అని మల్లక్క చెప్పింది.

ఏందీ..నేరుగా తాళ్లగూడెం క్యాంపు పక్కకే వచ్చామా? ఈ రాత్రి ఎలా గడుస్తుందో? వాళ్లు మళ్లీ రారని గ్యారెంటీ ఎంది? అనే సందేహంతో ఎక్కడివాళ్లం అక్కడే గువ్వల్లా ఒరిగిపోయాం. అంత అలసటలో కూడా ఆ రాత్రి ఎవరూ నిద్ర పోయినట్లు లేదు. మెలకువతోనే ఉన్నట్లు మధ్య మధ్యలో అలికిడి అవుతూనే ఉంది. ఇంత దూరం ప్రయాణించి చివరికి క్యాంపు పక్కనే ఈ రాత్రి గడపాల్సి వచ్చిందేమిటి? అనే ఆందోళన. అయినా ఏమీ చేయడానికి లేదు.

ఆ ఇంటి వాళ్లు చెప్పిన మాటలే రొదపెడుతున్నాయి.

వేకువజాము కోసం ఎదురు చూడటం చాలా కష్టమైపోయింది. ఆరుగంటలకల్లా బయల్దేరాం. క్యాంపు దాటాం. సంతోష్ వాహనం శరవేగం మీద ఉన్నాడు. అడవి పల్చగా కనిపిస్తోంది. దారి ఫర్వాలేదు. ఏదో ఆహ్లాదం.. గుండె నిబ్బరం. గోదావరి మీది గాలి వీస్తున్నట్లుంది.

'82వ పేజీ తరువాయి)

తను అడిగాడు. నేను చెప్పాను. తన రియాక్షన్ ఏమిటి? ఇప్పుడైతే నాకు ఏమీ గుర్తు రావడం లేదు. చాలా మందికి వున్న ఇబ్బంది కావచ్చు. కానీ నాకు తెలుసు మాట్లాడాల్సిన చోట మాట్లాడి వుంటాడు. ఒక్కొక్క సారి అనిపించేది తను కూడా మిగతా కొందరిలాగా, 'ఇదో చిన్న విషయం. ఇంత పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని' అనుకుంటున్నాడా' అని.

కానీ అది సందేహం మాత్రమేనని చాలా సంవత్సరాల తర్వాత ఒక మిత్రుడి ద్వారా తెలిసింది. 'తను ఎంతో సఫర్ అయిందన్న దాంట్లో సందేహమే లేదు. ఆ సంఘటనల నేపథ్యంలోనే స్వయం విమర్శ చేసుకున్నాం. డాక్యుమెంట్లలో కూడా రాసుకున్నాం - పితృస్వామిక ధోరణులను ఎలా అధిగమించాలని,' అన్నాడని, నా గురించి అడిగేక.

అంతే కాదు. అలాంటి విషయాలపై యుద్ధం చేస్తూనే, ప్రజా వుద్యమాల్లో వుండాలన్నాడట నన్ను. 'ఉద్యమాల్లో తప్పుడు ధోరణులుంటే గుర్తించాలి. నాయకత్వ దృష్టికి తీసుకురావాలి. చర్చ చెయ్యాలి. సమాజంలోని అవలక్షణాలు వుద్యమాల్లోకి వస్తుంటాయి. మనం వాటిని అధ్యయనం-ఆచరణతో సరిచేయాలి. మనం కాకపోతే ఎవరు చేస్తారు? బాధపడి వదిలేస్తే ఎలా? స్త్రీలపై అదనపు అణచివేత వుంటుందని మావో చెప్పాడు కదా. దీన్ని వదిలించడానికి అదనపు పోరాటం చెయ్యాలి కదా. అందుకే తను మన పనిలో చేరితే బాగుంటుందని అన్నాడట నా మిత్రుడితో,' అంది నీలిమ.

'అప్పుడప్పుడూ తన గురించి వినడం, పరోక్షంగా నా ప్రస్తావన తీసుకురావడం వింటూనే వున్నా. కానీ దాదాపు పదేళ్ళ తర్వాత విగత జీవుడై వ్యాన్ లో శవ పేటికలో వున్న తన శరీరాన్ని చూశాను. జీవచ్ఛవాలుగా మారుతున్న మనుషుల్ని కనిపెట్టుకుని, చేరదీసి, ధైర్యమిచ్చి మళ్ళీ మనుషుల్ని చేస్తున్నవీళ్ళని విగతులుగా మారుస్తున్న సమాజం ఏ రకమైన సమాజం అయివుంటుంది?' అన్నది నీలిమ.

కథ

మొదలు

- ఎన్.డి.

కాలింగ్ బెల్ కొట్టక ముందు చేతిలోని అడ్రస్‌ని మరోసారి సరి చూసుకున్నా. గుండె గొంతుకలోకి వచ్చినట్టు ఏదో ఉద్వేగం - 17 సంవత్సరాలు అంటే మాటలా? అప్పుడు చైతుకి ఎన్నేళ్లు? 7వ క్లాసులో వుండె. కనుక పన్నెండు లేదా పదమూడు అంతే. ఇప్పుడు ఇంత చిన్న వయసులోనే స్వంత ఫ్లాట్, కారు, సమాజంలో పెద్ద హోదా సంపాదించాడు. గుర్తు పడతాడా నన్నసలు?

కాలింగ్ బెల్ ఎప్పుడు నొక్కానో, తలుపు ఎప్పుడు తెరుచుకుందో? ఎదురుగా 30 ఏళ్ల లోపు ఓ యువతి - ప్రశ్నార్థకంగా చూస్తో.

'చైతన్య?'

'లేదండీ, ఫ్రెండింటికెళ్లాడు, అరగంటలో వస్తాడు గానీ వెంటనే ఆఫీసుకెళిపోతాడు. సాయంత్రం అయితే దొరుకుతాడు'

'ఇప్పుడు యింటికొచ్చే ఆఫీసుకు వెళతాడు కదా?'

యువతి తలూపింది.

'వెయిట్ చేస్తాను'

'లోపలకి రండి'

హాలులోకి ఆమె వెనుకే దారి తీశాను. సోఫాలో కూచోమని చెప్పి మంచినీళ్లు తెచ్చిచ్చింది. రెండు చుక్కలు తాగి టీపాయ్ మీద పెట్టేశాను.

'ఉదయం హడావుడి, సారీ, టీవీ చూస్తారా?' అని అడుగుతూనే పాత హిందీ సినిమా పాటలు వచ్చే ఛానెల్ ఏదో పెట్టి రిమోట్ చేతికిచ్చింది. ఆమె అటు తిరగగానే నేను శబ్దం తగ్గించి రిమోట్ పక్కన పెట్టేసి వార్తాపత్రికను చేతిలోకి తీసుకున్నా. హెడ్‌లైన్స్ తిరగేసి అదీ పక్కన పెట్టేశాను. దేని మీదా మనసు లగ్నం కావడం లేదు.

బొంగరంలా హడావుడిగా తిరుగుతోంది ఆమె ఏవో పనులతో. ఆ మధ్యలోనే టీ పెట్టుకుని వచ్చింది.

టీ తాగుతూ హాలునంతా కలియజూస్తున్నా. నిరాడంబరమైన అలంకరణ. షోకేసులో కనిపించిన ఫోటో దగ్గర కళ్లు టక్కున ఆగాయి.

శేఖరన్న, పుష్పక్క

సోఫానుంచి లేస్తుంటే కాళ్లు వణికాయి.

'బాత్రూంకి వెళ్తారా? ఇటు...' అంటూ దారి తీసింది ఆ యువతి.

నేను చూపులు తిప్పుకుని బాత్రూంలోకి వెళ్లాను. అద్దంలో ముఖం బాగా పీక్కుపోయి అలసటగా కనిపించింది. ముఖాన్నీ, నిండుతున్న కళ్లనూ కడుక్కుని హాల్లోకి వచ్చి ఫోటో దగ్గరకెళ్లి నుంచున్నా.

17 ఏళ్ల క్రితం అన్నతో, అక్కతో గడిపిన రోజుల జ్ఞాపకాలు...ఇక్కడకొస్తూ ప్రయాణంలో ఎన్నోసార్లు ఆ రోజుల్ని తలచుకుంటూనే వచ్చాను. ఆహా, వాటిలోనే జీవిస్తున్నా అనచ్చు చైతు దగ్గరకెళ్లచ్చు అనే నిర్ణయం అయినప్పటి నుండి.

'మైత్రీ, టీ తాగి పోతా, టైం లేదు...' హడావుడిగా, బిగ్గరగా వినిపించిన గొంతు. వెనక్కి తిరిగి చూశాను. చైతుని వెంటనే గుర్తు పట్టాను.

చెప్పులు విడిచి లోపలకు పోబోతున్నవాడల్లా అలాగే ఆగిపోయి నిర్ఘాంతపోయినట్టుగా నాకేసి చూస్తున్నాడు.

చిరునవ్వుతో చైతు దగ్గరకి నడిచాను.

'అక్కా, నువ్వు....ఇక్కడ..యెలా...ఎప్పుడొచ్చినవు...?' అంటూ దగ్గరకొచ్చాడు.

నేను ఆప్యాయంగా చైతు భుజం పట్టుకుంటూ, 'గుర్తుపట్టావా, పట్టవేమో అని భయపడ్డాను' అన్నా, మరోవైపు చైతు ముఖంలోని భావాలను పరిశీలనగా చూస్తూనే. అతని ముఖంలో ఆపుకోలేని ఉద్వేగం తొణికిసలాడుతోంది. నా చేయి పట్టుకుని సోఫాలోకి లాక్కుపోయినంత పని చేశాడు.

నా పక్కనే కూలబడి, 'ఎట్లా మర్చిపోతాననుకున్నవక్కా, ఎన్నేళ్లయిపోయింది, ఏంటిలా పాడైపోయావు? అసలు ఇది కలా? నిజమా?' చైతు మాటలకు తడబడుతున్నాడు.

నాకూ మాటలు దొరకడం లేదు. తల మీద నిమురుతూ, 'బాగానే వున్నా, అమ్మా, చెల్లీ... అంతా బాగున్నారా?'

'ఆ, బాగున్నారు, నాన్న...'

'విన్నా' అన్నా క్లుప్తంగా.

నా ముఖంలో దేని కోసమో వెతుకుతున్నట్టుగా చూపులతో తడుముతున్నాడు. ఒక్కక్షణం వాటిని తప్పుకోవడానికన్నట్టు చూపు తిప్పాను. వంటింటి గుమ్మంలో టీ కప్పు పట్టుకుని ఆశ్చర్యంగా మా ఇద్దరికేసీ చూస్తూ నిల్చుండిపోయి ఉన్నది యువతి.

స్పృహలోకి వచ్చినట్టుగా, 'మైత్రీ, నీకు చెప్పిన మాధవక్క ఈమే, అక్కా, మైత్రి' అన్నాడు చైతు పరిచయాలు చేస్తూ.

మైత్రి ఆశ్చర్యం నుండి తేరుకుని నవ్వి చైతు చేతికి టీ కప్పు అందించింది.

'మీ గురించి ఎప్పుడూ చెప్తూ వుండేవాడు పెళ్లయిన కొత్తల్లో...' ఎదురుగా కూచుంటూ అంది.

'ఇప్పుడు చెప్పడం లేదా అయితే...' నవ్వుతూ చైతుకేసి తిరిగాను.

ఇంకా నమ్మలేనట్టుగా నాకేసే చూస్తున్న చైతు నవ్వేసి చాయ్ నాకు అందించబోయాడు.

'తాగాను ఇప్పుడే'

'అది మైత్రి వంతు, ఇది నాది' అన్నాడు. మైత్రి ఇంకో కప్పు తెచ్చిచ్చింది. ఇద్దరం ఆ చాయ్‌నే సగం సగం తాగాం.

'మీ చాయ్ ఇష్టం గురించీ చెప్పాడు' అని నాతో అని 'ఏంటీ ఆఫీస్‌కు డుమ్మానా?' అని చైతుని ప్రశ్నించింది మైత్రి.

'అమ్మో, వెళ్లక తప్పదు, కానీ అక్కా, ఎట్ల, వుంటవు కదా?'

రెండు వేళ్లు చూపిస్తూ తలూపాను.

'హమ్మయ్య, మరి నేను పోతాను, సాయంత్రం వీలైనంత తొందరగా వస్తాను, మైత్రీ నువ్వు మరి?'

'నాకు హాఫ్‌డేనే ఇవాళ. కానీ ఆంటీ, మీరు వుండమంటే ఉంటాను'

'లేదమ్మా, వెళ్లి రండి, నేను ఉంటాను' అన్నా.

అప్పుడు అక్కా, అన్నా యిలాగే ఇంటిని నాకు వదిలేసి వెళ్లడం గుర్తొచ్చింది. ఇంటినేంటి పిల్లల్నీ వదిలేసి వెళిపోయేవారు. చైతు, సుమిత్ర ఎంత అల్లరిపిల్లలు. కానీ నా మాటని ఎంతగా వినేవారు...సుమీ గురించి అడగాలని వుంది కానీ వాళ్లిద్దరూ తయారయ్యే హడావుడిలో పడిపోయారు.

మైత్రి నాకు ఇంటినీ, యేవి ఎక్కడ వున్నాయో గబగబా పరిచయం చేసింది. ప్లేట్లో టిఫిన్ పెట్టేసింది. ఇద్దరూ 'బై అక్కా' 'బై ఆంటీ' అనుకుంటూ తుర్రుమన్నారు.

'ఎన్నాళ్లైందో వీళ్ల పెళ్లయ్యి, పిల్లలు లేనట్టున్నారు ఇంకా'. టిఫిన్ చూస్తుంటే రెండు రోజుల్నుండి సరిగా తినలేదని గుర్తొచ్చి హఠాత్తుగా ఆకలేసింది. కానీ ముందు ఫోన్ చేసి రావాలి.

ఇంటికి తాళం వేసి బజార్లోకి వెళ్లి రాఘవులుకి ఫోన్ చేసి, 'కలిశాడు, అంతా ఓకే. మళ్లీ రేపు ఫోన్ చేస్తా, ఇవాళిక్కడే వుంటా' అని చెప్పాను. ఎంతో ప్రమాదానికోర్చి నన్ను ఈ పట్టణం దాకా తీసుకువచ్చిన రాఘవులు గొంతులో ఊరట.

'ఏం సమస్య లేదు కదా, ఏమన్నా వుంటే ఫోన్ చేసి వచ్చేయి' అన్నాడు రెండుసార్లు ఒకలాంటి ఆత్రుతతో.

'ఏం లేదు' అని గట్టిగా హామినిచ్చి ఫోన్ పెట్టేశాను.

రాఘవులు ఆందోళన అర్థం చేసుకోదగినదే. వేయి కళ్లతో మా కోసం వేటాడుతున్న శత్రువు కళ్లు కప్పి ఈ సాహసానికి పాల్పడక తప్పలేదు. ఏదో ఒక రోజు చేయక తప్పని సాహసం. అంత ముఖ్యంగా భావించకపోతే పార్టీ నాయకత్వం నన్ను ఇంత నిప్పులు చెరిగే నిర్బంధ ప్రాంతానికి పంపకనే పోయేది. ఒకటా, రెండా...ఆరు నెలల నుండి ప్రయత్నాలు.

నేను వచ్చిన పని నిన్ననే అయిపోయింది. వీలైతే అని పెట్టుకున్న అదనపు పని చైతుని కలవడం. ఇవాళ రాత్రికి చైతుతో మాట్లాడి, పని ముగించుకుని రేపు సాయంత్రానికి బైల్దేరిపోతే బానే వుంటుంది. ఎక్కువ రోజులు 'బయట' వుండడమూ మంచిది కాదు. శేఖరన్న చనిపోయినా, చైతు వేరే ఇంట్లో వుంటున్నా చెప్పలేం ఎటు నుండి ప్రమాదం ముంచుకొస్తుందో.

ఆలోచనల్తోనే ఇల్లు చేరుకున్నా. టిఫిన్ తిని స్నానం చేసి ప్రయాణం మురికిని వదిలించుకున్నా. మైత్రి చెప్పినట్టే పని చేసే బాయి వచ్చి అంట్లు తోమి, బట్టలుతికి, ఇల్లూ, పొయ్యి గట్టూ తుడిచి, శుభ్రం చేసి, 'జా రహీ ఆంటీ, దర్వాజా బంద్ కరో' అంటూ వెళిపోయింది.

ఉన్న గంట సేపట్లో ఏవో కబుర్లు చెప్తూనే వుంది బాయి. నేను లేకుంటే పక్కింట్లో తాళాలు ఇచ్చి పోతుందట మైత్రి. మైత్రి తనను బాగా చూసుకుంటుందనీ, తనూ అంతే నమ్మకంగా పని చేస్తాననీ చెప్పింది. బాయి మాటల్లో మైత్రిని చూస్తూ ఆమె వ్యక్తిత్వాన్ని అంచనా కట్టే ప్రయత్నం చేశాను. 'అప్పుడూ' మధ్య, పై తరగతి మహిళల మనస్తత్వాల్ని అంచనా కట్టగల గీటురాళ్లలో నాకిది తప్పకుండా వుండేది. పని మనుషుల వద్ద వ్యక్తిత్వం దాగడం కష్టం.

నేను ఎవరు అనే కుతూహలం కూడా లేదు బాయికి! పట్టణాల్లో వుండే ఒక సౌకర్యం....

చాలా సంవత్సరాల తర్వాత టీవీలో వార్తలు చూసే అవకాశం. కానీ పావుగంటకే విసుగొచ్చింది. ఇంతలో మైత్రి రానే వచ్చింది. తనతో కబుర్లు చెప్పుకుంటూ తీరిగ్గా తిందామనుకున్నా.

నా కోసం అన్నీ తీసి పెట్టి, 'ఆంటీ, మీరు తినేయండి. మేం బచత్ గట్ పెట్టాలనుకున్నాం. అందరూ నన్నే ఎన్నుకున్నారు, ఆ కాయితాలు అవీ అన్నీ నేనే చూసుకోవాలి, పోతున్నా' అంది.

'మరి అన్నం?'

'బ్యాంకు దగ్గర క్యాంటీన్లో ఏమైనా తింటాలెండి' అంటూనే మాయమైంది.

'పొదుపు సంఘాల జోరు ఏరియాల్లోనే కాదు పట్టణాల్లోనూ అంతే వుందన్న మాట'

తిని పడుకున్నానంటే నాలుగింటి వరకు మెలకువే లేదు. మైత్రి ఇంకా జాడ లేదు.

టీ పెట్టుకుని వచ్చి టీవీలో ఛానెల్స్ మారుస్తూ వున్నా. చికాగ్గా తోచింది ఏది చూసినా. నిజంగా అడవిలో ఎంత కాలుష్యం నుండి, ఎన్ని రకాల కాలుష్యం నుండి మమ్మల్ని మేం కాపాడుకుంటున్నాం రోజువారీగా. శరీరానికే కాక మనసుకూ, చేతనకూ ఆక్సిజన్ అందించే అడవి!

'ఈ చెత్తను చూసే బుర్రల్ని బాగు చేయాలంటే పదిహేడేళ్ల నాటికంటే ఇంకెంత కష్టపడాలీ...' టీవీ బంద్ చేసి బాల్కనీలోకి వెళ్లా.

ఆకాశ హర్మ్యాల మధ్య నుండి, కాలుష్యం మధ్య నుండి చిరిగిపోయిన, వెలిసిపోయిన గుడ్డముక్కలా ఆకాశం. వాహనాల రొద కొద్దిగా దూరంగా. ఆ గల్లీలో చీమల్లా తిరుగుతున్న హడావుడి పట్టణజీవుల్ని చూస్తూ కూచున్నా. పట్టణ పేదల్లో పని చేసిన ఆనాటి రోజులు నా సుప్తచేతనలో శాశ్వతంగా నిక్షిప్తం అయిపోయాయేమో. ఇప్పటికీ ఎన్నిసార్లు కలలు వస్తాయి తిరిగి ఆ కార్మికుల్లో, ఆ బస్తీల్లో వాళ్లలో పని చేస్తున్నట్టు! ఈ కోట్లాది శ్రమజీవుల్ని విప్లవంలో భాగం చేయకుండా ఎలా? నష్టాల నుండి ఫీనిక్స్‌లా తిరిగి లేవాల్సిందే కదా! పార్టీ ముందు పెద్ద సవాలుగా నిలిచిన పట్టణోద్యమ నిర్మాణం.....

ఇన్ని గంటలైనా నేనింకా శేఖరన్న, పుష్పక్కల కొడుకు చైతు ఇంట్లో వున్నానంటే నమ్మశక్యంగా లేదు. చైతు అసలు ఇంట్లోకి రమ్మంటాడా లేదా అనే సందేహం కూడా తనకి లేకపోలేదు. కానీ నాలుగేళ్ల పాటు ఆ కుటుంబంతో ఏర్పడిన గాఢమైన అనుబంధం తనకి ఎక్కడో ఒక నమ్మకాన్ని కలిగిస్తూ వుండింది.

'మరీ అంతగా మారిపోయి వుండకపోవచ్చు చైతు'

పార్టీకున్న వనరుల నుండి సగం సగంగా అందిన సమాచారం ఏమంత ఆశాజనకంగా లేకుండింది. శేఖరన్న చనిపోయేనాటికే పిల్లలు పూర్తిగా పార్టీకి దూరంగా వుండేవాళ్లట. పుష్పక్కకు ఇష్టం వున్నా అన్న చనిపోయాక ఆమె అన్న వాళ్ల ఊరికి మకాం మార్చడంతో కాంటాక్టులో లేని స్థితి. రాష్ట్రంలో పార్టీ దెబ్బ తిని కలువలేని స్థితి. ఇలా ఎంతమంది వున్నారో! వాళ్ల భావాలేంటో తెలిసే అవకాశం లేదు.

బుర్రంతా ఆనాటి సంగతుల చుట్టూ, పని అవుతుందా లేదా, ఇప్పుడు చైతు ఏంటి, పుష్పక్కని కలవకుండానే తిరిగి పోవాల్సి వస్తుంది కదా అనే దిగులుతో గజిబిజిగా వుంది.

శేఖరన్న ఆప్యాయపు ప్రవర్తన, గలగల నవ్వు నాకు అన్ని సంవత్సరాలు ఎంత అండగా నిలిచాయో అవి లేకుండా పోయిన రోజుల్లో గానీ పూర్తిగా అర్థం కాలేదు. ఎక్కడ ఏ మూల నుండి ఏ పని కావాలని కబురు చేసినా కచ్చితంగా చేసేవాడు. పని జరగదు అనేదే వుండేది కాదు ఆయనకు అప్పజెప్పాక. పేరుకు పార్ట్‌టైమర్ పార్టీ సభ్యుడు గానీ ఏ పూర్తికాలం కార్యకర్తకూ తక్కువ కాకుండా పని చేశాడు. అప్పుడు ఈ పట్టణంలో, చుట్టుపక్కల సబర్బన్ ప్రాంతంలో అనేక

రంగాల్లో, అనేక ప్రాంతాల్లో ఇలాంటి పార్ట్ టైమర్ పార్టీ సభ్యుల నెట్‌వర్క్ వుండేది. అలాంటి కామ్రేడ్స్ అండదండలు లేకుంటే నేను అన్నేండ్లు అన్ని అరెస్టులు, ఎన్‌కౌంటర్ల మధ్య ఈ పట్టణ ప్రాంతాల్లో అజ్ఞాతంగా పని చేయగలిగేదాన్నేనా?

జీవించి ఉన్న ప్రతి కామ్రేడ్ యిలాంటి ఎంతమంది త్యాగాల, అండదండల సామూహిక వ్యక్తీకరణో కదా...

కాలింగ్ బెల్ మోగడంతో ఈ లోకంలోకొచ్చాను. మైత్రి వచ్చేసింది. ఎక్కువ మాట్లాడుకోకున్నా మైత్రి చాలా దగ్గరైనట్టుగా ఏదో భావన. పట్టణంలో ఎన్నో కుటుంబాల్లో వేర్వేరు వయసుల్లో ఎత్తుకున్న పిల్లలు, ఆడించిన పిల్లలు స్వంత పిల్లల్లాగే అనిపించేవారు. ఇప్పుడు చైతుని, మైత్రినీ చూస్తుంటే ఏదో కొడుకునూ, కోడల్నీ చూస్తున్న భావన లిప్తపాటు. ఆ విచిత్రమైన అనుభూతికి నవ్వొచ్చింది. అన్నీ వదులుకున్నవాళ్లకి ఏంటీ అనుభూతులు అన్నట్టు.

మైత్రి మాటల్లో తమకు రెండేళ్ల పాప వుందనీ, పుష్పక్క దగ్గరే పెరుగుతోందని చెప్పింది. మంజీరట పేరు. పుష్పక్క పెట్టిందట. ఆ పేరే ఎందుకు పెట్టిందో? అక్క కలిస్తే అడగాల్సినవి, వినాల్సినవి, పంచుకోవాల్సినవి ఎన్ని వున్నాయి! అప్పుడు ఆ కాలనీలో నేను 'ఫలానా' అని తెలినివాళ్లందరూ నన్ను పుష్పక్క చెల్లెలు అనే అనుకునేవారు - అంత గాఢంగా అల్లుకుపోయాం.

అన్న సరే, అక్క ఎన్ని పనులు ఎంత నిశ్శబ్దంగా చేసేది! నాకో అనధికార కొరియర్ అక్క. నాకంటూ ఒక అధికారిక కొరియర్ లేకుండా ఇలాంటి ఎంతమంది అనధికార కొరియర్లతో ముఖ్యంగా అక్కలతో తను ఎన్ని పనులు నడిపించగలిగింది. చరిత్రలో వీరిందరి పాత్రను ఎలాగు నమోదు చేయడం? మనకు తెలియని మన చరిత్రగా మారిపోతాయా పట్టణోద్యమాలు?

ఆలోచనల్లో పడి మైత్రి చెబుతున్న విషయాల్ని సరిగా వినడం లేదనుకుంటా. నిశ్శబ్దంగా తోచేవరకు స్పృహలోకి వచ్చి చూశాను. మైత్రి నాకేసే చూస్తోంది.

'ఏమ్మా ఏమైనా అడిగావా? వినలే' అన్నా నొచ్చుకుంటూ.

'అడగలేదు, చెప్తున్నా, కానీ మీరు వినడం లేదని అర్థమై...'

'పుష్పక్క గుర్తొచ్చి ఎటో వెళిపోయాలే...'

'పుష్పాంటీ కూడా మిమ్మల్ని చాలా సందర్భాల్లో గుర్తు చేసుకునేవారు. ఆఖరికి మంజీరతో చిట్టి పొట్టి కబుర్లు చెబుతూ కూడా మీ ప్రస్తావన తీసుకొస్తారు. ఇంట్లో అంతా మీ గురించి ఇలా గుర్తు చేసుకుంటూ వుంటే ఎప్పుడు చూస్తానా మిమ్మల్ని అనుకునేదాన్ని. ఇలా హఠాత్తుగా నెరవేరుతుందనుకోలే'

'ఎవరం ఎక్కువ గుర్తు చేసుకుంటామో తేల్చుకోవడం కష్టమేనేమో. శేఖరన్న పోయాడని తెలిశాక అయితే పుష్పక్కని తలుచుకోని రోజే లేదు. కలవకుండా వెళ్లాల్సి వస్తుందనేది...' గొంతు పూడుకుపోయినట్లయ్యింది.

'అదేంటీ, ఆంటీని కలవకుండా ఎలా వెళ్తారు? నాలుగు రోజులు తీరిగ్గా వుండి వెళ్లండి. ఆహా కాదు, ఎంతకాలం వుండగలిగితే అంత, ఆహాహా, పూర్తిగా వుండిపోండి' కల్మషం లేని ఆప్యాయతతో.

'లేదురా, రేపు సాయంత్రం బైల్దేరితే బాగుండని...'

'అదేం కుదర్దు. ఇంతకీ నేనిందాక చెప్తూ ఉండింది అదే. నా జీవితంలో ముగ్గురు అతి ముఖ్యమైన వ్యక్తులున్నారు - అమ్మా, నాన్న, మాధవక్క అని పెళ్లయిన కొత్తలోనే నాతో అన్నాడు చైతు. ఇన్నేండ్ల తర్వాత కలిసిన ఆ ముఖ్యమైన వ్యక్తిని అప్పుడే ఎలా వెళ్లనిస్తాం' గోము చేసింది.

'అలా చెప్పాడా చైతు?' ఆశ్చర్యం వేసింది.

'ఊ, తను చదువు విషయంలో అశ్రద్ధగా, ఆసక్తి లేకుండా వున్నప్పుడు మీరిచ్చిన గైడెన్స్ వల్లే తను యిప్పుడిలా ఈ ఉద్యోగం, ఈ హోదా సంపాదించానని చెప్పాడు'

నేను నవ్వి ఊరుకున్నా. చైతు విషయంలో అన్న, అక్క పడ్డ ఆందోళన, చైతు చదువు విషయంలో దెబ్బలు తినడం, ఎవరో అమ్మాయికి ప్రేమలేఖ రాయడం, మరిన్ని దెబ్బలు తినడం, తను అడ్డుకుని చైతుతో నేను మాట్లాడ్తా అని బాధ్యత మీదేసుకోవడం అన్నీ లీలగా గుర్తొచ్చాయి. నిజానికి ఒక్క చైతు అనేదేముంది, ఎవరి ఇంటికి వెళ్లినా ఆ యింటి సమస్యలన్నీ తమవే అయ్యేవి. పిల్లల చదువులు, సమస్యలు సరేసరి. అలా ఎంతమందికి ఎన్ని చెప్పి వుంటామో, వాటిని ఎవరు ఎంత తమ జీవితాల్లో ఉపయోగించుకున్నారో తెలీదు కూడా. చైతు విషయం కూడా నాకు అంత గుర్తు లేకుండింది. పదిహేడేళ్ల క్రితం పార్టీపరంగా చేసిన పనులే అన్నీ జ్ఞాపకం లేవు - ఇవెక్కడ? చాలా సహజంగా, రోజువారీగా చేసిన పనులు అవన్నీ. వాళ్లందరికీ చదువుతో జోడించి ఎన్ని రాజకీయాలు కూడా చెప్పి వుంటాం! ఎవరికేం గుర్తు వున్నాయో తెలుసుకోవడంలో ఎక్కువ ఆసక్తి వుంది వ్యక్తిగత జీవితాల్లో వాళ్లు వుపయోగపెట్టుకున్న వాటికంటే. కానీ ఎవరు చెప్తారు?

విషయం మార్చి మైత్రి కుటుంబ వివరాలు, చదువు, ఉద్యోగం, చైతు తనతో ఎలా వుంటాడు మొదలైనవన్నీ నేను అడగడం మొదలుపెట్టానిక. మైత్రి గురించి తెలుసుకోవాలనే కాక నేను ఈ అంటే వేరే లోకంలోకి వెళిపోకుండా వుండాలన్నా ఇదే మార్గం అని.

మా కబుర్ల మధ్యనే చైతు వచ్చి కలిశాడు. నన్ను కబుర్లు చెప్పమని కూచోబెట్టి ఇద్దరూ కలిసి చకచకా వంట చేసేశారు.

'నేను, పుష్పక్క చేయలేని పనిని నువ్వు సాధించావురా మైత్రీ, కంగ్రాట్స్' అన్నా-చైతు పని చూస్తూ.

ఏ యింటికి వెళ్లినా మగపిల్లలకు అమ్మకు పనిలో సాయం చేయాలని చెప్పడం పరిపాటిగా వుండేది. నేనూ పుష్పక్కా ఇంటి పనంతా చేస్తూ చిన్న చిన్న పనులు చెప్పినా చైతు వంగేవాడు కాదు. ఏదో వంకతో తప్పుకునేవాడు. మిగతా విషయాల్లో విన్నట్టుగా ఇది మాత్రం వినేవాడు కాదు. నేను వినేలా చేయగలిగేదాన్నే కానీ ఎక్కడో పుష్పక్కకి పెద్ద కొడుకుతో ఈ పన్లు చేయించకోదదు అనే భావన పని చేసేది. అందువల్ల నేనిక కొంత జాగ్రత్తపడాల్సి వచ్చేది. లేకుంటే వదిలేదా గానీ...

ఇంటిపనిని తను ఎలా తప్పించుకునేవాడో చైతు వర్ణించి, వర్ణించి చెప్పి మా ఇద్దరినీ బాగా నవ్వించాడు.

అన్నీ మాట్లాడ్తూనే చైతు భావాల్ని నిశితంగా పరిశీలిస్తూనే ఉన్నా. ఎక్కడా వేరే రకమైన భావన అంటే దూరంగా భావించే విధంగా వ్యక్తం కావడం లేదు. నిజంగానే తనకి నన్ను కలిసిన ఆనందం వుందనేది మనసుకి అర్థమైంది.

* * *

మైత్రిని పడుకోమని చెప్పి నేనూ, చైతూ బాల్కనీలో కూచున్నాం చల్లగాలికి. గతానికీ, వర్తమానానికీ వంతెనలు కట్టే ప్రయత్నంలో ఎన్నో కబుర్లు నడుస్తున్నాయి.

'అన్నకు ఏ దురలవాట్లూ లేవు కదా, చిన్న వయసులోనే

గుండెపోటు ఎలా?'

'ఎవరికీ అర్థం కాలేదు. అలా జరిగిపోయింది...'

%కాసేపు ఇద్దరం ఏం మాట్లాడలేదు. మాలోకి మేం ఏవో గజిబిజిగా అల్లుకున్న అనుబంధాల్ని చూసుకుంటున్నట్టుగా అలా చాలా సేపే వుండిపోయాం.

మళ్లీ చైతుయే అన్నాడు, 'కానీ అక్కా, నాకెందుకో రాష్ట్రంలో పార్టీ దెబ్బతినడం, తర్వాత ఎన్ని ఆందోళనలు చేసినా తెలంగాణ రాకపోవడం అనేవి ఆయన ఆరోగ్యాన్ని తెలీకుండానే దెబ్బ తీశాయనిపించేది. బైటకి ఏం అనకపోయినా అది వుందనిపిస్తుంది. చివరి వరకు ఆయన మిమ్మల్ని తలచుకుంటూనే వుండేవాడు. పార్టీ దెబ్బ తినకుంటే తెలంగాణ కూడా ఈపాటికి వచ్చి వుండేదని ఆయనకదో నమ్మకం. నాకూ ఆయనకూ చాలానే వాదనలు జరిగేవి'

చైతుయే విషయం ప్రస్తావించడంతో నాకు దారి దొరికింది.

'చైతూ, నేను మిమ్మల్ని వదిలి వెళ్లేనాటికి నీకు పదమూడేళ్లు వుంటాయేమో. అప్పుడు నీకు పార్టీ పట్ల స్వంత భావాలు ఏర్పడే వయసు కాదు. తర్వాత అసలు ఏం ఆలోచించేవాడివి? నీకు ఏం భావాలు ఏర్పడ్డాయి? శేఖరన్న ఎంచుకున్న రాజకీయాలు నీకెందుకు తప్పుగా అనిపించాయి?'

'అక్కా, నీ విషయంలోగానీ, అప్పుడు మన ఇంటికి వస్తూ పోతుండిన అన్నల విషయంలో గానీ నాకు వ్యక్తిగతంగా ఏం తగాదా లేదు. మీరంతా ఎంత మంచివాళ్ళు చిన్నవాడినే అయినా నేను గ్రహించగలిగాను. బహుశా ఆ అన్నలందరూ దాదాపుగా ఎన్‌కౌంటర్లలో చనిపోయారేమో కూడా...'

అవునన్నట్టు తలూపాను చైతు ప్రతి మాటనూ చెవులు రిక్కించి వింటూ.

'ఏం సాధించారు, అంతా అయిపోయింది కదా, అంత బలమైన ప్రభుత్వంతో కొట్లాడి ఎలా గెలుస్తారు? నాకైతే నమ్మకం లేదు'

పసలేని పాత వాదనే. ఇంకా చెప్పు అన్నట్టుగా చూస్తున్నా. చైతు తల వంచుకుని కూచున్నాడు మౌనంగా. సమయం తీసుకోనీ అని వదిలేశాను. తిరిగి తనే మొదలుపెట్టాడు.

'పార్టీ వాళ్లు ఇంకెవరి దగ్గరైనా చెప్పగలనో లేదో గానీ నీకైతే చెప్పగలను. కుటుంబాన్ని నిర్లక్ష్యం చేసినందుకు నేను నాన్నను ఎప్పటికీ క్షమించలేను' ఒకలాంటి మొండితనంతో అంటూ సూటిగా నా కళ్లలోకి చూశాడు.

నేను నా ముఖంలో ఎటువంటి భావాల్నీ కనబడనివ్వలేదు. వింటున్నా అన్నట్టుగా చూశాను.

'నాన్న అరెస్టు అయినప్పుడు ఎంతగా ఏడ్చాం అమ్మా, మేమూ. ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారేమో అని ఎంతగా భయపడ్డాం, అప్పటివరకు మంచి ట్రేడ్ యూనియన్ నాయకుడిగా అందరూ గౌరవించిన నాన్ననీ, మమ్మల్నీ అందరూ ఎంత దూరం చేశారు, మా బాల్యం అంతా ఎంత అల్లకల్లోలంగా మారిపోయిందీ...'

అవన్నీ వాస్తవాలే. కానీ శాస్త్రీయమైన సమాధానం లేనివి కావు. అవి చెప్పడానికి నేను అవసరం లేదు.

'నీ ప్రశ్నలన్నిటికీ నాన్న సమాధానం చెప్పే వుంటాడు కదా?'

'ఎందుకు చెప్పడు? బాగానే వంటబట్టినాయి కదా రాజకీయాలు. చివరికీ పార్టీ జెండా కప్పమనే చెప్పాడు. అన్నేండ్లు పోలీసుల వేధింపులు అనుభవించినా కూడా నాన్నకి ఈ పిచ్చి వదలలేదే అనిపించింది నాకైతే. సుమీ ఎటూ మాట్లాడదు. కానీ అమ్మేం తక్కువ కాదు...'

చైతు ఉక్రోషంగా అంటున్న మాటలు వింటుంటే నాకో పక్క చిన్నపిల్లాడిలా అన్పించి నవ్వొచ్చింది. మరోవైపు అక్క, అన్నల్ని తల్చుకుంటుంటే ఎంతో గర్వంగా తోస్తోంది. మనసులోనే 'లాల్‌సలాం' చెప్పాను వాళ్లకు.

'నాన్న వారసత్వంగా ఈ చేదునే తీసుకుంటున్నావా చైతూ? నాన్న తరంవాళ్లు ఆ మాటకొస్తే మానవ జాతి చరిత్రలోనే ఒక్కో తరమూ పోరాటాలు చేయకపోతే మనకసలు ఈ జీవితం వుండేదేనా అని ఆలోచించావా?'

'ట్రేడ్ యూనియన్ రాజకీయాల వరకు ఓకే, నేనూ ఒప్పుకుంటాను. కార్మికులకు అవసరమే అనుకుందాం. మళ్లీ ఈ పార్టీ రాజకీయాలెందుకు పట్టుకోవాలి? తెలుసు కదా సుమీని హాస్టల్లో పడేసింది కూడా పోలీసుల వేధింపులు తట్టుకోలేకే. నువ్వు ఊహించగలవు అమ్మకు అది ఎంత కష్టం కలిగించి వుంటుందో'

'మీ బాల్యాన్ని అల్లకల్లోలం చేసింది పార్టీ రాజకీయాలా రాజ్యమా అనేది కూడా తెలీనట్టు ఏంటి చైతూ నువ్వు కూడా' అనకుండా వుండలేకపోయాను.

అదేం విననట్టే, 'ముందు ఇంటిని ఉద్ధరించి తర్వాత సమాజాన్ని ఉద్ధరించాలి ఎవరైనా' అన్నాడు తల విదులుస్తూ మొండిగా.

'నాన్న పేదరైతుగా పుట్టి కార్మికుడయ్యాడు. కులపరమైన అణచివేతను ఎదుర్కొన్నాడు, కులాంతరమే కాదు మతాంతరంగా, రాష్ట్రాంతరంగా, భాషాంతరంగా ప్రేమపెళ్లి చేసుకుని సమాజాన్ని ఎదిరించాడు. చివరి వరకూ తన మూలాల్ని మరిచిపోకుండా కార్మికుల కోసమే పోరాడాడు. నాన్నలా అన్ని రకాల అణచివేతలకూ వ్యతిరేకంగా పోరాడే చైతన్యం, వర్గస్పృహ లేకుంటే పోనీ, కనీసం దేశభక్తి కూడా లేకుంటే ఎలా? రోజూ పేపర్ చూస్తున్నావా అసలు? మన దేశాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేసి దోచుకుపోతున్నారే సామ్రాజ్యవాదులు చీమ కుట్టినట్టయినా లేకుంటే ఎలా? ఢిల్లీలో కూచుని దేశాన్ని తూకానికి అమ్మేస్తున్న దళారీ నాయకులను చూసి రక్తం మరగకుంటే ఎలా? ఆర్థిక సంక్షోభం బారిన మీ సాఫ్ట్‌వేర్ వాళ్లూ పడ్తున్నారు కదా?'

'అవును పడ్తున్నారు. ఐతే ఏంటి? నా జీవితం నేను కోరుకున్న విధంగా ఇప్పటికి సాఫీగా సాగిపోతోంది. ఆ సుఖాన్ని నేను వదులుకోదల్చలేదు. స్వార్థపరుడ్ని అనుకుంటారు మీరు. అనుకోండి. నాకేం అభ్యంతరం లేదు'

'నేనేమీ అనుకోవడం లేదులే గానీ, నిన్నేం పార్టీలోకి రమ్మనడం లేదు. అమ్మలాగో, నాన్నలాగో పని చేయమనీ అనడం లేదు. కానీ శేఖరన్న పుష్పక్కల కొడుకుగా, మా చేతుల్లో కొన్నేండ్లయినా పెరిగినవాడిగా అజ్ఞానంలో వుండిపోతానంటే మాత్రం ఒప్పుకోలేను చైతూ. నీ అజ్ఞానంలోకి మైత్రినీ, మంజీరనీ కూడా లాగకు, ప్లీజ్'

'మీ నమ్మకాలు మీకున్నట్టే నా నమ్మకాలు నాకున్నాయి. మీకది అజ్ఞానంలా తోచవచ్చు, నాకు మాత్రం నా జీవితాన్ని నడిపే వెలుతురు అదే'

'ఇన్నేండ్ల తర్వాత కూడా నాకు టమాటాలు ఇష్టం అని గుర్తుపెట్టుకుని వండిపెట్టావు గానీ నేను మీతో వేయించిన భగత్సింగ్ నాటకం గుర్తులేదేం చైతూ నీకు? నక్సల్బరీ వీరుడిగా నువ్వు అందులో చెప్పిన డైలాగు గుర్తుందా? అందరూ భగత్సింగ్ ఈ దేశానికి అవసరం అనుకుంటారు గానీ పక్కింట్లో పుట్టాలి అనుకుంటారు అని. ఎంత

బాగా చెప్పావు అని రాధక్క నిన్ను ముద్దు పెట్టుకుంది కూడా. నీ మాటలు వింటూ వుంటే నువ్వు అంతకంటే వెనకబడిపోయినట్టు తోస్తోంది. నువ్వు అసలు భగత్సింగ్ అవసరాన్నే గుర్తించడం లేదు అనిపిస్తోంది'

చైతు ఏం మాట్లాడకుండా బాల్కనీలోంచి కనిపిస్తున్న చుక్కలకేసి చూపులు తిప్పుకున్నాడు. ఇబ్బందిపడ్తున్నాడు అని అర్ధమౌతోంది. దానికంటే ఎక్కువ తానెక్కడ ఒప్పుకుంటానో అని భయపడ్తున్నాడు. పోనీలే 'భయం' యింకా పోలేదు. ఆశ చావకుండా మిగిల్చాడు.

చైతు చేసే పాత చింతకాయ పచ్చడి వాదనలన్నిటికీ అన్న ధీటైన సమాధానాలు ఇచ్చే వుంటాడు. అసలు ఆయన రాజీలేని జీవితమే పెద్ద సమాధానం కదా. ఇప్పుడు నేను ఈ ఒక్క రాత్రిలో వాదించి చైతుని కొత్తగా ఒప్పించేది ఏం వుంటుంది? కొన్నిటికి కాలమే సమాధానం చెప్పాలి. తెల్లారి రెండవుతోంది. నా పని విషయం మాట్లాడితే మంచిదనిపించింది.

'సరేలే చైతూ, తర్వాతైనా ఆలోచించు గానీ నేను వచ్చిన పని చెప్పనే లేదు నేను. నాన్న నేను గానీ, నా ద్వారా పార్టీ వాళ్లు ఎవరైనా గానీ వస్తే ఇవ్వమని ఏమైనా అప్పగించాడా నీకు?'

'అంటే?'

'అంటే ఒక ప్యాకెట్టు లాంటిది'

'లేదక్కా'

'గుర్తు చేసుకో చైతూ, అన్నేండ్లలో ఎప్పుడైనా పార్టీ వాళ్ల వస్తువులు, ముఖ్యమైనవి అని ఏమైనా ప్రస్తావించాడా? చాలా ముఖ్యమైనవి చైతూ, ప్లీజ్ గుర్తు చేసుకో'

చైతు చాలాసేపే ఆలోచించి ఆత్రుతగా తనకేసే చూస్తున్న నన్ను చూసి తల అడ్డంగా ఊపాడు.

ప్రాణం ఉసూరుమంది. ఆ నిరాశకు కాసేపు నేనూ ఏం మాట్లాడలేకపోయాను.

నా ముఖంలో ఏం కనిపించిందో చైతునే అనునయంగా, 'చాలా ముఖ్యమైనవా అక్కా, దాని కోసమే వచ్చావా?' అనడిగాడు.

అవునని తలూపాను. తీవ్రమైన నిర్బంధంలో, ఎన్‌కౌంటర్ల పరంపరల మధ్య చాలా ఏండ్లే శేఖరన్న లాంటి ఎంతో మంది సహాయ సహకారాలతో ఆ పట్టణాన్నీ, చుట్టుపక్కల గ్రామాలనూ ఆధారంగా చేసుకుని తిరిగాను. దాదాపు ఒంటరిగా మిగిలాను. ఆ సమయంలో ఒకసారి నేను అరెస్టు అయ్యాననే పుకారు రావడంతో పార్టీ నన్ను కట్టుబట్టలతో ఆ ప్రాంతం నుండి ఖాళీ చేయించేసింది. కబురు రావడానికీ, బయలుదేరడానికీ కూడా అంతరం ఏం లేదు. ఆ కొద్ది నిమిషాల సమయంలోనే ముఖ్యమైన కొన్ని డాక్యుమెంట్లు, నా ఆయుధం శేఖరన్నకు అప్పగించి వెళిపోయాను. ఆయనైతే వాటి విలువ తెలిసి కాపాడుతాడని నాకు అపారమైన నమ్మకం.

శేఖరన్న చనిపోయిన వార్త మాకు ఆలస్యంగా తెలిసింది. పార్టీ నాయకత్వానికి ఆ 'ప్యాకెట్టు' గురించి ముందు నుండే తెలుసు. వార్త విన్నాక అడిగితే, 'కుటుంబం కూడా కాపాడుతుంది' అని చాలా ఆత్మవిశ్వాసంతో చెప్పాను. ఆ నమ్మకంతోనే ఇప్పుడు వేరే పని మీద 'బయటకు' వస్తూ ఇదీ తీసుకు వస్తానంటే పార్టీ ఎంతో రిస్క్ తీసుకుని తయారీలు అన్నీ చేసి పంపించింది.

ఇప్పుడేం చేయడం? నాకు బుర్ర పని చేయడం లేదు.

'పోనీ అమ్మకేమైనా చెప్పాడేమో' అన్నాడు చైతు మెల్లగా.

తల కొట్టుకున్నా.

'అరే చైతూ, నిజమే, అమ్మకే చెప్పి వుంటాడు. ఎలా మరి?'

'ఎలా ఏముంది? రేపుదయం అమ్మ దిగుతుంది కదా, అడుగుదాం' అన్నాడు తొణకని కుండలా.

ఆశ్చర్యంగా చూశాను.

'ఏంటి అంతగా ఆశ్చర్యపోతున్నావు? నువ్వు వచ్చాక అమ్మను కలవకుండా ఎలా పోతావు? ఉదయమే ఏర్పాట్లు చేశాను'

'అరే చైతూ, నాతో ఒక మాట అనాల్సింది, అనవసరంగా ఫోన్లలో ఏం మాట్లాడలేదు కదా?' ఆందోళనగా అడిగాను.

'నాకు తెలీదాక్కా, ఈ విషయంలో నీకంటే ఎక్కువ ఆందోళనే నాకు వుంది. నీ గురించే కాదు, నా భద్రమైన జీవితం గురించీ, మైత్రీ...మంజీరా...'

చైతు పట్ల నమ్మకం కుదిరింది. పని జరుగుతుంది అనే ఆశా, అక్క కలుస్తుందనే సంభ్రమం ఒక్కసారిగా ముంచెత్తాయి. ఇకిప్పుడు చైతు ఏంటి అనేది ఒకసారి తెల్సుకుంటే బాగుంటుందనిపించింది.

'ఓ పెద్ద భారం దిగినట్టుంది చైతూ, ఇంకేంటి చెప్పు'

'ఏముందక్కా, అంతా బాగే. సుమీ తను కోరుకున్నట్టే డాక్టర్ అయ్యింది, రెండేళ్లలో యుకె నుండి వచ్చేస్తుంది. అమ్మ-మన ఊర్లోనే స్కూలు నడుపుతోంది పేదపిల్లలకు. నాన్న మనసు సగం ఊరిలోనే వుండేదని తెలుసు కదా. మమ్మల్నీ లాక్కుపోయి ఆ కలుపులూ అవీ పీకించేవాడుగా పొలంలో. అమ్మ వూర్లోనే వుంటే బాగుంటుందని పట్టుబట్టింది. నా దగ్గరే వుండమని ఎంత చెప్పినా వినలేదు. తెలంగాణ కోసం జరిగే అన్ని కార్యక్రమాల్లో ఊర్లో అందరితో పాటు పాల్గొంటూ వుంటుంది. మంజీరకి మూడేళ్లు రాగానే తెచ్చి ఇక్కడే చేరుద్దాం స్కూల్లో అని ఆలోచిస్తున్నా. మైత్రితో ఏం సమస్యలు లేవు, మంచమ్మాయి. ఇంకొకర్ని కని ఆపాలని చూస్తున్నాం. అంతా హ్యాపీ' అన్నాడు సంతృప్తిగా.

'మైత్రికి అసలు పార్టీ గురించి ఏమన్నా తెలుసా?'

'అంతగా ఏం తెలీదు. నీ గురించి కూడా ఇలాగని, యింత ప్రమాదం అని అంత స్పష్టంగా తెలీదు. అయితే నాన్న అరెస్టు కావడం తెలుసు. నిజంగా అక్కా, రోజూ పేపర్లూ టీవీ హోరెత్తిపోతుంటే కూడా పార్టీ గురించి అంతగా తెలీకుండా వుండే ఇలాంటివాళ్లు వుంటారని నాకు మైత్రిని చూశాకే అర్ధమైంది'

'హు, ఇప్పుడు యిలాంటివాళ్ల సంఖ్య ఎక్కువ అవుతోందిలే మన రాష్ట్రంలో. ఎదురుదెబ్బలు తిన్నాం కదా. తెల్సిన నీలాంటి వాళ్లూ చెప్పరు' అన్నా కావాలనే కొంత నిష్టూరంగా.

చైతు నవ్వేశాడు, 'నో ఛాన్స్' అంటూ.

'ఎలా మారిపోయావు చైతూ! నిజంగా నన్ను కూడా లోపలకి రమ్మంటావా లేదా అని సందేహపడ్డాను వచ్చేటప్పుడు'

అప్పటివరకు స్వేచ్ఛగా మాట్లాడుతున్న చైతు ఒక్కసారిగా మూగగా అయిపోయాడు. అలా అనకుండా వుండాల్సిందా? తెల్సుకోలేకపోయాను. చైతు ఏం మాట్లాడ్డం లేదు.

'సారీ చైతూ, హర్ట్ చేశానా?'

'లేదక్కా, నీకా సందేహం రావడం తప్పు కాదు. నేను కూడా ఉదయం నుండి ఒకలాంటి అల్లకల్లోల స్థితిలోనే ఉన్నా. నిన్ను ఆహ్వానించడంలో, అమ్మని పిలిపించడంలో ఎక్కడా నాకెలాంటి సందేహాలూ లేవు. నాకూ, నా కుటుంబానికీ మరీ రిస్క్ అనుకుంటే

తప్ప భవిష్యత్తులోనూ వుండదు అనే అనుకుంటున్నా. కానీ నాకు ఉదయం నుండి అక్క ఏం పని మీద వచ్చింది, ఏం ఆశిస్తోంది అనే ప్రశ్న తొలుస్తూనే వుంది'

'చైతూ, నీకామాత్రం తెలుసు, పార్టీ పని అంటే స్వచ్ఛందంగా, ఇష్టంగా చేసేదే అని'

'తెలుసు. నాకిష్టం లేదనేది నాకు స్పష్టం. అందుకే ఏం ఆశిస్తున్నావో, నిన్ను కాదనగలనా, నా ఇష్టానికి వ్యతిరేకంగా అవునంటానేమో అని మధనపడ్డం...'

'నా పనేంటో చెప్పాను. అది రేపు అక్క కలిస్తే అవుతుందా లేదా కూడా తెలుస్తుంది. ఆ తర్వాత ఎలాగూ గుడ్‌బై, మళ్లీ కలిసే అవకాశం అసలు రాకపోవచ్చు కూడా'

'ఛ, అలా అనద్దు, నీకు ఎప్పుడైనా నా ఇంటి తలుపు తెరిచే వుంటుంది. ఎప్పుడు రావాలనిపించినా రా...' నా చేతిని బుగ్గకు ఆనించుకుంటూ అన్నాడు చిన్నప్పటి చైతులా.

నవ్వి తలూపి లేచాను. నన్ను మైత్రి దగ్గర పడుకోమని చెప్పి చైతు హాల్లో సోఫాలో పడుకోవడానికి దిండు తీసుకుని పోయాడు.

సుమీ ఎలా వుందో? ఆనాటి అభిమానాలు అలాగే నిలుపుకుందా? అప్పటికి మరీ చిన్నదైనా గుర్తు వుండకపోతుందా? అక్కా, అన్నా గుర్తు చెదిరిపోకుండా చెప్తూనే వుండి వుండాలి అన్పిస్తుంది. తెల్లారడానికి మిగిలిన ఆ కొద్ది సమయం ఆ కుటుంబం గురించిన ఆలోచనల్తోనే గడిచిపోయింది.

విప్లవం అవసరం తమకు లేదని భ్రమ పడుతున్న కొన్ని జీవితాలు...

* * *

పుష్పక్క కలవగానే గాఢంగా కౌగిలించుకున్నా. కొన్ని సెకన్లు అలాగే వుండిపోయాం. ఇద్దరం ఏడుస్తామేమో అనుకున్నా. విచిత్రంగా ఇద్దరం ఏడవలేదు. అదే అందమైన నవ్వు, అదే కళ అక్క ముఖంలో.

'మాధవీ - మన రాము' అని అక్క అన్నాక గానీ వెనకాల నుంచుని వున్న ఓ 20-25 మధ్య వయసున్న యువకుడిని గమనించలేదు. ఎక్కడో చూసినట్లనిపిస్తోంది గానీ ఆ వయసు అబ్బాయిని ముందు చూసి వుండే అవకాశం ఎక్కడుంది?

రాము వినయంగా నమస్కారం చేశాడు. అక్క బ్యాగుని చొరవగా బెడ్రూంలోకి తీసుకెళ్లి పెట్టి, మైత్రికి కూరగాయల సంచీ యివ్వడానికి వెళ్లి అక్కడే సెటిల్ అయ్యాడు.

నా ముఖంలో ప్రశ్నార్థకాన్ని చూసి, 'యాదగిరి అన్న కొడుకు, చిన్నగుండె అప్పుడు'

ఒక్కసారిగా రక్తం ముఖంలోకి చిమ్మినట్టూ మళ్లీ అదంతా ఎవరో గుంజేసినట్టూ అయ్యింది.

'నిజమా, అందుకే ఎక్కడో చూసినట్టనిపించింది, అన్న పోలికలు బాగా వున్నయ్. సునీతక్క?'

'అన్నను పోలీసులు చంపేశాక సునీతక్క పుట్టినూరుకి వెళిపోయింది. మీ అన్న చివరి వరకు కలిసి వస్తూనే వుండేవాడు సునీతక్కను. రాముని హాస్టల్లో వేసి చదివించాడు. మన కంపెన్లనే ఉద్యోగం యిప్పించాల్నని కోషిస్ చేసిండు గానీ అన్నీ ప్రైవేట్ అయిపోతున్నయి కదా. మీ అన్న యూనియన్ పెట్టి కొట్లాడినంత కాలం చేయలేకపోయినవన్నీ యాజమాన్యం ఇప్పుడు డబుల్ స్పీడ్‌తో చేసేస్తోంది. నవరత్నాలకే దిక్కు లేదట కదా? అందుకే ప్రైవేట్ కంపెనీలో దొరికిన ఉద్యోగం చేస్తున్నడు. ఉన్న వుద్యోగాలే ఊడబెరుకుతుంటే యిగ పర్మనెంట్ ఉద్యోగం ఎన్నడు దొరకాలె'

'ఊర్లో వుండి కూడా అన్నీ తెలుసుకుంటున్నట్టున్నవు కదక్కా'

'ఇక్కడకొచ్చినప్పుడు ఒక రౌండ్ వేస్తా కదా మన యూనియన్ అన్నయ్యలందరి ఇండ్లకూ. నేను పోకుంటే వాళ్లే వచ్చి బాధలు వెళ్లబోసుకుంటరు. అన్న వుంటే ఇట్ల కాకపోయేది అంటరు. అన్న ఒక్కడు ఏం చేస్తుండె, అన్న చెప్పింది అందరు కలిసి కొట్లాడాల్నని, ఆ పని చేయండి అని నేను చెప్తుంటా'

'రాముకి నేనెవరో తెలుసా?'

'తెలీకపోవడం ఏంది? నిన్న చైతు రాముని కలిసి శెలవు పెట్టించి దగ్గరుండి అమ్మను తీస్కరా, మాధవక్క వచ్చింది అని నోటిమాటగా చెప్పు అని జాగ్రత్తలు చెప్పి పంపిస్తే నన్ను తీస్కుని వచ్చిండు. రాము అంత నమ్మకమైన మనిషి యింకోరు వుండరు మనకు, కుటుంబానికి గానీ, పార్టీకి గానీ. నాకైతే రాము అమ్మా, అమ్మా అనుకుంట ఎనకాలే తిర్గుతుంటే మన వేణులాగో, సుధాకర్‌లాగో అన్పిస్తడు. వాళ్లూ అట్లే అక్కా, అక్కా అనుకుంట ఎంట తిర్గెటోల్లు కదా'

మైత్రితో కబుర్లు ముగించుకుని టీ కప్పులతో వచ్చి ఎదురుగా కూచున్నడు రాము. నేను రాముని కండ్లారా చూస్తూ కూచున్నా. అతని ప్రతి కదలికా నాకు అపురూపంగా, అన్నను జ్ఞాపకం తెచ్చేదిగా ఉన్నది. తెలీకుండానే కళ్లు చెమరుస్తున్నాయి.

సునీతక్క గురించీ, కుటుంబ పరిస్థితి గురించీ, తన ఉద్యోగం గురించీ అడుగుతూ వుంటే ఏ మాత్రం కొత్తగా కాక ఎన్నాళ్ల నుండో తెలిసిన మనిషితో మాట్లాడినట్టు సమాధానాలు చెప్తూ పోతున్నాడు. నమ్రత అతని ప్రతి మాటలో తొణికిసలాడుతోంది. ఆత్మవిశ్వాసమూ తక్కువ లేదు.

చైతు, మైత్రి, రాము ముగ్గురూ వెళిపోయారు. పుష్పక్కకీ, నాకూ ఎన్నో విషయాలను పంచుకోవడానికి అవకాశం. పాత జ్ఞాపకాలు, 17 ఏండ్లుగా తెలీని విషయాలు ఎన్నో మాట్లాడుకోవాలంటే రెండు పూటల సమయం ఎక్కడ సరిపోతుంది? అక్క మాట్లాడ్తూ వుంటే నేను 'మంచి శ్రోత' అనే నా పాత పేరును నిలబెట్టుకుంటున్నట్టుగా వింటూ పోయాను.

అక్క చెప్తున్న విషయాల్లో నాకు అవసరం అయిన ఎంతో సమాచారం అలా దొర్లిపోతూనే వుంది. అన్నేండ్ల పరిణామాల్ని శ్రద్ధగా, జాగ్రత్తగా నా మనసులో ముద్రించుకోసాగాను. నేను వచ్చిన అసలు పని అక్కకు చెప్పకపోయినా, తెలిసినట్టే మేం వేయాల్సిన అనేక అడుగులకు తన మాటల్లో ఆరంభ బిందువుల్ని పేరుస్తూ పోతోంది.

ఏం వండామో, ఏం తిన్నమో - రోజంతా మాట్లాడుకుంటూ వున్నట్టే తోచింది. నేనూ పార్టీ ప్రస్తుత పరిస్థితి, పార్టీ ఆలోచిస్తున్న విషయాలూ క్లుప్తంగానే చెప్పాను అక్కకి. సాయంత్రమైపోయింది. మైత్రి వచ్చేస్తుంది ఇక. అసలు విషయం అడగనే లేదు.

'అక్కా, అన్న నీకేమైనా ప్యాకెట్టు అప్పజెప్పాడా నేను గానీ, నా ద్వారా పార్టీ వాళ్లు గానీ వస్తే యివ్వాలని?'

'వచ్చినప్పటి నుండి నేనూ నీకు చెబ్దామనుకుంటనే వున్న' అంటూ అక్క ఏకంగా తన బ్యాగు నుండి దాన్ని తీసి ఇచ్చింది. సంభ్రమంగా అందుకున్నా దాన్ని. తెరిచి చూద్దామని ఆత్రుతగా తోచింది గానీ అదెంత మంచిగా ప్యాక్ చేసి వుందంటే ప్రయాణంలో అది అలాగే వుంటే మంచిదనిపించి వదిలేశా.

దాన్ని చేతులతో తడుముతూ వుంటే చరిత్ర చెక్కిలిని నిమురుతున్నట్టుగా తోచింది. ఎంతమంది పట్టణ వీరుల త్యాగాల చరిత్ర అందులో నిక్షిప్తం అయి వుంది!

'దీని గురించి అన్న చైతుకీ, సుమీకీ కూడా చెప్పలే. నాకు చెప్పిండు, తర్వాత రామునే విశ్వాసంలోకి తీసుకున్నడు. రాము దగ్గరే వుంచు, మనకేమైనా అయినా పార్టీ ఎన్నడు వచ్చినగని అప్పగించాల్నని చెప్పిన, పార్టీ దెబ్బ తిన్నది, ఎన్నడు వస్తరో చెప్పలేని స్థితి, మనం వున్నా లేకున్నా రాము ఈ బాధ్యతని నెరవేరుస్తడు అని నాతో అన్నడు. చాలా నమ్మకం రాము మీద'

'అదే, చైతునడిగితే తనకేం తెలీదన్నడు'

'సొంత కొడుకే అయినా చైతులో క్రమంగా స్వార్థం పెరుగుతూ పోవడంతో అన్నకు వాని మీద నమ్మకం పోయింది. సుమీ ఎటూ మాట్లాడదు, ఏం ఆలోచిస్తదో ఎవ్వరికీ తెల్వదు. తనేమో, తన చదువేమో అంతే. ఫారిన్ పోతే తిరిగి వస్తదో రాదో కూడా తెల్వని స్థితి. రామైతే మన పిలగాడు అని అన్నకు నమ్మకం. ఇంతకీ అప్పుడు నువ్వు మన దగ్గర కొన్ని పైసలు కూడా పెట్టినవు, గుర్తుందా?'

తలూపాను. అవి కొన్ని వేలే కనుక నేను వాటి ప్రస్తావన తేలేదు ఇప్పటివరకు. వాళ్లు పార్టీకి చాలా సేవే చేశారు కనుక, అన్న అరెస్టు తర్వాత చాలా ఇబ్బందులే పడ్డారు కనుక వాడుకుని వుంటే సరే, అడగద్దు అని ముందే అనుకున్నాం.

'అన్న అవి కూడా రాము పేరు మీదకే మార్చిండు. నువ్వెప్పుడు అంటే అప్పుడు తీస్కపో. వడ్డీతో చాలానే అయ్యి వుంటాయి'

%పార్టీ పైసల్ని అన్ని యిబ్బందుల్లో కూడా వాడకుండా దాచిన ఆ కార్మికవర్గ జంటను ఏమని అభినందించగలను? పార్టీ సొమ్మునెత్తుకపోయి సరెండర్ అవుతున్న వాళ్లు వీళ్ల ముందు ఎంత మరుగుజ్జులుగా అవుపిస్తున్నారు!

'ఉండనీ అక్కా, తర్వాత చూద్దాం'

'నువ్వే విషయంలోనూ ఎనక ముందు కాకు. నేను, అన్న ఎంతనో రాము అంతే. చైతుని నమ్మలేం. నువ్వు ఎక్కువ నమ్మకం పెట్టుకోకు. వానికి ఇబ్బంది కానంతవరకే ఏదైనా. వాని ఆలోచనలూ, స్నేహాలూ అన్నీ ఒక హోదా ఉన్నవాళ్లతోనే యిప్పుడు. పేదవాళ్లు కనిపించరు. వానికంటే అమాయకురాలైన మైత్రికే తక్కువ స్వార్థం వుంది అన్పిస్తది నాకు. మంజీరను వీని ప్రభావం లేకుండ పెంచాల్ననిపిస్తుంది అందుకే. ఏమైతదో గానీ. మీ అన్న కూడా అనేవాడు చైతుని మనం గావరం చేసి పాడు చేసినట్టు మనవలను కానియ్యద్దు, మన ఆలోచనల్తో పెంచాలె అని'

చైతుతో నా సంభాషణను అక్కతో చెప్పలేదు. దాన్నీ, స్వంత తల్లిదండ్రుల అంచనాల్నీ కలుపుకుని చైతుపై అంచనాకు రావాల్సి వుంటుంది. వాళ్లకు చైతు అంటే ఎంత ప్రేమో నాకు తెలీనిది కాదు, కానీ రాజకీయాలకు వచ్చేసరికి రక్తబంధాన్ని వాళ్లు పక్కన పెడుతున్న తీరు నాకు ఎంతో ఉత్తేజంగా తోస్తోంది.

'అవునక్కా, అడుగుదామనుకుంటనే మర్చిపోయిన, మంజీర పేరు నువ్వే పెట్టినావంట కదా?'

'అమరులైన మనవాళ్లలో ఎవరో ఒకరి పేరే పెడ్తే ఎలా అనిపించింది. అందరి పేర్లూ కలిసి వచ్చేలా పెడితే బాగుండనిపించింది. అన్న ఎప్పుడో ఒకసారి అన్నడు, మనవాళ్లు ఎక్కువగా మంజీర ప్రవహించే గడ్డనే అమరులయ్యిన్రు కదా, మన చైతుకి బాబు పుట్టినా, పాప పుట్టినా మంజీర పేరు పెట్టుకుందామని. అందుకే ఆ పేరు పెట్టా'

ఎంత లోతైన ఆలోచన! ఆ పాపను ఒక్కసారిగా గుండెకు హత్తుకోవాలనిపించింది.

'తీసుకురావల్సిందిగా అక్కా, చూసేదాన్ని'

'పరిస్థితి ఏంటో తెల్వదు కదా, రమ్మన్నడు అంతే. ఏం యిబ్బంది అయితదో ఏమో అని తేలేదు. అడుగుదామంటే ఫోన్‌లు వాడద్దు కదా అని...' అక్క నొచ్చుకుంది.

'పోనీలే అక్కా, మళ్లెప్పుడన్నా చూస్తానేమో. నా ముద్దులన్నీ మూటగట్టి నీకే ఇస్తా, తీస్కపో'

'ఇంతకీ ఏంది, ఇప్పుడు పోతే నువ్వు మళ్లీ?'

'ఇప్పుడేం చెప్పలేనక్కా. అవసరం వచ్చినప్పుడు అన్నీ తెలుస్తాయిలే. నేను వచ్చిన రెండు పనులూ పూర్తి అయినాయి'

ఒక్కొక్కరుగా మైత్రీ, చైతు, రాము వచ్చేశారు. నేను రాఘవులుకి ఫోన్ చేసి మర్నాడు ప్రయాణం కట్టేలా ప్లాన్ చేసుకుని వచ్చాను. అందుకు ఒక ముఖ్యమైన కారణం అక్కవాళ్లతో ఒక రోజైనా పూర్తిగా వుండచ్చనే కాక రాముతో కొద్దిసేపైనా మాట్లాడవచ్చని కూడా.

చైతుకు నేను రాముతో ప్రత్యేకంగా మాట్లాడ్తున్నా అనే భావం కలగకుండా అందరి ముందూ మాట్లాడ్తూనే నాకు కావల్సిన వివరాలు సేకరించుకున్నా. కాంటాక్టు చేసే ఏర్పాట్లు చేసుకున్నా.

రాము చెప్తున్న ఫ్యాక్టరీ పరిస్థితులు వింటూ వుంటే 20 ఏళ్ల నాటి పరిస్థితికి పెద్ద భిన్నంగా ఏం అన్పించలేదు. ఇంకా చెప్పాలంటే కొన్ని ఫ్యాక్టరీల్లో కార్మికుల స్థితి ఇంకా దిగజారింది. విషయం తెలిసినదే అయినా నేరుగా రాము నోటి నుండి వింటూ వుంటే యాదగిరి అన్నతో ట్రేడ్ యూనియన్ పెట్టడం గురించి చేసిన చర్చలే గుర్తుకొస్తున్నాయి.

విప్లవం తక్షణావసరం అయిన కొన్ని జీవితాలు...

చివరగా యాదగిరి అన్న గురించి కదిపాను.

'శేఖరన్న నీకు ఎప్పుడైనా చెప్పిండా నాయినను ఎలా...'

'నేను చిన్నగుంటి కదా, నాకస్సలు యాది లేదు. పోలీసులు బూటకపు ఎన్‌కౌంటర్లో చంపేసిన్రు అని తెలుసు. అంతకంటే ఎక్కువ అమ్మగానీ, శేఖర్ సార్ గానీ నాకెన్నడూ చెప్పలేరు. ఈ పాకెట్టు నా చేతికిచ్చి, నా పేర డిపాజిట్ చేసేటప్పుడు మాత్రం చాలాసేపు పార్టీ గురించీ, నాయిన గురించీ చెప్పిండు'

'ఏం చెప్పిండు నాయిన గురించి?'

'నాయిన ప్రైవేట్ కంపెన్ల పని చేసేది. పార్టీ కాంటాక్టులోకి శేఖర్ సార్ ద్వారానే వచ్చిండు. చానా ఘోరమైన పరిస్థితులుండెనట కంపెన్ల ఇప్పటి తీర్గనే. యూనియన్ పెట్టుకోనీకి తోటి కార్మికులకు ధైర్యం చెప్తూ, ముందుండి యాజమాన్యాన్ని ఎదిరిస్తూ ఎంతో కోషిష్ చేసిండు. చివరికి యూనియన్ పెట్టుకున్నరు. బీహార్ గుండాల ద్వారా దాడులు చేయించినప్పుడూ, పోలీసులు అరెస్టు చేసి కొట్టినప్పుడూ కూడా నాయిన గింత కూడా అది కాలేదు. సార్ వాళ్లే బెయిలూ అవీ యిప్పించి యిడిపిచ్చిన్రు. పైసలు కూడా వసూలు చేసి యిచ్చిన్రు బాధిత కార్మికులకు. సురేందర్ అనే పార్టీ ఆర్గనైజర్‌ను పట్టుకున్నప్పుడు ఆ ఏరియాలోని కార్మికులందర్నీ టెర్రరైజ్ చేయనీకి నాయినను కూడా ఆయనతో పాటు కాల్చేసిరు. సురేందరన్నకు కూడా 23 ఏండ్ల కంటే ఎక్కువ లేవు అని చెప్పిండు. ఇద్దరి మీదా తీసిన కరపత్రం యిచ్చిండు. ఫోటో చూసిన. అమ్మకు కూడా అన్న బాగా తెలుసట. ఇంటికి వచ్చేదట'

'అవును, మొదట్లో నాయిన పోలీసులకు అంతగా తెల్వనప్పుడు నేరుగా ఇంటికే వస్తుంటిమి అందరం. చాలా ఆదరించేది సునీతక్క, నిన్ను కూడా ఎత్తుకున్నా'

'అమ్మ చెప్పేది సీతక్క అని?'

'ఆ బస్తీలో ఆ పేరుతోనే పరిచయం, శేఖరన్నగానీ, అమ్మగానీ ఇంకేం చెప్పలేదా?'

కొద్ది సెకన్లు ఆలోచించి 'ఊహు' అని తల అడ్డంగా వూపాడు.

'యాదగిరి అన్న తన ప్రాణాలను ఒడ్డి ఆ రోజు ఒక ఆర్గనైజర్ ప్రాణాలను కాపాడాడు'

రాము తదేకంగా చూస్తున్నాడు. అప్రయత్నంగానే ముందుకు వంగాడు.

'నాయినను అర్ధరాత్రి ఎత్తుకెళ్లారు పోలీసులు. కొద్ది గంటల ముందే తొమ్మిదింటికి ఆయన నన్ను వేరే కార్మికుడి ఇంట్లో పెట్టి ఇంటికి పోయి పండుకున్నడు. నా ఆచూకీ తెలిసినా కూడా ఆయన ఒక్క ముక్క కూడా పోలీసులకు చెప్పలేదు...'

రాము నిశ్చలంగా అలాగే చూస్తున్నాడు. నా ప్రతి మాటనూ కింద పడకుండానే పట్టుకోవాలన్నట్టు చూస్తున్నాయి అతని కళ్లు.

'ఇవాళ ఈ విధంగా నేనూ, ఇంకా అప్పటి కామ్రేడ్స్ కొందరూ బతికి వుండి విప్లవానికి సేవ చేయగల్గుతున్నామంటే యాదగిరి అన్నలాంటి, శేఖరన్నలాంటి కార్మికుల నుండి మొదలుకొని సురేందర్ లాంటి పార్టీ కార్యకర్తల వరకు ఎందరో కాపాడుకోబట్టే రామూ. పోలీసులు మొదటి దెబ్బ నీ గురించే కొట్టారు తల్లీ, మా అవ్వ కూడా నన్నెన్నడూ కొట్టలే అంటూ రిలీజయ్యాక శేఖరన్న నాతో నవ్వుతూ అన్న మాటల్ని నేను ఎప్పటికీ మర్చిపోలేను'

చెప్పిన విషయం ఇంకించుకోవడానికీ రాముకీ, ఆ బరువైన జ్ఞాపకం నుండి తేరుకోవడానికి నాకూ కొంత సమయం పట్టింది.

'ఇలాగని చెప్పలేదు గానీ నాయిన గురించి ఎంతో గొప్పగా చెప్తా ఆయనలా ప్రాణత్యాగానికైనా సిద్ధపడాలనేవాడు నేనూ ట్రేడ్ యూనియన్‌లో పని చేయడం మొదలుపెట్టినప్పుడు. నాయిన, శేఖర్ సార్‌ల స్ఫూర్తి నాకూ ఎప్పటికీ వుంటుంది. నాయినను చూడకపోయినా శేఖర్ సారే నాకు అన్నీ...' వాక్యం పూర్తి చేయకుండానే ఆగిపోయాడు రాము. శేఖరన్నతో అతని అనుబంధం చాలా లోతైనది అని అర్థమౌతోంది.

యాదగిరి అన్న త్యాగం గురించి రాముకి చెప్పాక మనసు తేలికైంది. ఉదయం రాముని చూసినప్పటి నుండి ఏదో తెలియని అపరాధ భావన. శేఖరన్న ఈ కుటుంబాన్ని పట్టించుకుని వుండకపోతే ఇంకెంత అపరాధ భావన కుదిపేదో. ఎంతమంది శేఖరన్నలు పార్టీ దెబ్బ తిని కాంటాక్టు చేయలేని స్థితిలో పార్టీ సభ్యులుగా తమ కర్తవ్యాల్ని అమరవీరుల కుటుంబాల పట్ల కూడా నెరవేరుస్తూ వున్నారో...

ఇంకొక్క ప్రశ్న తొలుస్తోంది. అడక్కుండా వుండలేకపోయా.

'రామూ, చైతు శేఖరన్న విషయంలో చాలా వ్యతిరేకంగా...'

'తెలుసక్కా, నా ముంగట కూడా వాళ్లు లొల్లి పెట్టుకునేది. శేఖర్ సార్ విడిగా కూడా నాతో చెప్పుకుని బాధపడేవాడు'

'నీకెప్పుడైనా అలా అంటే నాయిన లేకుండా పెరగాల్సి వచ్చిందని, కుటుంబం దెబ్బ తింది ఈ రాజకీయాల వల్ల అని...?'

'ఊహు, ఎన్నడూ అట్లనిపియ్యలే. నాయిన లేకుండా పెరగడంలో ఎన్నో యిబ్బందుల పడ్డాం. నిజమే. కానీ నాయిన కరపత్రం, అమరవీరుల జీవిత చరిత్రలో ఆయన గురించి రాసింది చదువుతూ వుంటే చాలా ఉత్తేజంగా తోచేది. ఆయనలా నేనూ చరిత్రలో స్థానం సంపాదించుకోవాలి అనిపించేది. పార్టీ లేదు కదా అని బాధనిపించేది. ఎప్పటికైనా వస్తది, మనం తయారుగా వుండాలె అని శేఖర్ సార్ చెప్పేది. చైతన్నయ్య నాకంటే పెద్దవాడు, ఆయన ముందు నేను ఇప్పటికీ మాట్లాడలేను, కానీ ఆయన ఆలోచించేది తప్పు అని నాకు స్పష్టంగా తెలుసు. ఎవరితో నేను ఏమీ మాట్లాడకున్నా అందరికీ తెలుసు నా భావాలేంటో'

నా మనసు నుండి ఏదో పెద్ద భారాన్ని రాము అలా తీసి పక్కన పడేసినట్టనిపించింది. చైతుతో సంభాషణ కలిగించిన భారం కూడా అది అనిపించింది.

....

రాము టూ వీలర్ మీద నన్ను రాఘవులతో కలవడానికి నేను పెట్టుకున్న చోటు దగ్గర దింపాడు. రాముని రాఘవులుకి పరిచయం చేసి పంపేస్తుంటే తటపటాయిస్తూనే అడిగాడు.

'అమ్మకి చెప్పనాక్కా?'

మనసు ఊగింది కానీ గట్టిపరుచుకోక తప్పలేదు. పార్టీ ఆదేశాలు స్పష్టంగా వున్నాయి.

'వద్దులే రామూ, తర్వాతసారి చూద్దాం. వీలైతే కలవాలనే వుంది'

తలూపి బండి ఎక్కి వెళిపోతున్న రాముకేసి కనుమరుగు అయ్యేవరకు చూస్తూనే వున్నా. రాఘవులు వెళ్లి జీపు తీసుకుని వచ్చాడు. రెండు రోజులుగా నిద్ర లేదు. ముందూ కొద్ది రోజుల నుండి నిద్ర లేదు సరిగా. దాంతో జీపులో కూచోగానే నిద్ర ముంచుకొచ్చినట్టనిపించింది. కానీ పాపం రాఘవులుకి అర్ధం కాక ఏవో మాట్లాడాలని ప్రయత్నిస్తున్నాడు.

'ఎట్లా వున్నరక్కా? ఏం యిబ్బంది కాలే కదా?'

'ఏం యిబ్బంది కాలే, అక్కైతే అలాగే వుంది, పిల్లలు అంటే బాబే కలిశాడు, పాప లేదు, ఇంగ్లాండులో వుంది, బాబు మన రాజకీయాలతో లేడు మీరన్నట్టే'

'శేఖరన్న దగ్గర పెట్టినవి?'

'సారీ, చెప్పలే కదూ, భద్రంగా దొరికినట్టే. బ్యాగులో వున్నాయి. వాటితో పాటు శేఖరన్న మనకో సందేశం కూడా వదిలిపోయినట్టు...'

'ఉత్తరం కూడా రాసి పెట్టాడా?'

'ఉత్తరం కాదు డాక్యుమెంటే రాసినట్టు'

'డాక్యుమెంటా?'

'ఊ, తన ఆచరణతో. దీన్ని ఆయన దాపెట్టిన తీరు, మనకందించడానికి ఎంచుకున్న మార్గం మనం మళ్లా ఎక్కడ మొదలవ్వాలో చెప్పకనే చెప్పినట్టనిపిస్తుంది. పార్టీకన్నేండ్లు దూరం వున్నా పార్టీ ఆలోచనలకు ఎంత దగ్గరగా వున్నాడు అన్న నిజంగా. కార్మికవర్గం అని నిరూపించుకున్నట్టు!'

'ఎట్లక్కా, సమజైతలేదు'

'చెప్తా, చెప్తా, వివరంగానే చెప్తా. పార్టీ మళ్లీ ఇక్కడకు ఎప్పుడు ఆర్గనైజర్లను పంపిస్తుందో చెప్పలేం గానీ, ఇక్కడే వుంటున్న నీలాంటి పార్టీ సభ్యులకైతే అర్ధం కావాలి. పార్టీ పనులు ఏవో చేస్తూనే వున్నావు కానీ మొదలు ఏంటో, ఎక్కడ మొదలవ్వాలో నీకు 'సమజ్ చేయించకుంటే' ఎలా? తప్పక చెప్తాను. కానీ నిద్ర ముంచుకొస్తోంది రాఘవులూ. కాసేపు పడుకుంటా మనం ఆగాల్సిన చోటు వరకు. ఆగాక మాట్లాడుకుందాం' అన్నా వెనక్కి ఒరుగుతూ.

రాఘవులు ఇంకేం మాట్లాడకుండా జీపును ఉరికించాడు.

రిపోర్టు

ఇవాళ ఏమి రాయాలి, ఎలా రాయాలి?
వర్తమాన విప్లవ కథపై వర్క్‌షాపుల్లో సమాలోచన

- పి. వరలక్ష్మి

ఒక చీమ రోజూ ఆఫీసుకు పోయేది. ఆడుతూ పాడుతూ పని చేసేది. అది పని చేసే చోట మంచి ఉత్పత్తి వచ్చేది. సిఈవో సింహం చీమను చూసి సంతోషించేవాడు. ఒక రోజు అతను ఇలా ఆలోచించాడు. చీమ దానంతటది పనిచేస్తేనే ఇంత బాగా చేస్తోందే, దీని పైన ఒక మంచి సూపర్‌వైజర్‌ను పెడితే ఇంకెంత బాగా పనిచేస్తుందో అని. ఆలోచన వచ్చిందే తడవుగా ఒక బొద్దింకను సూపర్‌వైజర్‌గా నియమించాడు. బొద్దింక అప్పటిదాకా లేని టైమ్ షీట్‌లు, అటెండెన్స్‌లు ప్రవేశపెట్టింది. వీటిన్నిటినీ చూసుకోడానికి ఒక సాలీడు సెక్రెటరీని అది నియమించుకుంది. సింహంగారు మెచ్చుకుంటూనే ఈ మార్పుల వల్ల ఉత్పత్తి ఎంత పెరిగింది, పనివిధానానికి సంబంధించిన రిపోర్టులు వగైరా అడిగారు. ఇవన్నీ చేయడానికి బొద్దింక కంప్యూటర్‌ను, ప్రింటర్‌ను తెప్పించుకుని, వాటిని ఆపరేట్ చేయడానికి ఈగను నియమించింది. మరోవైపు ఆడుతూ పాడుతూ పనిచేసే చీమ నీరసించడం మొదలైంది. అది చేసే పనికితోడు పైఅధికార్లతో మీటింగులు, ఎప్పటికప్పుడు అందేయాల్సిన రిపోర్టులు దాని నెత్తిమీదికొచ్చి పడ్డాయి. ఈలోగా బొద్దింక అధికారికి తోడు మరో మేనేజరు, వీళ్ళ హోదాకు తగినట్లు ఆఫీసుకు కొత్త హంగులు, ఆర్భాటాలు తయారైనాయి. క్రమంగా చీమకే కాదు ఆఫీసులో ఎవరికీ పని పట్ల ఆసక్తి లేకుండాపోయింది. ఉత్పత్తి పడిపోయింది. సీఈవో సింహంగారు ఈ సమస్యను పరిష్కరించే పని కన్సల్టెంట్ గుడ్లగూబకు అప్పగించారు. ఇలాంటి సమస్యలకు పరిష్కారాలు కనుక్కోవడంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన గుడ్లగూబగారు ఆఫీసు స్థితిగతుల్ని అధ్యయనం చేసి అక్కడ అనవసర సిబ్బంది చాలా ఎక్కువగా ఉన్నారని తెల్చారు. వెంటనే సింహం, బొద్దింక మీటింగ్ పెట్టుకుని కొంతకాలంగా పనిపట్ల అలసత్వం ప్రదర్శిస్తున్న చీమను పనిలోనుండి తొలగించాలని తీర్మానం చేశాయి.

ఇదొక ఈజిప్టు కథ. ఈ కథ రాసిన రచయితను దేశం నుండి బహిష్కరించారట. గత ఆరేదేళ్లుగా క్రమం తప్పకుండా జరుగుతున్న విరసం కథావర్క్‌షాపుల్లో వర్తమాన విప్లవ కథ గురించిన లోతైన సమాలోచనలు సాగుతున్నాయి. మరీ ముఖ్యంగా గత రెండుమూడు వర్క్‌షాపుల్లో ఏం రాయాలి, ఎలా రాయాలి అనే చర్చ ప్రధానంగా సాగుతోంది. వర్తమాన సమాజాన్ని, సంక్షోభంలో కూరుకపోతున్న జీవితాన్ని, అందులోంచి నిర్మాణాత్మకంగానూ, స్పాంటేనియస్‌గానూ పెల్లుబుకుతున్న పోరాటాలను ఎలా కథలుగా మలచవలసి ఉన్నది? వీటన్నిటినీ చిత్రించవలసిన దృక్పథం, ఈ సంక్షోభాలను, పోరాటాలను పట్టివ్వగల శిల్పం ఈ సమావేశాల్లో ఎక్కువ చర్చనీయాంశం అవుతున్నది. సమాజంలో మార్పులు వేగవంతమవుతున్న కొద్దీ వాటిని పట్టుకోడానికి సాహిత్యంలో ఎప్పటికప్పుడు కొత్త పరికరాల తయారు చేసుకోవాల్సి ఉంటుంది. ఉన్న పరికరాల్ని చాకచక్యంగా వాడాల్సి ఉంటుంది. ప్రొద్దుటూరు కథావర్క్‌షాపులో (సెప్టెంబర్ 8,9- 2012) ఈ చర్చ జరుగుతుండగా అల్లం రాజయ్య పైన చెప్పిన చీమ కథను పరిచయం చేశారు. పెట్టుబడిదారీ వ్యవస్థలోని అసంబద్ధతను, దుర్మార్గాన్ని చాలా అలవోకగా, అద్భుతంగా ఆవిష్కరించిన కథ అని చెప్పారు. అలాంటి మరో అద్భుతమైన శిల్పంతో మార్క్వెజ్ రాసిన డెంటిస్ట్ అనే కథను కూర్మనాథ్ పరిచయం చేశారు.

మన కథలో మార్పుకు సంబంధించిన అంశం కీలకంగా ఉండాలి. అట్లాగే మారుతున్న సామాజిక పరిస్థితుల్ని చిత్రీకరిస్తున్న క్రమంలో సాహిత్యం కొత్త కొత్త వ్యక్తీకరణల్ని తీసుకొని రావాలి. జీవన స్థితిగతులు మారినట్టే సాహిత్యంలో కాలానికి తగిన ఎక్స్‌ప్రెషన్ తీసుకోవాలి. ఈ మధ్య గాన్ విత్ ద విండ్ తెలుగులో చదివుతున్నప్పుడు మార్పుకు సంబంధించిన అద్భుతమైన వ్యక్తీకరణ అందులో కనపడింది. అట్లాంటాలో జరిగిన అనేక సంఘర్షణలు భూస్వామ్య సమాజం నుండి పెట్టుబడిదారీ సమాజానికి మార్పులు కనిపిస్తాయి. తెలంగాణ సాంస్కృతిక వ్యక్తీకరణను పోలినవి అందులో చాలా ఉన్నాయి. మాలాంటి వాళ్ళం స్కార్లెట్‌తో, బట్లర్‌తో (గాన్ విత్ ద విండ్ నవలలో పాత్రలు) పోల్చుకోవలసిందే. ఇక్కడా అనేక కోటలు కరిగిపోయాయి. పరిణామాలు చాలా జరుగుతున్నాయి...అంటూ అల్లం రాజయ్య ప్రారంభించిన చర్చలో గ్రామీణ సమాజం నుండి ప్రపంచ రాజకీయాల వరకూ అనేక ఆసక్తికరమైన విషయాలను హాజరైనవాళ్లు ప్రస్తావించి విశ్లేషించారు.

సమాజంలో ఒక ఘటన జరిగేలోపే ఇంకో ఘటన జరిగిపోతూ ఉంది. ఇంత డైనమిక్‌గా సమాజం మారుతూ వస్తున్నప్పుడు ఏ కథ రాయాలి? ఏ ఇతివృత్తం రాయాలి? వ్యక్తం కాని విషయాలను ఎట్లా వ్యక్తం చేయాలి? అనే సమస్యలు సీరియస్ రచయితల ముందు ఉన్నాయి. మన సాహిత్యంలో ఎక్స్‌ప్రెషన్‌కు సంబంధించి చాలా ఇబ్బందులున్నాయి. శిల్పపరంగా చాలా నేర్చుకోవాల్సే ఉంది. లాటిన్ అమెరికన్ సాహిత్యంలో మంచి ప్రయోగాలున్నాయి. మనం ఇక్కడ చేయవలసిన ప్రయోగాలు ఏమిటి? విప్లవ దృక్పథంతో ఎలా ఆ వస్తువులన్నింటిని అర్థం చేసుకోడానికి ఎలా విస్తరించాల్సి ఉంది? అనే దిశగా ప్రొద్దుటూరు వర్క్‌షాపులో మొదటి రోజంతా చర్చ జరిగింది. ఈ విషయంలో వర్క్‌షాపులన్నిటిలో ప్రతిసారీ జరుగుతున్న చర్చ ఈసారి మరింత ముందుకు తీసికెళ్లగలిగామని అందరికీ అనిపించింది.

ఈ చర్చ కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా విప్లవ కథా రచనలో చాలా వరకు వ్యక్తమవుతూనే ఉంది. నిజానికి విరసం 1980ల నుంచి నిర్వహిస్తున్న కథా వర్క్‌షాపులన్నీ ఈ కోణంలో చాలా మంచి ఫలితాలను ఇస్తూనే వచ్చాయి. ప్రతి దశలోనూ ఆ సామాజిక, ఉద్యమ సన్నివేశానికి అనుగుణంగా విప్లవ కథను తీర్చిదిద్దడానికి దోహదపడుతున్నాయి. దృక్పథం, శిల్పం వగైరాల్లో మెళకువలు అందిస్తున్నాయి. ఇంతే ముఖ్యమైన విషయం మరొకటి ఏమంటే- విప్లవ కథా రచనలోకి మూడు నాలుగు తరాల రచయితలను ఈ వర్క్‌షాపులే తీసుకొని వచ్చాయి. విరసం సభ్యులతోపాటు ఈనాడు సుప్రసిద్ధ కథకులుగా గుర్తింపు పొందిన మార్క్సిస్టు రచయితల్లో చాలా మంది విరసం వర్క్‌షాపుల్లో పాల్గొన్నవాళ్లే. నిర్దిష్టంగా విరసంలో ఈ

తరం కథా రచయితలందరూ చాలా వరకు ఈ సమావేశాల్లో మెళకువలు నేర్చుకున్నవారే. వర్క్‌షాపులే కథలకులను తయారు చేయకపోవచ్చుగాని, రచన పట్ల ఆసక్తి ఉన్నవాళ్లను మేలైన కథకులుగా తీర్చిదిద్దడంలో ఈ వర్క్‌షాపులు గణనీయమైన ఫలితాలను ఇస్తున్నాయి. సీనియర్ కథకులనుంచి ఔత్సాహిక రచయిత దాకా.. విరసం సభ్యులు, సోదర రచయితలు పాల్గొంటున్న ఈ సమావేశాల్లో కథా పఠనం జరిగాక ఆ నిర్దిష్ట కథ విశ్లేషణేగాక, సాధారణస్థాయిలో కథా సాహిత్యంలో రావలసిన మార్పుల దాకా విస్తరిస్తాయి. ఇవి ఆ తర్వాత కథలు రాయడానికి ఉపయోగపడుతున్నాయి.

ఆరేడేళ్ళుగా ఈ సమావేశాల్లో వర్తమానంలో ఏం రాయాలి, ఎలా రాయాలి అని జరుగుతున్న చర్చ అనుత్పాదకంగా మిగిలిపోలేదు. కొత్త కథకుల్ని తయారుచేయడమే కాక, ఈ చర్చల సారాంశం ప్రయోగాల్లో, దృక్పథ స్పష్టతలో వ్యక్తమవుతోంది. దీనికి ప్రొద్దుటూరు, మిర్యాలగూడ (మార్చి 9,10- 2013) వర్క్‌షాపుల్లో వచ్చిన వైవిధ్యభరితమైన కథలే ఉదాహరణ. ఈ రెండు సమావేశాల్లో చదివిన ప్రతి కథ దానికదే ప్రత్యేకమైనదీ, అవసరమైనదీ అయినా ఇక్కడ కొన్నిటి గురించే ప్రస్తావిస్తాను. ఇక్కడ చదివి, చర్చించి సవరించిన కథల్లో కొన్ని ఇప్పటికే అచ్చయ్యాయి కూడా. అందు వల్ల వర్తమాన కథ కోసం జరుగుతున్న ప్రయత్నానికి ఉదాహరణగా కొన్ని వివరాలు రాస్తాను.

ఒకే ఇతివృత్తం మీద రెండు కథలు (దోషులు, రాజుగారి పులిస్వారీ) తీసుకొచ్చారు కూర్మనాథ్. సత్యం ఐటి కంపెనీ పేకమేడలు కుప్పకూలడం కేంద్రంగా తీసుకొని రాసిన కథలు ఇవి. ఫైనాన్స్ వ్యవహారాలు రాసే జర్నలిస్టులు అబద్ధాలపై, భ్రమలపై ఆధారపడి రాయడం గురించి, కార్పొరేట్ శక్తులు, రాజకీయ వ్యవస్థ, మీడియా కలగలసిపోయి పత్రికా వ్యవస్థను భ్రష్టుపట్టించడం మొదటి కథలో కనపడుతుంది. రెండోది ఫైనాన్స్ కాపిటల్ వలయంలో పడి పులిస్వారీ చేస్తున్న వ్యాపారవేత్త గురించిన కథ. నిజానికి రెండూ వేరువేరు కథలు. ఒక విషయాన్ని గురించి ఆలోచిస్తున్నప్పుడు ఇట్లా భిన్నకోణాల్లో వ్యక్తీకరించే ప్రయత్నం చేయడం అరుదైన విషయమే.

ఒక కార్పొరేటు కంపెనీ అట్టహాసంగా జరిపిన తెలుగు మహాసభలను, గ్రామంలో జరిగే తిరుణాలను పోలుస్తూ రుక్మిణి రాసిన కంపెనీ తిరుణాల కథలో చివరికి తెలుగుభాషను, సంస్కృతిని ఉద్ధరిస్తున్నామని చాటుకుని, రచయితల, భాషాపండితుల చేత ప్రశంశలందుకున్న కంపెనీ ప్రాణాంతక రసాయనాలను వదిలి ప్రజల ఎదుట ద్రోహిగా నిలబడుతుంది. భాషాసంస్కృతులు పుస్తకాల కందే మామూలు విషయాలు కావని, అవి ప్రజల జీవనంతో పెనవేసుకున్నవన్న సత్యాన్ని విస్మరించి, పైపై ఆర్భాటాలకు లొంగిపోయే సాహిత్యకారులను చూసి రచయిత్రి ఈ కథ రాశారు. సమకాలీన సాహిత్యరంగానికి, కార్పొరేట్ శక్తులకు ఉన్న సంబంధాన్ని చాటే తాజా ఇతివృత్తం ఇది. రుక్మిణి మిర్యాలగూడ వర్గషాపుకు మరో భిన్నకథాంశంతో వచ్చారు. ఒకప్పుడు విప్లవ విద్యార్థి ఉద్యమ రాజకీయాలతో ప్రభావితమైన తెలుగుసమాజం చాలా మార్పుల గుండా ప్రయాణం చేసింది. ఒక తరం గడిచాక, ప్రపంచ మార్కెట్‌కు మన సమాజం ప్రయోగశాల అయ్యాక విలువలూ, ఆదర్శాలూ మారిపోయాయని తల్లిదండ్రులు విచారించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తమ ఆదర్శాలను పిల్లలకు అందించలేకపోయామని, లోపం ఎక్కడో జరిగిందని వాళ్లు తర్కించుకోవలసి వచ్చింది. తల్లిదండ్రుల సామాజిక ఆచరణలోనే ఉన్న లోపం, కుటుంబం లోపల ఉన్న పరిమితులు, బైటి ప్రభావాలు.. ఏవి ఏ స్థాయిలో పిల్లలను ప్రభావితం చేస్తున్నాయో ఆలోచింపజేస్తూ సాగిన కథ ఇది. ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నవాళ్లలో ముఖ్యంగా మధ్యవయస్కులు ఈ కథతో మమేకయ్యారు.

విజయలక్ష్మి ప్రొద్దుటూరు సమావేశంలో నెల్లూరుజిల్లాలోని ఒక పల్లెటూరులో వీధి అరుగుమీద కూర్చున్న పెద్దాయన కేంద్రంగా నడిపిన కథను ప్రొద్దుటూరులో చదివారు. నిజానికి ఈ కథలో ఆయన చుట్టూ గ్రామీణ సమాజమంతా పరిభ్రమిస్తుంటుంది. కుటుంబ సమస్యలు, గిట్టుబాటుకాని పంటలు, పట్నంలో చదువులు, పల్లె జీవితంలో సంక్లిష్టమైన కదలికల్ని గమనిస్తూ, వ్యాఖ్యానిస్తూ సాగిన ప్రయోగాత్మక కథ. హాస్యం, ఎత్తిపొడుపులు, సామెతలు గ్రామీణ పలుకుబళ్లు నిండుగా ఉన్న కథ ఇది.

కథా ప్రక్రియలోకి తాజాగా ప్రవేశించిన పావని అంతే తాజా వ్యక్తీకరణతో పట్టణ మధ్యతరగతి విద్యార్థుల సరదా సరదా సంభాషణలతో రాసిన కథ కొన్ని రంగులూ.. ఒక కల. రాజకీయాలు, ఉద్యమాలూ, స్నేహాలూ, ప్రేమలూ, ఆదర్శాలూ ఇప్పటి తరంలో ఎట్లా వ్యక్తమవుతున్నాయో ఈనాటి భాషలో, సంస్కృతిలో వ్యక్తం చేసిన కథ ఇది. ఈ తరంలో ఎంత పరిణతిగల మనుషులు ఉన్నారో కూడా ఆశావహంగా ఈ కథ నడిచింది. మిర్యాలగూడాలో ఇంకొన్ని మంచి కథలు వచ్చినా పావని చదివిన కథ విన్నాక అందరూ చాలా తాజాగా ఫీలయ్యారు. ఇవాల్టి జీవితంలో ఎంత సంక్లిష్టత ఉన్నా ఆశారేఖ కూడా అందులో ఉందని చాటే కథ ఇది.

వస్తువ్యామోహం వల్ల ఈ తరం పిల్లల్లో ఎలాంటి మార్పులు వస్తున్నాయో సుభాషిణి ఒక కథ వినిపించారు. పిల్లలను మన ఆదర్శాల ప్రకారం పెంచాలనుకున్నా వాస్తవానికి వాళ్లను రూపొందిస్తున్న వ్యవస్థ ఒకటి ఉందని, ఈ తరహా పోరులు లేకుండా అది బతకలేదనే లోతైన అర్థం పలికే కథ ఇది. సరిగ్గా ఈ సమస్యనే వి. ప్రతిమ చదువుల వైపు నుంచి డీల్ చేశారు. పిల్లలకు కనీసం తమ పేరుకు ఉన్న అర్థం ఏమిటో కూడా తెలునుకునే వీలు లేని విధంగా ఈ చదువులు తయారైపోయాయనే సున్నితమైన విమర్శ ప్రకటించే కథను చదివారు. సుభాషిణి, ప్రతిమ కథలు ఈ స్థితికి ఏదైనా ప్రత్యామ్నాయం ఉంటుందా? అనే ఆశతో ముగుస్తాయి.

ఈ స్థితిని ఎలా అర్థం చేసుకోవాలి? ప్రగతిశీల కథకులు దీని మీద ఎలాంటి కథలు రాయాల్సి ఉంటుంది? అనే చర్చ జరిగే క్రమంలో పాణి దండకారణ్య కథలను క్లుప్తంగా ఇలా పరిచయం చేశారు.

తెలుగుసాహిత్యంలో ఇప్పుడొస్తున్న కథల గురించి, రావాలసిన కథల గురించి చర్చించవలసింది చాలనే ఉంది. అయితే మన పక్కనే ప్రధాన స్రవంతి పత్రికలుగాని, తెలుగుసాహిత్య సమాజంగాని పట్టించుకోని కథలు కూడా ఉన్నాయి అవి దండకారణ్యం నుంచి వస్తున్నాయి. వాటిలో అద్భుతమైన ప్రయోగాలు ఉంటున్నాయి. ముఖ్యంగా ఈ నాలుగైదేళ్ళుగా యుద్ధం, ఉత్పత్తి, నిర్మాణం మధ్య అల్లకల్లోలంగా ఉన్న దండకారణ్యం నుండి నూతన సమాజాన్ని, నూతన మానవుడ్ని ఆవిష్కరిస్తున్న కథలు వస్తున్నాయి. ఇక్కడ మన జీవితంలో సంక్లిష్టమైన సమస్యలు ఆవరించి ఉన్నాయి. పరిష్కారం తెలీని సందిగ్ధత, స్టాగ్నేషన్ ఆవరించి ఉన్నది. ఇక్కడ నడుస్తున్న పోరాటాలు ఈ స్థితి మీద ఒక ఆచరణాత్మక విమర్శ పెడుతున్నా, పరిష్కారాలు ఇలా ఉంటాయని చెబుతున్నా.. మొత్తం మీద ఒక సందిగ్ధ స్థితి ఉన్న మాట వాస్తవమే. అయితే దండకారణ్య కథల్లో ప్రతి కథకూ ఒక పరిష్కారం ఉంటుంది. దీనిని మామూలు సాహిత్యకారులు అంగీకరించకపోవచ్చు.

ఇది మూస వ్యవహారమని ఈసడించుకోవచ్చు. కానీ దండకారణ్యంలో జరుగుతున్న పోరాటం, నిర్మాణం ప్రతి సమస్యతో ఆచరణాత్మకంగా ఎదుర్కొంటున్నాయి. ఈ క్రమంలో చైతన్యవంతులవుతున్న ఆదివాసులు దానికి ఒక పరిష్కారాన్ని కూడా వెతుక్కుంటున్నారు. ఈ క్రమం అక్కడి కథా వస్తువులో, దృక్పథంలో, శిల్పంలో కనిపిస్తుంది. ఈ కథల్ని ఎక్కువగా మహిళలు రాయడం కూడా ఒక ప్రత్యేకత. ఆదివాసీ తెగలు పితృస్వామ్యాన్ని, రాజ్యహింసను ఎదుర్కొంటూ యుద్ధంలోనూ, ఉత్పత్తిలోనూ, నూతన సమాజ నిర్మాణంలోనూ పాల్గొంటున్నాయి. ఇది ఒక సామాజిక రాజకీయ పరివర్తనా క్రమం. అందువల్ల అరుణతార ఈ తరహా రాజకీయ కథలకు వేదికవుతున్నది. వీటికి విస్తృత ప్రచారాన్ని ఇవ్వాల్సిన అవసరం కూడా ఉన్నది... అంటూ చాలా వైవిధ్యమైన వస్తువులు, శిల్ప పద్ధతులు ఉన్న ఆరు కథల్ని తీసుకొని పరిచయం చేశారు. సల్వాజుడుం, ఉద్యమం నేర్పుతున్న ప్రత్యమ్నాయ చదువులు, విలువలు, యుద్ధం, రాజ్యనిర్బంధం, జైలుజీవితం, వీటన్నిటి నేపథ్యంలో మానవసంబంధాలను తీర్చిదిద్దుతున్న వర్గపోరాటం గురించి ఆ కథలు ఎలా చిత్రించిందీ విశ్లేషించారు. (కొన్ని దండకారణ్య కథలతో త్వరలో విరసం సంకలనం తేబోతున్నది)

మిర్యాలగూడా సమావేశంలో స్త్రైబాబ తెలంగాణ ఉద్యమ సమయ సందర్భాల్లో రాసిన కథ చదివారు. తన ఊరికి దూరంగా, గతంలో తానున్న స్థితికి దూరంగా ఉన్నత స్థాయి జీవితం గడుపుతున్న వ్యక్తి వైపు నుంచి కథ నడుస్తుంది. అతడికి ఇప్పటికీ గ్రామంలో ఆనాటిలాగే బతుకుతున్న మిత్రుడితో స్నేహం కొనసాగుతూ ఉంటుంది. తన జీవన విధానంపట్ల అసంతృప్తితో ఆ మిత్రుడ్ని కలవడానికి గ్రామానికి వెళ్తాడు. అక్కడ కనిపించే వాస్తవికత అతడిని సంక్షోభంలో పడేస్తుంది. అక్కడ మిత్రుడి కొడుకు గ్రామాల్లో చేస్తున్న కార్యకలాపాలను తెలుసుకున్నాక అంత వరకు తాననకున్న జీవన ప్రమాణాల విచికిత్సకు గురవుతాడు. వర్తమాన పరిణామాల్లోని వాస్తవికతను ఈ కథ ప్రతిబింబించిందనే కోణంలో చర్చ జరిగింది. తెలంగాణ గ్రామ వాతావరణం, భాష కథలో బాగా కనిపించింది. అయితే మిత్రుడి కొడుకు ఎంచుకున్న మార్గంలో సమస్యలు పరిష్కారమవుతాయా? మొత్తంగా ఇలాంటి పరిణామాలకు ఒక ఆశావహమైన ముగింపుఎలా ఉంటుంది? అనే దిశగా చర్చ సాగింది.

కథా వస్తువుకోసం అన్వేషిస్తున్న రచయితకు ఊరి నుండి కాసిన్ని పండ్లు తెచ్చుకుని అమ్ముకునేందుకు జాగా కోసం వెతుకుతున్న మనిషి కనపడతాడు. అతను జాగాకోసం ఎన్నెన్ని తిప్పలు పడతాడో, ఎన్ని శక్తులతో ఘర్షణ పడతాడో అసక్తికరంగా ఫాలో అయిచూస్తుంటాడు. రచయితకు కథా వస్తువు దొరుకుతుంది కాని ఆ మనిషికి జాగా మాత్రం దొరకదు. రియల్ ఎస్టేట్, భారీ నిర్మాణాల వల్ల ఒక వైపు విస్తరిస్తున్నట్లు కనిపించే నగరాలు నిజానికి ఎంతగా కుంచించుకుపోతున్నదీ, సామాన్యుడికి నిలబడటానికి కాసింత నీడ కూడా ఎట్లా కరువైపోతున్నదీ మిర్యాలగూడా సమావేశంలో ఉదయమిత్ర 'జాగా' అనే కథ చదివారు. అలాంటిదే మరో కొత్త ఇతివృత్తంతో చిన్న కథ చదివారు. బహుశా అన్ని ప్రాంతాల్లో నదుల్లో, వంకల్లో జరుగుతున్న ఇసుక దొంగతనం గురించి రాసిన కథ ఇది. ఇసుక మాఫియా తక్షణ సమస్యగానేగాక, దీర్ఘకాలంలో పర్యావరణ సమస్యగా కూడా ఎట్లా మారబోతోందో వాస్తవికతా శిల్పంలో ఈ కథ చిత్రించింది. ఒక రకంగా గ్రామస్థాయి నుంచి లుంపెన్ సెక్షన్ ఇసుక రవాణాతో ఎలా తయారవుతున్నదీ, పట్టణీకరణ నేపథ్యాన్ని కూడా ఇది చిత్రించింది.

పాణి రాసిన రాజకుమారుడు.. కార్పేటమ్మ అనే కథ ప్రత్యేకమైన శిల్పంలో సాగింది. వ్యంగ్యం, ఫాంటసీ, వాస్తవికతలతో మూడు విభాగాలుగా గనుల రాజకీయార్థిక మూలాలను తడిమిన కథ ఇది. తాజా ఇతివృత్తంతో, కొత్త శిల్పంలో సాగింది.

ముస్లిం జీవిత నేపథ్యంలో పితృస్వామ్య ఆధిక్యాన్ని ధైర్యంగా ఎదిరించిన మహిళ గురించి మహమూద్ ప్రొద్దుటూరులో ఒక కథ వినిపించారు. ఈ తరహా కథల్లో వర్క్‌షాపులకు వచ్చిన కథల్లో ఇది అందరినీ ఆకట్టుకుంది. ఈ సమస్య ముస్లిం కుటుంబాల్లో ఎలా ఉండేదీ ఇది చిత్రించింది. అక్కడే బాసిత్ మబ్బులు తొలిగిన ఆకాశం అనే కథ చదివారు. ఇది కూడా మారుతున్న మానవ సంబంధాల్లోకి, విలువల్లోకి అందం, రంగు అనేవి కూడా ఎట్లా ప్రవేశించిందీ చెప్తూ వీటన్నిటికంటే జీవన విలువలపట్ల మనిషి అంతిమంగా మొగ్గు చూపుతాడనే కోణంలో ఈ కథ సాగింది. పైకి చాలా చిన్న ఇతివృత్తాలుగా కనిపించినా సామాజిక నేపథ్యంపట్ల రచయితలకు దృష్టి ఉంటే వీటినే ఎంత లోతుల్లోంచి వివరించవచ్చో ఈ కథలు నిరూపిస్తాయి.

ఇంతకూ ఇటీవల సమాజంలో మన కంటికి కనిపిస్తూ, అనుభవంలో భాగమవుతూ, జ్ఞానానికి అర్థమవుతూ ఎన్ని రకాల మార్పులు జరుగుతున్నాయి? కథకులు వీటిలో ఎన్నిటి గురించి ఎంత శ్రద్ధగా, సరైన దృక్పథంతో రాస్తున్నారు? అసలు కథల్లోకి రాకుండా ఉండిపోయిన పరిణామాలు ఏమిటి? అనే దిశగా ప్రొద్దుటూరులో వెంకటకృష్ణ ఒక ఆసక్తికరమైన పరిశీలనాత్మక ప్రసంగం చేశారు. ముఖ్యంగా గ్రామ స్థాయిలో వ్యవస్థ ప్రజలను తనలో భాగం చేసుకోడానికి ఎన్ని రూపాల్లో, ఎన్ని పథకాలతో ప్రయత్నిస్తోందో చెప్పి, అవి అక్కడి జీవితాన్ని చాలా పెద్ద ఎత్తున ప్రభావితం చేస్తున్నాయని విశ్లేషించారు. అయితే వీటి గురించి మన కథకులకు అంతగా పట్టలేదనే చెప్పాలి. కొన్ని మార్పులు కథా వస్తువులుగా స్వీకరించినా అంత బలంగా కథలు రాలేదనే చెప్పాలి.. అని విశ్లేషించారు. అట్లాగే విప్లవ కథకులు ఏ రకమైన వస్తువులపై ప్రత్యేకమైన శ్రద్ధ పెడుతున్నదీ ఎత్తి చూపి, అంతగా పట్టించుకోని ఇతివృత్తాల గురించి గుర్తు చేశారు. ప్రత్యేకంగా విప్లవోద్యమం మీద విమర్శనాత్మక వైఖరితో విరసం సభ్యులు ఎందుకు రాయకూడదు? అని ప్రశ్నిస్తూ.. ఇటీవలి విప్లవ కథలోని వైవిధ్యాన్ని స్థూలంగా అంచనా వేశారు.

వెంకటకృష్ణ వేసిన ప్రశ్నపై కూర్మనాథ్ స్పందిస్తూ.. విప్లవోద్యమం మీద ఎవరికైనా విమర్శనాత్మక అభిప్రాయాలే ఉండవచ్చు. అయితే నేను మాత్రం అవి కథల్లో రాయను. వాటి గురించి నేను చర్చించే పద్ధతి వేరేగా ఉంటుంది. అవి కథల్లోకి తేవాలని అనుకోను. అసలు దానితో కలిసి నడవకుండా, దాని మార్పులేమిటో సన్నిహితంగా తెలుసుకోకుండా విమర్శనాత్మకంగా రాయడం ఎలా సాధ్యమవుతుంది? అన్నారు.

ఇదంతా ఈ రెండు సమావేశాల్లోని కొన్ని కథల గురించే. అన్నిటి గురించీ ఇలాంటి విశ్లేషణలే ఇవ్వవచ్చు. మొత్తం మీద ఈ రెండు సమావేశాల్లో వర్తమాన జీవితాన్ని.. దాని మొత్తంలో భాగంగా, దాని సంక్లిష్ట సారాంశంలో భాగంగా ఎలా కథలు రాయాలి? అనే చర్చ ప్రధానం. కొత్త పరికరాలతో, కొత్త శిల్ప పద్ధతులతో గాఢంగా విప్లవ కథను ఎలా అభివృద్ధి చేయాలనేదే వర్క్‌షాపుల ఇతివృత్తం. మారుతున్న సమాజాన్ని.. మారుతున్న విప్లవోద్యమాన్ని, ప్రజాపోరాటాలను దృష్టిలో పెట్టుకొని కథ అభివృద్ధి చెందాల్సి ఉంది. పరివర్తనాదశలో ఉన్న మొత్తం సమాజాన్ని ప్రతిబింబించడం, అందులోని మార్పు క్రమాలను చిత్రించడం ఇవాళ్లి విప్లవ కథలకుల లక్ష్యం. ఆ దిశగా సాగడానికి ఈ సమావేశాలు స్ఫూర్తిని ఇస్తున్నాయి.

సీరియల్

సూర్యోదయ

- కె.వి. కూర్మనాథ్



ఆర్టిస్టు : రాయ్ లిచ్టెన్‌స్టిన్

(9)

(గత సంచిక తరువాయి...)

నీలిమ - మాజీ కార్యకర్త

కార్యకర్తలతోటో, కార్యకర్తలు కాని వాళ్ళతోటో మాట్లాడడం కష్టం కాదు. కానీ నీలిమలాంటి వాళ్ళతో మాట్లాడడం అంత సులభం కాదు. నీకు తెలుసు వాళ్ళు పనిచేసి వచ్చారని, కానీ ఏయే కారణాలతో వెనక్కి వచ్చారో, లేదా ఏయే మనుషుల వల్ల వచ్చారో, అసలు వెనక్కి రావడం అంటే ఒప్పుకుంటారో ఒప్పుకోరో, ఒక సందేహం కాదు. వెనక్కి వచ్చిన వాళ్ళందర్నీ ఒకే గాటన కట్టగలమా? వుద్యమం మీద విమర్శతో నిందారోపణలు చేసే వాళ్ళు కొందరు. ఇంకొందరికీ వుద్యమం అవసరం తెలుసు. వుద్యమం లో ఎక్కడో ఒకచోట సంబంధాన్ని నిలుపుకుంటూనే, తమ ప్రశ్నల్ని అడిగేవారు కొందరు. వాళ్ళ గురించి తెలుస్తూనే వుంటాయి విషయాలు. ఇంకొన్నేళ్లు వాళ్ళు పనిచేసి వుండగలరని. వాళ్ళకింకా వుద్యమం మీద లేశమాత్రమైనా సందేహం లేదని.

ఏయే కారణాలు, ఏయే మనుషులు ఎంతెంత వాళ్ళని తొలిచివేసాయో, కలిచివేసాయో, ఆయా గాయాల లోతెంతో ఎన్నటికీ మనకి తెలిసే అవకాశం లేదు. ఇక ఆలోతే తెలీనపుడు ఆయా లోతుల్లో వాళ్ళు పడే వేదన ఎంతో తెలిసే అవకాశం లేదు. బాధ, దుఖ్ఖము చిత్రమైనవి. మనం ఎంత సహానుభూతి చెందినప్పటికీ, బాధ పడుతున్న వాళ్ళ బాధని ఎంతమేర అర్థం చేసుకోగలం? ఎవరిదైనా దుఖ్ఖాన్ని ఎంతవరకు కొలవగలం?

ఎపుడో ఏదో క్షణాన దుఖ్ఖము పొర్లుకు వస్తుంది. ఎందుకొస్తుందో తెలీదు. ఎన్నటి గాయమో హఠాత్తుగా రేగి పెను దుఖ్ఖము కబళించివేస్తుంది. బాధ, దుఖ్ఖము హృదయంలోంచి, మెదడు లోలోపలి పొరల్లోంచి వుబికి వచ్చి నొప్పి కండరాల్లోకి ప్రవహిస్తుంది. మనకి తెలీకుండానో ముఖం కండరాల్లోకి అనువాదమౌతుంది. బాధ నెమ్మదిగా కంటి చుట్టూ ముడుచుకుపోయిన మడతల్లోకి ప్రవేశిస్తుంది. మెదడు లోపలి నరాలు నలిగిపోతాయి. ఏక్షణాన పగిలి పోతాయో, ఏక్షణాన ఏయే వికృత జ్ఞాపకాలని మనో నేత్రాలముందుకు తోసుకువస్తాయో తెలీదు.

నీలిమని కలవడం మొదటిసారి కాదు. చాలా ఏళ్లుగా చూస్తూనే వున్నాను. ఎప్పుడైనా తను open up అయినపుడు వింటూనే వున్నాను. నాకు తన గత కాలపు అలజడికి సంబంధించిన ఆనవాళ్ళు కనబడేవి. నాకు అలా అనిపిస్తుందో లేదా తను నిజంగానే అలా వుందో గాని నాకు తన కళ్ల వెనుక అలవిగాని బరువును మోస్తున్నట్టుండేది. అటుమొన్నటి జ్ఞాపకాలేవో నిలదీస్తుంటే, క్రుంగదీస్తుంటే, వెంటాడుతుంటే సోచాయిస్తూ వున్నట్టు వుండేది. లేదా నాకు అలా అనిపించేది.

నేనేమైనా అడుగుదామని అనుకునే వాడ్ని. కానీ మళ్ళీ ఎందుకులే కావాలని రేపెట్టడం అని వూరుకునే వాడిని. ఆ విషయాన్ని ఎలా డీల్ చెయ్యాలో తెలిసేది కాదు. క్రికెట్లో అయితే టెక్స్ట్ బుక్ స్టైల్ షాట్లు వుంటాయి. కానీ మానవ సంబంధాల మధ్య వుండే సున్నితమైన అంశాలల్ని డీల్ చెయ్యడమెట్లా? ఆ విషయం గురించి మాట్లాడితే బాధపడుతుందా, మాట్లాడక పోతే బాధపడుతుందా? బహుశా ఆ మూసేసిన తలుపుల్ని తెరిచే ప్రయత్నం చేస్తే బాగుంటుందా, చేయకపోతే బాగుంటుందా?

కానీ అలాంటి సందేహపు, మొహమాటపు one-sided సంభాషణాల్లో తనకు సూర్యుడి గురించి కూడా తెలుసని తెలిసింది. అందుకే తనతో నా రచనగురించి ప్రస్తావించాను. తను నాతో పంచుకున్న విషయాల్ని మీకు చెప్తా.

* * *

'అప్పటికి నేను బయటకు వచ్చి రెండు మూడేళ్లు అవుతుందేమో. ఎవరితోనూ మాట్లాడక, ఎక్కడికీ వెళ్ళక నాలో నేను, నాతో నేను మాత్రమే గడుపుతున్న రోజులు. గతకాలపు తలపులు రీళ్లు రీళ్లుగా కదులుతుండేవి – కళ్ళు మూస్తే కళ్ల వెనుక, కళ్ళు తెరిస్తే కళ్ల ముందర. అవే, అవే సంభాషణలు, అవే అవే ఆరోపణలు, అవే అవే నిశ్శబ్ద క్షణాలు – ముందు వెనుకగా, వెనుక ముందుగా ప్రవహిస్తూ వుండేవి,' అంది నీలిమ.

అట్లాంటి ఒకరోజు మధ్యాహ్నం వచ్చేడు మా ఇంటికి, దాదాపు జైలునుంచి నేరుగా. అప్పటికే బాగా పరిచయం వుండడం వల్ల పరిచయాలు అవీ అక్కర్లేకపోయాయి. ఎప్పటిలాగే నేను నాలోపలే ముడుచుకుపోయి వున్నాను. అలవాటు చేసుకుంటున్న డీటీపీ వ్యాపకంలో మునిగిపోయివున్నాను. ఎక్కడెక్కడికో వెళ్లివచ్చేవాడు. కానీ మళ్ళీ లోపలికి వెళ్ళేవరకు మా ఇంట్లోనే వున్నాడు. తనని దగ్గర నుంచి గమనించడానికి చాలా అవకాశం వుండింది. ఏవేవో విషయాలు పొట్టి పొట్టిగానైనా మాట్లాడేదాన్ని. నిజానికి మాట్లాడడానికి నా ప్రయత్నం కంటే తనదే ఎక్కువని చెప్పాలి.

బహుశా నన్ను కొంచెం బయటపడెయ్యడానికి తానే కల్పించుకు మాట్లాడేవాడు. అప్పటికే నా గురించి, నేను ఏ పరిస్థితుల్లో బయటకు రావాల్సి వచ్చిందో బాగానే విని వున్నాడు కాబట్టి, నా పరిస్థితి తనకు బాగానే తెలిసివుండాలి. కానీ చిత్రంగా ఆరోజు తను, నేను చాలా సేపు మాట్లాడుకున్న విషయం ఏమిటంటే – వాషింగ్ మెషీన్ ఎలా పనిచేస్తుందని! అప్పటికే టెక్నికల్ నిపుణుడిగా పేరు తెచ్చుకున్న సూర్యుడికి వాషింగ్ మెషీన్ వింతగా అనిపించిందేమో అదెలా పనిచేస్తుందో అడిగి తెలుసుకున్నాడు. తెలియని విషయం శ్రద్ధగా వింటున్న విద్యార్థిలాగా విన్నాడు. నాకు ఖచ్చితంగా తెలుసు – ఈ టెక్నాలజీ వుద్యమానికి ఎలా పనికొస్తుందో ఆలోచించి వుంటాడని. ప్రతీ క్షణం, ప్రతీ విషయం వుద్యమం, వుద్యమం తప్ప మరొక విషయం పట్టించుకునేవాడు కాదు.

* * *

నేను తనని గమనిస్తుండేదాన్ని. నా గురించి ఏం ఆలోచిస్తున్నాడో అని అనుకునేదాన్ని. నాకు అనుకూలంగా వున్నాడా లేదా అన్నది కాదు నా సందేహం. అసలు నా సమస్య గురించి ఏమైనా ఆలోచిస్తున్నాడా అని. కానీ అప్పుడప్పుడు గమనిచేదాన్ని, నన్ను శ్రద్ధగా గమనిస్తున్నాడని. నేను చేసే పనుల్ని, నన్ను ఆపేక్షగా చూస్తున్నాడని గమనించాను.

మొదట్లోనే ఒకసారి, ఒకసారి నాకు షేక్ హాండ్ ఇచ్చాడు. ఒక అడుగు వెనక్కి వేసి, 'అపరిచిత' కథలో లాగా, ఇది 'సుధ' కోసం అని మరో షేక్ హాండ్ ఇచ్చాడు. 'సుధ' నేను బస్తీ లో పని చేసినప్పటి పేరు. నా పని గురించి విన్నాని, ఇష్టపడ్డానని చెప్పడానికి. పనిని గుర్తిస్తే అంతకంటే కావాల్సిందేముంటుంది?

* * *

ఒకసారి ఒక యువతి అనుభవాన్ని వింటూ కంపోజ్ చేస్తుంటే కళ్ల వెంబడి నీళ్ళు తిరిగాయి. 'నువ్వు కాబట్టి తట్టుకుని నిలబడ్డావు. నేనయితే యెమైపోదునో,' అన్నాను, తన బాధ లోతుల్ని అంచనా వేసే ప్రయత్నం చేస్తూ.

తను అంది కదా, 'అక్కా, ఇది నువ్వు ఇచ్చిన ధైర్యమే, పరోక్షంగానే అనుకో,' అంది.

'ఆదాటుగా మీద పడ్డ సమస్యని చూసి తల్లడిల్లి పోయాను. కన్నబిడ్డను కూడా కాపాడుకోలేక పోతున్నాన్న బాధలో వున్నాను. దారీ తెన్నూ తెలియక వున్నపుడు అన్న చెప్పేడు మనుషులు నిలబడాలని. ఎంతటి ప్రతికూల పరిస్థితులు వున్నా మనిషి నిలబడాలని. నీ గురించి చెప్పేడు. సమస్యని నువ్వు ఎదుర్కొన్న పద్ధతి గురించి చెప్పేడు,' అంది.

నాకు ఎంత ఆశ్చర్యం వేసిందంటే, మనసులోనే సూర్యుడిని అభినందించలేకుండా వుండలేకపోయాను. నన్ను ఒక వుదాహరణగా చూపించినందుకు కాదు. మనుషుల్ని నిలబెట్టాలని, నిలబడాలనుకునే మనుషుల ప్రయత్నాలను చాలా శ్రద్ధగా, నిశితంగా గమనించినందుకు. సమస్యలు సాపేక్షమే కావచ్చు. నేను పెద్దదనుకున్న సమస్య నీకు చాలా చిన్నది కావచ్చు. లేదా నాకు చాలా అల్పమైనదనుకున్న విషయం నీకు పెద్ద సమస్య కావచ్చు. కానీ సమస్యల్ని నిభాయించుకుని నిలబడడం ముఖ్యం కదా. సమస్యలు నిన్ను చుట్టుముట్టి నిన్ను మొత్తానికే మింగేయకుండా చూసుకోవడం ముఖ్యం కదా!

* * *

ఎన్నోరోజుల తర్వాత గానీ నా సమస్య జోలికి రాలేదు తను. నేను కూడా ఒకరకంగా చెప్పాలంటే కొంచెం tensed up అయి వున్నాను. ఎపుడు తెస్తాడో, ఎలా తెస్తాడో ఆ ప్రస్తావన అని. ఎలాంటి వుపోద్ఘాతాలు లేకుండానే మొదలెట్టాడు. 'ఏమైనా చెప్పుకునేది వుందా. నేను పోయేది డీకేకే అని.

అప్పటికే ఒకరకమైన నిరాసక్తతకి వచ్చేశాను ఆ విషయంలో. ఏం ప్రయోజనం వుంటుంది ఎవరికి చెప్పుకుంటే' అన్న ధోరణికి వచ్చేశాను. అంటే ఆ పీడకలని నా హృదయంలోంచి పూర్తిగా తుడిచేశానని కాదు. అది ఎలా పోతుంది? హృదయంలోని ప్రతి అణువునూ బాధించిన ఆ రోజుల్ని ఎలా మరిచిపోగలను?

కానీ చెప్పుకోడానికి ఒక నమ్మకం కలిగించే ఒక హృదయం కావాలి కదా. నాకు సూర్యుడిలో అలాటి హృదయం కనిపించింది.

(...మిగతా 69వ పేజీలో

-: స్వీకారం :-



శివారెడ్డి కవిత
మొదటి భాగం
ప్రచురణ :
ఝరీ పొయిట్రి సర్కిల్,
హైదరాబాద్
వెల : రు. 225/-
పేజీలు : 456



శివారెడ్డి కవిత
రెండవ భాగం
ప్రచురణ :
ఝరీ పొయిట్రి సర్కిల్,
హైదరాబాద్
వెల : రు. 225/-
పేజీలు : 520



శివారెడ్డి కవిత
మూడవ భాగం
ప్రచురణ :
ఝరీ పొయిట్రి సర్కిల్,
హైదరాబాద్
వెల : రు. 225/-
పేజీలు : 560



బస్తర్‌లో జనతన
జైత్రయాత్ర
రచయిత :
డి. మార్కండేయ
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 20/-
పేజీలు : 32



విజయపథంలో పురోగమిస్తున్న
ఫిలిపినో
విప్లవోద్యమానికి జేజేలు
ప్రచురణ :
విప్లవ రచయితల సంఘం
వెల : రు. 15/-
పేజీలు : 40



యానాం ఎదురు
పోరాటం
ప్రచురణ :
ఎస్. వాసుదేవన్,
ముంబై
వెల : రు. 20/-
పేజీలు : 40



ప్రజా ఎజెండా లేని
పార్లమెంటరీ రాజకీయాలు
రచయిత :
ఎ. నర్సింహారెడ్డి
ప్రచురణ కర్త:
ఎ. నర్సింహారెడ్డి
వెల : రు. 40/-
పేజీలు : 78

అభివృద్ధి - పర్యావరణం
(వ్యాస సంకలనం)
రచయిత :
ఎ. నర్సింహారెడ్డి
ప్రచురణ కర్త:
ఎ. నర్సింహారెడ్డి
వెల : రు. 40/-
పేజీలు : 84



సామాజిక విద్య -
ఒక మిథ్య
రచయిత :
ఎ. నర్సింహారెడ్డి
ప్రచురణ కర్త:
ఎ. నర్సింహారెడ్డి
వెల : రు. 100/-
పేజీలు : 212



ఇద్దరి మధ్య
(2007 - 2012) కవిత్వం
రచయిత :
పలమనేరు బాలాజి
ప్రచురణ :
పవిత్ర-ప్రణీత ప్రచురణలు
వెల : రు. 70/-
పేజీలు : 140

ముసుం
తెలంగాణ
కవితాపుష్కరం
2000-2011
ప్రచురణ :
తెలంగాణ సాహిత్య సమాఖ్య
వెల : రు. 300/-
పేజీలు : 585



కె.వి.ఆర్. సాహిత్య
వ్యాసాలు
మొదటి భాగం
ప్రచురణ :
కె.వి.ఆర్., శారదాంబ
స్మారక కమిటీ
వెల : రు. 300/-
పేజీలు : 798



భారత వ్యవసాయ రంగంలో
భూస్వామ్య ఉత్పత్తి సంబంధాలు
ఏ స్థాయిలో ఇంకా
కొనసాగుతున్నాయి
రచయిత :
రమేశ్ పట్నాయక్
ప్రచురణ :
లెఫ్టిస్ట్ స్టడీ సర్కిల్
వెల : రు. 15/-
పేజీలు : 32



Tricolour Shall Fly
Over Hyderabad
Dr. Raj Bahadur
Gour
Prachee Publicatios
Rs. 25/-
Pages : 54

దళిత స్త్రీ ఆత్మగౌరవ పోరాటం
దాహం (నాటకం)
రచయిత :
డా॥ ఎం.ఎం. వినోదిని
ప్రచురణ :
హేలీ ప్రింట్ మీడియా
వెల : రు. 50/-
పేజీలు : 32

ARUNA [KLVA101M163] l Telugu Monthly Journal of Revolutionary Writers' Association (VIRASAM)
● RNI Regn.No.21152/72 ● Published on 11/06/2013 298 - May, 2013

BC

ఆకాంక్షలు ఎన్నో
అలజడులెన్నెన్నో
సంఘర్షణను ఉసిగొలిపే
సంఘటనలెన్నో, చలనాలెన్నో
జీవితాన్ని దర్శించడమే కాదు
మార్పును దృశ్యీకరించేది కథ

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	KLVA101M163
పుస్తకం పేరు	అరుణతార
తారీఖు	08 February 2025
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	85
పెద్ద సైజు పేజీలు	no
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	no
తయారు చేసినది	Susmitha
పేజీలు విడదీసినది	Bhany sree
స్కాన్ చేసినది	[illegible]
పరీక్ష చేసినది	HASEEMA
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good